

చెన్నపట్టణము అక్టోబరు ౧౯౨౬

సంపుటము 3 అక్షయ సంవత్సరము ఆశ్వయుజమాసము సంఖ్య ౧౦

యోధుఁడా!

నాళము కృష్ణారావు గారు

వీరమాత

యోధుఁడా! చెప్పుమెందుండి నీదురాక
ఎన్నఁడో నిన్నుఁ దిలకించి యున్న
[యట్లు
జ్ఞప్తి యున్నది వచియింపఁ జాల నెట్లొ
వోడు లందఱు-అందఱుజోలి యేల?
నాదుకూరిమి తనయుండు మాధవుండు
సేమముగ నున్నవాఁ డేమొ చెప్పుమయ్యా!
దిక్కుమాలినయట్టి యీదీనురాలి
దీవనలు నిన్ను సాకును తెలుపుమయ్యా!

యోధుఁడు

జననిరో! భవదాశీర్వచనముచేత
సుఖముగా నున్నవారలు వోడులెల్ల
నీదుకూరిమి తనయుండు మాధవుండు
నీకుఁ బంపినయట్టి సందేశ మిదిగో
తెలుపుచుంటిని ఆశీర్వదింపుమమ్మ!

వీరమాత

ఏమి యంటివి? చెప్పుమా ఏమియంటి?
నాదునందనుఁడే-నాదునందనుండె
నాదు చిన్నారిపొన్నారి నందనుండె
నాకు సందేశ మంపెనా? నాకె-నాకె!
ఏమి యంపెను? సందేశమేమియంపె?
ఆతఁ డాడినయట్టి ప్రత్యక్షరమును
కడమ యొక్కింత వడకుండ నుడువు మయ్యా!
యోధుఁడా! నీవు నమ్మెదో లేదొ కాని
ఆతఁడే నాదుజీవన, మతఁడె ప్రాణ,

మాతఁడే నాదుచేయూఁత, అతఁడె ప్రాపు
చెప్పు మేటికి తడసెదు చెప్పుమయ్య!
పిదప సంగతులన్ని చెప్పుదువు కాని
ముందుగాఁ జెప్పు మొకమాట నందనుండు
చెక్కుచెదరక యున్నాఁడె సేమముగను?

యోధుఁడు

పెక్కుమాట లిఁకేల? నే నొక్కమాట
చెప్పుచుంటిని వినవమ్మ శీఘ్రముగను
జననిరో! నీదుతనయుండు సమరమందు
శత్రుబలముల నెల్లను జక్కడంచి
వచ్చుచున్నాఁడు తలపువ్వు వాడకుండ
నీదు చరణరాజీవసన్నిధికి వేగ.

వీరమాత

చల్లఁగా వేయియేండ్లు వర్ధిల్లుమయ్య!
ఆర్తరక్షక! ఈశుభవార్త వినఁగ
నిలిపితివె జీవనంబుల నేఁటిదాఁక?
వీరుఁడా! నీదుపల్కులు వినక యుండ,
నడుమ నడ్డంబు వచ్చితి నుడువుమయ్య
తనదు ముదుసలితల్లికి అనుఁగుబిడ్డ
ఏమి సందేశ మంపెనో ప్రేమ మీఱ
విందు చెప్పుమ వీనులవిందు గాఁగ.

యోధుఁడు

పగతురకుఁ జిక్కి మనరాజు పట్టువడఁగ,
సైన్యములు పటాపంచలై దైన్యవృత్తి
పరుగువాఱుచునుండ నీ వరసుతుండు
మెఱుపు మెఱసినచందాన నురవడించి
"పాఱిపోయెద రేటికి కో పందలార!
దోర్బలంబున రిపులతో దుర మొనర్చి
చంపు టొండెను వారిచేఁ జచ్చుటొండె
చేయనగుఁగాని, యీరీతి చేవ తఱిగి
పాఱిపోవుట మీ కది పౌరుషంబె?
నిక్కముగ మీర లాంధ్రులై నెగడిరేని
చోడవీరులకీర్తులు వాడకుండ
ఆహవంబున రిపులతో మోహరించి
మించి పోరుఁడు జయలక్ష్మి మిము వరించు."
అంచుఁ జెదరిన చోడసైన్యంబులకును
నూతనోత్సాహశక్తిని నూలుకొలిపి
మరల నాజికి వారి నెల్లర మరల్చి
ఒక్కపెట్టున రిపులపై నుఱికి తఱిమి
చించి చెండాడి శాత్రవసేన లెల్ల
వసుమతీశుని విడిపించె వైభవమున.

* * * *

తల్లి! నీసుతు సాహసధైర్యములకు
అంత మనన్నృపుఁ డెంతయు స్వాంత మందు
పొంగి, యాతని గ్రుచ్చి కవుంగిలించి
కంఠహారంబు ఖడ్గంబు కానుకనొసఁగి
వానిఁ దనసేనలకు దళవాయి చేసె.

* * * *

జనము లెల్లరు జయజయధ్వను లెసంగ
వినుతి చేసిరి నీసుతు విమలకీర్తి,
అంగనలు పాడి రంతట మంగళములు.

* * * *

వీరమాత

చాలు చాలును నిలు మింకఁ దాళుమయ్య!
ఇంక వినఁజాల, తక్కిన దెప్పుడైనఁ
జెప్పెదవు కాని ముందుగా నిప్పు డొకటి
యడుగుచుంటిని దప్పక నుడువుమయ్య!
కన్నతనయునిఁ గని చిరకాల మయ్యె

ఇప్పు డేరీతి నున్నాఁడో ఎఱుఁగఁజాల
నయ్య! వర్ణించి చెప్పుమా యతనిరూప
మెట్టు లుండెనో కన్నులఁ గట్టినట్లు.

యోధుఁడు

మాతరో! వానిరూపంబు మాఱిపోయె,
వ్రేలుగడ్డము మీసము పెంచి నేఁడు
పెద్దవాఁ డయ్యె; వాఁడు నీయొద్ద కిపుడు
వచ్చి నిలిచిన పోల్చ నీవశము కాదు.

ఇంత యేటికి? నీసుతుఁ డిటకువచ్చు
తరుణమయ్యెను, కన్నుల కఱవుదీఱఁ
గాంచుభాగ్యము నీ కిదే కలుగు నమ్మ!
ఏల నీకింతతత్తర మింతలోనె?

వీరమాత

వచ్చుచున్నాఁడ? చెప్పుమా నిచ్చయముగ
ఎపుడు వచ్చును? ఏమంటి విపుడె యనియు
కన్నులారఁగఁ దనకూర్మికన్న సుతుని
గాంచుభాగ్యమ దింతలోఁ గలుగునో కా-
పనికిమాలిన పరమ నిర్భాగ్యురాలి?
కకట! నిక్కంబుగాఁ దెల్పుమయ్య! నాకు.

యోధుఁడు

తల్లిరో! ఇంక నీకడ దాఁచ నేల?
నీదుకూరిమి తనయుండు మాధవుండు
అప్పుడేవచ్చి చాలసేపయ్యె నమ్మ!
ఇంతతడవును వాఁడు నీచెంత నుండె,
ఈవు పోల్చంగ లేకుంటి వింతెకాని.

వీరమాత

యోధుఁడా! నీవు నాముద్దు మాధవుఁడవె?

యోధుఁడు

మాతరో! నేను నీముద్దు మాధవుఁడనె.

సంపూర్ణము

కాఁపురమ్ముండెనఁట, మృషాకాంత! వింత!!

పండిత పురాణం సూర్యనారాయణ తీర్థులు గారు

మొదట శుల్కాలయమ్మునయందు జన్మించి, పిమ్మట శిల్పిగేహమ్ముఁ జేరి
పౌరాణికులతోడ భాషించి స్వర్ణకారుని యింటి కేఁగి భోజనముచేసి
అటనుండి మరలి కోమటివీధి కేతెంచి, పిదపఁ బ్లీడరులతో వియ్యమంది
కరణాల జ్యోతిష్కవరులను నుతియించి, కవివరేణ్యుల బ్రీతిఁ గౌఁగిలించి
వైద్యులను జూదరులను వహ్వ! యటంచు, వారకాంతలఁజూచి యవ్వారిమాయ
నేరువఁ దలంచినదివోలె వారియింటఁ, గాఁపురమ్ముండెనఁట, మృషాకాంత! వింత !!

సంపూర్ణము

విరాటపర్వము - నవరసములు

నిడమర్తి సత్యనారాయణమూర్తి గారు, బి. ఎ. (సారస్వతసమాజము)

ఒక్కొక భాషయందున్న జీవ మొక్కొక కవియం దుత్తేజమగును. ఆతనిముం దాభాషయం దుదయించిన యితరకవులు నిస్తేజస్కులగుచుందురు. గ్రీకు భాషయందు 'హోమరు'ను, ల్యాటినుభాషలో 'డాంటే'యును, ఇంగ్లీషుభాషలో 'షేక్స్పియరు'ను, సంస్కృతములో వాల్మీకియు నట్టివారు. ఈమహాకవు లనూన గౌరవసంపన్నులు. తెనుగుబాసకు తిక్కనగూడనట్టివాడు. సర్వతోముఖమగు తనప్రజ్ఞాప్రభావమువలన ఆంధ్రసారస్వతాకాశమున చుక్కలనడుమ చంద్రుని బోలి నిరుపమానతేజో విరాజితు డగుచున్నాడు. ఇట్టి యుత్కృష్ట కవిపుంగవుల కవితావిధాన విమర్శనము నేటివారికి మిక్కిలి యావసరము. రుచులు, రీతులు క్షణక్షణము చంచలములగుచున్న నేడు మనము పూర్వకవుల పోకడలను, ఆదర్శములను పరామర్శించి వారికావ్యముల కమరత్వము ప్రసాదించిన మహాగుణముల గణనముచేయుట హితకరము. కాని బాహుళ్యముగల తిక్కన రచనలను గూర్చి విమర్శించునపు డతని నడకలను పెక్కుశీర్షికలుగా విభజించి వానినిగూర్చి విడివిడిగా విమర్శింపవలెను. కావున నీవ్యాసమున విరాటపర్వమునందలి నవరస పోషణమును మాత్రమే విమర్శింతము.

విరాటపర్వము తిక్కన భారతరచనమున తొలుతటిది. అట్లగుట ఇది అతని కన్నెరచనము. అతని దీక్షా సాధనములు మిక్కిలి ప్రశంసనీయములనుటకు ఆతని దేయగు నీక్రింది పద్యము తార్కాణము:

ఉ. వైదికమార్గనిష్ఠమగు, వర్తనముం
దగ నిర్వహించుచున్
భేదములేని భక్తిమతి నిర్మలవృత్తిగఁ
జేయుచుండ మ
త్పాదనిరంతరస్మరణ తత్పర
భావముకల్మి నాత్మ స
మ్మోదముఁ బొందఁ గావ్యరస [డున్.”
ముం గొనియాడుచునుండు దెప్పు

ఆసమయమున నతని సామర్థ్యాతిశయ మట్టిది. మరి గ్రహించిన విరాటపర్వమునందలి విషయముకూడనంత మహోన్నతమైనదే. ఏలయన:

“మ. హృదయాహ్లాది చతుర్థ మూర్జితకథో
పేతంబు నానారసా
భ్యుదయోల్లాసి విరాటపర్వము”

ఇట్టిదానిని

“తెనుంగుబాస సంప్రార్థ్యంబుగా”

చేయబూని నిరుపమానప్రజ్ఞాధురంధరుడై సోమయాజి తనకార్యము నిర్వహించి బుధసంతోషంబునిండారఁ జేసెను.

శృంగార వీర కరుణాద్భుత హాస్య భయానక బీభత్స రౌద్ర శాంతములని రసములు తొమ్మిది. వీని

కెల్లను సోమయాజి యీ పర్వమున సంపూర్ణ పరిపోషణ మిచ్చి పాఠకులకు హృదయానందము సంధానించుచున్నాడు. ద్రౌపదీ కీచకులను అవలంబనముగా నిడికొని శృంగారమును, గోగ్రహణయుద్ధమున వీరమును, కీచక పరిభావితయగు ద్రౌపదీ శోకరూపమున గరుణమును, కీచకవధా సందర్భమున నద్భుతమును, ఉత్తర కుమార ప్రజ్ఞలలోను, ఉత్తర జయ ప్రస్తావనలోను హాస్యమును, ఉత్తరునిపలాయన సమయమున భయానకమును, శవాకృతిని పాండవాయుధ నిక్షేపమునందు బీభత్సమును, ఉపకీచక వధయందు రౌద్రమును, సన్న్యాసి వేషధారియగు ధర్మజుమూలగా శాంతమును ఈ పర్వము నందు పోషింపబడినవి. ఆయా సమయముల నవలోకించి తత్తద్రస ప్రకటనౌచిత్యమును బరిశీలింతము.

శృంగారము :—

సంస్కృతాంధ్ర కవి పుంగవుల హృదయక్షేత్రముల భావాంకురములను ప్రోదిచేసి పెంచిన రసము శృంగారము. హద్దు పద్దులలో పుట్టి పెరిగిన యీ రసము కొందరు కవుల చేతులలో ఘోరమగు పరిణామమును పొందుట ప్రబంధపాఠకులకు బట్టబయలే.

మాసిన చీరగట్టి యేవగొలుపు చందంబుననున్న ద్రౌపదినిగాంచి సింహబలుడు కామాంధుడై చేసినచేతల నూతగా గొని శృంగారరసమును కవి పోషించెను. కీచకుడు రసికతయందు కేవలము 'నీలాద్రిలా' జనిపించును; ఉచితానుచితములు గాని సమయాసమయములు గాని యెరుంగని రాక్షసతుల్యుడు. అక్కజమైన యంపచందముల నొప్పారు పాంచాలిని గాంచి నవుడు మర్యాదాతిక్రమణములకు చెడుకోరిక లీరికలెత్తిన,

"తన్వంగి మవ్వంబు తనులత నెసఁగెడు
నునుగాంతి వెల్లువ మునుఁగఁబార
కిసలయ హస్త కెంగేల నేపారు క్రొ
మ్మించను లేయెండ మిగులఁ బర్వ
కమలాస్య ముద్దుమొగంబు లేమెఱుఁగుల
మొత్తంబుపరిఁ జుట్టు ముట్టికొనఁగ
ధవళాక్షి తొంగలి ఱెప్పల చెన్నున
గప్పను చీకటి గవియు దేర
బెగ్గలం బంతకంతకు నగ్గలింప
నోదవు చెమటతోఁ జిత్తంబు సెదరి యెందు
మెలఁగఁ దలఁపేది యాసింహబలుఁడనంగు
పట్టి యాడెడు జంత్రంబు పగిదినుండె."

ఆ వికార సమయమున నత డింగితజ్ఞాన విహీనుడై యామెను డగ్గరించి తనకోర్కె నెరుక పరచెను. ఆమె తన సహజగాంభీర్యము తెలియునట్టు లాతనినుంద లించెను. అతడు వానినెల్ల బెడచెవిబెట్టి

నెత్తమ్మి రేకుల మెత్తఁదనముఁ దెచ్చి
యచ్చునఁ బెట్టిన ట్లుంద మొంది
చక్రవాకంబుల చందంబుఁ గొనివచ్చి
కుప్పలుచేసిన ట్లొప్పు మెఱసి
చందురునునుగాంతికం దేర్చికూర్చి బా
గునకుఁ దెచ్చినయట్లుకొమరుమిగిలి
అళికులంబులకప్పు గలయంతయును దెచ్చి
నారువోసినభంగి నవకమెక్కి
యంఘ్రితలములు, కుచములు, నాననంబు
గుచభరంబును నిట్లున్న రుచిరమూర్తి
యనుపమానభోగములకు నాస్పదంబు
కాదె యీ త్రిప్పలేటికిఁ గమలవదన.

అని వావి వరుసలు విడిచి యాడదొడగెను. కాని యందు మృదుత్వము తప్పిన వర్ణనలు మాత్రము లేవు. ఇంటికిపోయిన తరువాత నత డకాంతపైగల తమిచే దుఃఖించెను; అలమటపొందెను; మాయానిధిని దూరెను. కాని చంద్రాద్యుపాలంభనలు మొదలగు వెఱ్ఱిప్రేలాపనలనుకాని, గుహ్యాంగముల వర్ణనముకాని చేయక ఔచిత్యమును పూర్తిగగనుబరచెను. పాఠకుని యూహాపరిశ్రమకు విశాలమగుస్థానము వదలి తక్కిన యుచితములగు వర్ణనలుచేసెను.

చిన్న చిన్న సొడిమాటలచేతను, ఉచితోపమానముల మాలమునను ఘోరి పూర్తులు మనమనఃఫలకమున

నద్దుకొనునట్లుచేసి యీకథాభాగమంతయు నొకనాటక రంగమువలె కవిచేసెను.

కరుణము:—

ఇట్లు మోహాంధుడగు కీచకుడు ద్రౌపది వెంటదగిలి సభాస్థలిజొచ్చి సదస్యులెల్లరునుజూడ

"ఒడిచి తలపట్టి తిగిచి మహోగ్రవృత్తిఁ
గొంకుకొనరించుకయులేక కూలఁద్రోచె"

పతులందరును జూచుచుండ నంతటి యవమానమునకు బాల్పడిన యాసాధ్వి

"ఎలదీఁగఁగప్పిన లలితపరాగంబు
క్రియ మేన మేదినీరేణు వొప్ప
చంపకంబున నవసౌరభం బెసఁగెడు
కరణి నాసిక వేఁడిగాడ్పు నిగుడ
తోయజదళములతుది మంచుదొరఁగెడు
గతికన్నుఁగవ నశ్రుకణము లురుల
నిందు బింబము మీఁది కందుచందంబున
కురులు నెమ్మొగమున నెరసియుండ"

సభాసదుల ముందు నిలచి యెలుంగు సలిప

"ఈనరపతియాస్థానము
లో నొక్కరుఁడైన ధర్మలోపభయముసం
బూని తగవైన వెడపలు
కైనను బలుకంగఁజాలఁ డయ్యెడునకటా!"

యని ఱాలు కరగునట్లు విలపించెను. ఆమె తన యుడుకు చల్లారక పోవుటచే చీకటి తెరచాటున ప్రతాపఖని యగు భీమునితో తనభంగపాటు చెప్పుకొనుటకుజేరి

"నన్ను పరాభవించి సద
నంబునకుం జని కీచకుండు ము
న్నున్న తెఱంగు దప్పక సు
ఖోచితశయ్యను నిద్రసేయ నీ
కన్ను మొగుడ్చు నూరటకుఁ
గారణమెయ్యది భీమసేన! మీ
యన్న పరాక్రమంబు వల
దన్ననొకో దయమాలి తక్కటా!
అకటయాఁడుకూయు నాలకూయునులాఁతి
వారికైన నరయ వలయుననిన
నన్నుఁగీచకుండు దన్నంగ నెట్టులు
సూడ నేర్చె ధర్మసూతుఁ డపుడు."

అని మనసు కరగునట్లతని సంబోధించి యాతని దయార్ద్రసంబు నర్థించెను. ఆతని నింకను వశంవదుని జేయదలంచుకొని ధర్మరాజాదులయొక్క దుస్స్థితిని హృద్భేదకముగ వర్ణించెను. చివరకు దనమాట వచ్చినపుడు

"పనివంపఁగాని యొకతకుఁ
బనిసేయ నెఱుంగనన్నుఁబనిగొను నెడఁబాం
డుని యగ్రమహిషి గొంకుచుఁ
బనిగఱపెడుచందమునన పనుచు టెఱుఁగవే?

నున్నఁదనంబుగా నలుగు
నూరియుఁ జందనమట్లురాచియుఁ
బన్నగఁ గ్రొత్తలైన కల
పంబులఁగూర్చియుఁ దా సుదేష్ణకుం
గన్నుల సన్నలం బనులు
గైకొని వారక చేయుచుండుటం
ము న్నటులున్న పాణితల
ముల్ బలుగాయలు కాచెఁజూచితే."

యనుచు నశ్రుల మునిగిన తనమోమతని వక్షస్స్థలమున మోపెను. భీముడును మిక్కిలి చింతించెను. లోలోన తగుల్కొని మండుచున్న కోపానలము నాపుకొని ఆమెను జూచి

"ఎల్లి యెల్లవిధంబుల నెందుఁ జూచ్చె
నేని నా ధర్మ తనయుండు దాన వచ్చి

యడ్డఁ పడెనేని నీవ పెంపారు కరుణఁ
గాచితేని నా చేఁబడు కీచకుండు "

అని వాగ్దానమిచ్చి కీచకునికి నర్తనశాల సంకేత ప్రదేశంబుగాఁ జెప్పి "యొంటరిగా వచ్చునట్లు చేయుము; మిగిలిన కార్యము నేను జక్క జేయుదు"నని చెప్పి యామెను బంపెను.

అద్భుతము :—

ద్రౌపదిని వెడలబంపి ఉడికిపోవుచున్న క్రోధాగ్నిని దినమంతయు నెట్టెటో అణచిపెట్టి చుక్కలు పొడచూపగనే పెండ్లికి తరలినటులు బయలుదేరి భీముడు సాంకేతిక ప్రదేశంబునకు బోయెను. కీచకుడు నా సమయంబున కతి రయంబున జనుదెంచి, యా చీకటి కోణమునందున్నది యాజ్ఞసేనియే యని తలంచి చేయిచాచి భీముని పైఁ బెట్టి, సరసాలాపము లాడజొచ్చెను. వానికి ప్రత్యుత్తరముగా

"నను ముట్టి నీవు వెండియు
వనితల సంగతికిఁ బోవు వాఁడవె యైనం
దను వేఁబడసిన ఫల మే
కనియెద విదె చిత్తభవ వికారము లెల్లన్."

అనుచు రూక్ష కఠినంబైన హాసంబుతో, లేచి సింహాబలు డాశ్చర్యము పొందునట్లుగా నతని తలపట్టి వంచెను. అతడును తిరిగి కలియ బడగనే వారిరువురును భయంకరముగా బోరజొచ్చిరి. తన దురవస్థ నితరులు చూతురని కీచకుడును, సమయ భంగమగునని భీముడును భయపడి సడి చప్పుడులేకుండ దెబ్బలాడిరి. అపుడు భీముని చేయి పైనగుటచే

" పల్లవ ప్రసూన ఫల భరితంబగు
ప్రమానుఁగూలఁ ద్రోచు మత్తగజము
పోల్కి వివిధరత్న భూషణ భూషితుం
డైన సూతుఁ గూల్చె ననిలసుతుఁడు.
వికృతపుఁజావు సంప మది
వేడుక పుట్టినఁ గిట్టి పట్టి మ
స్తకమునఁ బీన దీర్ఘ భుజ
శాఖలుఁ బాదయుగంబు మేనిలో
నికిఁ జొర నుగ్గుగాఁ దుఱిమి
నించిన గంతల తిత్తియైన కీ
చకు ధరణీ స్థలిం జదిపి
చక్కన ముద్దగఁజేసె దుష్టుఁడై."

ఆస్థితిమాచి కుంతి కోడలుకూడ నాశ్చర్యపడి ముక్కుపై వ్రేలిడు కొనెను.

రౌద్రము:—

కీచకుని చావుతో ద్రుపదనందనకు గష్టములు గట్టెక్కుటకు మారుగ క్రొత్తవడచుట్లు వచ్చిపడెను. తమయన్న మరణంబున కామెయే కారణమనియెంచి యుపకీచకు లామెను బట్టిబంధించి కీచకుని శవముతో దహనము చేయుటకై పరేతభూమికి గొంపోయిరి. ఆమె యెంత యేడ్చిన నామెమొర నెవరు నాలకింప లేదు. భీము డదివిని

"......లంఘించి పోయిపరేతభూమి
యొద్దనలుదిక్కులునుజూచియొక్కయున్న
తావనీజంబువెఱికి రౌద్రాతిరేక
మడర భుజశిఖరంబున యందమర్చి.
వికటభ్రూకుటిఘోరఫాలకలిత
స్వేదోద్భటుండుం జల
ద్వికృతోష్ఠద్వయుఁడుం బ్రమర్దనదశా
విర్భావ సంభావితాం
గకుఁడుం జిత్తవిదాహదోహల సమ
గ్రక్రోధవేగుండునై
బకవిధ్వంసకుఁడయ్యెడన్ నిలిచె శుం
భత్స్ఫూర్తి విస్ఫూర్తితోన్.

జగత్సంహారోన్ముఖుడగు రుద్రుగతినిల్చి సంక్షోభభరితులగు సూతులనెల్లర జక్కడంచి ద్రౌపదినిబంధవిముక్తురాలిని గాజేసి విడచెను.

హాస్యము:—

ద్రౌపది శోకముచే గరగి భీముని రౌద్రదర్శనమున భయభ్రాంతులైన పాఠకులను దేర్చి వారికి కొంచెము విశ్రాంతి ఇచ్చుటకై యనంతరము హాస్యప్రకరణమగు ఉత్తరకుమారుని ప్రగల్భములసీను ప్రవేశపెట్టబడినది. కురువర్గము విరాటుగోవులను దోలుకొని చనుచుండగ వార్తాహరుడు వచ్చి యాసంగతి రాకుమారునకు విశదపరచి నిన్ను మీనాన్న "బాహువిస్ఫురితుడు, శౌర్యశాలి, జనభవ్యతపఃఫలసంభవుండు"నని పదిమందితో తరచుగా ననుచుండును.

"తేరుఁబూన్పఁబంపు తెప్పింపు దృఢతను
త్రాణ ముగ్రచాప బాణపూర్ణ
తూణఘనగదాసి తోమరచక్రాదు
లనువుగా నొనర్పు మతిరయమున."

అనుచుఁ బలుక సహజముగ డచ్చీలరాయడగు నతడు సారథికొరకు వెదకి బృహన్నలను సారథిగా నియమించి

"కురుపతి భీష్మకర్ణకృప
కుంభజముఖ్యులు మత్సముద్యమ
స్ఫురణము సూచి పార్థుఁడను
బుద్ధిగలంగఁగ బెట్టుగిట్టి సం
గరమున నోర్చి యోఁబసులఁ
గ్రమ్మఱఁ దేరకయున్న నన్నుభూ
వరుఁడు సుహృజ్జనంబుఁ బరి
వారముఁ జిత్తములందు మెత్తురే?

అని కోతలు కోయుచుండ వెఱ్ఱియగు ఉత్తర అతని మాటలు నమ్మి కురువీరుల శిరోంబరంబులు బొమ్మశాత్తికలుగా దెమ్మని యడిగె వారికి జయశ్రీ గోరుచు బంపెను. అట్లు మహా సంరంభంబునఁ జని కౌరవరాజసైన్యంబు,

"కనియుత్తరుండు గరు పా
టిన మేనును దలఁకుమనము టిచ్చవడినచూ
పును నై తొట్రుపడుచు ని [డక్"
ట్లనియె దిగులుసొచ్చి యాబృహన్నలతో

భీష్మ ద్రోణ కృపాదిధన్వి నికరా
భీలంబు దుర్యోధన
గ్రీష్మాదిత్య పటుప్రతాప విసరా
కీర్ణంబు శస్త్రాస్త్ర జా
లోష్మస్ఫార చతుర్విధోజ్జ్వల బలా
త్యుగ్రం బుదగ్రధ్వజా
ద్యుష్మత్త్వాకలితంబు సైన్య మిది యేఁ
జేరంగ శక్తుండనే ?

అనుచు తొట్రుపడిన మనస్సుతోడను, వడకు మేనితోడను, వెఱ్ఱిచూపులు చూచుచు రథమును ముందుకు సాగనీయకలదని యర్జునుని బ్రతిమాలెను. అతడామాటలు పెడచెవిని బెట్టి ప్రాణములపై తీపిచే కురు వీరుల చూడకమున్న పోవలెనని ప్రయత్నింప పురిలోని స్త్రీలు నవ్వుదురని పాండు కుమారుడతని నడ్గించెను. కాని యామాట లతని చెవిని పడలేదు.

దవ్వుల విరిగినఁ బౌరులు
నవ్వుదురటె మేలుమేలు నను నాఁగకు నీ
క్రొవ్వారుగ దేనిఁ దలపడు
మెవ్విధిఁ జనితేని యనుచు నెత్తినభీతిన్".

శరములును శరాసనమును రథముపై దిగవిడిచి భూమిపై కుతికి సిగ్గు వీడి పారజొచ్చెను.

కురు వీరులను పరాభవించుటకు దగిన సమయము కొరకు పొంచియున్న భీభత్సునకు ఉత్తరుని పలాయనము అసహ్యముగదోచి యతని వెంటనంటి యాపెను. ఎండియారిన పెదవులతో, చెవర్చు కరపదములతో, దీనదృష్టులతో ఉత్తరుడు భయభ్రాంతుడై తన్ను వదలిన వజ్ర వైడూర్యములను ఒకయూరు నిచ్చెద నని దీనాతిదీనుడై తన్ను గాంచిన కౌరవ సైన్యము నవ్వునట్లుగా వేడుకొనెను.

"నాతోడఁ బ్రేముడిం గడు
నాతురయై యెదురుచూచు నంబకుఁ జేతః
ప్రీతిగఁ జని యాయమఁ బొడ
సూతుం బోనీక దే విశుద్ధచరిత్రా!"

అని తనది రాచపుట్టు వనియు, వీరమాత చన్నిచ్చిపోరిన వారి మొగము గాంచదనియు గూడ దలంపక ప్రాణములతో దల్యమగునది లేదని చెప్పుచు మ్రొక్కెను.

భయానకము:—

హాస్యమును స్థాయిగా నిడుకొని పైన ఉత్తరుడు పలాయనుడగు సమయమున నతడు కురుసైన్యంబుల వర్ణించిన సందర్భమున భయానకము అంగి రసముగా జూపబడినది.

"అభినవజలధరశ్యామంబు లగునెడ
లాకుజొంపంబుల ననుకరింపఁ
సాంధ్యరాగోపమ చ్ఛాయంబులగుపట్లు
కిసలయోత్కరములఁ గ్రేణిసేయ
రాజమరాళగౌరములగు చోటులు
దఱచుపూఁబొదల చందంబునొంద
హరిద్రరుచిసమానాకృతులగుతావు
లడరెడు పుష్పొడులట్లు మెరయ
గలయ నెగసి ధరాధూళి లలితవనము
దివికి నలిగాపు వోయెడుతెఱఁగు దాల్ప
గోగణము ముంగలిగ నేల గోడినడగ
నడచు కౌరవరాజసైన్యంబు."

మిక్కిలి భయానకమై చూపట్టెను.

బీభత్సము:—

పలాయనుడగు నుత్తరుని బట్టుకొని అర్జునుడు పరేతభూమిని ఆకాశము నంటుకొమ్మలతో దట్టముగ బలిసిన యాకులచే చీకటికి నెలవగు నట్టియు

"........పవమాన వివిధనర్తనకళాను
వర్తిఁ, గాకఘూకారవస్ఫూర్తి, జాత
భీతిపరిసరవర్తి నాభీలభుజగ
చండమూర్తి శమీతరుచక్రవర్తి.
"పక్షివ్యాకులమున్ బరేతనిలయో
పాంతోత్థముగ్ డాకినీ
రక్షోభూతపిశాచగోచరము దు
ర్గంధంబునై చూడఁ, జి
త్తక్షోభం బొనరించు
....

వృక్షమును జూపి దానిపై గోశచర్మావృతమైన శవము వలె నున్న అస్త్రసంచయమును దన కిమ్మనెను. రాజకుమారుడు మొదట సంకోచించెను. కాని యర్జునుని మాటలవలన ధైర్యముఁబూని పైకెక్కి ఆయుధసంచయ బంధము నెడలించగనే యయ్యవి

"పెనుబాములచందమున"

భయదములై చూపట్టెను.

"అందొక చాపము విస్మయ
మొదవించుచుఁ గొండచిలువ
యొకొనాఁదగియు
న్నది ఖచిత కనక కమల స
ముదయద్యుతి సముపగూహ
నోజ్జ్వల మగుచున్"

ఇట్లే ఆ యస్త్రములెల్ల భయంకరాకృతిని జూపట్టుచు ఉత్తరుని మనమున భీతిని నెలకొల్పుచుండెను!

వీరము :

ఈ గోగ్రహణము నాటి యుద్ధమంతయు వీరరస భూయిష్ఠము. సిరికి పందయగు ఉత్తరుని సారథిగా గొని

"సింగం బాకటితో గుహాంతరమునం
జేడ్పాటుమైనుండి మా
తంగ స్ఫూర్జిత యూధ దర్శన సము
ద్యత్క్రోధమై వచ్చు నో
జం గాంతార నివాస ఖిన్నమతి"

యగు నర్జును డొక్కఁడను గౌరవయోధవర్గముల నెల్ల దలపడి చూపిన యసమాన యుద్ధనైపుణ్యము, నిర్జీవుని రక్తనాళములందలి రక్తమునకు జలనము గలిగింపజాలినది. ఒకరివలన వీరరసమయాత్ముఁడగు నితడును, వేరొకవంక

"కాంచన మయ వేదికా కనత్కేతనో
జ్జ్వలవిభ్రమమువాఁడు కలశజుండు
సింహలాంగూల భూషితనభోభాగకే
తుప్రేంఖణమువాఁడు ద్రోణసుతుఁడు
కనకగోవృషసాంద్రకాంతిపరిస్ఫుట
ధ్వజసముల్లాసంబువాఁడు కృపుఁడు
లలితకంబుప్రభాకలిత పతాకావి
హారంబువాఁడు రాధాత్మజుండు
మణిమయోరగ రుచిజాల మహితమైన
పడగవాఁడు కురుక్షితిపతిమహోగ్ర
శిఖరఘనతాళ తరువగు సిడమువాఁడు
సురనదీసూనుఁడు"

మొదలగు అగ్నిహోత్రపు పుంతలును గుమిగూడిన సంగర రంగము సమకూర్పబడినది.

అపుడు అర్జునుడు

"విలసద్గాండివ చాలనోద్ధతి గన
ద్విద్యుల్లతాలీలఁగా
నలఘుస్ఫార కపిధ్వజధ్వని సము
ద్యద్గర్జ చందంబుగా
జలదాకారత నొందెఁ దేరితఁడు ప
ర్జన్యాకృతిం బొల్చె దో
ర్బల తీవ్రారినిదాఘ దుర్విషహగ
ర్వస్ఫూర్తి నిర్మూర్తిగన్."

అంతటి రభసంబున బయలుదేరి గోవుల దెసంబోవ నుంకించిన కురుసైన్యంబు లతని దలపడెను. అజ్ఞాతవాసము మొదలు తీరెక్కిన తనచేతుల దురద పోవుటకు అంతకన్న నుచితసమయము దొరకనట్లు పాండవమధ్యము డుత్తరసారథియై గాంగేయకుంభజ రాధాత్మజాదియోధవర్గమును దనయస్త్రవర్షమున ముంచిలేవనెత్తి

"బలమెల్లన్ వెఱ రెండుపాయలుగ
భద్వేగుఁడై చొచ్చి ఁగూ
వలఁ దా నడ్డమువచ్చి నాలుపుగ దు
ర్వారోద్ధతిం బోయి మూ
లల నానాశకలాకృతిం బొరయ లీ
లాయనదుర్దాంతుఁడై
వలయంబుల్ సని చించి చిక్కువఱచెన్
వైకల్యసంపాదియై."

అమ్మహాసంకుల సమరంబున

"ప్రళయాంభోధర ముక్తసాంద్రవిసర
త్పాషాణవర్షంబు మి
క్కిలియై శైలముఁగప్పినట్లు నరు న
క్షీణాస్త్రసంతాన మి
ట్టలమై కప్పినఁ దీవ్రమారుతము గా
ఢవ్యాప్తి జీమూత మం
డలిఁబోలెన్ విరియించె భానుజుఁ డవ
ష్టంభోజ్జ్వలాకారుఁడై."

ఇట్లు గండుమీరినమగండై వాసవనందనుండు కురువీరుల నొక్కరొక్కరిగ దలపడి పోడిమిచూపెను. ఉత్తరకు తానిచ్చినమాట చెల్లుకొరకు తుదిని సమ్మోహనాస్త్రప్రయోగమున కురుపక్షము నెల్లను బడవైచి వారితలమట్లుమాత్రము గ్రహించి ప్రాణంబు లపహరింపక యవిడచెను. చివరకు పసులమరల్చి శత్రుబలంబుల సీనుంగుపెంటలుగాజేసి విజయోల్లాసియగు విజయుడు విరాటునగరంబు జొచ్చెను.

శాంతము:—

శాంతము కంకుని యాకృతినున్న ధర్మరాజునందు మూర్తీభవించి యున్నది. సైరంధ్రిని కీచకుడు సభాస్థలిని ముష్కరుడై తన్నినపుడును, విరాటుడు సారెగొని తన్నేసినపుడును అతడు చూపిన సహనము

అనుపమానము. సూతుడు ద్రౌపదిని దన్నుటచూచి భీము డుగ్రుడుగా ధైర్యహీమానలు డగు పాండవాగ్రజుడు శాంత మూర్తిపడ నర్మగుగ బల్కి అతనిని వారించెను. అట్లే విరటుడు తొందరపడి తన్ను గొట్టినపుడు నిర్వికారములును, నిర్వికారములు నగుచూపులతో ద్రౌపదిని జూచెను. మాటలందే కాక మానసమందు గూడ నతనిపై కినుకవహింప లేదు. ఆశాంతము అనన్యదుర్లభమనుట అత్యుక్తి కానేరదు. ధర్మరాజు శాంతమునకు మూలమై విరాజిల్లెను. అందు చేతనే దుష్కరమైన యజ్ఞాతవాసమును గడపబెట్టి విజయుని విజయోల్లాసముతోడను అభిమన్యుని వివాహోత్సాహముతోడను క్రొత్తజీవితమును ప్రారంభించిరి.

“వ్యాసుని భారతము ననుసరించికదా తిక్కన తన భారతమును రచించినది? ఇందున్న మెరుగులన్నియు నతనివికావా? అట్లయినచో తిక్కనఘనత యేమి?” అని కొందరి కనుమాన మున్నది. ఈయనుమానము న్యాయ్యమైనదిగాగూడ దోచుచున్నది. ఈ విషయ మతి విపులముగుటవలన వేరేయొకవ్యాసమున చర్చింపెదను. విరాటోద్యోగపర్వములలో మూలమునందలి కథాభాగమును గ్రహించి తిక్కన స్వాతంత్ర్యమువహించి వర్ణనలయందును పాత్రపోషణమునందును, రసప్రకటనమునందును, నిరంకుశుడై, రచించెను. అందుచే ఈ రెండు పర్వములును స్వతంత్రరచనలనియే చెప్పవచ్చును.

ఈ పర్వమున తిక్కన సోమయాజి చూపిన నేర్పు అపూర్వమైనది. నవరసములను తత్తత్సమయములందు ఉచిత రీతిని పూర్ణపోషణము బొందుపడునట్లొనర్చి బుధులకు సంతోషమును గూర్చెను. ఈ మహాకవి పోయిన పోకడలను, నడచిన మార్గములను, ఆంధ్రమున కవిత్వము చెప్పబూను వారందరును దృక్పథమున నిడుకొనుట అవసరము.

సంపూర్ణము

రాగతృష్ణ*

‘ఈశ్వర’

ఏనాటికైన నీవేణునాళమును
వాయింపవత్తువే వాకిలి కనెడి
అడియాస, తలుపుల గడెలూడదీసి
వీనుల నూపిరి బిగబట్టి వైతు.
సారెసారెకు దూరదూరాన విరిసి
యల్ల దోతెంచు నాయూరాగరవళి
నీజాడ గురుతింప నేర్తునుగాని
అటువోవునంత నీవిటువత్తువేమొ?

విశ్వవిశ్వమ్ములు విహరించు నీకు,
యుగయుగమ్ములు గాన మొలికించు నీకు
ఈకుటీరకవాట మెంతదూరమ్ము!
ఈజీవనాళమదెంత నూతనము!
నీమీది తలపులో నిలుకడలేక
నిలచి నీరాగమ్ము నెమకుటే కాని
కలవరించనదెట్టి యలవోకనేని
రాగదే! రాగదే! రాగాప్రమేయ!!

* “నిశాంతము” నుండి.

పురాణవిమర్శనము

పొరనంది సర్వేశ్వరశాస్త్రి గారు

"వ్యాసో నారాయణో హరిః"

అనునట్లు సాక్షాన్నారాయణాంశసంభూతు లగు వ్యాసులవారిచే ద్వాపరయుగంబున నష్టాదశ పురాణములు ప్రణీతము లైనవి. ఇవికాక సనత్కుమారాదులచే రచియింపబడిన యుపపురాణములును కలవు. అందు మహాపురాణములు

"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశమన్వన్తరాణిచ,
వంశానుచరితంచేతి పురాణం పంచలక్షణమ్."

అనిచెప్పినట్లు సృష్ట్యాదిపంచలక్షణములతో విరాజిలు చుండునవి

ఈపురాణములు ధర్మనిర్ణయము జేయునవి యనియు, వేదోపబృంహకములనియు నందరు నంగీకరించిన విషయమే. అది నిర్వివాదాంశము; కాని ఈపురాణములు ప్రత్యేక దేశములనియు నప్రత్యేక దేశములనియు కొందర భిప్రాయపడుదురు. అందు ప్రత్యేక దేశము లనుటకు ఇతరప్రామాణ్యములకంటె శ్రుతిప్రామాణ్యమే కదా బలవత్తరము! ఈవిషయమున ఛాందోగ్యోపనిషత్తు సప్తమప్రపాఠకమున నిట్లున్నది.

"ఋగ్వేదం భగవో ధ్యేమి యజుర్వేదగ్ం
సామవేద మాథర్వణం చతుర్థ మితిహాస
పురాణం పంచమం వేదానాం వేదమ్".

అని.

దీనికి శ్రీశంకరభాష్యము:

"ఋగ్వేదం భగవో ధ్యేమి=స్మరామి......
ఆథర్వణం చతుర్థం వేదం; వేదశబ్దస్య
ప్రకృతత్వాత్. ఇతిహాసపురాణం పంచమం. వేదం వేదానాం = భారతపంచమానాం వేదం = వ్యాకరణమిత్యర్థః. వ్యాకరణేన హి పదాదివిభాగశ ఋగ్వేదాదయో జ్ఞాయన్తే ఇతి"

రంగరామానుజభాష్యము:

"......ఇతిహాసపురాణం పంచమమ్, వేదానధ్యాపయామాస మహాభారతపంచమా నితివ దృగాదిభి రితిహాసస్య అత్ర పంచమత్వోక్తిః. వేదానాం=ఋగాదీనాం, వేదం= ప్రకృతి ప్రత్యయవిభాగావేదకం; వ్యాకరణ మిత్యర్థః."

ఈభాష్యములవలన ఇతిహాసము (భారతము)నకు పంచమవేదత్వమున్ను 'వేదానాంవేదం, అనువాక్యమునకు వేదములలో వేదమయినపురాణము వనియర్థము కాదు. వేదములయొక్కక ప్రకృతిప్రత్యయవిభాగమును తెలియజేయువ్యాకరణశాస్త్రమున కీ యర్థము అనియు (పురాణము దాజదివినివాటిలో నైదవది యనియు) స్పష్టమగుచున్నది కాన నీశ్రుతి పురాణములు ప్రత్యేక దేశములని తృప్తికరముగ నాజ్ఞాపింపకయున్నది.

మరియు యజురారణ్యకమున బ్రహ్మయజ్ఞప్రకరణమున:

"యద్బ్రాహ్మణా నీతిహాసా న్పురాణాని
కల్పా న్గాథా నారాశగ్ంసీ
ర్మేదాహుతయో దేవానా మభవన్"

అనియున్నది.

భా."ఆత్మావా ఇద మేకఏ వాగ్రఆసీ
నైన్యత్కించనమిషత్ ఇత్యాదీని
సృష్ట్యాది ప్రతిపాదకాని పురాణాని ఇతి"

దీనిచే వేదాన్తర్గతమగు నొకభాగమునకు పురాణవ్యవహారమని తెలియుచున్నది.

అట్లుకాక యా శ్రుతియందు మత్స్య కూర్మాదులే చెప్పబడినవని భావించినను బ్రహ్మయజ్ఞ ప్రకరణమున నవి పఠింపబడినచో నిట్టి ఫలమని చెప్పియున్నందున నంతమాత్రముచే పురాణములు శ్రుత్యేక దేశములని నిశ్చయించుట సమంజసము కాదుకదా?

పై శ్రుతులలో శ్రుత్యేక దేశములని సువ్యక్తము కానందున స్పష్టముగ నీ యంశమును ప్రసాదించు శ్రుతులు సాక్షాత్కరించుపరకు పురాణములు శ్రుత్యేక దేశములనుకొనుట యవిచారమూలకము శ్రుతులలో పురాణ శబ్ద మున్నంతమాత్రమున నవి శ్రుత్యేక దేశము లనుకొనకూడదు.

ఇటుపై పురాణములు స్మృత్యేక దేశము లను విషయమునుగురించి కొంత వ్రాయుచున్నాను:

స్మృత్యేక దేశములు పురాణము లనుటకు స్మృతులలో మనుస్మృతికి ప్రాముఖ్యము నార్యులు చెప్పిరి. కాన దానినే ముందుగ నవలోకించుట యుక్తము.

"శ్లో. వేదోఽఖిలో ధర్మమూలం
స్మృతిశీలేచ తద్విదామ్;
ఆచారశ్చైవ సాధూనా
మాత్మనస్తుష్టిరేవచ."

......శ్రుతిస్తు వేదో విజ్ఞేయో
ధర్మశాస్త్రంతు వై స్మృతిః"

మనుస్మృతి, 2 అధ్యాయము.

వ్యా. "వేదః = ఋగ్యజుస్సామాథర్వణలక్షణః స సర్వో విధ్యర్థవాద మంత్రాత్మా ధర్మే మూలం=ప్రమాణం ...... మన్వాదీనాంచ వేదవిదాం స్మృతిః ధర్మేప్రమాణం ...... స్మృతిః = వేదః మన్వాదిశాస్త్రం స్మృతిః"

పై మనువచనములయందలి స్మృతి పదమునకు 'మన్వాది శాస్త్రం, అనియే కుల్లూకభట్టు వ్యాఖ్యానించెను. కాని పురాణములు తదేక దేశములని చెప్పలేదు. మనుస్మృతి వ్యాఖ్యానాంతరములందు. స్మృతిపదముచే పురాణములు స్వీకరింపబడియున్నను కుల్లూకభట్టు మతమునకు అది విరుద్ధముకాదా? కుల్లూకభట్టు మాత్రము సామాన్యుఁడా? అతని వ్యాఖ్యానముకూడ సుప్రసిద్ధమైయున్నది. లేక యుభయమతములుకూడ నాదరణీయములే యయినచో పురాణములు స్మృత్యేక దేశములని సిద్ధాంతీకరించుట సాహసముకాదా!

మరియు స్మృతిపదమునకు 'మన్వాదిశాస్త్ర' మని వ్యాఖ్యానించిన కుల్లూకభట్టు ఆ మన్వాదిశాస్త్ర పదము పురాణములనుకూడ సంగ్రహించునని భావించియుండునని యూహించుటకు సాధ్యముకాకున్నది. అట్టి యభిప్రాయ మాతనికి గలదేని దానిని వ్యక్తీకరించకయుండునా? కాన సుస్పష్టవ్యాఖ్యానపంక్తులకు లేని యర్థము నూహించినంతమాత్రమున స్మృత్యేక దేశము లనుటకవకాశము చాలదు.

"శ్రుతి స్స్మృతి స్సదాచార
స్స్వస్యచప్రియ మాత్మనః;
సమ్యక్సంకల్పజః కామో
ధర్మమూల మిదం స్మృతమ్."

అని యాజ్ఞవల్క్యస్మృతి.

"వ్యా. శ్రుతిః=వేదః. స్మృతిః=ధర్మశాస్త్రం."

స్మృతిపదమునకు ధర్మశాస్త్రమని యర్థము.

"పురాణన్యాయమీమాంసా
ధర్మశాస్త్రాంగమిశ్రితాః;
వేదాః స్థానాని విద్యానాం
ధర్మస్యచ చతుర్దశ."

యాజ్ఞవల్క్యవచనము.

"పురాణం = బ్రాహ్మాదిన్యాయః = తర్క-
విద్యా; మీమాంసా=వేదవాక్యవిచారః;
ధర్మశాస్త్రం=మానవాది........"

ఇందులో పురాణములు ధర్మశాస్త్రమును ప్రత్యేకముగ నిరూపింపబడియున్నవి.

"అంగాని వేదా శ్చత్వారో
మీమాంసా న్యాయవిస్తరః;
పురాణం ధర్మశాస్త్రంచ
విద్యా హ్యేతా శ్చతుర్దశ"

అని యాజ్ఞవల్క్యవచనమునకు సరియగునార్యోక్తి.

తా. శిక్షావ్యాకరణాదిషడంగములు నాలుగువేదములు మీమాంస, న్యాయశాస్త్రము, పురాణము, ధర్మశాస్త్రము అనునివిపదునాలుగు విద్యలు.

పైవచనములలో పురాణము ధర్మశాస్త్రము వేర్వేరుగ జెప్పబడినవి. స్మృత్యేకదేశములే పురాణములగునేని (అంగాంగిభావముచే నొకటియేకాన) పదమూడువిద్యలే యగును. (విద్యా హ్యేతా శ్చతుర్దశ) అనువచనము వ్యర్థప్రలపిత మగును.

శ్రీమద్రామాయణము బాలకాండము మొదటిసర్గలో

"పఠన్ ద్విజో వాగృషభత్వ మీయాత్"

అను శ్లోకమునకు గోవిందరాజీయవ్యాఖ్యానమున

"శూద్ర స్యేతిహాసపురాణయోః శ్రవణ
మాత్రం స్మృతిభి రనుజ్ఞాతం"

అనియున్నది.

(ఇతిహాసపురాణములు శూద్రుడువినవచ్చునని స్మృతులచే నంగీకరింపబడినది. అనిభావము)

స్మృతిపురాణములకు పృథక్త్వము దీనిచే స్పష్టమగుచున్నది. స్మృత్యేకదేశములే పురాణము లయినచో పురాణశ్రవణమున కిచట స్మృత్యనుజ్ఞ ఎందుకు ?

"స్మృతిశ్చ తంత్రాఖ్యా పరమర్షిప్రణీతా
శిష్టపరిగృహీతా"

అనిమాత్రము, బ్రహ్మసూత్రములయందు (రెండవ అధ్యాయము, స్మృత్యధికరణమున ప్రథమసూత్రభాష్యపంక్తి) కలదు.

స్మృతియనగా శాస్త్రమనే పేరు కలదియు, మహర్షిప్రణీత మయినదియు, శిష్టులచే పరిగ్రహింపబడినదియు నని యర్థము.

స్మృత్యేకదేశములకుగూడ నీ మూడులక్షణములుండవలయునుకదా! అయితే పురాణములు మహర్షిప్రణీతములును, శిష్టపరిగృహీతములు నగును. కాని వాటికి శాస్త్రమనేవ్యవహారము లేదు కాన పురాణముల కాలక్షణములు పట్టనందున నవి స్మృత్యేకదేశములును కావు.

స్మృతిపదమునకు ధర్మశాస్త్రమని వ్యాఖ్యానము లున్నను ఆధర్మశాస్త్రపదము ధర్మమును శాసించు గ్రంథపరమని తలంచి అనేకధర్మముల నుపదేశించు పురాణములుకూడ ధర్మశాస్త్రములగునని పురాణముల యొక్క శాస్త్రత్వసిద్ధికై చెప్పినయెడల మీదవ్రాసిన సూత్రభాష్యపంక్తిలోని స్మృతిలక్షణములు పూర్తిగ కల్గును. అట్లయిన శంకరమతానుసారముగ పురాణములు, స్మృతులు, వేదములుకూడ శాస్త్రములై స్మృత్యేకదేశములు కావలసివచ్చును. ఇట్లు ధర్మజ్ఞు లంగీకరింతు రని నిశ్చయింపజాలము.

ధర్మమును శాసించుగ్రంథమే ధర్మశాస్త్ర మైనచో రాజనీతి, పితృభక్తి, సత్యసంధత, సౌభ్రాత్రము, కృతజ్ఞత, పాతివ్రత్యము మొదలగు ననేకధర్మముల నుపదేశించుచు, గాయత్రీసంపుటితమై సకలపురుషార్థదాయకమై వేదముకంటె నెక్కువ మాహాత్మ్యంబు గలదని యందరు నమ్ముచున్నయాదికావ్యంబగు శ్రీమద్రామాయణమును, హితోపదేశము మొదలగు గ్రంథములును కూడ ధర్మశాస్త్రములో, స్మృతులో, స్మృత్యేకదేశములో అగును.

పురాణములు స్మృత్యేకదేశము లనుకొనుటకు స్మృతులలో నిట్టియనవకాశములున్నను అన్నిటికిని ప్రధానమగు శ్రుతిలో నీయంశ మెట్లున్నదో తిలకించుటవసరము

"స్మృతిః ప్రత్యక్ష మైతిహ్యం
అనుమాన శ్చతుష్టయమ్"

అని తైత్తిరీయారణ్యక శ్రుతి (అరుణమ్)

భాష్యం. "స్మృతిః=అనుమేయ శ్రుతిమూలం మన్వాదిశాస్త్రం; ప్రత్యక్షం= సర్వపురుషాణాం శ్రోత్రేణ గ్రాహ్యం వేదవాక్యం చ; ఐతిహ్యం=ఇతిహాస పురాణ మహాభారత బ్రాహ్మణాదికమ్; అనుమానః= శిష్టాచారః......తదేతత్ స్మృత్యాదిచతుష్టయమ్. అవగతి కారణభూతం ప్రమాణమ్."

అనియున్నది.

పురాణములు ఐతిహ్యములో నంతర్గతములనియు స్మృతి యనగా మన్వాదిశాస్త్రమనియు నీ శ్రుతి స్పష్టముగ జెప్పుచున్నది.

" స్మృతిశ్చ......గృహీతా "

అని స్మృతిలక్షణము జెప్పిన శ్రీశంకరులవారు గాప్రకరణమున నే

"శ్రుత్యనుసారిణ్యః స్మృతయః ప్రమాణం;
అనపేక్ష్యా ఇతరాః"

(శ్రుతి ననుసరించుస్మృతులు ప్రమాణము; అట్లుకానివి ప్రమాణములు కావు)

అని మరియొకభాష్యపంక్తిని వ్రాసిరి.

కాన మీదవ్రాసిన యరుణశ్రుతి పురాణము లైతిహ్యములో నంతర్గతములని చెప్పుచుండ దానికి విరుద్ధముగ (పురాణములు స్మృత్యేకదేశములని) నీ విషయము నే స్మృతిగాని పురాణములుగాని చెప్పునా? చెప్పిన నవిగ్రాహ్యము లగునా?


కాన శ్రుతులు, స్మృతులు, పురాణములు అను నవి ధర్మనిర్ణయము జేయు మూడుస్థానములు; ఇది నిశ్చయము. అందులో బలాబలవిషయమై తారతమ్యముగూడ కలదు. ఎట్లనిన

"శ్రుతిస్మృతిపురాణేషు
విరుద్ధేషు పరస్పరమ్.
పూర్వం పూర్వం బలీయస్స్యా
దితిన్యాయవిదో విదుః."

అని సంగ్రహవచనము.

తా. శ్రుతి స్మృతి పురాణములు పరస్పరము విరోధించినపుడు పురాణముకంటె స్మృతియు, స్మృతికంటె శ్రుతియు బలవత్తర ప్రమాణము లగునని.

శ్రుతిస్మృతుల కవిరుద్ధముగ జెప్పినవిషయము ననే పురాణములకు ప్రామాణ్యబలమును నిర్ణయించుచున్న ఈ వచనముకూడ పురాణములు స్మృత్యేకదేశములు కావని సూచించుచున్నవి. కాన నీయంశము నింత వరకు జిజ్ఞాసతో విమర్శించి విరమించుచున్నాడను.



సాత్రాజితీ సాంత్వనము

తమిరిశ శ్రీరామప్సారావుగారు

శ్రీకటింటను మూలఁజేరితివేల?
మోమునఁ జిరునవ్వు మొలపింపవేల?
సుకుమార తనులత స్రుక్కఁనదేల?
తొడవులన్నియుఁ దీసి దుఃఖింతువేల?

జగదభినుత శౌర్య సామర్థ్యబలుఁడ
పాకారివందిత పాదపద్ముండ
త్రిజగతీరాజ్య సందీప్తయశుండ
నారీజనాంచిత నవమన్మథుండ

కతమేమి వెతఁజెంద ఘనవేణి, చెపుమ?

చెదరిన ముంగురుల్ బెదరినచూపు
ఘర్మాంబుకణజాల కలితాలికంబు
సొబగేది బడలిన చొక్కంపుమేను
సడలిన కేశపాశంబును గలిగి
సొంపఱియున్న నీ సోయగంబకట!
నిముసమైనను జూచి నే నోర్వఁగలనె!

పండుతములపాకుఁ బరిహాసింపఁగల
నును జెక్కు నిగనిగల్ గనఁబడకున్న
మంజులారుణమృదు మధురాధరంపు
దగదగల్ గాంచుచుఁ దనియకయున్న
మేలిమిబంగారు హేళన చేయు

లావణ్యతరకోమలంబగు మేని
మిసమిసల్ దిశలను మెఱయంగఁజేయు

నవపుష్పఫలభర నమ్రద్రుమాళి
కలకలమను శుక కలకంఠపాళి
విచ్చుసుమావళిఁ జొచ్చుమదాళి
విలసితోద్యానంపు వీథులనడుమ
నిన్గూడి విహరించ నేరకయున్న
క్షణమొక యుగమంచు వసటఁజెందుటను

తే నీలోత్పలాక్షి !

ర్యంబు నెమ్మి నేఁజేసి
తులలేనిపదవిని దులదూగినటుల
ముదితుఁడ నౌటెల్ల విదితమేకాదె!
ఇట్టి నన్గనుఁగొన కేల మార్మోము
వెట్టితివే తెల్పు బింబాధరోష్ఠి!
నెమ్మన మరయుంగ నిట్లు పన్నితివో!
నవ్వులాటలకో? తప్పునాయెడఁ గలదో?
వెఱకింపఁదలఁచి నీ విమ్మాడ్కి నయితో
పగవాఁడనే! నీకు భావ్యమే రమణి!
తప్పుగల్గిన దయాదర వీక్షణముల
నన్ను మన్నింపుమా నా సత్యభామ!
ఆననజితసోమ! యక్షిలైక వినుత
సుగుణాభిరామ!! యోసుదతీ లలామ!!

ముద్రారాక్షసము-తన్నామౌచిత్యము

భాగవతుల దక్షిణామూర్తిశాస్త్రి గారు

ఈనాటకశ్రేష్ఠమును విశాఖదత్తమహాకవి రచియించెను. ఈయన 'విశాఖదేవ' యను నామాంతరమును గలిగియుండెనని తెలియవచ్చెడిని. ముద్రారాక్షసనాటకారంభమున కవివిరచితమైన పీఠికవలనఁ దప్ప మఱెచ్చటను నీకవివృత్తాంతము మనదృష్టి విషయము గాదు. పీఠికఁబట్టి వాతేశ్వరదత్తను సామంతరాజీతని తాతయనియు, 'పృథు'అను నాతఁ డీతనిజనకుఁడనియు తెలియవచ్చును. పృథ్వీరాజున కీతఁడు కుమారుఁడై యుండనోపునని ప్రొఫెసర్ విల్సన్ చెప్పుచున్నాఁడు. అందులకు విశేషతార్కాణములు గానరానికారణమున నాపైయాశయమును నిశ్చయముగా నితరులు స్వీకరింపకుందురుగాక! ఇట్లే ఈకవికాలనిర్ణయమునఁగూడ విచికిత్స జనింపఁగా నిందలికొన్నిశ్లోకములను, రచననుబట్టి విల్సన్‌గారీతఁడు 11-12 శతాబ్దములవాఁడై యుండునని యూహించుచున్నారు. ఏది యెట్లులైనను విషయమింతకన్న నెక్కుడు తెలియరాకున్నది. ముద్రారాక్షసమొక్కటియే యీతనికావ్యము. మఱియొకగ్రంథము నీతఁడు వ్రాసినట్లు తెలియదు.

ముద్రారాక్షసము సంస్కృతవాఙ్మయమున నద్భుతమైననాటకరాజము. ఇతివృత్తము కేవలము కల్పితమైనది గాదు కాని సంస్కృతనాటకములను రచించిన భారతకవులు సుప్రసిద్ధపురాణేతిహాసములను దమయితివృత్తమునకు సహాయముగా స్వీకరించిన ట్లీకవి స్వీకరింపలేదు. ఇందు కవి స్త్రీపాత్రను యోజింపలేదనియే చెప్పవచ్చును. సప్తమాంకమునఁ జందనదాసునిభార్యాప్రవేశ మున్నను నది విశేషరసాపాదనముగాక సామాన్యముగ భర్తృవియోగావస్థయందు భార్యకు విహితమైనధర్మము (A stern sense of duty) కొంతవఱకుఁ జూపింపఁబడెను. కవిత్వశైలి వీరరసప్రధానమైన యీనాటకమున కనుగుణమైయొప్పుచున్నది. కాని శైలి మధురముగను శ్రోత్రపేయముగను లేక వ్యావహారికమై కొన్నిస్థలములందు శ్రోత్రపుటముల భేదించుచు, సులభముగ నర్థముగాకున్నది. ఇందలిపాత్రలకుఁ గల్పింపఁబడిన భావములుగాని, చేష్టలుగాని, తాత్కాలిక కోపావేశములుగాని యతిభయంకరములై, కొన్నిస్థలముల బీభత్సములై యున్నవిగాని సుకుమారములై హృదయంగమములై సహృదయులకు శీఘ్రముగ మనోరంజకములై యున్నట్టులు తోఁచదు.

అందు చాణక్యుఁడు గొప్పబుద్ధికుశలుఁడు; నీతివిశారదుఁడు. తన సామర్థ్యముపైననే యాధారపడి (Self confidential) నందోన్మూలన, చంద్రగుప్తప్రతిష్ఠల నొనర్చి రాక్షసాదుల కసాధ్యుఁడై యున్నాఁడు.

"ఆః! క ఏష మయి స్థితే చంద్రగుప్త
మభిభవతు మిచ్ఛతి"

యను వాక్యముచే చంద్రగుప్తుని రక్షించుట, ధీరభావము, ధార్ష్ట్యము, కొంత గర్వము మొదలగునవి సుస్పష్టమగుచున్నవి. ఆతఁడు దనబుద్ధివిశేషమునకు రాక్షసుఁడు దీటు కాఁడనియు తాను స్వతంత్రుఁడ ననియు గర్వము నొందువాఁడు.

"తేసాధర్మ్యం మదనుకృతేః ప్రధానవైరమ్"
"ప్రకర్షం మద్బుద్ధేరతిశయితు మేష వ్యవసితః"

అను తృతీయాంక చాణక్యవాక్యము లీ యభిప్రాయమును సువ్యక్తీకరించుచున్నవి.

ఇక రాక్షసునిగూర్చి విచారింతము. వీరరస ప్రధానమగు రూపకమున నాయకుఁడు, ప్రతి నాయకుఁడు ఉండుటవసరము. మఱియు నా నాయకులు పౌరుషమునకేమి, స్థితికేమి, ఆఢ్యత్వమునకేమి కొంచెమెచ్చుతగ్గుగా సరిగాకపోయిన నాకయ్యము మనోరంజకముగాదు. రూపకమునం దిట్టిసమయమున రసము పుష్టినొందదు. అందును కవి ప్రప్రథమమున నేదియో యొకనాయకునిపక్షము నవలంబించి రెండవవానికి స్వల్పలోపముల నక్కడక్కడ కల్పించుచుండును కొస నాదోసంగులే యతిబాధకములై ప్రతినాయకునిఁద్రుంచి నాయకునకు జయమును గల్పించును.

ప్రస్తుత మిద్దోనీపైవిషయ మెంతవఱకు పని చేయునో చూతము. ద్వితీయాంకమున విరాధగుప్తుఁడనుచారుని ప్రవేశావసరమున దద్వృత్తాంతమును ప్రతీహారిచే నివేదితుఁడైనరాక్షసుఁడు విరాధు నేకార్యావసరమున నియోగించినదియు స్మరింపలేఁడు. మఱల విరాధ సందర్శనమున ప్రతీహారీసమక్షమునసే

'అయే! విరాధ—(ఇత్యర్ధోక్తే)నను విరూఢశ్మశ్రుః'

యని పొరపడినట్లు నటించి యనంతిరంబ దిద్దికొనెను.

ఇటులనే చతుర్థాంకమునఁ జాగుఁడగుకరభకుఁడు ప్రవేశింప,

(ఆత్మగతమ్) 'కస్మిన్ప్రయోజనే మమాయం ప్రహితఇతి ప్రయోజనానాం బాహుల్యా న్నఖ ల్వవధారయామి'

యని రాక్షసుఁడు పల్కుచున్నాఁడు.

కాని చాణక్యుఁ డట్లుగాక తనకార్యములం దెప్పు డెట్టివనిని నియోగించెనో గుర్తెఱింగి జాగరూకతతో మెలఁగుచున్నాఁడు. ప్రథమాంకమునఁ జారుఁడు ప్రవేశింప,

'కథ మయం ప్రకృతిచిత్తపరిజ్ఞానే నియుక్తో నిపుణకః'

యని వానిని గుర్తించెను. ఇట్లు పరిశీలించి చూడగా చాణక్యుఁడు రాక్షసునికన్న బుద్ధివిశేషముగలవాఁ డనియు మతిభ్రమావిరహుఁ డనియుఁ దెలియును.

చాణక్యరాక్షసులకుఁ దగినట్లు చంద్రగుప్తమలయకేతువులును గవి ఇందుఁ గూర్చియున్నాఁడు. చంద్రగుప్తుని రాజనీతి చిత్తస్థైర్యము వీనికంటె వేయిరెట్లధికమగు దనరాజ్యకారకుఁడైన చాణక్యునియందు భక్తివిశ్వాసములు గలవానినిగాఁ బోషించెను. కాని ప్రతికక్షియగు మలయకేతువు అపనమ్మకము, పరాయత్తత ఆలోచనావిరహము, సందేహబుద్ధి గలవాఁడై చంద్రగుప్తుని కేవిషయమునను సరిరాకున్నాఁడు. మిగిలినపాత్రలు స్వామిభక్తిపరాయణులై యధికవిశ్వాసమున మెలఁగుచున్నారు. అందుఁగూడ ముఖ్యముగ సిద్ధార్థక భాగురాయణులు వీరు చాణక్యునికి సహాయమొనర్పకున్న చాణక్యుని బుద్ధివిశేషమునకు మెఱుఁగు వచ్చుటవకాశము లేదు. రాక్షసప్రణిధులకు చాణక్యప్రణిధుల కొకింతభేదము కన్పట్టుచున్నది. చతుర్థాంక ప్రారంభమున, రాక్షసచారుఁడిట్లు చెప్పుచున్నాఁడు.

"శ్లో. రాజనియోగో మహీయాన్
కోనామ గతా గత మిహ కరోతి,
అస్థానగమనగుర్వీ
ప్రభో రాజ్ఞా యది నభవతి"

అనఁగా రాజనియోగభీతిచే గతాగతుల మగుచున్నాము. అట్లుకానిచో నింతమార్గాయాసమున కెవ్వఁ డోర్వఁగలఁడు?

కాని చాణక్యప్రణిధి సిద్ధార్థకుఁడు పంచమాంకమున నిట్లు చెప్పుచున్నాఁడు.

శ్లో. బుద్ధిజలనిర్ఝరైః సిచ్యమానా
దేశకాలకలశైః,
దర్శయిష్యతి కార్యఫలం
గురుకం చాణక్యనీతిలతా.

నీతివిశేషమను జలనిర్ఝరములచే దేశకాలముల నెడి కలశములచే తడుపఁబడు చాణక్యనీతిలత గొప్పకార్యఫలమునీయఁగలదు. సమానక్లేశమును బొందుచున్నను చాణక్యస్థునియుత్సాహము వేఱుగనున్నది.

ఇఁక ముద్రారాక్షసమను నామధేయము నాటకమున కెంతవఱకు సరిపడినదియో చూతము:

'ముద్రయా గృహీతః రాక్షసః అస్మిన్నితి ముద్రారాక్షస'

మని విగ్రహముగదా!

"ముద్రచే రాక్షసుండు గ్రహింపఁబడుట యిందువర్ణింపఁబడినది గావున ముద్రారాక్షసము." ఈముద్ర రాక్షసుని సంబంధమైనది. నందోన్మూలనానంతరము పాటలీపుత్రము చాణక్యాధీనమైనప్పుడు రాక్షసుఁ డచ్చోటు గదలి పలాయనమొనర్చు నవసరమున భార్యాపుత్రాదులఁ దనయాప్తమిత్రమగు చందనదాసగృహమ్మునం దుంచెను. అట్లు జాయాపుత్రుల శత్రురాజ్యమం దుంచక నారితోఁగూడఁ బలాయన మొనర్చినచో రాక్షససహోత్థాయులును 'చాణక్య' ప్రద్వేషులును నగుకొందఱు పాటలీపుత్రులు రాక్షసు నన్యథా తలంచి చంద్రగుప్తమిత్రులగుదురు. భార్యాపుత్రాదుల న్యాసముగ నచ్చోటనే యుంచిన రాక్షసుఁడు కష్టకాలమందు స్వజనరక్షణ మొనర్చుటకు పాటలీపుర మేతెంచును. అప్పు డాతని సహోత్థాయులుకూడ రక్షింపఁబడుదురను నమ్మకమును దన మిత్రులకుఁ గల్పించు నిమిత్తము రాక్షసుఁడట్లు చేసెను.

అట్లు రాక్షసుఁడుపయాయితుఁడుగాఁగా చాణక్యనియుక్తచారుఁడు యమపటముతో పర్యటనమొనర్చుచు రాక్షస పుత్రుని చేతినుండి భూమిపైఁబడిన రాక్షసనామాంకిత ముద్రను సంపాదించెను. తత్సహాయమున చాణక్యుఁ డొక లేఖను రాక్షసుఁడు చంద్రగుప్తునకు వ్రాసినట్లు వ్రాసి దానిని సిద్ధార్థకునిద్వారా రాక్షస మిత్రమగు శకటదాసునిచే వ్రాయించి ముద్రచే ముద్రించెను. ఈ లేఖచే సిద్ధార్థకునిచేఁ బంచమాంకమున వ్యాపారము చేయఁబడెను. ఈ లేఖయే మలయకేతువునకురాక్షసునిపై నీర్ష్యాగ్రములకు హేతు వాయెను. అంత చేయున దేమియు లేక రాక్షసుఁ డడవిఁ ద్రిమ్మరుచుండెను. రాక్షస సంచారమును, ప్రణిధిప్రచారమున దెలిసికొనిన చాణక్యుఁడు పురుషునొకని ప్రేరేపించి వానిని రాక్షస సంచారమార్గమున నియోగించెను. వాఁడురిపెట్టుకొనుచున్నటులు నటించి క్రమముగా చాణక్యుఁడు చందనదాసును వధింపనున్నాఁడని నివేదించి వధ్యస్థానమునకురాక్షసుని దెచ్చెను.

కాని ఇంతకల్పన కవియసమంజసముగా కల్పించెనేమో యని కొందఱు తలంచుచున్నారు. ఎట్లన: చందనదాసుని గారాగారబద్ధునిఁజేసి చాణక్యుం డుపేక్షించినచో రాక్షసుఁడు తిరిగితిరిగి 'ఏ పుట్టలో పాము ఆ పుట్టలోని కేగునట్లు' తుదకు తన యాపత్సమయమున జాయాపుత్రులఁ గాపాడిన చందనదాసుని మోచనసేయుటకు వచ్చియే తీరును. అట్టి సమయమునఁగూడఁ బ్రస్తుత కథాంశమువలెనే, రాక్షసుఁడు చంద్రగుప్తునకు మంత్రిగా నంగీకరింపనిచోఁ జందనదాస వధ జరుపఁగల శక్తి చాణక్యునికిఁగలిగియే యున్నది. అప్పుడు ముద్రచేత రాక్షసుండు గృహీతుఁడుగాఁడని శంకవచ్చును. ఇప్పుడు మాత్ర మాశంకకు స్థానము లేదేమి? అట్లుకథను మార్చినచో ముద్రారాక్షసమను పే రెట్లుకుదురునని ప్రశ్నింతురా? కాళ్లుకడుగుకొనుటకు బురదయం దెవ్వరేని దిగువారుందురా? నామధేయమును సమర్థించుటకా ఈకష్టము! ఆహా! ఏమి చిత్రము? రాక్షసుండు ముద్రచే నెందు గృహీతుఁడు కాకపోవుటచే తననాటకమున కానామధేయమసమంజసముగ నున్నది మలయకేతువు పాత్ర కీనాటకమునం దవసరమే కన్పట్టదు. రాక్షసుఁడు చందనదాస కారణమున గృహీతుఁడయ్యెను గాని ముద్రాకారణమునను గాదు, లేఖా కారణమునను గాదు. ఈ సందేహమునకుత్తరోత్తర సమాధాన మిచ్చుచున్నాను.

మఱియు, రెండవయంకమున విరాధగుప్తనిర్గమనానంతరము, పురుషుఁ డొకఁడు ప్రవేశించి,

'అమాత్య! ఏష ఖలు శకటదాసః విజ్ఞాపయతి—ఏతేఖలు త్రయోఽలంకారసంయోగా విక్రీయంతే; తస్మాత్ స్వీకరోతు త్వమాత్య ఇతి.'

అనఁగా నలంకారత్రయ మొకటి యమ్మకమునకు వచ్చినది విని దేవరవారు పరిశీలింతురుగాక యని రాక్షసునికి శకటదాసప్రేషితమైన వాక్యము. రాక్షసుఁడంత

'అహో మహార్హాణ్యాభరణాని భద్ర!
ఉచ్యతా మస్మద్వచనా చ్ఛకటదాసః
పరితోష్య విక్రేతారం గృహ్యతా మితి.'

(అనగా వెలనిచ్చి నగలను స్వీకరింపుమని శకటదాసుతోఁ జెప్పునది)అని. ఇచ్చోట కొంచెము విమర్శింతము :

అలంకారములను గొనువా రవసరమునుబట్టి కాని లేక సంతోషాతిశయములతో నుండుకాలమున నవసరము లేకయే కాని కొనుచుండుట లోకవిదితము. కార్యాలోచనానిమగ్నుఁడగు రాక్షసున కలంకారములనుకొనునంతటి యవసర మేలకల్గును? ద్వితీయాంక ప్రారంభమునుండి రాక్షసప్రయోగములన్నియు దైవయత్నముచేఁ గొన్నియు, మానుషయత్నముచేఁ గొన్నియు విఫలములైనవిగా విరాధగుప్తముఖమున వినుచున్న రాక్షసునికి సంతోషవార్త యెచ్చటిది? తన ప్రయోగము లమోఘము లగునని కొండంతయాస పెట్టుకొనియున్న రాక్షసుఁడు విరాధవచనవిధ్వస్తహృదయుండై యితరుల మాట్లాడించుటకునైన నుత్సాహము లేనపు డలంకారత్రయము నెట్లు కొనుట కాజ్ఞాపించెను? కాని విరాధునివచనములకుఁ దుది యని చెప్పఁదగిన చంద్రగుప్తచాణక్యకలహవార్త వినినరాక్షసున కేమైన సంతోష ముద్భవించెనేమొ తెలియదు. దుష్కార్యాచరణ మొనర్చిన యొకయువకుని ప్రాణము పోవునంత దనుక చీవాట్లుపెట్టి యనంతరంబ 'నిన్నిఁకవదలినాము, వెళ్లుము; నీమంచా!' యనిపల్కి వదలినను నావదలుట వానికి తత్క్షణమే తత్పూర్వహృత్పరిహారములను విస్మరింపనటులు చేయునా? అటులే ప్రస్తుతము ప్రథమమునుండి తనప్రయోగములన్నియు విధ్వస్తములై విఫలము లగుట విని క్రమముగా క్షుణ్ణహృదయుండగు రాక్షసునకు చాణక్యచంద్రగుప్తకలహముచే (ఆకలహమైనను యెంతనిజమో తెలియదు, వార్తయే. ప్రత్యక్షము గాదు. కృత్రిమమగునేమో?) సంతోషాతిశయము కలుగు టాశ్చర్యము. ఈయలంకారత్రయమును రాక్షసునిచే క్రయ మొనరింపఁజేసి వానిని ధరించి రాక్షసుఁ డైదవయంకమున మలయకేతుసమక్షమునకు వచ్చునట్లు కవికూర్చెను. దానంజేసి తనతండ్రియగు పర్వతేశ్వరునిచేఁ బూర్వముధరింపఁబడిన యలంకారత్రయమును రాక్షసుఁడు ప్రస్తుతము ధరించుటచే, రాక్షసుఁడేతనపితృవధావిధానమునకు నిదానమనియూహించి వానిఁ నెడలఁ గొట్టెను. ఈయోజనా నిమిత్తము కవి రెండవయంకమునఁ జాణక్యప్రేషితమైన పర్వతేశ్వరుని యలంకారత్రయమును రాక్షసునిచే స్వీకరింపఁజేసెను. కాని యీ స్వీకరణమిచ్చట యెట్టియవసరమే లేక, జరుగఁబడి యసమంజసమై 'అతుకు' వలె నుండి ప్రశ్నావకాశ మిచ్చుచున్నదని కొందఱు చెప్పుచున్నారు. ఇఁక దీనికి సమాధానము. శత్రువిషయక జయమును దనప్రయత్నపరాభవమును విరాధగుప్తముఖమున వినిన రాక్షసున కాభరణములు క్రయ మొనరించునంతటి యుత్సాహము లేదనుట నిజమేకాని చాణక్య చంద్రగుప్త కలహవార్త రాక్షసున కత్యంత యుత్సాహజనక మగును. ఎట్లన, రాక్షసుఁడు లోకసామాన్యుఁడు గాఁడు. లోకోత్తరుఁడు శత్రువున కెట్టియాపద సంభవించినను తజ్జనకసోత్సాహముచే వెంట్రుకతోఁ గొండ నధిరోహించునట్లు, వ్యాపారము చేయువాఁడు. తనప్రయత్నములు విఫలము లగునట్లు తోఁచినను వెనుదీయఁడు. దీనికిఁ దార్కాణము: చతుర్థాంకరాక్షస ప్రవేశావసరమున వచనము.

'తదపినామ దురాత్మా చాణక్యవటుః—
అని.

అనఁగా దురాత్ముఁడగు 'చాణక్య వటువు'—అనునంతలో దౌవారికుఁడు ప్రవేశించి

'జయతు'

అనిరాక్షసుని దృష్టిని దనవంకఁ ద్రిప్పుకొనెను. అంత రాక్షసుఁడు

'అతిసంధాతుం శక్య స్స్యాత్'

'ఓడించుటకు శక్యుఁడగును' యని తనవాక్యమును పూర్తిజేయ నంత దౌవారికుఁడు

'అమాత్యం'

అని తనవాక్యమును పూర్తిజేయ రాక్షసుఁ డిట్లు తలపోయుచున్నాఁడు.

(వామాక్షిస్పందం సూచయిత్వా) 'దురాత్మా చాణక్యవటు ర్జయ త్వతి సంధాతుం శక్యః స్యా దమాత్య ఇతి వాగీశ్వరీ వామాక్షిస్పందనేన ప్రస్తావగతా ప్రసాదయతి [తథాపినోద్యమస్త్యాజ్యః,]

అని వామాక్షిస్పందనమున వాగీశ్వరి తనకపజయమును ఘోషించుచున్నను ఉద్యమము త్యాజ్యము కానీయనని యుత్సాహము, పట్టుదలవీడక వర్తించెను.

మఱియు, షష్ఠాంకమున రాక్షసుని యేకాంతదుఃఖావసరమున

'ప్రయత్నం నోయేషాం విఫలయతి దైవం ద్విషదివ.'

యనియు

'దేవే గతే దివ మతద్విధమృత్యు యోగ్యే'
'నయావన్ని శ్శేష క్షపితరిపుచక్ర స్సనిహితమ్'

అను శ్లోకములును రాక్షసుని పట్టుదల యెంత శ్రేష్ఠమైనది యో వ్యక్తపఱచుచున్నవి. అట్టి రాక్షసుడలంకారత్రయమును క్రయ మొనర్చుటలో నేమిలోపమున్నది? ద్వితీయాంకమున మలయకేతు ప్రేషితములైన యాభరణములు సిద్ధార్థకునకుఁ గానుకగ రాక్షసునిచే నీయఁబడెను. కావున మలయకేతు సంపర్కనార్థము మహార్ఘ్యములగు నాభరణముల కొనుటవల్ల నాటకమున కది లోప మేలకల్పించును? మఱియు నవరత్నములు, ఉత్తమజాతి శంఖములు మొదలగునవి యరిష్టసూచకములై శుభోదర్కములైనవి యను ప్రతీతి గలదు. ప్రస్తుతము రాక్షసుఁ డత్యంతశత్రు శిథిలీకృత వ్యవసాయము గలవాఁడు గావున నీ యుత్తమజాతి యాభరణములఁ గొనియుండు నేమొ! మహార్ఘ్యములగు నాభరణములు సనమపేక్షించినప్పుడెల్లఁ బ్రాప్యములు గావు. కావున రాక్షసుఁ డేల యుపేక్షించును? ఈ కారణములన్నియుఁ గాక

'బుద్ధిః కర్మానుసారిణీ'

యనునట్లు కాలకర్మలు గూడినప్పుడు తనకు మున్ముందు సర్పాయమానములగు నాభరణములను క్రయణమొనర్చు బుద్ధి యనివార్యమై రాక్షసుని వ్యాపారము చేయించి యుండఁగూడదా? ఈ క్రయణ మతుకువలె నెట్లున్నది? తరువాత; ముద్రారాక్షసమను నామధేయమంతసమంజసముగ నీ నాటకమునకు లేదని చెప్పువారి మతమును లోఁగడ విచారించితిని. దానికి సమాధాన మీయెడ నిచ్చువాఁడ.

చాణక్యుఁడు చందనదాసుని గారాగారబద్ధుని జేసి యుపేక్షించినచో రాక్షసుఁ డెక్కడనైన తిరిగి తిరిగి తుది మిత్రరక్షణార్థము వచ్చునను నమ్మకము చాణక్యున కెట్లుగల్గును? లోకోత్తరగుణముల కాస్పదుఁడగు రాక్షసు నంతటివాఁ డొకప్పుడు దేశరక్షణార్థమునఁగా విశేష ప్రజాక్షేమ సంఘటనార్థము చందనదాసుని విడుదలచేయ లేకపోవచ్చును! మఱియు మలయకేతు పాత్ర యిం దనవసరమని చెప్పుచున్నారు. తన పండ్రియగు పర్వతేశ్వరుని జంపె ననుకోపావేశమునఁ జేయున దేమియు లేక మలయకేతువు చాణక్యునినుండి పలాయితుఁడై ద్వేషించుచుండెను. నందప్రరోహ మెచ్చట లేకపోవుటచే స్వామిభక్తి పరాయణుఁ డగు రాక్షసుఁడు, చాణక్యుని జయించుట, చందనదాసుని మోచనసేయించుట, యను తన కార్యములను సాధించుటకు యుద్ధముఁజేయ యత్నించెను. అందులకుఁ జాణక్యద్వేషియగు మలయకేతువు నాలంబనముగ స్వీకరించెను. దీనిని గనిపెట్టి నీతికోవిదుఁడు చాణక్యుఁడు రాక్షస మలయకేతువుల కేవిధముననైన ద్వేషభావముఁ గల్పించిన బాగుండునని పూర్వము చెప్పఁబడిన మిథ్యాలేఖను సృష్టించి సిద్ధార్థకునిద్వారా శకటదాసుచే వ్రాయించి వ్యాపారముచేసెను. అంత నాశ్రయములేక రాక్షసుఁడు భ్రమిష్ఠుఁడుచుండెను. అప్పుడు చాణక్యప్రణిధియగురియొక్క యపహ్నవముచ వానిని వధ్యస్థానమునకుఁ దోడ్కొని రానిపక్షమున నాతఁడు మఱియొకరాజుతో స్నేహము చేసి చంద్రగుప్తోన్మూలన మొనర్చియేయుండునేమో! కావున మలయకేతువునకు అవసర మిచ్చోఁగలదు. మఱియు రాక్షసజాయాపుత్రులు చందనదాసగృహమున నుండినను వార్త చాణక్యుని ముద్రాధిగమనముచేతనే తెలిసికొనఁబడియె. తత్కారణమునసే చందనదాసుని

బద్ధుని జేసెను. తుదకు రాక్షసుఁడతనినిమిత్తమే చాణక్యుని సమీపించెను. కావున 'ముద్రారాక్షస'మని నామధేయ మీనాటకమునకు సమంజసముగనే యున్నది. పూర్వపక్షము విశ్వస్తమైనది—ఇంక నీనాటకము సత్కావ్యమా, యసత్కావ్యమా యనునంశ మొక్కింత విమర్శించి యుపసంహారమునకుఁ గడంగెద.

"కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే
శివేతరక్షతయే; సద్యః పరనిర్వృతయే
కాంతాసమ్మితతయా ఉపదేశయుజే"

యని యాలంకారికసమయముగదా!

కావ్యరసాస్వాదనముచే 'రామునివలె వర్తింపఁదగినది కాదనునీతి కాంతాసమ్మితత్వముచేఁ గల్గును. అదియే కావ్యముయొక్క యుత్కృష్టఫలము. ప్రస్తుతము ముద్రారాక్షస మొకక్రోధోద్రేకముగల నాటకమనియు, నందుఁ జంద్రగుప్తునికి రాక్షసమంత్రిత్వమును గలుగఁజేయుట యనెడి చాణక్యేచ్ఛ పూర్తియగుటకంటె నం దెక్కుడు హితాచరణకారకమగునీతి లేదని యాలంకారికులీకావ్య మసత్కావ్యముగఁ బరిగణించిరి. కాని నేనీయెడ దీనిని సత్కావ్యముగఁ జెప్పఁబూనితి.

చాణక్యుఁడు లయకారకుఁడై, నందోన్మూలన ప్రతిజ్ఞను నిరాఘాటముగ సమర్థించుకొనెను. ఆశ్రితుఁడగు చంద్రగుప్తుని రాజ్యమందుఁ బ్రతిష్ఠించెను. కాని యాతఁడు పోషణకర్తగాఁడు. పోషణసామర్థ్యము రాక్షసునకే వర్తించును.

శ్లో. గురుభిః కల్పనాక్లేశైః దీర్ఘజాగరహేతుభిః,
చిర మాయాసితా సేనా వృషలస్య మతిశ్చ మే.

అని చాణక్యవచనము.

అనఁగా దీర్ఘజాగరములచేతను కల్పనాక్లేశములచేతను చాణక్యచంద్రగుప్తులచిత్తములు ఏరాక్షసునిచే నాయాసపెట్టఁబడినవో, యారాక్షసుఁ డీతఁడని చాణక్యుఁడు సప్తమాంకమునఁ జెప్పియున్నాఁడు. చాణక్యుఁడు పోషణకర్తయగునేని నందోన్మూలన చంద్రగుప్తప్రతిష్ఠలను జేసినవాఁడు రాక్షసునికొఱకేల యంతయాసపడును. రాక్షసుఁడున్నచో దేశమునకు క్షేమము కల్గునని చాణక్యతాత్పర్యము. రాక్షసుఁ డెప్పుడును లయకారకుఁడుగాఁడు. పంచమాంకమున మలయకేతువు తన్ను నిందింపఁగా, రాక్షసుఁడు దాను స్వయముగా నిర్దోషియైనను మలయకేతునకు సమాధానమైన నీయఁడు. అట్లుగాక చాణక్యునివలె 'ఓరీ మ్లేచ్ఛుఁడా, నన్ను నిష్కారణమున నిందించిననీ కులనాశన మొనర్చెదను, చూడు;' మని రాక్షసుఁ డేమైనఁ బ్రతినఁబూనెనా? పూనలేదు. శాంతస్వభావునిలక్షణ మదియే. చాణక్యుఁడు దాను పోషణకర్తయైన దేశమల్లకల్లోలమగునని యెద నెఱుంగును. ఆకారణముఁబట్టియే మంత్రిత్వము సమీపమునందున్నను భోగములను సైత మాతఁడు పరిత్యజించి దేశక్షేమమునకై రాక్షసుని కాపదవి నిచ్చెను. ఆహా! దేశక్షేమమున కెట్టిస్వార్థపరాయణులు గలరు! ఇట్లు చాణక్యుఁడు నిష్కాముఁడై ప్రవర్తించుచున్నాఁడని చెప్పుటకే కాబోలు కవి మూఁడవయంకమున కంచుకిముఖమును వెలువరించెను.

'శ్లో. స్తువంతి శ్రాంతాస్యాః క్షితిపతి మభూతైరపి గుణైః, ప్రవాచః కార్పణ్యా ద్యదవితథవాచోఽపిపురుషాః; ప్రభావ స్తృష్ణాయాః సఖిలు సకలః స్యా దితరథా, నిరీహాణా మీశ స్తృణమివ తిరస్కారవిషయః.'

అనఁగా పురుషులు ధనాశచే రాజులను బొగడుచున్నారు. కాని నిరీహులు రాజాధిరాజును సైతము లక్ష్యము చేయక తమమార్గమున వర్తింతురని ముఖ్యతాత్పర్యము.

కావున స్వార్థమైనను బరిత్యజించి లోకక్షేమమునకుఁ బాటుపడవలయునను నీతిని కవి యీకావ్యపాత్రముల కిచ్చుచున్నాఁడు. కావున నీకావ్యము సత్కావ్యమనియే పరిగణింపవచ్చును. ఇట్టిమహాకవులకు నమస్కారశతము నర్పించుచున్నాను. ఇట్టి మనభారతపూర్వకవులు సూక్ష్మశరీరములతో మనవెనువెంటనే యుండి కావ్యరసాస్వాదనయోగ్యులనుగా మనల నాశీర్వదించు నటులు ప్రార్థించుచున్నాడను.

వలవంత

పి. అన్నాజీశర్మ గారు

౧

గుండెలదివేగముగ కొట్టుకొనుచునుండ
వేడినిట్టూర్పుగాడ్పుల పెదవులదర
కనులు పొడిగ్రుడ్లువడ మేను కంపమంద
తీవ్రగద్గదగతి మాట తేలిపోవ
సారెసారెకు జాబును జదువుకొనుచు
నాటియుదయాన నాస్వామినన్ను జేరి
"పోవుచుంటిని ఈజన్మమునకు మరల
కలుగబోదు పునస్సమాగమము మనకు
ఇంతి కడసారిదర్శనం బిదియె" అనుచు
అశ్రుధారలపొంగు లో నణచుకొనుచు
అడుగడుగునకు కాళులు తడబడంగ
తిరిగిచూడక బిరబిరనరిగె నెటకొ?

౨

అన్నెముం బున్నెము నెరుంగనట్టి నేను
పరిచయకఠోరవిశ్వాసభావములును
దీర్ఘనిశ్వాసభంగాల తేలిపోవ
గుమ్మమున నిల్చియుంటి రాబొమ్మవోలె
చిత్తము చలింప నున్మాదమెత్తినట్లు
క్షోభపడుచు నెడంద మూసుకొనిపోవ
పేదచూపుల నలుదెసల్ వెదకుకొనుచు
నక్షులు నిరంత రాశ్రుపయస్సు గురియ
బ్రదుకుఫల మొక్కమారె కోల్పడిన కరణి
నాకట గృశించు ప్రేమంపుటూస లెల్ల
తునిగిచెల్లాచెదరుగాగ,తుదియు మొదలు
లేనిసైపగారాని, యనూనదుఃఖ
మేదొ తెర చీల్చుకొనివచ్చి యిట్టె నన్ను
మూలమట్టముగా గాల్ప మొదలువెట్టె

3

అమృత తేజస్వి, దివ్యగాఢానురాగ
మధురహృదయుడు, ప్రేమాభిమానమూర్తి
ప్రాణనాథుడు, జీవితేశ్వరుడు ప్రభుడు
ప్రణయసర్వస్వ మాశాప్రభాకరుండు
నాహృదయదీపికా చిరస్నేహవర్తి
నాసుఖస్వప్న మారీతి నన్ను విడచి
యరుగ, ప్రౌఢునై నేను మైమరచియిట్టు
బ్రదికియుండుటయే యపరాధమనుచు
నెంతో యుడుకెత్తి యెలుగెత్తి యేడ్చినాను
నాకె దుర్భరమై క్రూరమై కఠోర
మై యసహ్య పీడాకరమైనయట్టి
నా దురంతజీవిత మనారతంబు
నెడతెగనియట్టి వలవంత యేడ్పుతోడ
మృత్యుదేవతాహ్వాన నిమేషమునకు
నెదురు చూచును, నాశా నిరీక్షణముల.

రామాయణము నందలి వానరు లెవరు?

కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి గారు

(భారతిలో శ్రీ గో. రామదాసుగారు వ్రాసిన వ్యాసమునకు సమాధానము)

ఈ శీర్షిక క్రింద ‘శ్రీశారద’ యందొక వ్యాసమును, ‘భారతి’ యందొక వ్యాసమును వ్రాసియున్నాను. అందు రామాయణమునందలి వానరుల దేహస్వరూపాదులను, బుద్ధివిభవాదులను, చేష్టావిశేషాదికములను, సాంఘికస్థితిగత్యాదికమును, భాషాదికమును చర్చించి చూచి రామసేనయగు వానరు లిప్పటి వానరజాతికిని, మానవజాతికిని నడుమనుండెడి యొకజాతి యని తెలిపియుంటిని. వానరు లేజాతివారో తెలిసికొనుటకై దేహస్వరూపాదుల విమర్శించుట సుకరమార్గము కాదనియు వారిభాషనుబట్టి దానిని దేల్పవలె ననియు సిద్ధాంతీకరించి తద్రీతి పరిశోధనము కొంతగావించి నా చెప్పినదానిని త్రోసిరాజని రామాయణమునందలి వానరు లిక్కాలపు సవరలజాతివారేయని స్థిరీకరించుచు శ్రీ గో. రామదాసు (బి. ఏ., యం. ఆర్. ఎ. యస్.) గారొక వ్యాసము వ్రాసి భారతిలో క్రోధన సం.ర ఫాల్గుణ మాస సంచికయందునను, అక్షయ సం.ర చైత్రమాస సంచికయందునను బ్రచురించిరి. రామదాసుగారి వ్యాసరాజము బహుభాషాపరిజ్ఞానమును జూపునదియై ప్రౌఢముగ నున్నది. కాని సత్యమునకు దూరమగు సిద్ధాంతమును చేయుచున్న దను భయము కలుగుచున్నది. ఏమన, భాషలయందలి కతిపయధ్వని సాదృశ్యాదులనుబట్టి జాతిసామ్య మేర్పఱుచుటయుఁ దగినమార్గము కాదు. ఇది శబ్దశాస్త్రజ్ఞు లెల్లరను నంగీకరించియున్న యంశమే. ఒక భాషయందలి శబ్దములకును మఱియొక భాషయందలి శబ్దములకును కతిపయస్థలములలో ధ్వనిసాదృశ్య మున్నంతమాత్రమున నా రెండు భాషలకు సజాతీయత కలదని నిరూపించుట సత్యము కానేరదు. ఇందుల కొకయుదాహరణము తీసికొందము.

ఆంధ్రము - ఆంగ్లము

పూర్వఖండమున నెచ్చటనో యొకమూల నున్న యాంధ్రభాషకును పశ్చిమఖండములో నెచ్చటనో యొకమూలనున్న యాంగ్లభాషకును కతిపయపదముల విషయమున ధ్వనిసాదృశ్యము కలిగియున్నది చూడుఁడు:

ఆంధ్రము	ఆంగ్లము	అర్థము
(1) త్రోయు	త్రో (Throw)	త్రోయుట
(2) పెట్టు	పుట్	ఉంచుట
(3) చూ	సీ	చూచు
(4) ఈను	యీన్	కనుట
(5) ప్రాపు	ప్రాప్	అండగానుండు
(6) త్రాడు	త్రెడ్	పగ్గము
(7) మాంతి	మాత్	నోరు
(8) చలి	ఛిల్	శీతము
(9) గాలి	గేల్	వాయువు
(10) చెక్కు	చీక్	గండము
(11) ఒన్	వన్	ఒకటి
(12) మడ్డి	మడ్డి	మూర్ఖపు
(13) ఈరు	యూ	మీరు

ఇట్టి వనేకములు కలవు. గ్రంథ విస్తరభీతిచేఁ గతిపయ పదములమాత్రమే యుదాహరించితిని. మఱియును మాసమను నర్థము వచ్చుటకై యాంధ్రులు చంద్రుఁడను నర్థముగల నెలయను పదమును వాడుదురు. ఆంగ్లేయులును చంద్రుఁడను నర్థమిచ్చు ‘మంత్’ అను

పదమును వాడుదురు. ఇంకను నాంగ్ల దేశమున డ్రూయిడ్స్ (Druids) అను వారుండెడివారు. ఆ డ్రూయిడ్లే ద్రావిడులు. ఆంధ్రులు ద్రావిడులలోని వారే కదా. ఇంతయేల? ఆంగ్లదేశమున మనలంక గూడ కలదు. దానినే వారు 'లంకాషై'రందురు మన యాంధ్ర దేశమునందును లంకలు గలవు. ఆంగ్లదేశమున థేమ్సు (Thames) అనునది గలదు. ఇది తమస్సను సంస్కృత పదమునుండి పుట్టినది. తమస్సనగా చీకటి. దీనిని నలుపున కుపలక్షణముగా దీసికొందురు. "అంధకారసమం వస్తు కృష్ణనామాక్షరద్వయం, కకారాది ణకారాంతం" మున్నగు శ్లోకములవలన నిది తెలియగలదు. తమస్స కృష్ణవర్ణమును దెల్పునదిగావున నీ తమస్సను నది కృష్ణానదియే.

ఇట్లెన్ని కొనుచు పోయి యాంధ్రులాంగ్లేయులే యనికాని, వారు వీరేయనికాని సిద్ధాంతము చేయవచ్చునా? ప్రస్తుత కాలమున మన ముభయులను భిన్నజాతుల వారినిగాఁ జూచుచున్నాము. కావున మనకీ యెన్నిక ఘోరమైన యసత్యముగఁ గాన్పించుచున్నది. కాలము గడచిపోయిన పిమ్మట యీ రెండు జాతులలో నేదో యొకజాతి యంతరించిన పిమ్మట యే శబ్దశాస్త్రజ్ఞులో బయలువెడలి బహుకాలాతీతమైన పిమ్మట నీ సాదృశ్యములను జూపి వారే వీరనిన నప్పటివారు సత్యమును గనుగొనుటకు నవకాశమంతగ నుండఁజాలదు కదా!

కాబట్టి భాషాపదముల యుచ్చారణ సాదృశ్యముంబట్టి జాతుల కైక్యము కల్పింపఁబోవుటలో హాని విశేషముగాఁ గలదు.

"గ్రంథము సంస్కృతమునందున్నప్పటికి ఏప్రదేశమందున్న స్థలములు ఆప్రదేశ భాషానామములతోనే చెప్పబడును. ఊరు, పల్లె, మొదలైన ద్రవిడపదములు సంస్కృతములో వ్రాయఁబడిన అలహాబాద్ శాసనమునందు మార్పుచెందకయే కొత్తూరు, ఏరండపల్లి అను నామములందున్నవి. ఏభాషయందు మనదేశచరిత్రము వ్రాసినను అలహాబాద్, ఆగ్రా, ఢిల్లి మొదలైన నామములు మారవుగదా! అటువలెనే గంగానదీ ప్రాంతమునుండి లంకవరకు నున్న ప్రదేశములో చెప్పబడిన స్థలములయొక్కయు మనుష్యులయొక్కయు పేరులు అచ్చట నివసించియుండు జనులభాషయందే యున్నవి. వాటి యర్థమును, ఉత్పత్తిని బరిశోధించినవారు ఉంటే భాష యేదో తెలియును." అని రామదాసుగారు వ్రాయించిరి. ఇది సాధారణధర్మమైనమాట నిజమేకాని దీనివంతటను వ్యాపింపఁజేయుటకు నవకాశ ముండనేరదు. హుస్సేన్‌పురము, హుస్సేనాబాదా, అమీనాబాదా, పవర్ పేట, ఇన్నీసుపేట, ఫాస్టరుపేట మున్నగునవి గోదావరీమండలమునం గలవు. ఇట్టి నామములంబట్టి గోదావరీమండలమునందలి ప్రజలభాష హిందూస్థానియనికాని యాంగ్లమనికాని చెప్పవలనుపడదుగదా. కావున గ్రామనామములంబట్టి యాస్థలమునందలి దేశభాష నిర్ణయించుట కష్టతరమే. కిష్కింధారాజ్యమునందలివారు సవరజాతివారని తెలియున్నయెడల నావానరులు నివసించిన స్థలములందలి నామములు సబరభాషలోనే యున్నవనుకొనవచ్చును. సబరులకు వానరులకు అట్టి సంబంధ మేదియు గాన్పింపదు. ఈప్రాంతములందు శబరియను స్త్రీయొకతె యున్నట్లు రామాయణమున గలదు. కాని యాశబరికిని వానరులకును నే సంబంధమును గానరాదు. అట్టి సంబంధమును దేనిని రామదాసుగారు చూపలేకపోయిరి. కాన స్థలనామములంబట్టి దేశభాషా నిరూపణముచేయ రామదాసుగారు చేసిన ప్రయత్నము నిర్బంధకముగ లేదు.

రామాయణముబట్టి వానరభాషయున్నట్లు తెలుచున్నదా?

నేను వానరులభాష యేదియో తెలిసికొనవ్యమింపక విడిచియుండలేదు. ఆయంశమును రామదాసుగారును నంగీకరించిరి. వానరభాష యేదియో వేఱుగ నుండిన నుండవచ్చునుగాని రామదాసుగారుదాహరించిన రామాయణవాక్యములంబట్టి యది వేఱుగనున్నదని నిర్ణయించుటకుమాత్ర మవకాశము గాన్పించుట లేదు. తమవాదమును బలపఱచుకొనుటకై రామాయణమునుండి యీక్రిందివాక్యములను వారుదాహరించిరి.

"వాచంచోదాహరిష్యామి మానుషీమిహ సంస్కృతామ్,
యది వాచం ప్రదాస్యామి ద్విజాతిరివ సంస్కృతామ్;
వానరస్య విశేషేణ కథం స్యాదిహ భాషణమ్."

దీనివలన వానరభాషయొకటి వేఱేయున్నదని స్పష్టమగుచున్నదని రామదాసుగారు వ్రాసిరి. పై వాక్యములు వానరభాషంగూర్చి యింతయును ముచ్చటించుటలేదు. సీతనుగనుగొనుటకై రామదూతగా లంకకుబోయిన హనుమంతు డశోకవనమున సీతతోమాటలాడ నెంచుకొని యేభాషతో మాట్లాడవలయునను వితర్కముగావించుకొనిన పలుకులివి. ఆ పలుకులనుండి కొన్నిశబ్దముల నేహేతువుచేతనో రామదాసుగారు తీసివేసిరి. రామాయణమున నీఘట్టమున నీయఁబడిన వాక్యములు నీక్రింద నిచ్చుచున్నాను.

అహం హ్యతి తనుశ్చైవ వానరశ్చ విశేషతః, [మ్;
వాచంచోదాహరిష్యామి మానుషీ మిహ సంస్కృతా
యది వాచం ప్రదాస్యామిద్విజాతి రివసంస్కృతామ్,
రావణం మన్యమానా మాం సీతా భీతా భవిష్యతి.

వానరస్య విశేషేణ కథం స్యాదభిభాషణమ్
అవశ్యమేవ వక్తవ్యం మానుషం వాక్య మర్థవత్.

"నేను సీతతో నేభాషతో మాట్లాడను? మనుష్యభాషను ముచ్చటింపనా? గీర్వాణభాషను ముచ్చటింపనా? "అని హనుమంతుఁడు శంకించుకొని" పండితైకవేద్యమగు గీర్వాణభాషను ముచ్చటించినఁ దన్నురావణునిగాఁదలంచి జంకి సీత తనతో మాట్లాడకుండునుగాన మనుష్యభాషతో ముచ్చటింతునని హనుమంతుఁ" డనుకొనినట్లువాక్యములు దెలుపుచున్నవి. ఇందువానరభాషాప్రశంస లేనేలేదు. ఈవాక్యములకుఁ బండితకవి వరులిదివఱకుఁ జేసియున్న "భాషాపరివర్తనముల నీక్రింద నిచ్చుచున్నాను.

"నేను బ్రాహ్మణునివలె సంస్కృతభాష మాట్లాడుదునేని సీత 'ఔతియెక్కడ, అందును విశేషించి సంస్కృతభాషతో మాట్లాడుటయెక్కడ!' అనిశంకించి నన్ను రావణునిగా భ్రమించి భయపడునుకావున నవశ్యము సాధారణమైన మనుష్యభాషనవలంబించియే అర్థసహితముగా మాట్లాడవలయునుగాని సంస్కృతభాషను మాట్లాడరాదు. అట్లుగాక మఱియేవిధమునను అనిందితయగు సీతనాశ్వాసించుట శక్యముగాదు."— దే. సు. [ఆంధ్రవచన రామాయణము.]

"తే. తగవె సంస్కృతమున నేను ధరణిసురుని
రీతిసంస్కృతమాడిన భీతయగుచు
దశముఖాసురుగా నన్నుఁ దలఁచునేమొ?
యేమిసేయుదు గ్రోఁతి నే నెట్లుపలుక?

క. ఊరార్పఁగఁదగుఁ దరుణిని
నూరార్పుటయెట్లు మానవూనిన మఱి నే
నేరీతిఁ బలుకగతి లే
దీరమణిం బలుకరింతు నే మనుజోక్తిన్.

—వా. సు. ఆంధ్ర వాల్మీకిరామాయణము.

"Shall I, a puny Vanar, choose
The sanskrit, men delight to use?
If as a man of Brahman kind,
I speak the tongue by rules refined,
The lady, yielding to her fears
Will think it is Ravana's voice she
rears.

I must assume my only plan
The language of a common man"

GRIFFITH'S RAMAYANA

వీనింబట్టి పైవాక్యములలో వానరభాషాప్రశంస లేదని చదువరు లంగీకరింతురని తలంచెదను.

రామదాసుగా రుదాహరించిన వాక్యములంబట్టి వానరభాష వేఱుగనున్నదని తేలకున్నను శ్రీమద్రామాయణములోని యీ క్రింది సుందరకాండ వాక్యములంబట్టియే యది వేఱుగ నున్నదనుకొనవచ్చును.

"ఏవ మే తే హతా శ్శూరా స్త్వయి తిష్ఠతి భర్తరి,
కృత్స్నం మధువనం చైవ ప్రకామం తైః ప్రభక్ష్యతే.
ఏవం విజ్ఞాప్యమానంతు సుగ్రీవం వానరర్షభమ్,
అపృచ్ఛత్తం మహాప్రాజ్ఞో లక్ష్మణః పరవీరహా.
కిమయంవానరో రాజన్ వనపః ప్రత్యుపస్థితః,
కంచార్థ మభినిర్దిశ్య దుఃఖితో వాక్య మబ్రవీత్."

హనుమంతుఁడు సీతను లంకయందు గనుగొని వచ్చి, తమ్మును గలిసికొనినతర్వాత నంగదాదివానరులెల్లరు నానందముతో బయలువెడలి కిష్కింధకడకు వచ్చి యుచ్చటనున్న సుగ్రీవుని మధువనములోఁ బ్రవేశించి పండ్లు మున్నగువానినిభక్షించి తోఁటను ధ్వంసము

చేయుచుండగా నది చూచి తద్వనపాలకుం డగు దధిముఖుండను వానరుఁడు సుగ్రీవునితోఁ దద్వృత్తాంతము నంతయు దుఃఖించుచుఁ దెలుపఁగాఁ దత్సమీపమునఁగూర్చుండియున్న లక్ష్మణుఁ డావాక్యముల యర్థము దెలిసికొనఁజాలక యీ వానరుఁ డేమిటికి దుఃఖించుచున్నాఁడేమి చెప్పుచున్నాఁడని శంకించెనని పైవాక్యములు తెలుపుచున్నవి.

దధిముఖుని వాక్యముల సమీపముననుండియు లక్ష్మణుఁడు గ్రహించుకొనఁజాలక యాతఁడు పల్కినదేమని సుగ్రీవునిఁ బ్రశ్నించెఁగావున దధిముఖుఁడు లక్ష్మణున కర్థముకాని వానరభాషలో మాట్లాడినట్లుగాఁ బెద్దలు తలంచుచున్నారు. ఈ విషయమై తీర్థీయమను వ్యాఖ్యానములో నిట్లున్నది.

“ సమీపే వసతో లక్ష్మణస్య ‘ కం చార్థ మభినిర్దిశ్య దుఃఖితో వాక్య మబ్రవీ’ దితి ప్రశ్నకరణాత్ దధిముఖేన వనభంగాదికం స్వజాత్యుచిత భాషయోక్త మిత్యవ గంతవ్యమ్.”

ఇట్టి యంశములంబట్టి వానరభాష వేఱుగ నున్నట్లు రామాయణముంబట్టియే తేలుచున్నదనవచ్చును. కాని దీనికిగూడ నొక చిక్కులేక పోలేదు. సుగ్రీవునితో దధిముఖుఁడను వానరుఁడు సంభాషించిన సంభాషణమును లక్ష్మణుఁడు తెలిసికొనలేక పోవుట తద్భాషాజ్ఞానము లేకపోవుటచేతనే కాక మఱియొక కారణముచేతఁగూడఁ దటస్థింపవచ్చును. రామానుజుఁడు తమవాఁడు కాఁడు; అన్యునకు తమ వనముయొక్క భంగపాటు తెలియనిచ్చుట కిష్టములేక గుడ్డ యడ్డుపెట్టుకొనియో, చేయి యడ్డుపెట్టుకొనియో సుగ్రీవునకుమాత్రమే తన మాటలు తెలియులాగున దధిముఖుఁడు గొణిగియుండవచ్చును. దానంజేసి లక్ష్మణున కావాక్యము లర్థముగాక యదేమనియడుగవచ్చును. కావున నే తీర్థీయమునందే ‘ఉపాంశూక్తమితివా ద్రష్టవ్య ’ మని గత్యంతరము చూపఁబడియున్నది. ఏమైననేమి, వానరభాష వేఱుగనున్నదని యంగీకరించుటకు నా కేయభ్యంతరమును లేదు. అది వేఱుగ నుండవచ్చుననియే నేను వ్రాసియున్నాను, కాని యీ భాష యిట్టి స్వరూపము కలదని తెలిసికొనుటకు మాత్ర మాధారములు లేవంటిని. ఆ యాధారముల రామదాసుగారు చూపయత్నించిరి కావున వారుచెప్పినదానిలో బలాబలముల కనుగొన బ్రయత్నింతము:

రామాయణములో దక్షిణాపథమునందలి స్థలాది నామములంబట్టి యీ భాషానిరూపణము చేయవచ్చునని రామదాసుగారు సెలవిచ్చిరి. అది సులభసాధ్యమైన పని కాదనియును, సత్యమును తెల్పుమార్గమనుట కవకాశము లేదనియును నే నిదివఱకే వ్రాసియున్నాను. రామాయణమంతయు సంస్కృతమున నున్నదని శ్రీరామదాసుగారే యంగీకరించినారు. అట్టిస్థితిలో దక్షిణాపథమున గల గ్రామనదీనామాదుల నామములంబట్టియును, పురుషనామములంబట్టియును వానరులభాష యేదో నిర్ణయింతుమనియు దానింబట్టి వానరు లేజాతివారో నిశ్చయింతుమనియు తెల్పుటమాత్రము సాధ్యమగునా? ఎంతమాత్రమును సాధ్యముకాదు. పురుషాదినామములంబట్టి భాషానిరూపణముచేయ నుపక్రమించిన మన రామదాసుగారే (1) “వాలి, సుగ్రీవ, అంగద, జాంబవంత, శూర్పణఖాదులైననామము లెట్లుకలిగెనో కనుగొనుట కేమి యవకాశము లేదు.” అని లిఖించియుండిరి. ఇంకను, (2) కబంధాదిశబ్దముల వ్యుత్పత్తిని దెలుపుటకై యాధారములను శబరభాషావాక్యావళివలన దెలిసికొనజాలకుంటిమని తెలుపుచునుగూడ యాంధ్రాదిభాషలయందున్న బాదరాయణసంబంధములంబట్టి శబరభాషలో కూడ నట్టియర్థముగలపదము లుండవచ్చునని సాహసించి యూహించి యాపై నాకాశహర్మ్యముల నిర్మింప జొచ్చిరి. (3) శబరభాషనుండి తామిచ్చు నర్థములకు వ్యతిరేకముగా రామాయణమే యుచ్చటించుచున్న యెడల తమవాదమునకు వ్యతిరేకముగా నున్న రామాయణభాగము లన్నియు వాల్మీకికృతములు కావనియు నితరు లిటీవలఁ దెచ్చిపెట్టినవనియు నిర్హేతుక సాహసోక్తుల వ్రాయఁజొచ్చిరి. (4) శబరభాషనుండి తామిచ్చు వ్యుత్పత్తులకైన తగినసారస్యము చూపలేక యెట్లైనో స్వాభీష్టమును నెఱవేర్చుకొన బ్రయత్నింపజొచ్చిరి. ఈప్రయత్నమైనను కతిపయపదముల విషయమున మాత్రమే. ఇట్టి చర్చలవలన సత్యము తేలుట దుర్ఘటమని వేఱుగ జెప్ప నక్కఱలేదు. గ్రామనామాదికముంబట్టి వానరులభాష యిప్పటి సవరభాషయని రామదాసుగారికి తోఁచియుండగా చిలుకూరి వీరభద్రరావుగారి

కయ్యది యాంధ్రభాషగాఁ గాన్పించినది. ఇఁకఁ గొందఱు కద్ది యాంగ్లముగాఁ జూపట్టవచ్చును. ఏమైననేమి? శ్రమవేసి రామాయణస్థ కతిపయపదములకు రామదాసుగారు చూపిన శబరభాషాసంబంధ మెట్టులున్నదో సత్యనిర్ధారణార్థమై విచారించి చూచుకొందుము గాక! మొదట స్థలనామ విమర్శనము గావించుకొందము.

దండకశబ్దమునకు సవరభాషనుండి వ్యుత్పత్తిని కలిగింప మనరామదాసుగారు ప్రయత్నించి యిటుల వ్రాసిరి :—

“సవరభాషలో” ‘దాన్’ అనగా నీరు; ‘డాక్’ అనికూడ నందురు. సవరభాషాసంబంధములైన సూరాండారీ మొదలైన అన్నిభాషలలోనూ నీటికి ‘డాక్’ అనియే అందురు. విశేషము నీరు అని చెప్పుటకు దాన్—డాక్. విశేషజలవనయని చెప్పుటకు ‘పలప లాచన’ అనిచెప్పినట్లుగా నే ‘దన్‌డాక్’ అగును. దీనికి షష్ఠీవిభక్తి ప్రత్యయమైన ‘ఆ’ చేర్చిన ‘దండకా’ అగును. ఇది ‘విశేషనీటియొక్క’ యని యర్థమగును. దండక అరణ్యము అంటే విస్తారము నీరుగలిగిన అరణ్యమని యర్థము. ఈయర్థము పైవర్ణనలకు సరిపోవుచున్నది. కాని ‘దండకా’ అనేది సవరభాషనుండి ఉత్పన్నమైనపదము.”

ఇది సర్వనియమముల సంపర్కరహితమగు వ్యుత్పత్తిగాఁ గాన్పించుచున్నది. ఏమనః(1) రామాయణముచెప్పు ఉత్పత్తికి వ్యతిరేకమగు వ్యుత్పత్తినిచ్చునదిగా నున్నది. (2) శబరభాషావ్యుత్పత్తి సంపర్కశూన్యమై వ్యర్థపదఘటితమై నిరర్థమైనదిగా గాన్పించుచున్నది. ఎట్లన.

వింధ్యశైవల దండకారణ్య మున్నట్లును, నందు సీతారామలక్ష్మణులు వనవాసదినములలో సంచరించినట్లు శ్రీమద్రామాయణము దెలుపుచున్నది. ఇది తొల్లి దండుఁడనురాజు పరిపాలించిన దేశమనియు నారాజు దుష్టుఁడై తన కులగురువగు శుక్రాచార్యుని పుత్త్రికయగు ‘అరజ’ యను కన్యకను బలాత్కారముగా భోగించుటచే నాభార్గవునకు కోపమువచ్చి యాదండుని దేశమున నేడుదినములవఱకు పట్టినవానకురియవలెనని శపించెననియు, ఆశాపముంబట్టి పట్టినవానకురియుటచే నాదేశము జీవజంతువిరహితమై యరణ్యమైపోయెననియు, నది దండుని తావుగావున దండకాటవియను పేరువచ్చెననియు శ్రీమద్రామాయణము చెప్పుచున్నది. రామాయణమే యిట్లుచెప్పుచుండ దానికి వ్యతిరేకముగా రామదాసుగారు నేఁడిచ్చు వ్యుత్పత్తియెట్లు గ్రాహ్యమగును?

ఈచిక్కు వాటిల్లునని రామదాసుగారు గ్రహించియుత్తరకాండము వాల్మీకికృతముకాదని మనపండితులే చెప్పుచున్నారనియు గావున నుత్తరకాండోత్పత్తి గ్రాహ్యముకాదనియు సెలవిచ్చిరి. కాని ఉత్తరకాండము వాల్మీకికృతముకాదనుట సాహసోక్తికంటె వేఱు కానేరదు. మనపూర్వులెవ్వరును నట్లు తెల్పియుండలేదు. విశేషించి వాల్మీకికృతమేయని నమ్మియుండిరి. వ్యాఖ్యాతలు దానికిని వ్యాఖ్యానముచేసిరి. కాళిదాసాది పూర్వకవులు రామకథను జెప్పునప్పు డుత్తరకాండకథనుగూడఁ జెప్పియుండిరి. భవభూత్యాదు లద్ది వాల్మీకికృతమేయనిరి. తిక్కనాదులును నట్లే నుడివి యాభాగము నాంధ్రీకరించిరి. ఇరువదినాల్గువేలగ్రంథ ముత్తరకాండముతో గలసిననే యగునని పెద్దలు చెప్పిరి. కావున నుత్తరకాండము వాల్మీకికృతము కాదనుట మహాసాహస మనక తప్పదు.

మన రామదాసుగా రుత్తరకాండము వాల్మీకికృతము కాదనుట కొక యుక్తిని దీసికొనివచ్చిరి. అదెట్లన,ఉత్తరకాండమునుబట్టి చూచిన దండకారణ్యప్రదేశము శుక్రశాపముచే జంతువులు స్థావరములు లేనిదైనట్లుగా గాన్పించుచున్నదట. ఇఁక రామాయణముఁ (పూర్వకాండమువఱకు) బట్టిచూడ నిది జల, తృణ, గుల్మలతాది సమృద్ధిగలిగి జంతుసహితమయి యున్నదిగా గాన్పించుచున్నదట. ఆహేతువుచేఁ బూర్వకాండ వఱకునకు నుత్తరకాండము వ్యతిరేకముగా నున్నదనియుఁ, గాన వాల్మీకికృతము గావనియు వీరు నిర్ణయింతురఁట! ఇది యుక్తియుక్తముగాఁ గాన్పించుట లేదు. వాదమునిమిత్త మరణ్యకాండముంబట్టి దండకారణ్యము జలసమృద్ధిని, జనసమృద్ధిని, తృణ, గుల్మ, లతాది సమృద్ధిని కలదియై యున్నదనియే భావింతము. అయిన నిది యుత్తరకాండమునం దెల్పఁబడిన యంశముల నెంతమాత్రమును ఖండింపజాలదు. ఏమన, రెండిటికిని కాలవ్యత్యాసముచాలకలదు.ఉత్తరకాండమునందుఁ

చెప్పఁబడినరీతిగా మొదట నీస్థలము పాంసువర్షముచే స్థావరజంగమవిరహితమైపోయి మరలఁ గొంతకాలమునకుఁ గ్రమక్రమముగా గొంతవఱకు స్థావరజంగమాదుల యునికిని పొందవచ్చును. అందేమిహాని యున్నది? ఉత్తరకాండము మిక్కిలి పూర్వకాలమునాటి స్థితి తెలుపునది. అనగా శ్రీరామునివారి పూర్వులలో ముప్పదిమూడవ పురుషుఁడగు నిక్ష్వాకునందనుఁడగు దండుని కాలస్థితిని దెల్పునది. ఇక్ష్వాకునితరువాత ముప్పదిరెండు పురుషాంతరములు గతించినతరువాత జనించిన రాముని కాలమునాఁటి దండకారణ్యస్థితిఁ దెల్పునది యరణ్యకాండము. ఈరెండుకాలములకును బహుశతసహస్రవర్షముల కాలవ్యత్యాసము కలదు. కాన నుత్తరకాండస్థ దండకారణ్యస్థితిని నారణ్యకాండస్థ దండకారణ్యస్థితితోఁ బోల్చుట యెంతమాత్రమును దగదు. కాలభేదమును మనము పాటింపకుందుమేని సర్వదేశచారిత్రములును ననుపపన్నములై పోవచ్చును. ఒకనాఁడు పల్లెగా నుండునది యొకనాఁడు ఢిల్లి కావచ్చును. ఒకనాఁడు వనశోభితమైనది. యింక నొకనాఁడు పవనశోభితము కావచ్చును. మాకాకినాడపురము ఏబదిరెండేండ్లకు పూర్వము కకారపంచకమునకు బ్రసిద్ధికెక్కినదఁట. అనఁగా (1) కాఱు నీళ్లకు, (2) కసింతకంపలకు, (3) కాకులకు, (4) కర్కటకములకు, (5) కల్లుకుండలకు ప్రసిద్ధినందియుండెడిదఁట. అట్టి నిస్సార ప్రదేశ మీకాలమున దివ్యరుచ్యోదక నిలయమై మేడలు, మిద్దెలు, తోఁటలు, తోఁపులు కలిగి సుందర మహాపురమై విరాజిల్లుచున్నది. ఇప్పుడిది యిట్లున్నకారణమునఁ బూర్వపు చారిత్ర మబద్ధమగునా? ఎంతమాత్రమును గానేరదు. ఆ కాలమున నదియథార్థము. ఈకాలమున నిదియథార్థము. రామునికంటె మిక్కిలి పూర్వుఁడగు దండుని కాలమున నేడు దినములు పాంసువర్షము కురియుటచే దండకారణ్యప్రదేశమంతయు నిర్జంతుకమై పోయియుండవచ్చును. ఏడు దినములు మాత్రమే కదా పాంసువర్షము కురిసినదని తెలుపఁబడియున్నది. పాంసువర్షముచే నీస్థలము నిర్జంతుక మగునట్లు శుక్రుఁడు శపించెనుగాని సర్వకాలమునునీయది నిర్జంతుకమై యుండవలెనని శపింపలేదే! కాన దండుని నాఁడు మట్టివానచే నిర్జంతుకమైన దేశము క్రమక్రమముగా గాలము చనఁగచనఁగ రాముని నాఁటికి ఘోరారణ్యమై నిలచినది. పాంసువర్షము శుక్రుని శాపముచేఁ గురిసెనని ప్రకృతిశాస్త్రవేత్తలమగు మేము నమ్మకుమాయని నవనాగరకు లనుగవచ్చును. ప్రకృతిశాస్త్రరీతిగా పై గాథను సమన్వయించుకొనుట కవకాశము లేకపోలేదు. ఆ ప్రాంతమున నుండెడు నేదియో యగ్నిపర్వతమునుండి బయలువెడలి పాంసువర్షమేడు దినములవఱకు దండుని కాలమున నాతని దేశమునఁ గురిసియుండవచ్చును. కాన నా దేశమప్పుడు నాశనమై యుండవచ్చును. ఇటీవల పర్వతములందు వర్షములు గురిసినవి నదులేర్పడి యా దేశమున బ్రవహించినవి. క్రమక్రమముగా వనము లేర్పడినవి. ఆ వనములందు తపస్సు చేసికొనుటకై ఋషులు ప్రవేశించిరి. వారు వనములందే నివసింపనిచ్ఛగలవారు కదా! అందుమూలముచే రాముని నాఁటికి తాపసాశ్రమము లేర్పడినవి. అప్పుడైనను వనవాస ప్రియులగు తాపసుల యాశ్రమములే యా వనమందు వర్ణింపఁబడినవి. కాని జనపదము లేమియు వర్ణింపఁబడి యుండలేదు అరణ్యకాండమైనను,

> "ప్రవిశ్యతు మహారణ్యం దణ్డకారణ్య మాత్మవాన్,
> దదర్శ రామో దుర్ధర్ష స్తాపసాశ్రమమణ్డలమ్.
> కుశచీర పరిక్షిప్తం బ్రాహ్మ్యలక్ష్మ్యా సమావృతమ్,
> యథా ప్రదీప్తం దుర్దర్శం గగనే సూర్యమండలమ్."

అని దుర్ధర్షుఁడు గావున రాముఁడు చొరశక్యము గాని యీయరణ్యమునఁ బ్రవేశించెనని తెలుపుచున్నది. పంపానదితోఁ గూడిన యీయరణ్యము బహుకాలమునుండి నిర్మనుష్యమని యరణ్యకాండమే తెలుపుచున్నది. ఆ యరణ్యకాండవాక్యముల రామదాసుగారే యుదాహరించిరి. అదియటులుండనిండు. ఉత్తరకాండ గాథంబట్టి చూచినను దండకారణ్యము విశేషజలాశయములు, జంతు, వృక్ష, గుల్మలతాదులు కలిగియుండుతావులు కొన్ని పాంసువర్షముకురిసినను నాకాలముననే నిలిచియున్నట్లు తెలుపుచున్నది. శుక్రాచార్యులవారు తనకూఁతురగు నరజను నామె యచటనుఁ దపస్సు చేసికొనుచున్న ఘన సరస్తీరముననే నిలువవలసినదనియు, నామె నిలిచినచోట— యోజనదూరమువఱకు పాంసువర్షము కురియదనియు,

జంతునాశనాదికము కలుగదనియు చెప్పెనని యీక్రింది వాక్యములవలనఁ దెలియవచ్చుచున్నది.

"స తథోక్త్వా మునిజన మరజా మిద మబ్రవీత్,
ఇహైవ వస దుర్మేధే ఆశ్రమే సుసమాహితా.
ఇదం యోజన పర్యంతం సరస్సురుచిరప్రభమ్;
అరజే విజ్వరా భుఙ్క్ష్వ కాల శ్చాత్రపరీక్ష్యతామ్.
త్వత్సమీపే చ యే సత్త్వా వాస మేష్యంతి తాం నిశామ్.
అవధ్యాః పాంసువర్షేణ తు భవిష్యంతి నిత్యదా."

దీనింబట్టి పాంసువర్షముచే బాధింపఁబడక జల, తృణ, గుల్మలతా సత్త్వాది సమృద్ధిగలిగి వాసయోగ్యములగు ప్రదేశములు దండకారణ్యమునందే కొన్ని యున్నట్లుత్తరకాండమువలననే తేలుచున్నది. ఇంకను నుత్తరకాండమునందే దండకారణ్యమిట్లు వర్ణింపఁబడియున్నది.

"తస్య రూప మరణ్యస్య నిర్దేష్టుం నశశాకహ,
ఫలమూలై స్సుఖాస్వాదై ర్బహురూపైశ్చపాదపైః."

ఇత్యాది వర్ణనముచే దండకారణ్యము ఫలమూలాదులచేతను, తృణ, గుల్మ, లతాదులచేతను నిండియున్నదని ఉత్తరకాండమువలననే తెలియవచ్చుచున్నది. కావున నుత్తరకాండవర్ణనమునకును నరణ్యకాండవర్ణనమునకును నేవిధమగు భేదమును లేదు. ఈవనము శ్వేతుని కాలములో అనగా త్రేతాయుగారంభమున నిర్మృగముగాను, పక్షివర్జితముగాను నున్నట్లుత్తరకాండము చెప్పుట లేదా యందురేనియట్లు చెప్పుచున్న మాట సత్యము అట్లున్నదరణ్యమధ్యభాగముగాని తుదిభాగముకాదు. రామదాసుగారు మున్యాశ్రమాదులు పక్షిమృగాదులతో నిండియున్నదని యరణ్యకాండముంబట్టి ఋజువుచేసిరి రామాదులు దర్శించిన తాపసాశ్రమములన్నియు దండకారణ్యపుటంచున నున్నవి. అవి జనస్థానములోనివి కాని కేవల దండకారణ్యములోనివికావు. కేవల దండకారణ్యముమాత్రమే పాంసువర్షముచే బాధింపఁబడినది. జనస్థానమట్లు కాలేదు. ఈయంశ ముత్తరకాండమందే దండకారణ్య ప్రశంసయందే యిట్లు తెలుపఁబడియున్నది. శుక్రుఁడు దండదేశమున మట్టివాన కురియునని శపించినవార్తను విని యాతావుననున్న తాపసులెల్లరును నాదేశమునుండి వెడలిపోయి యావల నివాసమేర్పరచుకొనినట్లు నీక్రింది వాక్యములవలన దెలియవచ్చుచున్నది:—

"శ్రుత్వా తూశనసోవాక్యం సోఽశ్రమావసథో జనః,
నిష్క్రాంతో విషయా త్తస్మాత్ స్థానం ఽచక్రేథ
[బాహ్యతః."

ఇట్లు దండుని దేశమునుండి వెడలివచ్చి తద్బాహ్యప్రదేశమున మునులు నివసించిన స్థానమునకే జనస్థానమని పేరు. ఈయంశ ముత్తరకాండమున నిట్లు తెలుపఁబడియున్నది:—

"తపస్వినః స్థితా హ్యత్ర జనస్థాన మతోఽభవత్."
ఈవాక్యములను పైన నుదహరింపఁబడిన

"శ్రుత్వా తూశనసోవాక్యం" అను వాక్యములతో కలిపి చదువుకొనవలెను దీనింబట్టి శుక్రునిశాపము వినగనే దండునిస్థానమున నివసించియున్న ఋషులెల్లరును దద్దేశమును విడచి తత్ప్రాంతముల నిలచిరనియు, వారు నిలచినతావు "జనస్థాన" మైనదనియుఁ దేలుచున్నది. జనస్థానమునఁ బాంసువర్షము కురియవలెనని శుక్రుఁడు శపింపనేలేదు. కాన నీజనస్థానము తృణకాష్ఠసమృద్ధిగలిగి సత్త్వోపేతమై యుండుట యుత్తరకాండమునకు విరుద్ధము కాదు. రామదాసుగారు జలకాష్ఠసమృద్ధికలిగి సత్త్వోపేతములై యున్నవని వర్ణించిన ఋష్యాశ్రమ స్థానములన్నియు నీజనస్థానములోనివే. దండకారణ్య బాహ్యప్రదేశమునందున్న 'జనస్థానము' దండకారణ్యములోని దెట్లగునని శంకింతురేని అయ్యది జహల్లక్షణముచే దండకాటవిలోని దగును. గంగలోని గొల్లపల్లెయన్న గంగయొడ్డుననున్న గొల్లపల్లెయను నర్థమైనట్లే దండకాటవియందలి 'జనస్థాన'మనఁ దత్ప్రాంతముననున్న జనస్థానమని యర్థము. కావున దండకారణ్య వర్ణనవిషయమునఁ బూర్వ రామాయణమునకును నుత్తరరామాయణమునకును వైరుధ్యమే లేదు. కాబట్టియుత్తరకాండము వాల్మీకికృతము కాదనియును నందీఁబడిన దండకారణ్యశబ్దోత్పత్తి సమంజసముగా లేదనియు రామదాసుగారు వ్రాసినవ్రాఁతలు సమంజసముగాఁ గాన్పించుటలేదు.

ఇఁక దండకారణ్యశబ్దమునకు మన రామదాసుగా రిచ్చిన వ్యుత్పత్తి యెట్లున్నదో చూచుకొందము. శబరభాషలో 'దాక్, డాక్' అనిన నుదక మర్థమఁట. 'ఆ'కార మాభాషలో షష్ఠీవిభక్తిని దెలుపు ప్రత్యయమఁట. కాన దండకారణ్యమనఁగా ఉదకములయొక్క అరణ్యము అనగా నవి విశేషముగాగల యటవి యని యర్థమఁట. ఈయర్థ మేవిధమునఁ జూచినను సరిపడి యుండలేదు. ఏమన; 'దాక్, డాక్' శబ్దములు రెండును శబరభాషలో నుదకము నర్థమిచ్చునవి యగుచో ఉదకముగల యడవియని తెలుపుటకై దాకారణ్యమనిగాని, డాకారణ్యమనికాని చెప్పుట యుచితముకాని, ఒక్క యర్థమేయిచ్చు దాక్, డాక్ పదములను రెండిటిని జోడించుటలో సారస్యము లేదు. మిక్కిలి పలచన యనుటకై పలపలచన యనినట్లే దాక్, డాక్ అన విశేషజలమని యర్థము చెప్పుకొనవలెనని మన రామదాసుగారు సెలవిచ్చిరి. ఇదియును సమంజసముగ లేదు స్వల్పమనియో అధికమనియో తెలుపుటకై మనవారొక పదమునే రెండుసార్లుచ్చరింతురుకాని పర్యాయపదములను కలిపి యుచ్చరింపరు. నడుమ + నడుమ= నట్టనడుమ; చివర + చివర=చిట్టచివర; కొన + కొన= కొట్టకొన; ఎదురు + ఎదురు=ఎట్టయెదురు; మున్నగునవి యుదాహరణములు. ఒకపదమునే రెండుసార్లుచ్చరించిన నతిశయార్థము తోఁచునుకాని పర్యాయపదములు కలిపినఁ దోఁపదు. పామరులు తెలిసియో తెలియకయో యొక యర్థమునే యిచ్చు పదముల రెండిటిని జోడించి పలుకుట కలదు. అట్టిజోడింపులవలన నర్థభేద మేదియును కలుగదు. ఆజోడింపులు పండితగ్రాహ్యములును కావు. ఎట్లన అగ్నియనుటకై పామరులు 'అగ్గినిప్పు' అని అందురు. ఇది నిప్పునర్థము నిచ్చునేకాని విశేషార్థము నీయఁజాలదు. ఇట్లే "పైమీఁదిబట్ట" మున్నగువానిని చదువరులు తెలిసికొనవలెను. కాన విశేషజలమును నర్థమిచ్చుటకై దాక్, డాక్ పదములు జోడించి వాడఁబడినవనుట సమంజసముగా లేదు. ఇంకను దండక అనునది యొక ప్రదేశనామము గావున దానితుదిని షష్ఠీవిభక్తి ప్రత్యయమువచ్చుట యనుచితము. మనము చింతలపల్లి, తుమ్మలగుంట, పనసపాడు, మామిళ్లవలస యనినట్లే దండకారణ్య మనవలెఁగాని షష్ఠీవిభక్తి ప్రత్యయమును జేర్చి దండకారణ్య మనఁదగినది కాదు. మఱియును నీయది శబరులవలన వచ్చిన పేరగు దండకారణ్యమని తుది నరణ్యపదముండక యాయర్థము నిచ్చు శబరభాషాపదమే యుండియుండును. ఇవన్నియు నిటుండ దండకారణ్యము నీటికి విశేషప్రఖ్యాతి నందెననుటయును రామదాసుగారు స్వప్రయోజనార్థము కల్పించుకొనిన కల్పనయే. ఇతరారణ్యములకంటె నీయరణ్యమున జలమధికముగాఁ గలదనుటకు నాధారము లేమియును లేవు. ఇది నర్మదకు గోదావరికి నడుమనున్నది. ఇందు విశేష జలముకలదనుట స్తవమగును కాని వాస్తవము కానేరదు. చిన్నచిన్న పర్వతములనుండి కుప్పిగంతులువేయుచువచ్చు సెలయేళ్లు లేని యరణ్యము లేవు. విశేషించి మహానదీనదములతోడను ఘనసరస్సులతోడను నిండియున్న దండకేతరములగు నరణ్యములు పెక్కులుగలవు. కావున, విశేషజలముండుట దండకారణ్యముయొక్క ప్రత్యేకలక్షణమనునది వట్టికల్పనము కాని వేఱుకాదు. దండకారణ్యమనునది హిందూదేశముని దక్షిణాపథమునందుగల పీఠభూమి. ఇట్టి పీఠభూమి మధ్య హిందూస్థానమునందునుగలదు. ఈపీఠభూములు పల్లపుభూములవలె జలాది సమృద్ధిగలిగియుండ నేరవు. ఈవిషయమును భూగోళశాస్త్రములు విస్పష్టముచేయుచున్నవి. ఆంధ్రీకృత మారిసన్ భూగోళశాస్త్రసంగ్రహముయొక్క పుటలు 86 మొదలు 90 వఱకుగలవిషయముఁ జూచుకొనిన నిది తేలఁగలదు విషయ మిట్లుండగా దండకారణ్యము విశేషమైనజలమునకుఁ బ్రసిద్ధమనుట సత్యదూరమైన సంగతియని బాలుఁడైన గ్రహింపఁగలఁడనితలఁచెదను. కావున దండకారణ్యపదము శబరభాషనుండి పుట్టినదనుట కవకాశమింతయును లేదు.

మనయూహలపైఁ గ్రొత్తసందర్భములు తెచ్చిపెట్టఁ బ్రయత్నింతుమేని యనేకభాషలనుండి యాయా సందర్భములు చూపవచ్చును. ఇది యాంధ్రమిచ్చిన పేరనవచ్చును ఎట్లన "దండు" అన తెనుఁగున సేనయని యర్థము. దండునకు అరణ్యముకావున దండకారణ్యమైనది. రావణుని దండు కొంత యీయరణ్యమున నుండెడిది. ఈ యంశమును రామాయణమే రూఢిచేయుచున్నది. కావున రావణదండునకు స్థానమైన అనగా రావణునిదండుగల యరణ్యమని దీనికిఁ దెలుఁగువ్యుత్పత్తిని

జెప్పవచ్చును. ఇంకను దండయను తెలుఁగుపదమునకు భుజ మర్థము వాఁడు నాకుడిబుజమని వాఁడు నాసహాయుఁడని యర్థము. అట్లే దండకు అరణ్యము అనఁగా రావణునికు డిబుజమగు ఖరాదులున్న యరణ్యము గావున దీనికిఁ దెలుఁగువారికలన దండకారణ్యమను పేరువచ్చినదని యేల తెల్పుకొనరాదు? వానరు లాంధ్రులని వీరభద్ర రావుగారిదివఱకే వ్రాసియుండిరి. దానిని రామదాసుగారేల యంగీకరింపరు? పెక్కేల? దండకారణ్య శబ్దము రామాయణము చెప్పువ్యుత్పత్తికాక రామదాసు గారు చెప్పువ్యుత్పత్తి కలదని చెప్పుట కేవిధమగు సందర్భ ముకాన్పింపుటలేదు.

పంపా శబ్దముంగూర్చి

పంపా శబ్దమునకు మన పండితులీక్రింది వ్యుత్పత్తి నిచ్చియున్నారు.

"పమ్పా – (స్త్రీ) – పాతి-రక్షతి మహార్హాన్ దీక్ష స్వీయ పవిత్రసలిదానాదిభి రితి శేషః. పా – పాలనే. కల్ప, శిల్ప, శమ్ప, బామ్ప, రూప, పమ్పా, తలాః" (ఉణా 3 28) ఇతి నిపాతనాత్ హ్రస్వ్యేస్వ ముడాగమేచ సాధుః"—(శబ్దకల్పద్రుమః)

జీవులను రక్షించును (పాతి) కావున దీనికి పంపయను పేరువచ్చినది. శుక్రశాపముచేఁ బాంసువర్షము కురిసి జంతువులు నాశనమొందు కాలము తటస్థించు నప్పుడు దండదేశమునుండు ఋషులు, మృగములు, పక్షులు వచ్చి యీ పంపకడఁ జేరి పాంసువర్షముచే నాశన మొందకుండ రక్షింపఁబడియున్నట్లు శ్రీమద్రామాయణమే చెప్పుచున్నది. 'అరజ' యీ సరస్తీరమునసే నిలచి తపస్సొనరించినది కావున జంతురక్షణము చేయుటయను విశేషలక్షణము దీనియందున్నట్లు తేలుచున్నది. కాన దీనికిఁ బంపయను పేరువచ్చుట సహజముగ నే యున్నది. అయినను నీ వ్యుత్పత్తి నంగీకరింపక మన రామదాసుగారు శబరభాషనుండి యొక క్రొత్త వ్యుత్పత్తిని బలాత్కారముగాఁ గల్పించిరి. అది యేదియన "పంప" లో వెన్నముద్దలవలె నుండునట్టియు, ఎగురలేనట్టియుఁ బక్షులున్నట్లుగా శ్రీమద్రామాయణమున "కబంధ" వాక్యములలో వర్ణింపఁబడి యున్నది. ఎగురలేని వెన్నముద్దలవంటి బాతులని యర్థమఁట. శబర భాషలో బాతును "పంపర" యందురఁట అ పంపర శబ్దమునుండియే "పంప" శబ్ద ముత్పత్తి యయినదఁట. ఈ 'పంప' శబ్దము నుండియే 'హంస' శబ్ద ముత్పత్తి యయినదఁట. ఎగురలేనివెన్నముద్దలవలెనుండు నీహంసలకుఁ బ్రసిద్ధి నొందుటచే బాతను నర్థముగల "పంపర" యను శబర శబ్దమునుండి "పంప" యను శబ్ద ముత్పన్న మయినట్లు తలంపవలెనఁట ఇదియంతయు రామదాసు గారి యూహలనుండి పుట్టిన విశేషము. ఏ విధమగు సంబంధమును లేనిది. (1) ఎగురలేనట్టియు వెన్నముద్దల వలె నున్నట్టియు ప్రత్యేక పక్షివిశేషములు పంపలో నున్నట్లు శ్రీమద్రామాయణములో వర్ణింపఁబడియే యుండలేదు. అందున్న వాక్యము లీక్రిందివి:

"శ్లో...... తత్ర హంసాః ప్లవాః క్రౌంచాః
కురరాశ్చైవ రాఘవ!
వల్గుస్వనాని కూజన్తి
పమ్పా సలిలగోచరాః;
నోద్విజన్తే నరాన్ దృష్ట్వా
వధ స్యాకోవిదా శ్శుభాః.

ఘృతపిణ్డోపమాన్ స్థూలాన్
తాన్ ద్విజాన్ భక్షయిష్యసి;
రోహితా న్వక్రతుణ్డాంశ్చ
నడమీనాంశ్చ రాఘవ!"

పంపాసరస్సునందు కొంగలు, వివిధములగు హంసలు కలవనియు నయ్యవి యెన్నఁడును హింసింపఁబడుట (వేఁటాడఁబడుట) నెఱుఁగవుగాన మనుజులనుజూచి యెగిరి పోవనియుఁ గానఘృతపిండమువలెనుండు నాపక్షులఁ దినవలసెననియు దీనిభావము. వధ (వేఁటాడుట) నెఱుఁగవు కావున మనుజులఁజూచిన నవి యెగిరిపోవని గ్రంథము చెప్పుచున్నదిగాని యెగురలేని పక్షులను చెప్పుట లేదు. అవి యెగురఁగల పక్షులేయనియు, నయినను వేఁటాడఁబడుట నెన్నఁడును నెఱుంగని వగుటచే మనుష్యులను జూచిన నెగిరిపోవనియు నవి నరులను జూచినను నెగిరిపోకుండుటకు గల కారణము మనుజులవలని బాధను నవి యెన్నఁడు నెఱుఁగకుండుట యనియు మూలము

చెప్పుచున్నది. ఇట్లుండ "మనుష్యులను జూచి భయపడి యెగిరి పోలేవంటే యెగుర శక్తిలేదని మృదువుగఁ జెప్పుటయే" అని రామదాసుగా రద్భుతమగు వ్రాఁతను వ్రాసిరి! "ఇవి యెన్నఁడు కొట్టఁబడుట నెఱుఁగకపోతే మీరు తినెదరని కబంధుఁడు యెట్లు చెప్పగలుగును?" అని రామదాసుగారు ప్రశ్నించిరి. ఇది బాగుగ నాలోచింపక వేసినప్రశ్న. కొంగలను హంసలను మనుజులు వేఁటాడి తెచ్చి భక్షింతు రనునంశము లోకవిదితము. ఇతర స్థలములయందు నిది యహరహమును జరుగుచునే యున్నది కావున హంసవిశేషములను, కారండవములను మనుజులు భక్షింతురని కబంధుఁడు చెప్పఁగలిగెను. ఇందు వింతయేదియును లేదు. పంపయందున్నవి వధ మెఱుఁగకుండుటకు కారణమే మందురేని అచ్చటనున్న జనులందఱు జీవహింసను మనస్సునైన తలపెట్టని తాపసులు కావున నవ్వి వేఁటాడఁబడుట నెఱుంగవు. అందు మూలముచే మనుష్యులను జూచిన నెగిరిపోవు. నరులను జూచిన నెగిరిపోవనిన నెగురఁజాలనివియని యర్థము చేయుట మహాసాహసము.

(2) హంసలెగురలేనిపక్షులని తలంచుట రెండవ సాహసము. మనగ్రంథములన్నియు హంస లెగురుపక్షులలో నగ్రగణ్యములైనవనియు, నెంతదూరమైన నెగురఁగలవనియు నొక్కి చెప్పుచున్నవి భారతాదులందలి నలచరిత్రము, హంసకాకీయోపాఖ్యానము మున్నగువానిఁ జూచిన నిది స్పష్టము కాఁగలదు. శబరభాషయందలి 'పంపర'శబ్దమునుండి సంస్కృతమునందలి 'హంస'శబ్దము పుట్టినదనుట మూడవవింత! కర్ణాటాదిభాషలలో 'పంప' 'హంప' యగును గాని రెండవ 'ప' చెడి సకారము రానేరదు. ఇట్లువిధమునజూచినను రామదాసుగారిచ్చిన వ్యుత్పత్తి సరసమయినది కాకపోవుచున్నది; కావున నగ్రాహ్యము. మనపూర్వులిచ్చిన వ్యుత్పత్తియే సరసముగ నున్నది.

అదియటుండ 'పంపర' శబ్దమునుండియే 'పంప' శబ్దము పుట్టినదనినయెడల శబర పంపరయనుటకంటె తెలుగు పంపరయనిన తగియుండును. పంపాతీరమున ఫలనమ్రములగు వృక్షము లున్నట్లు తెల్పఁబడియున్నది. పండ్లచే నమ్రములగునవి సన్నముగనుండు కొమ్మలకుఁ బెద్దపండ్లు కలవైయున్నవి. అట్టి ఫలవృక్షములను తెలుగువారు 'పంపర' (పనస) తెలుగులో పంపర (పనస) లందురు. ఈ పంపరశబ్దమునుండియే 'పంప' శబ్దము పుట్టియుండు ననరాదా? తత్తీరము పంపర (పనస) లకుఁ బ్రసిద్ధికెక్కియుండుటచే నది పంపయైన దనవచ్చును గదా! విపరీతార్థములకుఁబూనిన నెట్టిసందర్భములనైనను గల్పింపవచ్చును. ఇఁక గిష్కింధశబ్దమునుగూర్చి ముచ్చటించుకొందము.

(సశేషము)

నిత్యానిత్యములు

[షెల్లీకవి]

సెట్టి లక్ష్మీనరసింహముగారు

ఏకవస్తువు నిలుచు; ననేకము లటు
వలెను గాక, మార్పులు చెంది, నిలువక చను:
దివిని గల వెల్గు నిత్యమై తేజరిల్లు;
భువిని గలుగు నీడలు వడిం బోవుచుండు.

పలుతెఱంగుల రంగుల పలకలు గల
యట్టి గాజుబుడ్డిని దివ్వె యట్లు, మనుజ
దేహమునఁ గాలరూపుఁడౌ దేవదేవు
స్వచ్ఛతేజస్సు రంగులు పడయుచుండుఁ
దుదకు మృత్యు వామూఁతను జిదుకఁ ద్రొక్కు-

మాళవికాగ్నిమిత్రము నాటకమే యనఁదగు

బులుసు వేంకటరమణయ్యగారు

మాళవికాగ్నిమిత్రము నాటకమా, నాటికయా యని సందేహము వొడముచున్న దనియు, నొకపక్షము నవలంబించినఁ గాని సిద్ధాంతము దొఱకుట దుర్ఘట మనియు నెంచి నాటకము కాదను మతము నవలంబించుచున్నామనియు, శ్రీమాన్ న. స. వరదాచార్యు లయ్యవార్లుగారు కడచిన జ్యేష్ఠమాససంచిక (భారతి)యందు వ్రాసిన వ్యాసమును గంటిని. దానిపై నాకుఁదోఁచిన సిద్ధాంతమును గొలఁది యుదాహరణములతోఁ బ్రతిపాదింతును.

ఇయ్యది నాటకమని కవియే ప్రతిపాదించెను. అయ్యది యుక్తమే యగునని తద్వ్యాఖ్యాతలగు అప్పాశర్మ విద్యావాచస్పతిగారు తమ బాలబోధినీ వ్యాఖ్యానమున వ్రాసిరి. మఱియు లక్ష్మీవేంకటేశ్వర ముద్రాలయమునఁ బ్రకటింపఁబడిన యాగ్రంథమునకుఁ బీఠికఁగూడ వ్రాసి తమమతమును నిరూపించిరి. సహృదయయను సాంస్కృతిక మాసపత్రికయందు 'శాకుంతల సంవిధాన రామణీయకమును' వ్రాసిన శ్రీమాన్ కృష్ణమాచార్యులుగారు "మాళవికాగ్నిమిత్రము ధీరలలితాఖ్య నాయకమును, బంచాంకపరిమితమును నగు ప్రకరణదృశ్య" మని వ్రాసిరి. కాని యియ్యది నాటికయని యిదివఱ కెవ్వరును సందేహించియుండలేదు. ఈముప్వురిసిద్ధాంతములలో నెయ్యది యంగీకార్యమో కొంచెము విచారింప" నగు.

"(నాటకం) ఖ్యాతవృత్తం స్యాత్పంచసంధి
సమన్వితమ్"

ఇత్యాది లక్షణలక్షితము నాటకమని సాహిత్యదర్పణమున నిరూపింపఁబడినది. ఈయంశమే క్లుప్తముగఁ బ్రతాపరుద్రీయమునందు:

"వీరశ్శృంగారయో రేకః
ప్రధానం యత్ర వర్ణ్యతే,
ప్రఖ్యాతనాయకోపేతం
నాటకం తదుదాహృతమ్."

అని విద్యానాథ పండితులు నిరూపించిరి. ఈ లక్షణమీ నాటకమున కనుగుణ మగునో, కాదో యని విచారింపవలెనన నిందలి యితివృత్తము ప్రఖ్యాతమగునా, కాదా! యనియు; నాయకుఁడు ధీరోదాత్తుఁడగునా! కాదా! యనియు విచారింపవలెను.

ఇందలి నాయకుఁడగు నగ్నిమిత్రుఁడు ప్రఖ్యాబైంబిక వంశస్థుఁడని యయ్యవార్లుగారు కూడ నంగీకరించిరి. ఇతని చరిత్రము విష్ణుపురాణమునఁ జెప్పఁబడియున్నట్లు శ్రీ అప్పాశర్మ విద్యావాచస్పతిగారును వ్రాసియున్నారు. ఉదా.—

"మాళవికాగ్ని మిత్రమ్—............
న చైతత్ ఖ్యాతవృత్త మితిశఙ్క్యమ్ (భ్రమితవ్యమ్.) విష్ణుపురాణే కథాంశస్యాస్య ప్రథితత్వాత్ ...."

[కాళిదాస చరిత సంక్షేపః.]

కాన యయ్యవార్లుగారు వ్రాసిన "ఇందలి యగ్నిమిత్రునిచరిత్ర మెందును బ్రసిద్ధము కా" దను నంశము యుక్తముకాదని తోఁచుచున్నది.

ఇందలి నాయకుఁడు ధీరలలితుఁడని అయ్యవార్లు గారును, కృష్ణమాచార్యులు గారునుగూడఁ జెప్పుచున్నారు. కాని అప్పాశర్మ విద్యావాచస్పతిగారిదియంగీకరింపక నాయకుఁడు ధీరోదాత్తుఁడనియే చెప్పినారు. తల్లక్షణము.—

"అవికత్థనః క్షమావా
 నతి గంభీరో మహా సత్త్వః,
స్థేయా న్నిగూఢమానీ
 ధీరోదాత్తో దృఢవ్రతః కథితః."

ఇందలి లక్షణములు ధీరోదాత్తుఁడగు నగ్నిమిత్త్రునకుఁ దగియున్నవి. ఈ నాయకుఁడు మహాసత్త్వుఁడు కాఁడని సందేహించి నాయకుఁడు ధీరలలితుండని యంగీకరించుట పాడిగాదు. ప్రథమాంకమునఁ జెప్పఁబడిన క్రింది విదర్భకథాంశమున రాజు మహా సత్త్వుఁడనియే యంగీకరింపవలసి యున్నది.

ప్రథమాంకమున నమాత్యుఁడు చెప్పిన విదర్భ రాజాశయమును వినినపిదప రాజిట్లుపలికెననియున్నది.

"రాజా—(సరోషం)కథం కార్యవినిమయేన
మయి వ్యవహరత్యనాత్మజ్ఞః? వాహతక!
ప్రకృత్యమిత్రః ప్రతికూలకారీచ మే వై
దర్భః......"

(తన యోగ్యతాపరిమితి నెఱుంగని యాతఁడు కార్యవినిమయమున నాయెడ వ్యవహరించునా ఏమి! (ఏమిఅని ఆశ్చర్యము) అని రోషమున నసెను). ఇచట నాయెడనని చెప్పుటచేఁ దానే సర్వరాజ్యాధీశ్వరుఁ డని తోఁపకమానదు. అట్టివాఁడు మహాసత్త్వుఁడు కాకుండుట యెట్లు? రత్నావళ్యాదినాటికలలో నాయకుని సత్త్వ మెచటను నిరూపింపఁబడలేదు. చతుర్థాంకము నందును విజయపర్వాతులు జయించినటులే చెప్పఁబడినది.

కాఁగా నిందలి యితివృత్తము ప్రసిద్ధమైనదనియు, వేణీసంహారమున నాయకుఁడగు యుధిష్ఠిరుని పరాక్రమమువలెనే యిం దగ్నిమిత్రునిపరాక్రమ మించుక చూపఁబడుటచే నీతఁడు ధీరోదాత్తుఁ డగుననియు నిశ్చయింపఁబడినది.

ఇందు వీరశృంగారములలో నొకటియగు శృంగారము ముఖ్యమగు రసము దానికిఁ దక్కినవి యంగరసములు. ప్రథమాంకమున విదర్భవృత్తాంతమున వీరము, ద్వితీయాంకమున విదూషకసంభాషణమున హాస్యము, పంచమాంకమున సుమతిమరణస్మరణమున కరుణరసము, అచటనే "తూణీర..." ఈమొదలగువానిచే భయానకము, రాజపుత్త్రుఁడగు వసుమిత్రుని శౌర్యోదయమున వాత్సల్యమును బ్రతిపాదింపఁబడినవి. ఇయ్యది నాటకమని నిరూపించు కాళిదాసుని యభిప్రాయముగూడ నిద్దియేయని తోఁచుచున్నది.

ఇఁక నియ్యది ప్రకరణ మెట్లుకాదో నిరూపింతును:

"ఉత్పాద్యే నేతి వృత్తేన
 ధీరశాంత ప్రదానకమ్,
శేషం నాటకతుల్యాంగం
 భవే త్ప్రకరణం హి తత్."

అను లక్షణము ననుసరించిన నితివృత్తము కల్పితమై యుండవలెను. ధీరశాంతుఁడు నాయకుఁడై యుండవలెను. మృచ్ఛకటికమున నితివృత్తము కల్పితమగుటచేతను, నాయకుఁడు ధీరశాంతుఁడగుటచేతను, అయ్యది ప్రకరణమగును. ఇతివృత్తము కల్పితమనియే యెంచి కృష్ణమాచార్యులుగారు "మాళవికాగ్నిమిత్రము ధీరలలిత నాయక ప్రధానమగు ప్రకరణ" మని వ్రాసిరి. కాని యిందలి కథాంశము విష్ణుపురాణమునఁ బ్రసిద్ధమగుటచేతను, నాయకుఁడు ధీరోదాత్తుఁడగుటచేతను, నిద్ది ప్రకరణము కానేరదు. కృష్ణమాచార్యులుగారి వ్రాఁతనుబట్టి యిది యుత్పాద్యేతివృత్తమైనను నాయకుఁడు ధీరలలితుఁడగుటచేతను, ప్రకరణమున ధీరశాంతుఁడే ప్రతిపాదితుఁడు కావలసి యుండుటచేతను వారివాదము సమంజసమైనట్లు తోఁపదు.

ఇది నాటిక కాదని రూపింపవలెను. తల్లక్షణము సాహిత్యదర్పణమున నిట్లు చెప్పఁబడి యున్నది.

"నాటికా క్లృప్త వృత్తాస్యాత్
 స్త్రీప్రాయా చతురఙ్కికా,

ప్రఖ్యాతో ధీరలలితః
తత్ర స్యా న్నాయకో నృపః.
....
సంప్రవర్తేత నేతాస్యాం
దేవ్యాః త్రాసేన శఙ్కితః,
....
వృత్తిః స్యాత్కైశికీ స్వల్ప
విమర్శాస్సన్ధయః పునః."

"నాటికా క్లప్తవృత్తా స్యాత్"

ముందు నాటిక నాల్గంకములు గలిగియుండవలెనని నియమించుటచే నీనాల్గంకములందు నిముడునట్లితివృత్తమును గ్లప్తపఱుపవలెనని భావము. ఇచ్చట "క్లప్తవృత్తా" అనుదానికి "అప్రసిద్ధచరితపూర్ణా" యని దర్పణవ్యాఖ్యాత వ్యాఖ్యానముచేసెను. కాని యీ యభిప్రాయము దర్పణకారునిదని మనము సిద్ధాంతీకరించుటకు వీలులేదు. మఱియు నాటిక యప్రసిద్ధచరితపూర్ణయైనచో రత్నావళి నాటికకానేఱదు. భాసకృతమగు స్వప్నవాసవదత్తనాటకము ననుసరించి రత్నావళి వ్రాయఁబడినది. ప్రసిద్ధనాయిక యగుఁ బద్మావతికే యీనాటికయందు రత్నావళియనునామ మీయఁబడినది. ఇతివృత్తమంతయుఁ బ్రసిద్ధమే యనఁదగును. కాన నాటికయను పక్షమునఁ గూడఁ బ్రసిద్ధేతివృత్త మావశ్యకము.

"స్త్రీప్రాయా"

మీఁదిలక్షణము నీలక్షణమునుగూడ నాటికానాటకములకుఁగలభేదములను నిరూపింపఁజాలవు. నాటకమునందుఁ గూడ సామాన్యముగ స్త్రీలేనిరంగ ముండదు. ఉదా—(1) శాకుంతలము; అం. ౧. అనసూయ, ప్రియంవద, శకుంతల; అం. ౨. చామరగ్రాహిణులు మొ; అం. 3. అనసూయ, ప్రియంవద, శకుంతల; అం. ౪. అనసూయాదులు, గౌతమి మొ; అం. ౫. గౌతమి, శకుంతల; అం. ౬. సానుమతి, ప్రతీహారి; అం. ౭. శకుంతల, తపస్వినులు, అదితి మొ; (శృంగార నాటకము).

(2) వేణీసంహారము.—అం.౧. ద్రౌపది; అం.౨. భానుమతి, సఖులు దుశ్శలాదులు; అం. 3. రాక్షసి; అం. ౪. లేదు; అం. ౫. గాంధారి మొ; అం. ౬. ద్రౌపది, చేటి మొ; (వీరనాటకము).

(3) మృచ్ఛకటికము.—(ప్రకరణము) అం. ౧. రదనిక, వసంతసేన; అం. ౨. వసంతసేన, చేటి; అం. 3. ధూత, రదనిక; అం. ౪. మదనిక, వసంతసేన; అం. ౫. వసంతసేన; అం. ౬. వసంతసేన, రదనిక; అం. ౭. లేదు అం. ౮. వసంతసేన, అం. ౯. వసంతసేనతల్లి; అం. ౧౦. వసంతసేన, తల్లి, ధూత మొ.

సంస్కృతనాటకములందుఁ దఱచుగ నంకమున కొక్కటే రంగముండుటచే మీఁదియుదాహరణములందు రంగములను నిరూపించలేదు.

"చతురఙ్కికా"

ఇయ్యదియే నాటికానాటకములకు భేదమును దెలియఁజేయు నంశము. ఇం దైదంకము లుండుటచే నీలక్షణము మాళవికాగ్నిమిత్రమును నాటికగ నిరూపింపనేఱదు.

అయ్యవార్లుగారు సంధికొకయంకమని వ్రాసి నాల్గంకములుగలచోట విమర్శసంధి యుండదను భావమును దెల్పిరి. విమర్శసంధి యిచటనుండుటచే నిది యైదంకములు గలదయ్యెనని వ్రాసిరి. వా రనినట్లు

"స్వల్పవిమర్శాః"

అనుదానికి

"ప్రాయేణ విమర్శనరహితాః"

అనునర్థము నంగీకరించినను సంధి కొకయంకమును బంప వీలుపడదు. రత్నావళినాటికలో నైదుసంధులును నిరూపింపఁబడినవి. అది నాల్గంకములనాటిక. ఇందు అంకమునకు సంధినిబంచిన నెట్లు వీలగును?

శాకుంతలము 7 అంకముల నాటకము, 5 సంధులు; మఱియు గర్భసంధి నాల్గంకములవఱకుఁ బ్రతిపాదింపనే లేదు.

వేణీసంహారము 6 అంకముల నాటకము. ఇదెట్లు కుదురును? కాన నంకమునకును సంధికిని వారనిన

సంబంధముండనేఱదు. మాళవికాగ్నిమిత్ర మైదంకములు గలదగుట నిదియు నాటికయని నిరూపింపఁబడజాలదు

"ప్రఖ్యాతో ధీరలలితః
తత్రస్యా న్నాయకో నృపః."

ఇందు నాయకుఁడు ధీరోద్ధతుఁడుగాని ధీర లలితుఁడు కాఁడు. ఇందలి రాజు కేవల కళాసక్తుఁడేకాక శౌర్యౌదార్యాది గుణసంపన్నుఁడు. మఱియు నీతఁడు శృంగార నాయకులలో నొకఁడగు దక్షిణుఁడు. కాన నిందు శృంగార మధికముగ వర్ణింపఁబడినది. అనేక నాయికలయందు సమానభావమును జూపువాఁడు దక్షిణుఁడు.

"తుల్యోఽనేకత్ర దక్షిణః"

అని లక్షణము. ఇందలి నాయకుఁడు రాజు.

"సంప్రవర్తేత నేతాస్యాం
దేవ్యా స్త్రాసేన శంకితః."

ఇయ్యది యిట ప్రవర్తింపనేఱదు. ఈ లక్షణము నిరాఘాటముగఁ బ్రవర్తించుచున్నదని యయ్యవారలుగారి యభిప్రాయము. కాని యిది సరికానేరదు కొన్ని యెడల నట్లున్నను, దేవివలన భయమని శంకింపరాదు. దేవికిఁ దెలిసినచో నామె నిష్కారణముగ వ్యథపాలగు నను నాశయమే దానికి మూలము. ఇట్లే శాకుంతలము నఁగూడ దుష్యంతుఁడు తన మిత్రునితో శకుంతలా వృత్తాంతమును దేవీజనమునకుఁ దెలియపఱుపవలదని కోరుట—షష్ఠాంకమున చిత్రఫలక వృత్తాంత ప్రసంగము—మొ. గమనించునది.

రత్నావళియందు, సాగరికను, జెలికానిని, వాసవదత్త చెఱయం దుంచినను రాజేమియునన లేకయుండుటచే నాతఁడు (వత్సరాజు) దేవికి లొంగెనని చెప్ప వచ్చును. కాని యిట నట్లు చెప్పవీలు లేదు.

"వృత్తిః స్యాత్కైశికీ స్వల్ప
విమర్శా స్సంధయః పునః."

ఇందుఁ గైశికీవృత్తియేకాక సాత్వతీవృత్తియుఁ బ్రతిపాదింపఁబడుటచేతను, విమర్శసంధి విపులముగఁ బ్రతిపాదింపఁబడుటచేత నియ్యది నాటికయన వీలులేదు. మీఁదఁ జెప్పఁబడిన యంశములచే నియ్యది నాటి కాలక్షణ లక్షితము కానేరదని చెప్పవలెను.

"మాళవిక" అనినది నాటికయనియు, మాళవికాగ్నిమిత్రము నాటకమేయనియు శివదత్తశర్మగారు వ్రాసిరని యయ్యవార్లుగారే యంగీకరించిరి. ఇది నాటికయని కర్త్రభిప్రాయమైనచో స్త్రీప్రత్యయాంతముగనే నామధేయ ముండవలెను.

కాళిదాసు నాటకములను రచించుట కిదియే ప్రథమమన్నట్లు

"పురాణమిత్యేవ...ప్రథితయశసాం..."

అను పీఠికావచనములచేఁ జెప్పఁబడుచున్నది. మఱియు నీతఁడు తనకంటెఁ బ్రాచీనమగు స్వప్నవాసవదత్త నాటకమునుగాని, రత్నావళినిగాని జూచి తొలుదొల్త దానినిబోలు నాటకమును వ్రాయఁదలఁచి దీనిని వ్రాసియుండనోపును. మఱియు, నాటకలక్షణము లొకటిరెండీనాటకవిషయమై సందేహాస్పదము లగుచున్నను బ్రాచీనుఁడగు నీతనిని దరువాతిలక్షణములు నిరోధింపఁజాలవు. మఱియు నియ్యది ప్రథమనాటకరచనాప్రయత్న మగుటచే గుణసన్నిపాతమున నేకదోషము చందురునిమచ్చవలె నంతర్భవించి వింతశోభనుగూర్చును. కాన నియ్యది నాటకమేయని యంగీకరించుట యుక్తము. నాటికయనిగాని, ప్రకరణమనిగాని నిరూపించుటకుఁ దగిన యాధారములు లేవు.



నారదగీతము

పూడిపెద్ది వెంకటరమణయ్యగారు

ప్రొద్దుప్రొద్దునఁ బొలిమేరఁ బూలతోఁట
నెలమిబంగారుచాయ నీరెండలోన
నోలపాటను దిరిగెడు గాలిఁ దావి
నాల్గుదెసలను గ్రమ్ముకొనంగఁ జిలికి
యప్పుడప్పుడ విడియెడు నట్టినాల్గు
పూలుగాఁబోలు నందందు బొలుచుఁ గళల!

* * * * *

అదిగొ! తూరుపుదెసఁ ద్రోవకవలిప్రక్కఁ
బచ్చలీనెడుఁ బసకతివాచి పైనిఁ
జివురుపాదమ్ము లటునిటుఁ జిందులాడ
మోహమొలికించు నెజ్జని మోముతోడఁ
దొంగిచూచుచు రాగంబుఁదూఁచికొంచు
నల'గులాబిని' బురుడించునట్టివనిత
రాధ మసలెడుఁ దనప్రియురాకకొఱకు;

* * * * *

పశ్చిమంబునఁ దొలఁకాడుపసపువన్నె
సోగమేనునఁ గ్రొందళ్కుసొగసు లీన
దనదుసౌందర్యశోభను దనకుఁదాన
తెలిసినట్టుల లోలోనఁ దృప్తినొంది
మానసవికాసమును లోన మాటుపఱచి
జ్ఞానసూచకముగను హాసమ్ము సెలఁగ
దిక్కులనుజూచి చూడని తీరుదోఁప
నిలిచిసంపెఁగపూవును బోలుచువనిత
సత్యభామావధూటి నిశ్చలితహృదయ
వేచియున్నది తనమనఃప్రియునికొఱకు!

* * * * *

ఉత్తరపుదెస, వెల్లనై యొక్కవిధము
కాంతి తనచుట్టుపట్టుల గడలుకొనఁగఁ
బాలవన్నియ మేని సంపదలు పొదలఁ
గమ్మతావులు తడవకు గుమ్మరిలఁగ
శాంతమొలికించు ముఖవికాసంబుదోఁప
భక్తిరసమొల్కు విమలభావంబుతోడఁ
గడుమనోహరమగుచుఁ జెంగలువఁబోలి
విరిసి తాలిమితోఁ దనప్రియునికొఱకుఁ
జూచుచున్నది రుక్మిణీ సుందరాంగి!

* * * * *

కోరి నాలవదెసఁ గాఁచికొని జగమ్ముఁ
జూచిగాఁబోలుఁ బక్కునఁజొక్కినగుచు
రాగమును వీడి వలపు దూరముగఁ దోలఁచి
మోముపైఁ గేసరమ్ములు పొరలియాడఁ
దాండవముసేసి మధుపగీతమునఁ బాడి
పొంగిపొరలెడు నుమ్మెత్తపూవుఁబోలి
యాతఁడే నారదుఁడు కళహప్రియుండు!

* * * * *

ఇంతలో వనభూమిని గాంతి హెచ్చె
నిండెఁ గలకల లాచెట్లనీడలోన
సొగసుగుల్కు నపూర్వంపుశోభ దోఁచెఁ
కమ్మవాసన లన్నిటఁ గ్రమ్ముకొనియె

సందెలరవమ్ము ‘గలగల’ నాడఁదొడఁగ
చిన్నినడుమున నడయాడి చెన్ను మిగులు
తనువుతోఁదూఁగుఁ దనయాఁడుఁదనముతోడఁ
గాళ్లయందంబు పైకి సగంబుదోఁప
కట్టుకొనినట్టి చీరె రకంబుతోడ
నొంటిపొర జారు జారుగ నొసరిలెడు
పయ్యెదచెఱంగులోని సంపదలతోడ
నీలరుచులొల్కు మేనివన్నియలతోడ
రాగమూనిన యధరమార్దవముతోడ
నవ్యరుచులొల్కు చక్కనినవ్వుతోడఁ
జనువుఁగలిగించు ముద్దువాల్గనులతోడ
శాంతమయమైనయట్టి నాసమ్ముతోడఁ
దనివిదీరెడుఁ జెక్కుటద్దములతోడఁ
జివురుచివురున సందడిఁజేసికొనుచు
మసలి యాచెట్లచాటున మందగతులఁ
గొమ్మ లల్లనఁదనిసి చిగుళ్లువెట్ట
నెఱుకపాటను దగనెలుఁగెత్తి పాడు
చాన దోతెంచు నెఱుకలసానివడుచు!

*　　*　　*　　*　　*

దాని గాన సుధారస మానినంత
మూఁడుప్రక్కల నిలిచిన ముద్దుగుమ్మ
లొక్కమారుగ నెఱుకల యువతిఁజేరి
చుట్టి నిలిచిరి వింతఁగఁ జూచి యలరి
పొలుచు నందంపు మువ్వన్నె పూలగుత్తి
గూర్చినట్టుల యెఱుకల కొమ్మదోఁచె
వారితోఁ దాను లేఁగొమ్మ పలవఁబోలి

*　　*　　*　　*　　*

నారదుడు తనపాట సందడిని వీరిఁ
జూడలేకుంటఁ దనచోటు వీడఁడయ్యె

*　　*　　*　　*　　*

“ప్రేమమై నొక్కఫలము నపేక్షచేసి
కిలకిలని వచ్చు నోచిన్ని చిలుకలార!
ఒక్కపూవున మకరంద మొల్కఁద్రావఁ
జెలఁగివచ్చు సీతాకోక చిలుకలార!
ఇమ్మగు జలమ్ము నొకసెలయేటఁ ద్రావఁ
గలసివచ్చెడు మృగశాబకమ్ములార!
ఒద్దికల ముద్దుముద్దుల నొకతె కొకతె
యీడు దీయదు మీ యంద మెంతొ కలదు!
మిమ్ముఁ గని నంత నామది మేరలేని
మోహవారిధిలోఁ బడి మునిఁగి తేలు!
ఎట్టికోరిక మీమదిఁ బెట్టికొనుట
మీర లీతోఁటలోఁ జొచ్చినార లిపుడు?”
అనుచు నెఱుకలసాని తమ్ముడుగునంత
ముచ్చరును నొక్కమారుగ మొవు లదరఁ
బులకలు జనింపఁగాఁ బ్రొద్దుపొడుపుఁబూవు
లట్లు మోములఁ బ్రక్క కొయ్యారముగను
వంచి తమప్రేలికొనల నీక్షించి కొనుచుఁ
బలికి రిట్టులు భావమ్ము బయలుపడఁగ
“నారదుని పంపునేసి నానాథుకొఱకు
వేచికొని యుంటి నిప్పనవీథియందు”
అనిన విని నవ్వి మోమున నలక లదరఁ
బెదవిఁ గరచుచుఁ దలయూఁచి పిల్లయెలుఁగు
తోన నిట్టుల యెఱుకలసాని పలికె
“కుందనపుబొమ్మలార! సంకోచమేల?
కలవు నాకడ మరులమందులు నిజమ్ము
ప్రియుని ముంగొంగునం గట్టిపెట్టికొనఁగఁ
బిలువఁ బలికెడు నొక చిన్ని వేరు గలదు.
మారుమొగమున నన్యకోమలిని జూచు
మగని మఱలింప నొకపెట్టుమందు గలదు.
అనిశ మొకరీతి నతివ మోహమున మునుఁగ

విభునిఁద్రోయంగ నొక చిన్ని వేరుగలదు
ఇది యదియు నేల నాకడ నెన్నియేని
మందు లున్నవి మీర లిమ్మందు రేనిఁ
గాని మున్ముందు మీకోర్కెఁ గనుఁగొనకయ
నీయఁగాఁ జాల నొక లవమేని మీకు
చెప్పికొనుఁ డెట్టి మందు వాంఛించువారొ?
అనిన విని రాధ మెల్లన ననియె నిట్లు:
"ఓ యెఱుకసాని! నీకడ మాయ మేల
వలపుగల దొక్కచక్కనివానిపయిని
చాలదినముల నుండియుఁ జాన! నీదు
మందువలననొ, మాయనో,మంత్రముననొ
వాని సురుచిరరూపలావణ్య సరసి
దొరలు చల్లని చూపు తెమ్మెరలఁ గలుగు
వీచికాడోలికల నఱవిచ్చి కనుల
నప్రయత్నముగా నిట్టులట్టు లూఁగి ,
యతని ముఖపద్మ సీమఁ బ్రత్యూషమునందు
నూరు మార్దవమకరంద మొడిసి యాని,
భావ సంగీతరుచు లొల్క వానిపాట
పదములానంద పూర్ణహృచ్ఛలనములను
దాళగతి సూపి, వలపు క్రొందళ్కులీను
నతని పలుకులఁ దెలిముత్తియముల నెల్ల
నేరికొని తిని, ముచ్చట లూరువాని
కెంబెదవి సంజకెంజాయఁ గెరలు చిన్ని
నవ్వు లేఁత వెలుంగు సందడిని బోలుచు
మేనితళుకుల నల్లని మింట నెగసి,
క్రమ్ముకొని వచ్చుఁ బ్రణయపక్షములఁ జాచి
కేళి మెల్లన నానందగీతిఁ బాడు
కొనుచు నెగిరెడు రాయంచ కొదమనైనఁ
జాలుఁజాలును జాలును జాలుఁజాలు."
అంతటను సత్యభామ ధైర్యమున గళముఁ
జక్కసవరించుకొని పైఁట సర్దుకొనుచుఁ
దృప్తిసూచకముగఁ దలఁ ద్రిప్పికొనుచుఁ
బలికె నిట్టులు నెఱుకల పడుచుతోడ:
"నాకొకనిపైని చిన్నటనాఁటనుండి
నాటుకొనెఁ బ్రేమ యదియు నానాఁట వృద్ధిఁ
బొంది ఫలియించె నాతఁడుఁ బూర్ణమయిన
వలపు నామీఁదఁ గలిగియె వరలుగాని
నాని ప్రేమమ్ములోన లవమ్మునైన
నన్యకాంతల పొలిమేర కరుగకుండ
వానిచూపులు స్నేహభావముననైన
నన్యవనితల మోముల నంటకుండ
వానితలఁపులు మాటలవరుసనైన
వేఱుముగుదల కొఱకునై వెడలకుండ
వానిదర్శన మొక కలలోన నయిన
నతివ యెవ్వతె కనులకు నబ్బకుండ
నాకడనె తాను నిల్చి యనారతంబు
ప్రణయ మొలికెడు నాకను బాపలోన
బొమ్మయై యుండునట్లు లోఫువ్వుఁబోఁడి!
చేయుమా నీదుమందులచేవ నదియ
చాలుఁ జాలును! జాలును! జాలు జాలు!"
కడకు రుక్మిణి యెఱుకల కలికితోడ
నిట్టులనియె సుధారసం బుట్టిపడఁగ :
"నావలఁపుకాఁడు జగదేకనాథుఁ డతని
కానపెట్టఁగఁ జేప గలట్టిమందు
భక్తియేకాని యో వెఱ్ఱిపడుచుదాన!
వేఱులే దైన నీమందు వేరునాకు
వానిసేవను మనమున వాక్కునందుఁ
గాయమునఁ గర్మమున నొక్కగతిని జెలఁగఁ
జేయుదార్ఢ్యము ప్రబలంగఁ జేయు నేనిఁ
జాలుఁజాలును జాలునుజాలుఁ జాలు!"

* * * *

"ఓ యతివలార! నాకడనున్న యందు
లన్నిటను మిన్నయైయున్న యట్టిదొక్క-
మూలికయ దాని మీఁచిన్ని ముద్దరాళ్లఁ
బట్టిమదిలోనఁ బ్రియునిరూపమ్ముఁ దలఁచి
యెవతె తలనైనఁబెట్టిన యింతలోన
నామె మీ ప్రియుపోలిక నంది నిలుచు!
దాని సత్వమ్ముఁజూడఁగాఁ దలఁతురేని
మీరు ముగ్వురుఁ గలసి మీమీ మనములఁ
బ్రియుని యాకృతిఁ దలఁచి యీవేరునెత్తి
నాతలను బెట్టి భక్తిధ్యానమ్ము సేయుఁ
డేమియయ్యెడునో చూతు రింతలోన!"
అనుచు నెఱుకలసాని నవ్వాఁచికొనుచు
నొక్కతృణ మేరి వారలఁ గొసఁగె లేం.

వారు ముగ్వురుఁ గరపల్లవములదాని
నందుకొని యామెతలపయిఁ బొందుపఱచి
చూచునంతనె యెఱుకలసుదతి మారె
పసపునిగ్గులఁ దేరెడు వలువతోడ
మిగుల వెలుఁగొందు నల్లనిమేనితోడఁ
గరమునం దూఁగుఁబిల్లనగఱ్ఱతోడఁ
జెదరి యాడెడు నెమ్మిపించియముతోడ
మరులు గొల్పెడు చిన్ని నామంబుతోడ
ఘుమఘుమనివలచు పుష్పహారములతోడఁ
బువ్వుఁ గిలిగింత పెట్టెడు నవ్వుతోడ
ముగురు ముగుదలు నబ్బురమునఁ జలింప
ముద్దులొలికెడు గోపాలమూర్తి గాఁగ!

* * * *

సిగ్గుపడి రాధ పాదమాటు చేరి నిలచె
గర్వమున సత్య వెనుకకుఁ గదలి నిలచె
లీల రుక్మిణి కృష్ణు కెంగేలువట్టె

* * * *

అంతలోఁ గాలిగజ్జియ లట్టె తూఁగఁ
జేతివీణియ తనయంతఁ జెలఁగి మ్రోయ
జడలు మెలిగొని మోమునఁబడి నటింప
నడుముగట్టినదుప్పటి సడలిజారఁ
దులసిపూసలపేరులు త్రుళ్లియాడ
నొసటి నామంబు గరఁగి కన్బొమల జార
కన్నులఱమోడ్చుకొని తాళగతిచెలంగఁ
బాటఁబాడుచు నమృతంపు వాన గురియ
నృత్యమును జేసె రుక్మిణీ కృష్ణులకును
గెరలునానందమునఁ బ్రదక్షిణము సేసి
కలహబీజమ్ము సవతులకడను నాటి
నారదుఁడు గానశాస్త్ర విశారదుండు.



సౌందర్యోపాసకుడు

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారు

౧

అప్పటి కింకను క్షత్రియరాజ్య మంతరింపలేదు. బౌద్ధమతము సడిపోవుటకుఁ బ్రవణమై యున్నంత యుచ్చస్థితిలో నుండెను.

అకళంక దేవునకు లేకలేక కలిగిన విజయవర్మవలనఁ బొడకట్టిన యానందము ముందు తన వేయిగ్రామాదులవలనఁ గలిగిన యానంద మొకయానంద మనిపింపలేదు.

విజయవర్మ యొక్కఁడే యయినప్పటికిఁ బదిమంది కొడుకులపెట్టు. అల్లరిచేయుచోఁ గార్తవీర్యునకువలె వేయిచేతు లున్నవా యని యనిపించును. చదువుచోఁ జతుర్ముఖ బ్రహ్మయే; పాడుచో గంధర్వుఁడు; గుఱ్ఱ మెక్కుచోఁ గిన్నరుఁడు.

అకళంక దేవునకు విజయవర్మ యనఁగా అవతరించిన ఆనందము. ఆయానందమును హృదయగుహలో దాఁచుకొనువాఁడు కాని యేకాంతమునం దేని పట్టమహిషియగు జయకుఁగూడఁ గానిపింపఁ జేయువాఁడు కాఁడు.

కొండమీఁది కోటి కావలయునెడల విజయవర్మ కప్పటికపుడు సిద్ధము. అతనిమేడ నొక ప్రదర్శనశాల యని యనవచ్చుఁగాని చూచువాఁ డాతఁ డొక్కఁడే.

విజయవర్మ తనయుద్యానమున ద్వీపాంతరానీతములగు తీవలఁ బాతించెను. వానిని కుక్కలవలెను, కోళ్లవలెను, మనుష్యులవలెను గత్తిరించి క్రొత్తక్రొత్త దోహదము లొనరించి క్రొంగ్రొత్త పూలఁ బూయించును. వానిని జూచుచోఁ జైతన్యము సర్వపదార్థములకును గని యని తోఁచకమానదు.

వైసందిన మతనిమేడలో గాజుపళ్లెరము లందును వెండిపళ్లెరమునందును విచ్చినపూలు భగవంతుని సహస్రనేత్రములవలెఁ బ్రకాశించుచుండును. అతఁడు తన పూఁదోఁటలోని పూమొగ్గలఁ గోసికొనివచ్చి యూఁది వికసింపఁ జేయఁ బ్రయత్నించును. అవి కోపముచెంది సొటులుమఱికొంచెముముకుళించుకొనిపోవఁగా విచారముతో వానినిగనుచుఁ గూరుచుండును.

అతఁడు ప్రతిదినమునను సముద్రతీరమున ఆలిచిప్పలు, నత్తగుల్లలు లోనగునవి పోగుచేయును. ఆతఁ డిదివఱకు నిలువచేసిన వానితో నొకమేడ కట్టవచ్చును. అతిపరిచితులగు సేవకులు కొందఱాతని 'ఆలిచిప్పలదొర, ఆలిచిప్పలదొర' యని అపుడపుడు కీర్తించుచుందురు.

విజయవర్మకు వస్త్రములనిన కడుఁ బ్రీతి. అతఁడు నిన్నఁ గొనిన వస్త్రముమీఁది సంఖ్య పదివేలపై చిలుకు. నేఁడు కొనిన వస్త్రము మీఁదిసంఖ్య పదిగోనువేల పై చిలుకు.

ఏ సేవకునియొద్ద ఏవిచిత్రమగు వస్తువు కానిపించినను విజయవర్మ 'దీనిని నాకిత్తువా?' యని యడిగి తీసికొనునంతవఱకు తన ఘనతను పల్లము చేసికొనెను. కాని వారి కిబ్బడివెల యీయకుండ లేదు. ఇటులగుటచే నొకానొకపుడతనికడ ఒక బంగాళాదుంపవెల రెండు కాసులవఱకు పెరిఁగినది.

విజయవర్మకు కొంచె మీడు వచ్చినది. గురుకులమునఁ బ్రవేశించి ముక్కాఁకలు తీరవలసిన కాలము వచ్చినదని యాచార్యులు నిర్ణయించిరి.

ఎటులురా తప్పించుట? అని అకలంకదేవుఁ డాలోచించుచున్నాఁడు. ఎవరిమీఁద నేని త్రోసివైచి తాముదాసీనులవలె నుండి ఫల మనుభవించుట పెద్దమనుష్యుల లక్షణము కదా! అతఁ డొకనాఁడు తనభార్య జయతో- 'దైవము మనపాలఁ గలఁడు. అబ్బాయికి గురుకులమునఁ బ్రవేశింపఁదగిన యీడువచ్చినదని యాచార్యు లన్నారు. కుఱ్ఱఁడు కొంతకాలము మనవద్ద నుండకపోయినను సంపాదించుచుండు విజ్ఞానముచేతనే మన కత్యంత సన్నిహితుఁడగును.' అనియనెను.

దేవి జయ అన్నది, "ఆహా! తమ కెంత పుత్త్రప్రేమ లేదో! 'ఈ సంవత్సరము దాఁటనిండు! పై వత్సరమునకుఁ జూత'మని యైన ఆచార్యులకుఁ జెప్పలేకపోతిరా?"

ఈసంభాషణము దాసీపరంపరగా ఆచార్యకర్ణతాడిత మయినది. దాసికలనుండి వచ్చు రహస్యవార్త కడు నిశితమైనదికదా! ఆచార్యదేవులు చేతులు కట్టుకొనివచ్చి యెదుట నిలువఁబడి మహారాజాధిరాజా! కుమారదేవున కింకను సరియగు ఈడు రాలేదు. పై సంవత్సర మత్యుత్తమమని మనవిచేసిరి. విధి యనుకొనెను—'రాజులపాదములచేఁ ద్రొక్కఁబడుచుండుట నాకు విధియే.'

౨

విజయవర్మ తండ్రిమాటలు తల్లిమాటలు ఆచార్యుల మాటలు వినినాఁడు. ఒకనాఁటి తెలవారుతఱి లేచి ధరణికోటలోనున్న గురుకులమునకుఁ దనంతటఁ దాను పోలీసులకు అధీనుఁడగు దొంగవలె అధీనుఁ డయినాఁడు. 'తాను ఫలానా' అని చెప్పుకొనువఱకు అతఁ డెవరో ఎవరికిని తెలియలేదు.

ఏ మీవింత? ఇదివఱ కేరాజుకుమారుఁడైనను రోగ మభినయింపక, దాసీగృహముల దాఁగుకొనక, దేశాంతరము పాఱిపోయి పట్టువడక గురుకులమునకు స్వాధీన మయినాఁడా? క్షత్త్రియకులమునందుఁ గూడ విజ్ఞానమున కితఁడు మూలపురుషుఁడు కాఁగలఁడని ఆచార్యులందఱు ఆశ్చర్యపడిరి.

జయాకళంకదేవులావార్త విని 'మేము ధన్యుల మ'ని సంతసించి యాచార్యులకుఁ గానుక లంపినారు. ఉపాచార్యుఁ డతనిని తన యాశ్రమమునం దుంచుకొని నియమావళిని జెప్పెను.

విజయవర్మ మత్స్యమాంసములు సులభముగనే విసర్జించెను. హయవ్యసనముకూడ కొలఁదినాళ్లలోనే వీడఁగలిగెను. కాని, కంకణధ్వనులు కాయపారవశ్య మొనరింప దాసికలు కాళ్లొత్తుచుండ నిదిరించు వేళలలో వచ్చి 'నాయనా! సుఖనిద్ర పొందు'మనియు, మేలుకను వేళలలో వచ్చి 'సుఖనిద్రయా?' అని యడుగుతల్లి దివ్యదర్శనము లేకపోవుట మాత్ర మాతనికిఁ గొంచెము కష్టము కలిగింపక మానలేదు.

విజయవర్మ మాకడ అత్యాచారము చేసినాఁడని యేగురువును ఉపాచార్యునికడ దోషనివేదన మొనర్పలేదు. దానివలన మిగులు విద్యార్థులందఱును విజయవర్మపై గుఱ్ఱు. ఏనాఁటిపాఠ మానాఁట చూచికొనక యేయాచార్యుఁడయినను విజయవర్మకు పాఠము చెప్పలేదు.

'మహారాజా! కుమారదేవునివలన గురుకులము గురుకులముతీరుగా నున్నది. ఏలినవారికి పాఠము చెప్పుటకు ఆచార్యులు జంకిపోవుచున్నా'రని గురుకులమునుండి తిరిగి వచ్చుచున్న సేవకులు మనవులు చేయుచున్నారు.

'మహాదేవీ! రాజకుమారుఁడు రాజకుమారుఁడే. మీరు పంపిన ఖాద్యము లాశ్రమాచార విరుద్ధములని కాఁబోలు మూచూడనైన మూచూడలేదు. మిఠాయికన్న చదువే యేలినవారికి తీపిగా నున్నది. ఆలిచిప్పలబాబు చదువులబాబై పోయెనని దాసికలు జయకడ చెప్పుచున్నారు.

3

విద్య యెంతయో సుందరమైనదై యుండవలయును. కానిచో విజయవర్మ అంత తత్పరుఁడై యుండఁజాలఁడు. తార్కికుఁడా! ఈ వ్యాప్తి నధిక్షేపింతువేమో! సుందర మగు వస్తువు కానిపించుచో నది విజయవర్మ పరము కావలసినదే! కావుననే యతని మేడ యొక ప్రదర్శనశాలగా మాఱినది. అందు నత్తిగుల్ల మొదలుకొని నవమాణిక్యములవఱకు ఉన్నవి. అతనిమేడలో అందముకానిది లేదు. దానిచే విద్యగూడ సుందర మనుచుంటిని.

సుందరమగు వస్తువును జూచి యానందించుట కొందఱప్రకృతి. దానిని గ్రహించి యానందించుట కొందఱప్రకృతి. అది స్వాధీనము కానిదే యానందింపఁజాలకుండుట కొందఱప్రకృతి.

జ్ఞాని విచ్చిన పూవునందే భగవంతుని జూచి యానందించును. భక్తుఁడు దాని కోసి కొనివచ్చి భగవానునర్చించి యానందించును. కన్య దానిఁద్రుంచి తుఱుమునఁ దుఱుముకొనకుండ నానందింపలేదు.

సుందరమగు వస్తువనినచో నభిలాషలేనివాఁ డెవఁడు? ఒకసుందరమగు పరమ వస్తువు దెసకే యీజగతియంతయుఁ బరుగిడుచున్నది.

సుందరమగు వస్తువు లందఱకుఁ జిక్కునా? రాజందఱకన్న ధనవంతుఁడు అధికారము కలవాఁడును అయినంతమాత్రమున నతనికిఁ గూడ అన్నియుఁ జిక్కునను నమ్మక మెటులు? హృదయగుహాపిహితమయిన వస్తు

పునుగూడ బయలుపఱచి స్వాధీనము చేసికొనగల విజయవర్మ యిపుడు నియమములను ఉరులలో తగులుకొనియుండుటచేతనకు హస్తామలకముకూఁడ లభించునని నిశ్చయము పోయినది. అటులయినను విజయవర్మ తన కుటీరమును తనరహస్య ప్రదర్శనశాలగా చేసికొనక మానలేదు. ఆయరణ్యమున వికసించిన యేవిజాతీయమగు పూవును ఆతనిచేతఁ బడక మానలేదు.

అతని కీయాశ్రమములలోని పోకపొత్తులు, జంద్రములు ఉద్ధారిణులు, గావంచాలు, తాటాకు పుస్తకములు, గంటములు: భుర్జపత్రములు, రుద్రాక్షలుమొదలగువస్తువులతినూతనములు. అవిఅతనికివిచిత్రమగు ఆహ్లాదమును కలిగించినవి. ఎవరి నడిగిన ఎవ రిత్తురు? దైనందినము ఆవస్తువులు కానఁబడినపుడెల్ల విజయ విజయవర్మ హృదయమునందు ఉల్లాసము కలుగుటకు బదులు నొప్పి కలుగుచుండెడిది. క్రమక్రమముగా ఆనొప్పి తీవ్రమై యొకరోగముగా పరిణమించినది. సుందరమగు వస్తువును జూచినపుడెల్ల దాఁగియుండిన యారోగము బయటఁ బడుచుండెడిది.

ఒకనాఁ డాతఁడు సుషేణుని యాశ్రమములోనికి వెళ్లెను. తలుపు తెఱచియున్నది కాని సుషేణుఁ డందు లేఁడు. విజయవర్మ గుండెలు తటతట కొట్టుకొన్నవి. అంతట వెలుపలికి వచ్చి ప్రాంతములు పరిశీలించెను. సుషేణుఁడు కానరాలేదు. గద్గదస్వరముతో 'సుషేణా సుషేణా' యని పిలిచెను. దొంగతేకమునకు చెలికానివలెనున్న యా గద్గదస్వరము విజయవర్మ హృదయగుహాయందే ప్రతిధ్వనించినదికాని సుషేణుని ప్రత్యుత్తరము కొనిరాలేదు. మఱల నతఁడు రాకొమారునివలె కుటీరములోనికిఁ జనెను. అచటనున్న పోకపొత్తి, గంటము, మారేడుబుఱ్ఱ యీమూఁడును అతనికి చాలఁగాలమునుండియు రోగకారణములుగా నున్నవి. వెంటనే యతఁడు వానిని దీసికొనెను.

భూకంపమొకటి క్రిందఁ బ్రసరించినటులు అతనిపాదములు వడఁకెను. సిగ్నల్ కొట్టులోని యినుపచేతులవలె అతని చేతులు కదలెను. అతఁడు వాని నన్నింటిని పలుచనైన మట్టిముద్దవలె జాఱవిడిచి వాకిటి కడకు పరువెత్తుకొనివెళ్లి నలువైపులు చూచెను. కాకియేని కానరాలేదు. క్రమ్మఱలోని కేఁగి వాని నన్నింటిని మూటకట్టుకొనెను. నడుమ నడుమ ఉలికిపడి చూచుచు తనయాశ్రమమునకు నడిచెను. తలుపులు మూసి ఆవస్తువుల నన్నిటిని క్రిందఁబఱచి చూచుకొనెను.

వాని నెచట దాఁపవలెను? పెట్టె బేడ లేదు. అతఁడు తవుగోలఁ గైకొని యాపర్ణశాల మిడతగోడకు గజమునఱయెత్తున తవ్వ మొదలిడెను. శరీరము చివికిపోవఁగా కంకాళము బయటబడినటులు గోడలోని వెదుళ్లు బయటబడికటకట లాడఁజొచ్చెను. మృదువగు ఆఘాతములతో నాలుగుగజముల సొరంగము చేసెను. పందికొక్కుకన్నమువంటి యాసొరంగమున వానిఁబడవైవఁబోయి మఱలనొకతూరి ఆవస్తువుల నన్నిటిని గాంచెను. పిదప వానిని నాసొరంగములోఁ బడవైచెను. మా సౌందర్య

ముతోపాటు నీసౌందర్యముకూడ భ్రష్టమైనది సుమీ యని చెప్పినటులు చప్పుడు చేయుచు అవి అందు శాశ్వతవసతిని చేకొనెను. అతఁడు కవాటములు తెఱచి యాలోచించుచు కూరు చుండఁగా తనహృదయ కవాటములు మూసి కొనిపోయెను.

౪

పూర్వము విజయవర్మ సుందర మగు వస్తువు కానిపించుచో రెట్టికిరెట్టి వెలయిచ్చి కొనుచుండువాఁడు. కొనఁదగిన వస్తువే అతనికి కానఁబడుచుండెడిది. లేదా లభ్యమగు వస్తువే యతనికి కానఁబడుచుండెడిది.

ఇపుడు తనకడ ధనము ఉండరాదు. సామాన్యముగా ఏవస్తువును యాచింపఁగూడదు. ఒక యుపాయము మాత్రమే శేషించినది: అది చౌర్యము.

సుందరమగు వస్తువున్నచో మనస్సంయోగము లేకయే యతని కనులు చూడఁగలవు. కాళ్లు నడువఁగలవు. ఎవరికిఁ గానరాకుండ తీసి చేతులు దాఁచుకొనఁ గలవు. విద్యతోపా టీవిద్యయు అతనికి రాటుతేలినది.

గురుకులమునందలి విద్యార్థులలో అపుడపు డీవిషయములు జరుగుచుండెడివి. 'నా పోకసాత్తి నీవు చూచితివా?' అని ఒక్కఁ డొకని నడుగును. మిగుల శ్రమించి సెనగకాయలో ఇముడునటులు వడికి గురువుగారికి సమర్పింపఁ దలఁచుకొనిన నా జందెములు పోయినవని ఒకఁడు అందఱమెడలు పరీక్షించును. నా ఉద్ధారిణి పోయెనని ఒకఁ డుపాచార్యునికడ మొఱలిడును. ఒకఁడు నడిరేయి పోయిన తనగావంచాకొఱకు అందఱు మూటలు విప్పి పరికించుచుండఁగా మఱియొకఁడు లేచి 'దొంగ దొంగ' యని కేకలు వైచెను. ఆతఁ డెంత మొత్తుకొన్నను పలువు రాతని శంకించిరి.

ఆచార్యులలోఁగూడ కలవరము కలుగక మానలేదు. ఉపాచార్యుని భక్తిసూత్రములు పోయినవి. దానిచే నొకనాఁడు అందఱు అనధ్యయన మహోత్సవ మనుభవించిరి.

'ఎత్తుకొనిపోవుచో ఎత్తుకొనిపోయెను. వెల యిచ్చెదను. నాగంటము నా కిమ్మని వ్రాయసకాఁడు అంగలార్చెను.

ఎవరికిని పెట్టలేదు; ఎవరికడ ఏవస్తువును కానరాదు. కావున ఆ యభావసింహాసనముమీఁద నొక దయ్యమును వారందఱు పట్టాభిషేకము చేసిరి. 'నేను నడిరేయి యాంవలికిఁ బోవఁగా ఒక దయ్యము భూర్జపత్రము లెత్తుకొని విజయవర్మకుటీరముమీఁదు కా జివ్వున ఎగిరిపోయిన' దని ఒకవిద్యార్థి మిగిలినవారితోఁ జెప్పెను. ఆతఁడు చెప్పినటులు భూర్జపత్రాలు లేవు. ఆదయ్య మిటులు గురుకులమున నిరంకుశముగా పరిపాలింపఁ జొచ్చినది.

ఇవన్నియు నబాబుల 'తోసేఖానా'లోఁ బడినటులు విజయవర్మ సారంగములోఁ బడుచున్నవి. తమతమ వస్తువులు చూచుచుండఁగనే పోయినవని వారువారు చెప్పుచుండఁగా వినినపుడు విజయవర్మ కపహరించి నందులకు

భయమును, పట్టుపడనందులకు సంతసమును గలుగుచుండెను.

షికారు వెళ్లినపుడు 'నాకు దేవశర్మ మీఁద బలవత్తరమగు అనుమాన మున్న'దని యొకఁడనఁగా మఱియొకఁడు 'కాదు కాదు; వాఁడటువంటివాఁడు కాఁడు; సమయగుప్పుడు ఎల్లప్పుడు మాటలు సర్దుకొనుచుండును; ఇది వాని పనికావలయు'నని గద్దించి పలికెను. మఱియొకఁడు 'చీ చీ వాఁడసలే కోమటి. అందులో దయ్యపుభయము. ప్రతిక్షణమునందును తననే యెవ్వ రెత్తుకొనిపోవునో యని మోకాళ్లపట్టు కొని కూర్చుండుచున్నాఁడు. వాఁడు కాదురా! దేవదాసుఁడు ప్రతికుటీరము పనిలేనిదే పగలే తిరుగును. ఇది తప్పక వాని పని' అనెను. ఇదంతయు నాలకించి విజయవర్మ 'డబ్బ్యాక చోట అనుమాన మొకచోట' అని తీర్పుచెప్పెను.

ఆచార్యగణముకూడ ఈ దొంగఱికమునకు లోలోపల చాల బాధపడఁజొచ్చిరి. పాఠములు చెప్పునపుడు చౌర్యముపైనే సగము పాఠము. ఆకాలమున ఏవిద్యార్థియు పాఠమునకు ప్రాలుమాలలేదు.

౫

విద్యార్థులలో కొందఱు కొందఱిమీఁద తమ కనుమానమున్నదని చెప్పినపుడును తన కుటీరమునందలి సారంగమునుగాంచినపుడును సుందరవస్తు సందర్శన మయినపుడును విజయవర్మ ఒక సర్వాంగీణమగు కంపము చెందుచు 'ఇది తప్పు' అని ముమ్మాఱు అనుకొనును.

అతఁ డేకాంతముగాఁ గూరుచుండి 'ఇది తప్పా?' అని దీర్ఘముగా నాలోచించువాఁడు. దొంగతనము నిటులు సమర్థించుకొనువాఁడు: 'తనకుఁ గావలసిన వస్తువును తాను తీసికొనుట ప్రతివానికిని విధి. గురువుకడనుండు విద్యను శిష్యుఁడు తీసికొనుచున్నాఁడు. కాని సమ్మతించియే గురువు దాని నిచ్చుచున్నాఁడు. అడవిలోని వృక్షముల పండ్లను జంతువులు, మానవులు, కీటకములు సమానముగా ననుభవించుచున్నవి. కాని 'ఇవి నావి' అను నాథుఁడు ఒకరాజును జయించి మఱియొకరాజు వాని ముత్తాలన్నియు కలిపికొనుచున్నారు. కాని యిది పరాక్రమము. ఆఁడుదానిని మగవాఁడు, మగవాని నాఁడుది పరస్పర మాకర్షించి యపహరించుచున్నారు. కాని యిది ప్రేమ. ప్రతిదినము ప్రతివాఁడు పంచభూతముల నపహరించుచునే యున్నాఁడు. కాని యిది పుట్టుకతోనే సిద్ధించిన హక్కు. పట్టువడనిచో రాజు; పట్టుపడుచో దొంగ. జగత్తంతయు దొంగల కొట్టే.

మఱల ఆలోచించి యాలోచించి కొంతసేపటికి ఇటులు ఖండించుకొనువాఁడు: 'దొంగతనము తప్పే; కానియెడల వస్తువుల నపహరించునపుడు నాశరీరమంతయు నేల కంపింపవలయును? మఱియు నే నావస్తువుల నేల దాఁపవలెను. ఆవిషయమును వీరందఱు నాతో ముచ్చటించినపుడు నాకేల చెమట పోయవలెను. పాఠవేళలో ఆచార్యుల మోముచూచుటకు నేనేల జంకవలయును? ఆయా వస్తుస్వాములు కానఁబడినపుడు నేనేల తొలఁగిపోవలయును? వీరందఱు వెఱ్ఱివారు; కాని ఒకత్రుటిలో నన్నుఁ బట్టుకొనవచ్చునే! 'వీఁడుగో

దొంగ' అని నా మొగమున వ్రాయఁబడినటులు లేదా? ఆహా! మనస్సెంత దొడ్డది! ఎన్ని విచిత్రవస్తువులను ఇతరులకుఁ గానరాకుండ దాఁచుకొనుచున్నది! దీని కింతశక్తి యెందుల కనఁగా కొంతకాలమున కేని జీవి దారిలోనికి రాఁగలఁడేమో యని.

'దొంగతనము తప్పేయగునెడల నేనీపని నుండి నివృత్తుఁడఁ గావలయును.' అని తనకుటీరపుసొరంగముకడ కరిగి నిలిచెను. అది అతి భయంకరమగు గుహవలె నతనికిఁ గానిపించెను. 'ఓరీ! నీవు దొంగవైయుండ దేవశర్మ నయగుప్త దేవదాసులు దొంగలుగా తలఁపఁబడుచున్నారు!' అని యాసొరంగము సంబోధించినటులుండెను. విజయవర్మ తనమనస్సులోనే సొరంగము పడినటులు ఏనడిశేయినో వాని నన్నిటిదీసి యావల పాఱవైవఁ దలఁచెను; కాని ఆగోడ పడఁ గొట్టనిదే యతని యూహ నెఱవేఱదు.

వాకిట కాలిచప్పుడు వినఁబడఁగా విజయవర్మ గబగబ వెలుపలికి వచ్చెను. ఆవచ్చువాఁ డుపాచార్యుఁడు.

నన్ను బట్టుకొన వచ్చుచున్నాఁడా? ఇది నీకు తగదని శాసింప వచ్చుచున్నాఁడా? అని తలఁచుచు అతనికి వందనము చేయుటగూడ మఱచెను. దయచేయుఁ డనికూడ అనలేదు. ఉపాచార్యుఁ డీ యుపచారములకతీతమగు విషయము నాలోచించుచుండెఁ గాఁబోలు! శిష్యుని యుపచారములకు లోభపడ లేదు. తనంతటఁ దానే యరుఁగుపైఁ గూరుచుండి 'ఇంటి దొంగను ఈశ్వరుఁడైన పట్టుకొనలేఁడు' అనెను విజయవర్మ తెల్లఁబోయెను. పిదప నుపాచార్యుఁడు 'ఇదంతయు నీమీఁదనున్నది' అనెను.

విజయవర్మ మనస్సు కానిపించునేని దానిలో కోటానకోటులు బీఁటలు పడియుండును. తనను తన సొరంగము నిఁకఁ బట్టుకొనుటకు పలువురు వత్తురని యతఁ డనుకొనెను.

ఉపాచార్యుఁ డిటులనెను—'ఓయీ దేవశర్మ నయగుప్త దేవదాసులపై ననుమానమును జాలమంది రూఢి చేయుచున్నారు. ఇది తేల్చి మాభారము తీసివేయవలసిన విధి నీపై నున్నది.'

విజయవర్మ యూఁపిరి తిత్తులు క్రమక్రమముగా గాలిపోసికొనఁ జొచ్చెను. అతఁ డొక యుచ్ఛ్వాసము తీసికొని 'ఇఁక నేను పట్టుకొని తెచ్చెదను.' అని స్ఫుటతరముగా ననెను.

ఉపాచార్యుఁ డాశీర్వదించి వెడలిపోయెను. విజయవర్మ 'నా మొక్కచోట అనుమాన మొకచోట' అని బిగ్గఱగా ననుకొనియెను.

౬

విజయవర్మ ఒకనాఁడు ఉపాచార్యునితోఁ బ్రసంగింప నతని కుటీరమునకుఁ జనెను. తాటిమట్టలతోఁ జేసిన చెప్పులు ముంగిట నవనవలాడు తమలపుటాకులవలె ఏకాంతముగా మెఱయుచున్నవి. అవి మమ్ము తీసికొనుము మమ్ము తీసికొనుమని నిర్బంధపెట్టఁగా ఎట్టకేలకు సమ్మతించినటులు విజయవర్మ చేతులు వానిపైఁబడెను. వాతరోగ మంకురించినటులు

వానిశరీరమంతయు నొకసారి కంపించెను. అతఁడా చెప్పులను గ్రిందఁబడవైచి దెబ్బతినిన లేడి వ్యాధునిజూచి పరుగిడినట్లు పరుగిడెను.

వీనిని నేను తొడుగుకొనుటకా వీలు లేదు. కాని అవి నాకు వలయును. కాన వీని నపహరించుటలో నేదో సత్య మున్నది. అని యాలోచించుకొనియెను. అమలునాఁ డా చెప్పులుకూడ ఆసారంగమున రాణివాస మనుభవింప మొదలిడెను.

ఉపాచార్యుఁడు ఆచార్యునితో 'నాకును తిరుమంగయ్యాళ్వా రెదురుగావచ్చి'రని చెప్పుకొనెను. అతఁడు విజయవర్మను బిలిచి 'ఓయీ ఈపటినుండి సెలవులుకదా! విద్యార్థులమూట లన్నియుఁ బరీక్షించి దేవశర్మాదుల మూవురను గురుకులమునుండి తొలఁగింపుము' అని యాజ్ఞాపించెను.

విజయవర్మసునిశితముగా ఆలోచించెను. 'ఇఁక వడిగానే పట్టుబడఁగలదు. అనుమానము నమ్మఁదగదు. సెలవలు ముగిసి యందఱు వచ్చినపిదప కరణీయమును విన్నవించెదను' అనెను. ఉపాచార్యుఁ డతికష్టముమీఁద సమ్మతించెను.

విద్యార్థు లందఱు గురుకులాశ్రమద్వార ముకడఁ దమతమ మూటలు విజయవర్మ కడ విప్పి వెళ్లుచుండిరి. విజయవర్మ యే మూటను బరికించుటయే లేదు. తన హృదయపుమూటను విప్పి చూపించుచున్నటు లున్నది. అందఱును నిష్క్రమించిరి. వారందఱు వెళ్లిపోయినను అతఁడా ద్వారముకడ చాలసేపు నిలువఁబడి పోయెను.

అమలునాఁ డుపాచార్యుఁడు తక్కఁ దక్కినవారందఱును వెడలిపోయిరి. తండ్రికడ నుండి పరివారము వచ్చినను విజయవర్మ గృహోన్ముఖుఁడు కాలేదు. 'విజయవర్మ గురుకులమునఁ బ్రవేశించుట యొకతూరిగాదే నిష్క్రమించుటయు నొకతూరియే' యని యందఱను కొనిరి.

ఒకరేయి నతఁ డొంటరిగఁ గూరుచుండి సారంగమునందలి యాయాయి వస్తువులఁ దీసి చూడఁ దలపోసెను. చేయి లోపలఁ బెట్టి చూడఁగా చెప్పులందినవి. పైకిఁదీసి వానిచేఁతకుఁ జాలనానందించెను. తుదకు తొడుగుకొన వలయునని బుద్ధి పుట్టినది. తొడుగుకొనెను. అటిటు తిరిగెను. మెలమెల్లగా తలుపుతీసి కుటీరముముందు పచారు చేసెను. పండువెన్నెల తీవలమీఁదను, నేలమీఁదను పాలు పాఱఁబోసినట్లు ప్రవహించుచుండఁగా అప్రాంతము లన్నియు నడయాడెను.

తడపలన్నియు తెగి జోడు కాళ్లకు రాలేదు. కాలిజోడు చేతి కెక్కవలసి వచ్చెను. కుటీరములోనికిఁ జని దీపకాంతిలో దానిఁ గాంచెను. తమలపాకువంటిది తాటాకయి పోయెను. 'ఒకసారి అనుభవించుటలో ఇది వఱకుగల సౌభాగ్యమంతయు నాశమయి నది' అని యనుకొనెను. చూడఁగా జూడఁగా దానిపై రోఁత పుట్టెను. వెంటనే విసిరి దూరముగా పాఱవైచెను. అది యిపుడు లోకము మొగము చూచుచు కంచెమీఁద కాలుపెట్టి యున్నది.

మఱునాఁ డుపాచార్యుఁ డాజోడును జూచి 'యిది యిచట నేల యున్నది? నీ వెఱుఁగుదువా?' యని విజయవర్మ నడిగెను.

విజయవర్మ పిడుగు పడినటులు నిశ్చేష్టుఁడాయెను. ఇతఁడు నోటితో ఒప్పుకొనఁడు. ఇతఁడే వాని నపహరించెనని ముఖముపై చర్మముయొక్క అంచునఱకు వచ్చి మనస్సు సైగచేయుచున్నటు లుండెను. అతఁడు మాటలాడ లేకపోయెను.

'ఓయీ! నీవు దొంగ నెఱుఁగుదువు. వాని బండాలము బయటఁ బడకుండఁ గాపాడుచున్నటు లున్నావు. నిక్కము చెప్పు' మని ఉపాచార్యుఁడు నిలువఁదీసెను.

విజయవర్మ మాటలాడ లేకపోవుటగూడ తనకు ఉపకరించెను. కొంత సేపటి కతఁ డిటులనెను. 'నే నతని నెఱుఁగుదును. ఇంతవఱకును అతఁడు దొంగయని నిర్ధారింపఁ జాలకుంటిని. బహువిధముల దొంగయే కావచ్చును. ఇఁకఁ గొలఁదినాళ్లలోనే పరిష్కరించి మనవి చేసెదను.'

ఉపాచార్యుఁ డూరకుండెను. విజయవర్మ అతని ముందిఁక నిలువఁజాలక బయటికి వెళ్లిపోయెను. ఉపాచార్యుఁ డతని మనస్తత్త్వ మరయఁజాలక నివ్వెఱపడుచు నిష్క్రమించెను.

విజయవర్మ ఆనాఁ డంతయు తన నొక భూత మావేశించినటులు తిరుగాడెను. ఎటులును అతనికి మనశ్శాంతి కుదురలేదు. ఆ పవలంతయు తనను విచారించు న్యాయసభవలె నుండెను.

సూర్యుఁ డపరాద్రి మఱుగుసొచ్చి దొంగ వేషము తాల్చి వచ్చెనో యన చంద్రుఁడు మెల మెల్లగా మొగము బయటఁబెట్టుచుండెను. నీరవమును, నిస్తబ్ధమును అగు నా యేకాంతమున వెన్నెల వెట్టిదయ్యము వలె నతనికిఁ గానిపించెను. అతఁ డా వెన్నెల జూడఁజాలక నిదురింపఁ జనెను.

విజయవర్మ నిదురలో ఒక స్వప్నప్రపంచము చూచెను. ఆ ప్రపంచమంతయు అసారంగము. ఆ ప్రపంచమున మొదట నేమియు లేదు పిదప గావాంచా లేచి నిలువఁబడి "ఓయీ! మొట్టమొదట నన్ను పైకిఁ దీసినవాఁడు బాలాకి. పిదప నతఁడు నన్ను రాటమునఁ బెట్టి సన్ననిదారముగాఁ జేసెను. తరువాతకొల్లాయి అను మాలనిమగ్గమునఁ బడి సుందరమగు స్థూలదేహము సంపాదించుకొంటిని. బాలాకి మంచినీట మెత్తగా నుదుకుచు గన్నేరురంగు పట్టించి తన శరీరముతోపాటు నన్ను వాడుకొనుచున్నాఁడు. నేను జలకమాడి దణ్ణెము మీఁద నిదురించుచుండఁగా రావణుఁడు సీతాదుల నపహరించినటులు నీవు నన్ను దొంగిలితివి. నాకు వెలుఁగులేదు. గాలి లేదు. ఎలుకలు నాడొక్కలు కొట్టివేచినవి. నాశరీరమును కొంత మట్టి తిన్నది. నాసూక్ష్మశరీరమే మిగిలియున్నది.' అని చెప్పుచుండఁగా గంటమా ముందునకు వచ్చి నిలిచి 'నీవు నీగోలమాత్రమే చెప్పుకొనుచున్నావు. నీవు మాకందఱకు ప్రతినిధివి కావు. ఇఁక నీవాఁగుము. ఓ రాజకుమారుఁడా! లేక సౌందర్యోపాసకుఁడ ననుకొను గజదొంగా! నీవు మొదట పోనునున్న, కపా

త్తిని, మారేడు బుఱ్ఱను ఎత్తుకొని వచ్చితివి. పిదప ఎత్తుకొనివచ్చిన వస్తువులు మాయింటిలో గాలి పీల్చుకొనుట కుక్కిరి బిక్కిరి యగుచున్నవి. ['పక్కసొరంగములోని మా మాట చెప్పవేమి?' అని కేకలు] నీవు మాసౌందర్యమునకు లుబ్ధుఁడవైన మాట నిక్కము. కాని మా సౌందర్యమేది? మాతోపాటు నీ ముఖ మెటులు మాఱినదో అద్దములో చూచి కొంటివా?' అని చెప్పుచుండఁగా సొరంగముల లోని వస్తువులన్నియు పైకివచ్చి యతని ముఖమునుగాంచి 'ఛీ ఛీ' యనెను. భక్తిసూత్రములు పైకివచ్చి 'నీకు ఉత్తరజన్మమున చదువు రా'దనెను. పోకపొత్తి గలగలలాడుచు నవ్వెను. ఉద్ధారిణి పంచపాత్రమున దొరలి గణగణ మ్రోగెను. పిదప ఘంటము వాని నన్నింటిని వెనుకకుఁ ద్రోసి యతని కంఠము కడకు వచ్చి 'నన్నెఱుఁగుదువా? మమ్ము మా యజమానుల కప్పగింపకున్న ఒకపోటు పొడిచెద' నని బాణమువలె బయలుదేరెను. పిదప ఉపాచార్యుఁ డొకముసుఁగు కప్పుకొనివచ్చి 'నాచెప్పులను నీవే దొంగిలితి'వనెను.

క్రమక్రమముగా ఆ స్వప్నప్రపంచము ప్రలయము పొందెను. రావిచెట్లపై కాకులు కాకా యని యఱచుచుండెను. విజయవర్మ ఉలికిపడి లేచెను.

౭

అత్తింటికిఁ జేరు కోడండ్రవలె విద్యార్థులు గురుకులమునకుఁ జేరుకొనఁ జొచ్చిరి. దయ్యమునకు భయపడి కోనసీమవా రెవరును పోకపొత్తులను దెచ్చుకొనలేదు. పలనాటివారు గావంచాలు తెచ్చుకొనలేదు. దేవశర్మ నయగుప్త దేవదాసులును తుదకు గురుకులము పూరించిరి.

ఉపాచార్యుని కడనుండి విజయవర్మ కిటులు వార్త వచ్చెను: 'ఈదోషము నిర్ధారణము కానిది పాఠము లారంభింప వీలులేదు.'

అకలంకదేవుఁడు కుమారునకు యుక్తవయస్సు వచ్చినదనియు చదువు పరిపూర్తి యయినదనియు తెలిసికొని యౌవరాజ్యపట్టాభిషేకముతోపాటు పెండ్లియు తలపెట్టి ఆచార్యదేవులకు, కుమారునకు పంపిన వార్తలును అపుడే వచ్చినవి.

విజయవర్మకడకు ఆచార్యులును విద్యార్థులును వచ్చి తమ తమ యానందము వెలిపుచ్చి మునిముందిచటనే పట్టాభిషేకము చేయ మొదలిడిరి.

దేవశర్మ నయగుప్త దేవదాసులును ఇంకను అనుమానింపఁబడుచున్న గౌడపాదగుణాఢ్య శర్వవర్మలును, సునీతి పాంచాల బాదరులు లోనగువారును ప్రత్యేకముగా నతని దర్శింపవచ్చిరి. విజయవర్మ తలవంచుకొని కూరుచుండెను. మనస్సుతక్క శరీర మున్నటులు అతనికి గోచరింపలేదు. దేవశర్మ యిటులనెను. "మేము నిక్కముగా ఈ దొంగతన మెఱుఁగము. నీవు గురుకులము వీడి వెళ్లఁబోవుచున్నావు. దీనితో నీకు సంబంధ తంతువు తెగిపోవుచున్నది. మమ్ము దొంగలుగా పరిగణింతువేని నీవే దొంగవగుదువు."

ఇటులు చెప్పుచుండఁగా ఉపాచార్యుఁ డచటికి వచ్చెను. అందఱు లేచి యతనికి నమస్కరించిరి. ఉపాచార్యుఁ డిటు లనియెను: "వారి కేమి సమాధానము చెప్పెదు వో చెప్పుము."

విజయవర్మ యిటు లనెను: 'అయ్యా! నిక్కము. దొంగ లెవరో నాకుఁ దెలిసినది. మీమీఁద దోషారోపణమునకు నా జాలమే కారణము. దొంగ యెవఁడో తెపకడ విశదము కాఁగలదు. రేపు నాకుటీరముననే దొంగ నిలిచియుండును. మీరు భీతిఁ బాసి చనుఁడు.'

దేవశర్మాదులు సంతసముతో నిష్క్రమించిరి. ఉపాచార్యుఁడును ఆతని భావిపట్టాభిషేకమునకు సంతసముచూపుచు వెడలిపోయెను. విజయవర్మ ఒకతూరి నిట్టూర్చి "రేపు పట్టాభిషేకము, రేపు పట్టాభిషేకము!" అని యనుకొనెను.

దొంగ రేపు విజయవర్మకుటీరమున నిలిచి యుండునని ప్రతివాఁడును ప్రతివాని మోమును దిలకించుచుండెను. విజయవర్మ మందుచేత నిలువఁబెట్టునా? మంత్రముచేత నిలువఁబెట్టునాఁ? యని ప్రతివాఁడును సందేహించుచుండెను ఈ వినోదముతోడనే పగ లెల్లయు ప్రాఁకిపోయెను. సూర్యుఁ డస్తమించెను. చంద్రుఁ డుదయించెను. వెన్నెల ఒక తెలియని వస్తువునుగూడ తెలుపు చున్నటులు కాయుచుండెను.

విద్యార్థు లందఱు భుజించి తమ తమ గ్రామములలోని వస్తువులగుఱించియు, భోజనములగుఱించియు చెప్పుకొనుచుండిరి. కొందఱు ఊకొట్టుచునే నిదురలో ఇమిడిపోయిరి.

ఆచార్యోపాచార్యులకు కానుకలర్పించి నయగుప్తుడు మొదలగువారు అపుడపుడే తమతమ పర్ణశాలలకు చనుచుండిరి.

విజయవర్మ పర్ణశాలమీఁద ఒకఘూకము అఱచినది. ఒకజాము ప్రొద్దుపోయిన దను కొనుచు దర్భాసనములమీఁద నందఱు శయనింప దొరకొనిరి. తెలతెల వేఁగినదాఁక ఆ ప్రకృతి నిఁక నెవ్వరు చూడలేదు.

స్నానానుష్ఠానాదులఁదీర్చికొని యందఱును విజయర్మ కుటీరమునకుఁ బోవ నుద్యుక్తులగుచుండిరి. చాలమంది ఒకచోట గుమిగూడి ఉపాచార్యుని రాక కెదురుచూచుచుండిరి. ఆ సంఘములోని కపుడే నయగుప్తుఁడు వచ్చెను. 'నీవే అచట నిలువఁబడి యుందువని నే ననుకొంటి'నని బాలాకియనెను. 'అతఁడును అటులే అనుకొని రాత్రియంతయు గుంజకు మెడకు అంట గట్టుకొనె'నని దేవశర్మ పలికెను.

ఆచార్యుఁడును ఉపాచార్యుఁడును ఆసంఘముల నన్నిటిని జూచిరి. ఆచార్యునకు మనసులో నొకింత వ్యసనము కలిగెను. అతఁడు 'దేవునిగూడ నింత యుల్లాసముతో దర్శింపముకదా!' అని యనుకొని యుపాచార్యునితో నిటులనెను: "అయ్యా! మనమందఱ మూదొంగను జూడఁబోవుచో నతఁ డపుడే ప్రాణముల విడువఁగలఁడు. కావున విజయవర్మనే యిటకుఁ బిలిచి యతని రహస్యముగఁ గనుఁగొని దొంగను బాగుచేయుట మేలుకదా!"

ఉపాచార్యుఁడు సమ్మతించెను. ఎవరి కుటీరమున వారినుండ నియమించెను. తా నొకఁడే విజయవర్మ కుటీరమున కేఁగి తలుపు కడ నిలిచెను. తలుపులు మూసియుండెను. లోపల అలికిడి యేమియు లేదు. 'విజయ వర్మా!' యని పిలిచెను. ప్రత్యుత్తరము లేదు. ఎన్నిసారులు పిలిచినను పలుకులేదు. అది యతనికి విచిత్రముగా నుండెను. క్రమక్రమముగా నొకఁడొకఁడే వచ్చి పిలుచుచుండెను. తుద కందఱు పోగయిరి.

ఆచార్యుఁడు గునపము తెచ్చి తవ్వి తలుపుతీయ నాజ్ఞాపించెను. రెండు పోటులతోడనే ఆతలుపు ఊడిపడెను. అడ్డదూలమునకు తగిలించిన ఉరిలో బంధించుకొనిన మెడతో ఆకాశమున వ్రేలాడుచు విజయవర్మ నిలువఁబడియుండెను.

సంపూర్ణము

కష్టమా!

సాహిత్యసరస్వతి సీరిపి ఆంజనేయులు గారు

దివ్యకరుణామయాత్మ నా దేశమునను
గాక నీవు రానెడు నిక్కంపు నుడుగు
నీచెలిమి జ్ఞానమునకు సన్నిహితహేతు
వనెడు ననుభవవిదుల ముత్యంపు మాట,
అఖిలమున కింపునింపు సౌఖ్యంబు సొంపు
నీవు లేకున్న లేదను నిజము పల్క,
వీనులార విని యునైజవిధినె తలఁచి
వెఱచి నినుఁ జూడ నోడి నే వెట్టి నగుచుఁ
గష్టమా! నిన్నెఱుంగక కడపినాఁడ
బాల్యమంతయు నదె సుఖప్రదము గాఁగ;
ఎడనెడను నీవు నన్నుఁ బ్రేమించు వేడ్క
నెలమి దరిఁ జేర, నినుఁ దిలకింప జడిసి
దవ్వు దవ్వులఁ దలఁగుచుఁ దనిసినాఁడఁ
గాని, నీమాల్మికల్మి నేఁ గాంచనైతి.

కర్ణముల మ్రోఁగు నీదు చొక్కంపు చరిత
మదిగో! కమనీయ కావ్య వీణాంతరముల
కలవిరళరూఢి శబ్ద తంత్రులఁ గదల్చి
పంద్య సుమనోజ్ఞ మధుర భావస్వరాళిఁ
గొల్పి, వెస నీనిగారంపు గుణగణంబు
తెలియ విబుధులు కీర్తన సలుపుచుంట;
విశ్వమోహదమైన యావిమలగాన
రవము మనసార వింటి-మర్మమ్ముఁ గంటి-
నడఁగె నాలోని యలుకు తనంతగాన,
నీయడుగు జాడలను భక్తి నిలిచి కొలిచి,
ముదల మెట్టి దేనియు శిరమ్మున ధరించి,
తత్త్వవిజ్ఞాన ధనము చిత్తమునఁ గూర్చ
నమ్మి, దర్శింప వేచియున్నాఁడ, నిదిగో!
రమ్ము! హృదయకవాటముఖమ్ముఁ గనుము.

పశ్చాత్తాపము

(కల్పితము)

వింజమూరి భావనాచార్యులుగారు

౧

“అయ్యో! అయ్యో! స్టేషను సమీపించుచున్నది. ఈ పట్టణములో నాకు దిక్కెవ్వరు? నన్నాదరించే వారెవరు? నన్ను కడుపులో పెట్టుకొని తల్లివలె కాపాడువారెవ్వరు? అమ్మా! నీ కష్టములు నివారణ చేసుకొని నీదారిని నీవు పోతివి. నీ కూతురు, ఈ అనాథ, పడే పాట్లు నీ వెరుగవు కదా! నీవే యదృష్ట వంతురాలవు. నిన్ను మ్రింగిన మరడీ మహాలక్ష్మికి నేను మాత్రం వెగటయితినా? నా నిర్భాగ్య దశ యిట్లుండ బట్టే ఆమె కంటికి నే నగుపడలేదు. నేను పోయిన నీయగచాట్లు పడువారెవరు? కొంకరా, ఎంకట్రావుగా! నీతలపండు పగలా, ఎంతపని చేసితివిరా! తలిదండ్రులు లేనిదానను; మూడ ముట్టం, ముక్కుదైవం లేనిదానను; అశుభం శుభం యెరుగనిదానను; నిరుపేదను; నల్లని వన్ని నీళ్లూ, తెల్లనివన్ని పాలూ అని అనుకొన్నదానను, నాకు పదహారు సంవత్సరాలైనా నిండినవో లేవో? ఎంత కసరుకొన్నను, ఎన్ని తిట్టినను, ఎంత యేడ్చినను, ఎన్ని విధాల బతిమాలుకొన్నను వినక వక సారికి పద సార్లు వెంబడించి యేవేవో శ్లోకాలు వల్లించి వివాహం చేసుకొనెదనని నమ్మించి, నానిష్ఠ నట్టేట కలిపి నీవెక్కడికో పారిపోతివి! నన్ను నడి సముద్రములో ముంచితివి! పోనీ! అయినపనికి అనుకొని ప్రయోజనంలేదని నోరు నొక్కుకొని కూర్చున్న దానికి యీ క్షోభ యేమిటి పైగా? ఆ హితాగ్ని కటుంబములో బ్రాహ్మణ జన్మ మెత్తి బుద్ధిపూర్వకంగానో, బలవంతంగానో చేసిన పాప మూరకే పోవునా? పండనే పండినది! దానిల్లు వల్లకాదు కానూ! ఆ పూటకూళ్ల సుబ్బమ్మ నన్ను కాపాడి నన్నీ బాధనుండి తప్పించెదనని నమ్మించి ఆరుమాసములనుంచి అడ్డమైన చాకిరీ చేయించుకొని సమయానికి గెంటివేసినది.” అని తలపోయుచు గ్రుడ్లనిండ నీళ్లు గ్రుక్కుకొనుచు, చిన్న మూట చేతబట్టుకొని భారముచే దిగీ దిగ లేక యెట్టకేలకు తెనాలినుంచి వచ్చిన రాత్రి తొమ్మిది గంటల బండి నుండి గుంటూరు రైలు స్టేషనులో దిగి యెటు పోవుటకు కాళ్లాడక బెదరి బెదరి చూచుచు ప్లాటుఫారం మీద కృష్ణవేణి నిలుచుండెను. తెనాలిలో బండి యెక్కి ఆడవాండ్ర బండిలో కృష్ణవేణితో కూడ వచ్చి దిగిన అనసూయమ్మ యను సాధ్వీమతల్లి, కడు పెదు బిడ్డలతల్లి కృష్ణవేణి స్థితిని జూచి యథార్థమును గనిపెట్టి జాలిగొని, “యేవూరమ్మా మీది, యెవరింటికి పోతున్నావు?” అని కృష్ణవేణిని హెచ్చరించింది. కృష్ణవేణి జవాబు చెప్పలేదు; నోట మాట రాలేదు; కంటికి కడవెడు నీళ్లు మాత్రం కార్చుచుండెను.

ఆ యమ్మ యా చిన్నదాని చేతనున్న మూటను తనచేత బట్టుకొని ఆమెను మెల్లగ స్టేషను వెలపలకు నడిపించుకొని పోయి వంటెద్దుబండి యెక్కించి గాంధీపేటలో నున్న తన యింటికి తీసుకొనిపోయి, వేడి నీట స్నానం చేయించి వంట యింట్లో విస్తరి ముందు కూర్చుండబెట్టెను. పాపం! కృష్ణవేణి మెతుకు నోట బెట్టక వెక్కి వెక్కి యేడ్చెను. అనసూయమ్మ పట్టెడన్నము ఆమెచేత ఎట్లో తినిపించి వెండిగిన్నెలో చేయి గడిగి మూతి తుడిచి చెవిలో నేమేమో చెప్పుచు గదిలోనికి దీసికొనిపోయి మెత్తని పరుపు మీద పడుకోబెట్టెను

కృష్ణవేణికి ప్రయాణ బడలికచేతనూ, అనసూయమ్మ చెప్పిన యేకాంతంచేత కొంత మనశ్శాంతికలుగుటచేతనూ పక్కమీదపడుకోగానే గాఢమైన నిద్రపట్టెను.

అదివరకు గంతులువేసి గంతులువేసి అక్కలు బతిమాలుకొన్నను అన్నం తినక నిద్రించుచున్న జగన్మోహనమను ఐదేళ్ల పిల్లవాడిని తల్లి అనసూయమ్మ లేపి, నిద్రకళ్లు నీళ్లతో తుడిచి, 'కోడి రామమూర్తి సర్కసుకు పోదాము రా నాన్నా! అన్నం తిను మరి!' అని బుజ్జగించుచు ఆ పిల్లవానికన్నం పెట్టెను. కునికిపాట్లు పడుచున్న ఆ పిల్లవాడు నిద్రపోవుటకు గదిలోకి పోయేసరికి తాను మామూలుగా పడుకునే మంచము మీద కృష్ణవేణి నిద్రపోవుచుండెను. ఆ బాలుడు ఆ పక్కమీదనే పడుకొనేటందుకు యత్నించెను; కాని ఆ నిద్రించుచున్న క్రొత్తమనిషిని చూచి, 'నాపక్క మీద ఎవరో పడుకున్నారు నాకు చోటు లేకుండా' అని యేడ్వసాగెను.

'నాన్నా! అదిన్నీ మీ అక్కయ్యే; పాపం నిద్రపోయింది; గోలచేయకు. నీవు నా మంచం మీద పడుకో' అని తల్లి కొడుకును బుజ్జగించుచుండెను. ఇంతలో సోమసుందర్రావు శ్రీకృష్ణ దివ్యజ్ఞాన సమాజ మందిరమునుండి వచ్చి 'ఇంకా అబ్బాయి నిద్రపోలేదా? ఏడుస్తున్నాడెందుకు?' అని తన కోసము ఎదురు చూచుచు గడపలో నిలుచున్న వంట బ్రాహ్మణుడగు గంగాధరశాస్త్రి నడిగెను.

"తెనాలి నుంచి అమ్మగారు వచ్చింది. ఆమె ఒక కడుపుతో వున్న పిల్లను వెంటబెట్టుకొనివచ్చి అన్నం పెట్టింది. మన అబ్బాయి మంచంమీద పడుకొన్నది ఆవెడ. అందుచేత ఏడుస్తున్నాడు" అని వంట బ్రాహ్మడు చెప్పెను. సోమసుందర్రావు గదిలోనికి పోయి భార్యను అడిగెను. ఆమె పిల్లవాని చేతిలో పటికబెల్లం పెట్టి సమాధానపరచి తన పెనిమిటితో ఏదో రహస్యముగ చెప్పెను.

సోమ సుందర్రావు సంపన్న గృహస్థు; భూతదయ కలవాడు. పిల్లలు ఆటలకు ఏవిధముగానయితే అవకాశము కోసము చూస్తుంటారో ఆ విధముగనే మానవసేవకు-మానవసేవఅననేల?— లోకసేవకు అవకాశము ఎప్పుడు దొరకునా అని వెదకుచుండును. అట్టి అవకాశము దొరకెనా ఆయనకు పండుగ. పుష్పమునకు పరిమళమువలెను, చంద్రునికి వెన్నెలవలెను అనసూయమ్మ యీ మహామహునికి అనపాయిని యయి యుండెను.

ఆమె భర్తయొక్క సుగుణపుంజముల నెరుగును; కనుకనే కృష్ణవేణిని తన యింటికి తీసుకొని రా సాహసించినది. 'పెండ్లికి పోదామంటే వెళ్లిపోదామనే' భర్తయే అయినయెడల ఆమె కృష్ణవేణిని ఏ గుండెతో తన యింటికి తీసుకొని రాగలుగును?

౨

తెల్లవారినది. ఏడు గంటలు కావచ్చినది. సరస్వతి, చంద్రమతి, రుక్మిణి, కామాక్షి, జగన్మోహనం నిదుర లేచినారు. సూర్యప్రకాశరావు, జగదీశరావు స్కూలుకు పోయినారు. సోమసుందర్రావు అదివరకే స్నానం చేసి దేవతార్చన గదిలో జపము చేసుకొనుచుండెను. అనసూయమ్మ భర్తతోపాటు లేచి ఆయనకు కావలసినవన్నీ అమర్చి నవుకర్లకు పని పురమాయిస్తూరాటంతో నూలు వడుకుచున్నది. ఇంతలో డాక్టరు కుగ్లరు దొరసాని, డాక్టరు పారమ్మ మోటారు బండి దిగినారు. అనసూయమ్మ వారి కెదురుగా పోయి వారితో యేమేమో చెప్పి గదిలోకి వారిని తీసుకొని వెళ్లినది. వారిద్దరు కుర్చీలమీద కూర్చున్నారు. అదివరకు నిద్రించుచున్న కృష్ణవేణికి అప్పుడే మెలకువ వచ్చి కళ్లు తెరచి తత్తరపాటుతో చూచినది. కుగ్లరు దొరసానిగారిని, తదితరులను చూచి విభ్రాంతి పొందినది. అనసూయమ్మ మంచంమీద కూర్చొని కృష్ణవేణిపై చేయివేసి, 'అమ్మా!దొరసానిగారు వచ్చినారు. లేచి కూర్చో' అన్నది. ఆమె లేచి కూర్చున్నది. దొరసాని కృష్ణవేణమ్మను పరీక్షించి తొమ్మిదవ మాసం జరుగుచున్నదనియు ఆసుపత్రికి తనతో మోటారుమీద తీసుకొని వెళ్లెదననియు చెప్పెను. 'సరే అమ్మా! ఈ బిడ్డభారం మీదే' అన్నది అనసూయమ్మ.

కృష్ణవేణిని మోటారుపై నెక్కించుకొనిపోయి మేడపైన గదిలో పడుకోబెట్టినారు. ఆమె యెవరైనది అడుగుట అనవసరమని యెంచి యామె నెవరును ప్రశ్నించలేదు. తర్వాత రెండవ రోజు రాత్రి కృష్ణవేణి సుఖప్రసవమై చక్కని కూతురిని కన్నది. కన్న కొంత సేపటికి కృష్ణవేణి బిడ్డ ముఖము ముద్దుపెట్టుకొని బిడ్డను కౌగలించుకొని గోడు గోడున నేడ్వ మొదలుపెట్టినది. అక్కడ నుండు మంత్రసానులు సముదాయించిరి గాని

కృష్ణవేణి యేడ్పు మానలేదు. దొరసానిగారు వచ్చి బుజ్జగించినారు; కాని ప్రయోజనము లేకపోయింది. అనసూయమ్మ తటాలున ఇంటికి పరుగిడి పోయి సోమసుందర్రావుగారిని తీసుకొని వచ్చినది. భార్యాభర్తలిద్దరును పురిటి మంచము వద్దకు వెళ్లి కృష్ణవేణిపై చేయివేసి "అమ్మా! ఎందుకు యేడ్వడం? చక్కని చుక్కవంటి బిడ్డను చూచుకో. ఓగాయిత్యంగా యేడ్వకూ" అన్నారు. "ముందు మా గతియేమి?" అని గద్గదస్వరముతో కృష్ణవేణి అన్నది. "అమ్మా! నీకొచ్చిన భయమేమీ లేదు. మా పిల్లలలో నొక పిల్లవు నీవు. నీ ముద్దుబిడ్డ మా మనుమరాలు. నేటికి మాకు మనుమరాలిని ప్రసాదించిన యీ భగవంతునకు కృతజ్ఞులము" అన్నారు, భార్యాభర్తలు. కృష్ణవేణి ముఖము తామరకమలము వలె వికసించినది; చిరునవ్వు నవ్వినది; కొత్త తలిదండ్రులకు మ్రొక్కినది; 'ధన్యాస్మి' అన్నది. పదకొండోరోజున మాతాశిశువులను ఇంటికి తీసుకొనిపోయి తీర్థమాడించినారు. సోమసుందర్రావు శిశువునకు 'శకుంతల' అని నామకరణం చేసినాడు. పసిపాప శుక్లపక్షపు చంద్రునివలె పెరుగుచున్నది. పదేపదే మాతాశిశువులం జూచుచున్న షుగ్లరుదొరసాని సంతోషమునకు మేరయే లేదు.

3

లోకులు కాకులవంటివారు. కుండలు మూయుటకు మూకుళ్లు ఉన్నవిగాని యీ పలుగాకుల నోళ్లకు మూతలు లేవు. ఉన్నవికొన్నీ, లేనివికొన్నీ కల్పించి చిలవలు పలవలు పలవలకు చిలవలు పెట్టి నాలుక బుజాన వేసుకొని తిరుగుతారు. సోమసుందరంగారి వంటవాడు సువాలుముంచి దీపాలు ఆర్పేవాడు. కృష్ణవేణి సోమసుందరంగారి ఇంటికివచ్చినది మొదలు వాడికదే యావ. 'ఈ అమ్మాయి ఎవరు?' అని అనసూయమ్మను పిల్లలను గుచ్చిగుచ్చి అడిగేవాడు. కాని వారెవరూ జవాబు చెప్పలేదు. ఆవ తిన్నవానివలె వానికి ఆరాటము హెచ్చినది. ఒకరోజున సోమసుందరంగారిని అడిగినాడు. 'నీకెందుకీ పిలవని పేరంటము' అని మందలించినాడు ఆగృహస్థు. "యెవతో గుడిశేటిదానిని తీసుకొని వచ్చి ఇంట్లో వుంచినాడు. అంతా మాలకూడయింది" అని సాటించుట కారంభించినాడు గంగాధరం. ఊరంతా తెలిసినది. సోమసుందరంగారి ఇంటికి బ్రాహ్మణులెవరూ పోగూడదని శాసించినాడు సభాపతి సూరంభొట్లు. నీళ్లబ్రాహ్మడు చాలించుకున్నాడు. వంటబ్రాహ్మడు మానుకున్నాడు. అనసూయమ్మ, ఆమె కొమార్తెలూ ఇతర నవనాగరికస్త్రీలవలె వన్నెల విసనకర్రలు కారు. గుంటూరు కొండవీటి చెంతాళ్లతో వాళ్లే నీళ్లుతోడుకొనేవాళ్లు. వంట వాళ్లే చేసుకొనేవాళ్లు. "వచ్చినంటిదానవు నీవు పనిచేయడం ఎందుకమ్మా!" అని యెంతవద్దన్నను కృష్ణవేణి తోడుపోతూ ఉండేది. సోమసుందర్రావు తండ్రితద్దినానికి బ్రాహ్మణులెవరూ రాలేదు. ఇట్టి యాక్షేపణలు తమకు లేవని అదివరకు చెప్పుచుండెడి దివ్యజ్ఞానసామాజికులు ఆఘూత్య బ్రాహ్మణులకు భయపడి కాబోలును వెనుకంజ వేసినారు. సోమసుందర్రావు పిరికిపందకాడు. పుస్తక సహాయముచే మంత్రముల జెప్పి పితృపిండములు సర్వభక్షకుడగు అగ్నిలో పడవేసినాడు. తల్లితద్దిన మప్పటికి ఇరవైరోజు లున్నది. ఆయనకు స్నేహితులని పేరు పెట్టుకొని యెందరెందరోవచ్చి కృష్ణవేణిని బిడ్డను వెడలగొట్టమనియు లేదా క్రైస్తవసంఘమున కిచ్చిన తల్లీబిడ్డా సుఖపడుదురనియు చెప్పుట కారంభించినారు. సోమసుందరంగారు అంగీకరించలేదు. అమ్మలక్క లెందరో అనసూయమ్మకు చెప్పినారు ఆమె ధీరురాలు, అంగీకరించలేదు; చలించలేదు. చెప్పి చెప్పి వారికి నోరు నొప్పెత్తిందికాని ప్రయోజనం కలుగలేదు. అందుచేత అందరి నోళ్లూకట్టుబడ్డవి. తల్లి తద్దినము తండ్రి తద్దినమువలెనే జరిగినది:

ఒక రోజు ఆదివారం మధ్యాహ్నం భార్యాభర్తలు, పిల్లలు, కృష్ణవేణి సావిట్లో కూర్చొని లోకాభిరామాయణం చెప్పుకొనుచుండగా టపా బంట్రోతు ఉత్తర మొకటి సోమసుందర్రావుగారి కిచ్చెను. అది సామాన్యపు ఉత్తరంవలె లేదు. కవరుకు శీలువేసియున్నది. పైన ఎర్ర సిరాతో 'రహస్యము' అని వ్రాసియున్నది. ఆ వుత్తరం చేతబట్టుకొని సోమసుందర్రావు చివాలున లేచి తన పడకగదిలోకి వెళ్లి కవరును విప్పబోయే సరికి చేతులు వణకినవి. దస్తూరి చూచినాడు; పోస్టుముద్రను చూచినాడు; కవరు విప్పినాడు. ఉత్తరం

క్రింద దస్కత్తును యుండుట చూచినాడు. 'కృష్ణారావు' అని ఉన్నది. ఉత్తరము చదువుచున్నాడు. ఇట్లు వ్రాసియున్నది.

ముకాం నెల్లూరు,
5-4-18.

" సోమసుందర్రావు బావగారికి—

తమ వియ్యంకుడగు కృష్ణారావు నమస్కారములు. ఉభయ కుశలోపరి. తమరు దయతో వ్రాయించిన శుభలేఖ అందినది. మీ రేర్పరచిన ముహూర్తముకు తిథి వార నక్షత్రములు బాగున్నవి. మా కోడలు చిరంజీవి సౌభాగ్యవతియగు సరస్వతి ప్రథమ రజస్వల అయి రెండు సంవత్సరములు గడిచినవి. దానికి పదహారో సంవత్సరమున్ను వెళ్లినది. మీఅల్లుడు బి.యల్. పరీక్ష ప్యాసయి పట్టాకోసం దరఖాస్తుచేసి నాయొద్దనే పని నేర్చుకొంటున్నాడు. శుభకార్య మెప్పుడు కళ్లచూస్తామా అని మీ చెల్లెలు కలవరిస్తున్నది."

ఇంతవరకు చదివి సోమసుందర్రావు పరమానందభరితుడైనాడు. ఆపుట తిప్పినాడు. రెండవ పుటలో ప్రారంభమున " అయితే " అని ఉన్నది. ఆయన గుండె లదరినవి. ధైర్యము తెచ్చుకొని తరువాతిభాగము చదివినాడు.

'మీరు తద్దినములు పెట్టలేదనియు, బ్రాహ్మణు లెవరూ మీ యింటికి భోజనానికి రారనియు ఎవరో చెడుపిల్లను మీ యింట్లో పెట్టుకొన్నారనియు ఇంకెన్నెన్నో సంగతులు విన్నాను. ఆ సంగతుల నిజానిజములు వ్రాయవలెను. ఆ సంగతులు నిజమైనయెడల అవి పరిష్కార మయ్యేవరకూ కార్యమునకు రాజాలమని మనవి చేయవలసి వచ్చినందుకు మన్నించండి " అని వుత్తరం ముగింపబడ్డది. పాపము సోమసుందర్రావుకు ముచ్చెమటలు పోసినవి. తెల్లబోయినాడు. చాపమీద చతికిలబడ్డాడు. 'అనసూయ!' అని హీనస్వరంతో భార్యను పిలిచినాడు. ఆమె గదిలోపలికి పోయినది. తలుపువెయ్యమని అన్నాడు. తలుపు వేసినది. వియ్యంకుడు వ్రాసినజాబు చదువుకొన్నది. దిక్కుమొగములతో భార్యాభర్తలేమేమో మాట్లాడుకొనుచున్నారు.

౪

కష్టసుఖములు కావడికుండలవంటివి. కొన్నాళ్లు సంతోషము; కొన్నాళ్లు దుఃఖము. ఇది అందరికీ తెలుసునుగాని సుఖము కలిగినప్పుడు తమవంటివారు లేరని అదిరిపడుటయు, దుఃఖము కలిగినప్పుడు ప్రపంచమంతయు మునిగిపోయినట్లు విలపించుటయు మానవస్వభావము. పాపము కృష్ణవేణికి కూతురు పుట్టుట, అనసూయమ్మగారి అండదొరకుటతో గట్టెక్కినట్టు సంతోషించెనుగాని అది చిరకాలమునిలువలేదు. నీళ్లబ్రాహ్మడు, వంటబ్రాహ్మడు మానుకొనుటయు, తద్దినములకు బ్రాహ్మణులు రాకుండుటయు ఆమె కనిపెట్టక పోలేదు. ఆమె మంచి చురుకుదనము గలది. ఇంగ్లీషునందును తెలుగునందును కొంత విజ్ఞానము కలది. చిన్నప్పటినుంచి కష్టపడ్డది. సరస్వతి పునస్సంధానమునకు జేయు ప్రయత్నము లామె గ్రహించినది. కృష్ణారావుగారికి పంపిన శుభలేఖకు వెంటనే జవాబు రాకుండుటచే సోమసుందర్రావు అనసూయమ్మగార్లు తహతహ పడుచున్నారని గమనించినది. తనవలన వారికి గలిగిన ఇబ్బందులు ఆమె మనస్సులో నాటినవి. వచ్చిన యుత్తరమునకు లక్కసీళ్లు వేయబడియుండుట, రహస్యమని లకోటాపై వ్రాయబడిన రిమార్కు, ఉత్తరం పైవిలాసము చూడగానే సోమసుందరంగారిముఖవైఖరి, భార్యనుపిలుచునపు డాయన కంఠమునందు మార్పు, భార్యాభర్తల గుసగుసలు ఆమె మనస్సును మరింత కలవరపెట్టసాగినవి. ఆమెకువెయ్యితేళ్లుకుట్టినంతబాధకలిగినది. అక్కడనుండి లేవబోయి క్రిందపడినది. తెప్పరిల్లిలేచి సోమసుందరావుగారి గదివద్దకు వెళ్లి, 'అమ్మా' యని కేకవేసినది. భార్యాభర్తలు మాటలు చాలించి గుమ్మములోకి వచ్చి 'ఎందుకమ్మా?' అని అనుటయే వ్యవధిగా కృష్ణవేణి గొడ్డలిచే మొదలంట నరకబడిన వృక్షమువలె క్రింద గభాలునపడినది. నోట మాట లేదు. కుండ చిల్లిపడినట్లు కన్నీరు కార్చుచున్నది. వంటిమీద చెయ్యివేసి చూచినారు. నూటారు డిగ్రీల జ్వరమున్నంత వేడిమియున్నది. ఆమెను తీసుకొని మామూలు గదిలో పరుండబెట్టినారు; దుప్పటి కప్పినారు.

జగదీశ్వరావు బైస్కిలు ఎక్కిపోయి కుగ్లరు దొరసాని గారితో చెప్పగా ఆమె వాయువేగముతో పరుగెత్తికొనివచ్చి రోగిని పరీక్షించినది రెండుమూడు ఇంజెక్షనులు ఇచ్చినది. రోగ నివారణ కాలేదు. నాడియు గుండెలు పదేపదే పరీక్షించినది. గంటగంటకు ఇవ్వమని ఏదో ద్రావకము బుడ్డిఇచ్చి దేవునిపై భారము వేసి ఆమె వెళ్లినది. ఇంటిల్లిపాదికి అధైర్యము తోచినది.

సరస్వతి చంటిపిల్లను ఆగదిలోనుంచి తీసుకొని వెళ్లి ఆవుపాలుపోసి తొట్టెలో పడుకోబెట్టినది. వారంరోజులు గడిచినవి. రోగి అంతకంతకు చిక్కి శల్యమైనది. ధారకం బొత్తుగా లేకపోవడముచే మాట్లాడలేని స్థితిలో నున్నది. దొరసానిగారు రోజువచ్చి చూచి మందిచ్చు చున్నది. సోమసుందరం గారిస్నేహితు లెంత రెందరో వచ్చిచూచి పోతున్నారు. ఎవరికీ కాళ్లాడడంలేదు. రోగికి అప్పుడప్పుడు స్పృహవచ్చుచుండెడిదిగాని స్పృహవచ్చినప్పుడెల్ల ఆమె హోరు హోరున ఏడ్చుచుండేది; మళ్లీస్పృహ తప్పుచుండేది.

కుగ్లరు దొరసానిగారు పరీక్షించి నప్పుడల్లా, 'భయంలేదు' అని చెప్పుచుండేదికాని రోగలక్షణం మాత్రం చెప్పడములేదు. అది యామె నైజ స్వభావము.

ఆయుర్వేద వైద్యుని పిలిపించమని అనసూయమ్మ భర్తతో చెప్పుచుండేది కాని ఆయనకు పాశ్చాత్య వైద్యమునందు దెక్కువ నమ్మిక యుంటచే ఆమాటలు చెవిని బెట్టేవాడుకాడు. ఆయన కచేరీకి వెళ్లిన సమయం చూచి ఆయుర్వేద వైద్యములో మంచి పేరు సంపాదించిన రంగమన్నారు స్వామిని పిలిపించగా ఆయనరోగిని పరీక్షించి 'మనోవ్యాధికి మందులే' దన్నాడు. సోమసుందర్రావు ధైర్యశాలి. కష్టసుఖములకు తొణికేవాడు కాడు. "జరుగనున్నది జరగకమానదు. మనపని మనము చేయక తప్పదు. తర్వాత దైవాధీనం" అని భార్యకు ధైర్యము చెప్పేవాడు. అనసూయమ్మ, ఆమె కొమార్తెలు మాత్రం కంట తడిబెట్టుకొంటూ స్త్రీ నైజస్వభావమును కనబరచేవారు.

౫

కృష్ణవేణి పరుండిన గది అంత విశాల మయినది కాదు. కాని దానికి కిటికీలు సమృద్ధిగా నుండుటచేత గాలికి వెల్తురుకు కొదువలేకుండా ఉన్నది. గదిలో దక్షిణపువైపున కృష్ణవేణిమంచ మున్నది. తూర్పు తల బెట్టి పడుకోబెట్టినారు. నాలుగు గోడల పయినా పటాలు వ్రేలాడుచున్నవి. శేషశాయి, మహాత్మా గాంధి, శంకరాచార్యులు, రామానుజాచార్యులు, చైతన్యుడు, ఏసుక్రీస్తు, బుద్ధభగవానుడు మొదలగువారి పటములే కాక ఉత్తరపుగోడకు మేనక విశ్వామిత్రులు, అహల్యాశాపవిమోచనము పటములు వ్రేలాడగట్టబడి యున్నవి. అందొక పటములో మేనక అప్పుడే కన్న బిడ్డను విశ్వామిత్రున కందివ్వబోతే ఆయనకన్నుల నొక చేతితో గప్పుకొని, 'నాకు వద్దు' అని మరొకచేతి నడ్డంబెట్టి ముఖము వంకకు త్రిప్పుకొన్నట్లు ఉన్నది. మరియొక పటమునందు విశ్వామిత్రుడు, ధనుర్ధరులైన రామలక్ష్మణులును, రామునిపాదములకు తగిలియున్న రాయి యొకటియు, రాతినుండి వెలువడి రామునిపాదములను నమస్కరించుచున్న 'అహల్య' యను గౌతమ మహర్షి భార్యయు ముద్దుల మూటగట్టులాగు చిత్రింపబడి యున్నది.

రాత్రి జాముప్రొద్దుబోయి కృష్ణవేణికి స్పృహ వచ్చినది. పటములను యెగాదిగా చూచినది. 'అవి యేమి పటాలు?' అని తనపై చేయివేసుకొని కూర్చున్న సరస్వతిని అడిగినది. ఆమె వివరములు చెప్పినది. చిక్కిన రెండుచేతులతో దండము పెట్టినది. విశ్వామిత్ర మేనకల జూచి 'ఇదేమి పటం?' అని అడిగినది. విశ్వామిత్రుడు మహర్షి యనియు, మేనక ఆయనతపస్సును చెడగొట్టినదనియు ఆయనసంయోగముచే ఆమె యొక ఆడశిశువును కని ఆబిడ్డను చేతి కందివ్వబోతే విశ్వామిత్రుడు తన తప్పిదమును గ్రహించి ఆబిడ్డను చూడ నొల్లక మేనకను పిల్లతోగూడా వదిలిపెట్టి తిరిగి తపస్సుకు బోయినాడనియు తల్లి యాబిడ్డను అడవిలో చెట్టుక్రింద విడిచిపోగా ఆశిశువును శకుంతములు తేనె పోసి కాపాడెననియు, ఆబిడ్డకే కణ్వమహర్షి 'శకుంతల' యని నామమిడి తనయాశ్రమములో పెంచెననియు,

ఆమెను దుష్యంతమహారాజు గాంధర్వవివాహము చేసుకొనె ననియు, భరతమహాచక్రవర్తి వారికొమరు డనియు, ఆయన ప్రభుత్వముచేయుటచేతనే మన దేశము నకు భారతదేశమని పేరువచ్చినదనియు వివరముగ చెప్పెను.

కృష్ణవేణి యా పటమును రెప్పలార్పక జూచినది; కళ్లు మూసినది; తిరిగి తెరచినది; తిరిగి పటమును నిదానించి చూచినది; సరస్వతి ముఖము వంక జూచి చిరునవ్వు నవ్వినది; తిరిగి కళ్లు మూసినది. నిముషమునకే కండ్లు తెరచి అహల్యా శాపవిమోచన పటమును చూచినది. 'ఇది యేమిపటం' అని సరస్వతి నడిగినది. అహల్యపంచమహాపతివ్రతలలో నొకతెయనియు, ఆమెను ఇంద్రుడు మోసగించి ఆమె పాతివ్రత్యమును భంగపరచె ననియు, భర్తశాపముచే ఆమె రాయిగా మారెననియు, శ్రీరామచంద్రుని పాదస్పర్శచే పునీతురాలై శ్రీ స్వామివారికి నమస్కారము చేయుచున్నదనియు సరస్వతి చెప్పినది. కృష్ణవేణి రెండు చేతులు జోడించుకొని లేవబోయింది. కాని లేచుటకు శక్తిలేక తిరిగి పడుక్కొని సరస్వతి కేసి చూచి నవ్వింది; తిరిగి కన్ను మూసింది; స్మృతి తప్పింది.

సోమసుందరరావు అనసూయమ్మ వాళ్లయిదు గడియల ప్రొద్దుపోయేవరకు కనిపెట్టుకొనియుండి సరస్వతిని కృష్ణవేణి దగ్గర కూర్చోమని వంటయింటిలోనికి బోయి ఆదరా బాదరా రెండు మెతుకులు నోట్లో వేసుకొని తిరిగి వచ్చినారు. తాము భోజనమునకు వెళ్లిన తర్వాత కృష్ణవేణికి స్మృతివచ్చినదాయని యడిగినారు. సరస్వతి జరిగిన దంతయు పూసగ్రుచ్చినట్లు చెప్పగా వారు మిక్కిలి జాలిపడ్డారు. "నీవు పోయి పడుకో అమ్మా, పొద్దుపోయినది!" అనగా సరస్వతి వెళ్లిపోయినది.

భార్యాభర్త లిరువురు కృష్ణవేణిని చూస్తూ ఆమె దగ్గరగా కూర్చున్నారు. జగన్మోహనం పెందలాడే నిద్ర పోయి మెళుకువవచ్చి కృష్ణవేణి మంచం దగ్గర పరచియున్న చిరిచాపమీద కాలుమీద కాలువేసుకొని పడుక్కొని తల్లితో నేమేమో మాట్లాడుతున్నాడు. కొన్ని నిముషములకు కృష్ణవేణికి తెలివివచ్చింది. విశ్వామిత్ర మేనకల పటమూ, అహల్యాశాపవిమోచన పటమూ తేరిపార చూచింది. చిన్న నవ్వు నవ్వింది. "అమ్మా" యని పిలిచింది. అనసూయ 'ఏమమ్మా, దాహం కావాలా?' అని అడిగింది 'ఊ' అన్నది కృష్ణవేణి. అనసూయమ్మ ఆమె నోటికి కొంచెం నీరు అందించింది. రెండు గుటకలు వేసి కృష్ణవేణి, 'నాబిడ్డయేదీ అమ్మా!' అని హీన స్వరంతో అన్నది. 'అమ్మా, బిడ్డ చిన్న గదిలో ఉన్నది. ఇప్పుడెందుకు లేపడం!' అన్నది అనసూయమ్మ. 'న న్నొక్కసారి బిడ్డను ముద్దు పెట్టుకో నివ్వవూ?' అని కృష్ణవేణిఅడిగింది. అనసూయమ్మ బిడ్డను తెచ్చి కృష్ణవేణిమూతి దగ్గరపెట్టి పట్టుకొన్నది. కృష్ణవేణి చిక్కినపెదవులతో బిడ్డను చిరుముద్దు పెట్టుకొన్నది. పటములను తిరిగి చూచింది. విప్పగల్వలవలె ముఖము వికసించింది.

నిద్ర పోయినదో లేక స్మృతి తప్పినదో కాని కళ్లుమూసి జామువరకు కదలలేదు; మెదలలేదు. తర్వాత కళ్లు తెరచింది; తిరిగి మూసింది. కొన్ని నిముషము లట్లుంది. కలవరింతలు యేమోగాని ఆమె హీన స్వరముతో అప్పుడన్న మాటలివి.

"నాయనా, నేను బుద్ధిపూర్వకంగా పాపము చెయ్యలేదు. నన్ను వెంకటరావను విద్యార్థి యొకడు మోసంచేసినాడు. తర్వాత నన్ను వదలివేసి ఎక్కడికో పోయినాడు. నాకు శకుంతల పుట్టింది. నాడు మేనక గన్న శకుంతల కణ్వమహర్షి యాశ్రమంలో పెరిగింది. నేడు నాశకుంతల ఈపవిత్రగృహములో పెరుగుచున్నది. కణ్వమహర్షి దయచే నాటి శకుంతల పవిత్రురాలై మహారాజపత్ని యయినది. మీదయచే నాచిన్ని శకుంతల పవిత్రురాలు ఏల కాకూడదు? మేనక నిర్దయతో తనబిడ్డను పారేసి పారిపోయింది. నేను నాశకుంతలతో గూడ నీశరణు చొచ్చితిని ఆమె విశ్వామిత్రుని మాయ జేసి యాతనికి తపోభంగము కావించినది. నేను వెంకటరావును మోసగించలేదు; చెడగొట్టలేదు. అతడే నన్ను మాయలో బడవేసినాడు మోసబోయి ఒకసారి చేసిన పాపమునకు పశ్చాత్తాపపడుచున్నాను. ఇక ముందు శాశ్వతబ్రహ్మచారిణిగా నుండెదనని శ్రీశేషశాయి యెదుట ప్రమాణముచేసి చెప్పుచున్నాను.

ఓయీ శ్రీరామచంద్రా! ఇంద్రునిచే మోసపోయిన అహల్యను పునీతురాలను జేసిన నీపాదధూళి వెంకట్రావుచే మోసగింపబడిన నాపై ప్రసరింపజేసి నన్ను పునీతురాలుగ చేయుము. తండ్రీ! నీకిది అసాధ్యమా? ఇదిగో నీపాదములు పట్టుకున్నాను. ఊఁ, నీవెన్ని చెప్పినను ఆముత్యమంత మాట నీనోట వస్తేకాని యిక వదలను. రక్షించినా ననుచున్నావా? నీఆజ్ఞ అయిన తర్వాత నాకిక పాపమెక్కడిది? నీకు వెయ్యి నమస్కారములు. తల్లీ! నీనిర్వ్యాజప్రేమ నేనెట్లు మరవగలను! దిక్కులేని యనాథను నిదరి జేర్చుకొంటివి! ఇప్పు డెక్కడికిపోను? నాకు నీవేదిక్కు. సోదరీమణులారా! సరస్వతీ, చంద్రమతీ, రుక్మిణీ! నన్ను వెళ్లగొట్టవద్దని అమ్మతోను నాన్నతోను చెప్పరూ? సూర్యప్రకాశరావుగారూ, జగదీశరావూ! నాకు పట్టెడన్నము పెట్టుట మీకుబరువా? తమ్ముడూ, జగన్మోహనం, నీమేనకోడలిని చూడు నీవెంత చక్కనివాడవో అది అంతచక్కనిది. ఇంతటినుంచి నిన్ను జగన్మోహనం అని పిలువను. 'దుష్యంతా' అని పిలుస్తా, రానాన్నా! చిన్నిశకుంతలను పెళ్లిచేసుకొంటానని నీ చిలకపలుకలతో అమ్మతో నాన్నతో చెప్పూ! చేసుకుంటానని అంటున్నావా? నాతండ్రీ! నాకొకముద్దియ్యి!" అని ముద్దుపెట్టుకొనుచున్నట్లు పెదవులను కదిలించినది.

ఈమాటలు వినుచున్న జగన్మోహనం చివాలున లేచి తల్లిని కౌగలించుకొని, 'పాపం, శకుంతల నునేను పెళ్లి చేసుకుంటానే అమ్మా!" అనెను.

సోమసుందర్రావు అనసూయమ్మలు ఒకరి మొగమొకరు చూచుకొని ముసిముసి నవ్వులు నవ్విరి.

ఇంతలో కృష్ణవేణి కళ్లు తెరచి పటముల కేసచూచి మందహాసముచేసింది. భార్యాభర్తలు రోగిపైచెయివేసి, 'అమ్మా, నీకూతుర్ని జగన్మోహనం పెళ్లిచేసుకుంటా నంటున్నాడు విన్నావా!" అనిఅన్నారు. ఆమె నవ్వుమొగముతో రెండుచేతులు మెల్లగమోడ్చినది. తర్వాత ఆమె బాగా నిద్రపట్టినది. రోజులు గడచిన కొద్దీ రోగము నిమ్మళించినది ఆరోగ్యస్నానమయింది. క్రమేణా మామూలు ఆరోగ్యంకలిగి తక్కినవారితోపాటు గృహకృత్యములు నిర్వహింపగలిగినది.

౬

"పాపము కృష్ణవేణి అమాయకురాలు; జాలిగుండెగలది. ఏపాపము యెరుగనిఆపిల్లను పెండ్లిచేసుకుంటానని నమ్మించి లోబరచుకొన్నాను. నేను చెప్పినట్లు ఆమెను పెండ్లి అయినా చేసుకోలేదు. ఎట్లాగో అమ్మ నడిగట్టి నాయనతో చెప్పించ కాబోలు! నన్ను ఎప్పుడు పంపివేతునాయని ఆదుర్దాపడి నన్నిక్కడికి పంపివేసినాడు, వచ్చేటప్పుడు దానితో చెప్పివచ్చుటకైనా నోచుకోలేదు. కాలేజీలో చేరినానేకాని పాఠములు నాకు బొత్తుగా రుచించడము లేదు. గుడ్డివేటుగా బి. యే. పరీక్షమాత్రం ప్యాసయినాను. నాయన దినవారములకు వెళ్లినపుడు కృష్ణవేణి తనవద్దనుండి లేచిపోయి గుడిశేటి వృత్తివల్ల జీవించుచున్నదని పూటకూళ్ల సుబ్బమ్మ చెప్పితే నిజమనుకొన్నాను. ఛీ! నాబుద్ధి పెడతల పట్టినది. ఆ సుశీల చెడువృత్తిలో ప్రవేశించునా! ఇప్పుడు ఆంధ్రపత్రికలో ఆమె విషయం విపులముగా వ్రాసియున్నది. అదే నిజమయినదో..............., నిజమేలకాదు? ఆమె జీవనము పరమ పావనమని చెప్పవచ్చును. ఆమె యిప్పుడు బొత్తుగా స్వార్థమును త్యజించి యుండును. అట్లు త్యజించని యెడల నింత ప్రతిష్ఠాపన నెలకొల్పగలదా! సరస్వతీ నిలయమను పేరుతో స్త్రీవిద్యానిలయమును కృష్ణాతీరమున సీతానగరములో స్థాపించి సమర్థించుచున్నదనియు అందులో నూర్గురు కన్యలు, నూర్గురు బాల వితంతువులు నివసించి విద్య నభ్యసించుచున్నారనియు, వారికి ఇరవై సంవత్సరములు వచ్చేవరకు సకలవిధ దేశీయవిద్యలు గరపి పంపివేయుదురనియు, వారికి యిష్టముండెనేని వివాహము చేసుకొందురనియు లేదా బ్రహ్మచారిణులై దేశసేవకు గడంగుదురనియు ఆమె కుమార్తె శకుంతల గుంటూరు శారదానికేతనములో నివసించుచు విద్యాభ్యాసము చేయుచున్నదనియు గుంటూరునుండి పత్రికా విలేఖరి వ్రాసియున్నాడు. నా నిర్భాగ్యపు బి. యే పట్టమువల్ల ప్రయోజనమేమి? నా పొట్ట పోసుకోవడానికే కదా! జానెడు పొట్టకు విద్యలెందుకు? విద్యాగంధములేని వ్యవసాయకులు, శిల్పులు, వర్తకులు, బి యే.ల కంటె బాగుగ జీవించుట లేదా! ఈ పనికిమాలిన విద్యతో

నము ఏడేండ్లు రాజమహేంద్రవరములో కాలము గడిపి తిని. పరోపకారమున నుపయోగించని చదువు కాల్పనా? స్వల్ప విద్యతో ఏడేండ్లలో కృష్ణవేణి చేసినపని చూస్తే నాకు సిగ్గగుచున్నది. ఆమె నప్పుడే పెండ్లి చేసుకొని ఆమె యుద్యమములో సహాయము చేసిన నేనెంత ధన్యుడనయి యుందును! పోనీ, ఇప్పుడు మించిపోయిన దేమి? ఇప్పుడు సీతానగరమునకు బోయి ఆమెను వివాహము చేసుకొని ఆమె యుద్యమమునకు తోడ్పడెదను. ఆమె అందుల కంగీకరింపనిచో నేనును అక్కడనే యుండి బాలురకు గురుకులమును స్థాపించెదను. బాలురకు ఇరువదినాల్గు ఏండ్లు వెళ్లువరకు విద్యనేర్పి శరీర వ్యాయామములచే ధృఢకాయులనుగ జేసి సరస్వతీ నికేతనములోని బాలికలకు వివాహము చేసెదను. వారికి గలుగు సంతానము ధృఢకాయులై భావిదేశాభ్యుదయమునకు తోడ్పడుదురు. ఆహా! ఎంత బుద్ధిహీనుడను! ఈ దరిద్రదేశమందు ఇట్టి ప్రతిష్ఠాపనలకు డబ్బిచ్చువారెవరు? అట్లననేల? హరిద్వార గురుకులమునకు, బందరు జాతీయ కళాశాలకు, కొవ్వూరు సంస్కృతపాఠశాలకును, వున్నవ లక్ష్మీనారాయణదంపతులచే స్థాపితమైన శారదానికేతనమునకు, ఇంక నెన్నెన్నో ప్రతిష్ఠాపనలకు ద్రవ్య సహాయము చేయు త్యాగశీలురెందరు లేరు? దేశము గొడ్డుపోయినదా? 'మనోవాక్కాయకర్మభిః' దేశసేవ చేయువారికి సహాయముచేయువారుండకపోరు" అని అనుకొనుచు నొకయువకుడు, ఇరువైయైదు సంవత్సరములవాడు, గోదావరియొడ్డున పచారు చేయుచుండెను. గోపాలరావు అను సహాధ్యాయి యొకడు అక్కడికివచ్చి, తన చొక్కా జేబులోనుంచి ఆంధ్రపత్రికను దీసి 'ఒరే వెంకట్రావు! ఎవరో కృష్ణవేణట; సీతానగరములో ఆంజనేయస్వామి దేవాలయ సమీపమున స్త్రీవిద్యాలయమును స్థాపించినదట! మరి యింకేమేమో వ్రాసియున్నది. ఆసంగతి సందర్భములనుచూస్తే ఆకృష్ణవేణి నీపాతస్నేహితురాలవలె నున్నదే! 'పాత...... వీరమాత అయినదే!" అని పక్కున నవ్వెను. వెంకట్రావు చిన్నపోయినాడు. కొంచెసేపటివరకు మాట్లాడలేదు. తర్వాత 'ఆ వ్యాసమును నేనుకూడా చూచాను' అన్నాడు. గోపాల్రావు "ఆహాహా"అని పండ్లికిలించి కిలకిల నవ్వెను. "ఎందుకురా యీవెకిలినవ్వు?" అని వెంకట్రావనెను. 'నవ్వక యేడ్వమంటావా యేమిటి? ఇటువంటి పతివ్రతాశిరోమణిచేత నడపబడు విద్యాలయములో చదువుబాలిక లెటువంటివారగుదురో?' అని గోపాలరావనెను. వెంకట్రావు తెల్లబోయి బిక్కమొగముతో నీక్రిందివిధముగ జెప్పెను:—

౨

'ఒరే! గోపాల్రావూ. చేసినపాపం చెపితే పోతుంది. దురాగ్రహమంతా నాది. కృష్ణవేణికి కుడుము చేతికిస్తే పండుగ! తల్లివెంకమ్మ బ్రతికియుండగా కృష్ణవేణికి తనచదువేమో తనపనియేమో కాని ఇతరులతో ముఖ్యముగా—పురుషులతో—అందులో యువకులతో—మాట్లాడినపాపాన పోలేదు. నేనాపిల్లను వివాహం చేసుకోవలయునన్న కోరికతో స్త్రీపునర్వివాహములు శాస్త్రసమ్మతములని ఆమెవినుచుండగా ఆమెతల్లితో చెప్పుచుండేవాడను. తల్లి 'ఊఁ' కొట్టుచుండేది కాని జవాబుచెప్పేది కాదు. తల్లి కలరాతో చనిపోయినప్పుడు శవమును మోసేవారు కొరకలేదు. ఆమె బ్రతికియున్నప్పుడు బులుబుచ్చికమాటలు చెప్పి ఆమెచే వంట చేయించుకొన్నవారు, నీళ్లు తెప్పించుకున్నవారు, అడ్డమయిన చాకిరీ చేయించుకొన్నవారందరు మొగంచాటు వేశారు. కృష్ణవేణి యేడ్పుకు మితంలేదు. ఆమెను సమదాయించిన వారైనను లేరయిరి. నేను స్కూలునుండి ఇంటికివచ్చేవరకు మధ్యాహ్నం వంటిగంట అయింది. మాతలిదండ్రులు అప్పటికింకా భోజనము చేయలేదు. "అమ్మా! అన్నంపెట్టు"అని మాఅమ్మని అడిగితే "దాని అమ్మకడుపు కాలా, ఆవెంకమ్మముండ చచ్చింది! ఆ దిక్కుమాలిన శవమును పారేస్తేగాని భోజనము చెయ్యకూడదురా, నాయనా!" అన్నది మాఅమ్మ. నేను మావాళ్లకు తెలియకుండా శవమున్నచోటికి వెళ్లాను. కృష్ణవేణి, పాపం శవముదగ్గర కూర్చొని యేడుస్తున్నది. ఆయింటికి దూరదూరంగా చెట్లక్రిందను వీథియరుగుల మీదను బ్రాహ్మణులు పాడుమొగాలతో కూర్చున్నారు. శవంవుండగా భోంచెయ్యకూడదని యేవేవో శ్లోకాలు రోకటిపాటవలె చెప్పుతున్నాడు కుండనాల బ్రాహ్మణు డొకడు. నేను లోపలికి పోతూవుంటే

‘అబ్బాయి! ఆముండ కలరాతో చచ్చింది. పోకుఅక్కడికి’ అన్నాడు ముసలిబ్రాహ్మణు డొకడు. ‘పిల్లవెధవవు నీకెందుకు? ఇంటికిపో’ అన్నాడు మా మేనమామ. నేను మూర్ఖించుకొని లోపలికి వెళ్లాను. నన్ను చూచి కృష్ణవేణి బావురు మన్నది. ‘ఎందుకేడుస్తావు? ధైర్యం తెచ్చుకో?’ అని ఆమెకు ధైర్యంచెప్పి వీధిలోకివెళ్లి బ్రాహ్మణులను రమ్మని పిలిచాను ‘నా పెండ్లాము నీళ్లాడే రోజులు’ అని యొకడు, ‘నేను మొయ్యలేనబ్బా!’ అని ఇంకొకడు, ‘నాకు జ్వరం తగులుతోంది’ అని వేరొకడు చెప్పుచూ ఒక్కొక్కరే పలాయనం చిత్తగించారు. నేను పొలంపోయి మా తండ్రికి తెలియకుండా బండి కట్టించుకొని వచ్చాను. మా జీతగాడు పోతాయి వచ్చాడుకాని శవాన్ని వాడు ముట్టుకో కూడదని కృష్ణవేణి అన్నది. నేనున్ను ఆమెయున్ను శవాన్ని బండిమీద పెట్టి స్మశానమునకు తీసుకొనిపోయి దహనం చేసినాము. పాపం కృష్ణవేణి చితికి నిప్పు అంటించింది.

బ్రాహ్మణుల కందరకును భోజనం అమరింది. నేను చేసిన యీపాటిపనికి నన్ను భట్టు పొగిడివట్లు పొగిడినారు. నేను చెరువులో స్నానంజేసి ఇంటికి పోయినాను. మా అమ్మ నన్నేమీ అనలేదుగాని కంట తడి పెట్టుకొన్నది. నేను అన్నం తిని ‘అమ్మా! కృష్ణవేణికి పట్టెడన్నము పట్టుకొని వెళ్లనా?’ అన్నాను. ‘నీవెందుకు తే నాయనా? నీవు స్కూలుకుపో; నేనే దానికి నీళ్లుపోసి అన్నం పెట్టివస్తా’ అన్నది మా అమ్మ. పాపం మా అమ్మ అన్నమాట తప్పలేదు. ఇట్లే నెలరోజులు జరిగింది. గ్రామంలో కలరా నిమ్మళించినది. మా అమ్మ కృష్ణవేణిని మా యింటికే తీసుకొని వచ్చినది. మాఅమ్మ మానాయన ఆ పిల్లను చూచి జాలిపడేవారు. కృష్ణవేణికి నాయందు కృతజ్ఞత. అప్పటినుంచి నాతో చనువుగా మాట్లాడేది. ఆ పిల్లను వివాహం చేసుకోవలెనని నామనస్సులో గట్టి సంకల్పము కలిగింది. వీలయినప్పుడెల్లా స్త్రీ పునర్వివాహము శాస్త్రీయ మని ధర్మశాస్త్ర శ్లోకాలు చదివి చెప్పేవాడను. తుదకు ఏదో సందు చేసుకొని ఆమెతో నా కోర్కె చెప్పివేశాను. అప్పుడు మామధ్య జరిగిన సంభాషణ:

కృ—స్త్రీపునర్వివాహములు శాస్త్రీయములుకానీ, కాకపోనీ సంసారమను మురికికూపములో పడికొట్టుకొనుటకంటె బ్రహ్మచర్యవ్రతము జరుపుట పవిత్రము గాదు?

నేను—సాధ్యమా?

కృ—ఎందుకుకాదు? మల్లెలు, విరజాజులు మొదలయిన సుగంధపుష్పములు పడుపువృత్తిగలవారి కొప్పులలో ముడవబడి విటులకు సంతోషదాయకములు కావచ్చును; నేలపడిజంతువుల కాళ్లక్రింద నలిగిపోవచ్చు; కాని దేవుని పాదారవిందముల నలంకరించు భాగ్యము వానిపుణ్యవశంబున కొన్ని పుష్పములకు లభించుటలేదా? భగవానుడు తననిర్హేతుకజాయమాన కటాక్షముచే స్త్రీలలో కొందరికి అవివాహితత్వము లేక వితంతూత్వము ప్రసాదించి తనపాదసేవ, అట్టి సేవచేయువారి సహవాసముచేయించి వారిని రక్షించ తలంచియుండవచ్చు. ఈమంచితరుణము నన్నేల...” అని ఇంకేమో చెప్పబోవుచుండగా మాతల్లిగారువస్తున్నట్లు అలికిడి వినిపించెను. అంతటితో అప్పటి సంభాషణ ముగిసింది.

అయినను నేను పట్టినపట్టుమాత్రము విడువలేదు. అవకాశము కలిగినప్పుడల్లా ఆమెను వేధించేవాణ్ణి. ఆమె యొకప్పుడు “ఛీ! నీకిదిబుద్ధికాదు” అనేది. మరియొకప్పుడు “మీ అమ్మగారితో చెప్పుతాస్మా” అని బెదరించేది. ఇంకొకప్పుడు ఓరుఓరున యేడ్చేది. తుదకు చిరునవ్వునవ్వి “సరే; నీరుణం యిట్లాగయినా తీర్చుకుంటాలే” అన్నది. “ఈమాట తప్పితే నన్నుచంపుకొన్నట్లే” అని ఒట్టుపెట్టాను.

ఒకరోజు మా అమ్మ పుట్టింటికివెళ్లింది. నాన్నగారు పొలంపోయినారు. నేను,మాచెల్లెలుకస్తూరిబాయి, కృష్ణవేణిమాత్రంయింటివద్దనున్నాము ...మరుసటిరోజు మాఅమ్మవచ్చినది మాఅమ్మ గ్రామంలో లేనప్పుడు మేముమాత్రం ఇంట్లో వుండడం చూచి యిరుగుపొరుగు కొంటె పిల్లకాయలు అల్లరి కారంభించారు. వెనకటి స్థితికి, తర్వాత స్థితికి యేమిభేదం కనిపెట్టిందో కాని మా అమ్మకు అనుమానం కలిగినది. చీటికి మాటికి కృష్ణవేణిని కసరుకొనేది; సరిగా అన్నం పెట్టేదికాదు.

ఇంతలో స్కూలు వేసంగి సెలవులకు మూసివేసినారు. తర్వాత రెండు మాసములకు స్కూలు తెరచినారు. మా నాయనగారు నన్నిక్కడకు పంపివేసినారు. నేనా రాత్రికి తర్వాత కృష్ణవేణితో మాట్లాడుటకయినా అవకాశం దొరకలేదు ఆమె నన్ను తప్పించుకొని తిరిగేది. నేనిక్కడికి రాగానే ఆ పిల్లను మా తల్లి వెళ్లగొట్టినదనియు ఆమె పూటకూళ్ల సుబ్బమ్మ యింట్లో ప్రవేశించినదనియు మాత్రం తెలిసినది. మా నాయనగారు చనిపోయినప్పుడు నేను మా వూరికి వెళ్లాను. కృష్ణవేణి గర్భిణిగానుండి సుబ్బమ్మ యింట్లో కొంతకాలము పనిచేసి తర్వాత వెళ్లిపోయినదని విన్నాను. తర్వాతి చరిత్ర ఆంధ్రపత్రికవల్ల తెలిసింది. ఈ పయిసంగతులను బట్టి ఆమెయందు లోపములేదనియు, నేనేదు రాత్మర్గుడననియు తెలిసిందా?" అని చెప్పి వెంకట్రావు దుఃఖించినాడు.

గోపాలరావు కొంతసేపూరుకొని "అవునురా, వెంకట్రావూ! బాగా అలోచించిచూస్తే స్త్రీలు చెడిపోవడమునకు పురుషులే కారణలని మనము వప్పుకొనక తప్పదు. పురుషులు తమమాయోపాయములచే స్త్రీలను అందులో లేబ్రాయపుస్త్రీలను ప్రోత్సహించి చెడగొట్టుట లోకానుభవమువల్ల మనము తెలుసుకొనవచ్చును. కాబట్టి శిక్షాస్మృతిలో వ్యభిచారము స్త్రీని యిలువెడలదీయుట యను నేరములకు పురుషులకే శిక్ష నిర్ణయించబడినది. కాని స్త్రీలకు శిక్ష లేదు. మరియు సర్వజ్ఞుడగు శ్రీశంకరాచార్యులు స్త్రీలనుజూచి మోహపడి వారిని చెడగొట్టకుండా, 'నారీస్తనభర నాభీదేశం, దృష్ట్వామాగా మోహావేశం; యేతన్మాంసవ సాదివికారం, మనసి విచింతయ వారంవారమ్' అని భజగోవిన్దశ్లోకములలో పురుషులను మందలించినారు. పాపం! కృష్ణవేణికి కన్యాత్వం చెరిపి నీవూ, ఆమెను పరిహసించి నేనూ, పాపము మూటగట్టుకొన్నాము. నీతోపాటు నేనును పశ్చాత్తాపపడుచున్నాను" అనెను.

౮

ఆ రాత్రి మెయిలుబండిమీద వెంకటరావు బెజవాడలో దిగి తెల్లవారువరకూ స్టేషనులో పడుకొన్నాడు గాని నిద్రపట్టలేదు. తెల్లవారి లేచి వంతెన మీదుగా సీతానగరం చేరినాడు. కృష్ణలో స్నానం చేసి ఖద్దరుబట్టలుధరించి నొసటవిభూతిధరించి సరస్వతీ నిలయమునకు పోయినాడు. ఆనిలయపు కట్టడములు ఆస్థలవైశాల్యముచూచి నిర్ఘాంతపోయినాడు. పురుషులు లోపలికిపోవుట నిబంధనలు అంగీకరించవని జవాను చెప్పినాడు. కృష్ణవేణమ్మగారితో ఆమె పరినితుడొకడు బి. యే. పరీక్షయందుత్తీర్ణుడైనవాడు వచ్చి వేచియున్నాడని బంట్రోతును చెప్పమన్నాడు. బంట్రోతు గంటవాయించినాడు. స్త్రీయొకతె వచ్చినది. ఆమెకు వెంకట్రావును చూపించినాడు. ఆమె లోపలికి వెళ్లి తిరిగివచ్చి, "అమ్మగారు పనిమీదవున్నారు. అరగంటలో వచ్చెదరు. ఆగదిలో కుర్చీమీదకూర్చోండి" అని చెప్పింది వెంకట్రావు గదిలోకి పోయినాడు. అందొక వ్రాతబల్లయు కుర్చీలుఉన్నవి. అది పెద్దమనుష్యులు మాట్లాడుటకు వచ్చేటప్పుడు కూర్చునేగది. వ్రాతబల్లమీద నున్నపత్రికలు చదువుచూ వెంకటరావు కూర్చున్నాడు.

ఏడున్నరగంట లయ్యేటప్పటికి కృష్ణవేణి వచ్చినది. ఆమె ఖద్దరుచీర కట్టుకొన్నది. తలవెంద్రుకలు వెనుకకు ముడివేసుకొన్నది. వంటిన నగలు ఏవీ లేవు. ఆమెను చూడగానే వెంకటరావు చివాలున నిలుచున్నాడు. కృష్ణవేణి కూర్చోమని చెయిసన్న చేసినది. కాని ఆయన కూర్చోలేదు. కృష్ణవేణి ఆయన ముఖముపై యెగాదిగా చూచినది; గుర్తించినది; తెల్లపోయినది. తలవంచుకొని 'యేమిపనిమీదదయచేసినారు?" అన్నది. "నేను చేసిన తప్పిదమును పశ్చాత్తాపపడి ప్రాయశ్చిత్తముచేసుకోవడమునకు వచ్చాను." అన్నాడు వెంకటరావు. కృష్ణవేణి మాట్లాడలేదు. 'నన్ను క్షమించు' అన్నాడు వెంకటరావు. "క్షమించుటకు నేను సమర్థురాలనుగాను. నన్ను క్షమించిన శ్రీ రామచంద్రుడే మిమ్మల్నికూడా క్షమించుతాడు. ఆయనను వేడుకొండి" అన్నది కృష్ణవేణి. "నేను ఆయనను శరణుసొచ్చెదను. మనము యథాశాస్త్రీయముగా వివాహము చేసుకుందాము" అని వెంకటరావు చెప్పినాడు. "నేను బ్రహ్మచర్యములో నున్నాను. సంసారేచ్ఛ నాకులేదు. కడిగినకాలు తిరిగి రొంపిలో పెట్టుటకంటె అవివేకములేదు. ఇష్టముంటే

మీరు పెండ్లిచేసుకొని ఉద్యోగము సంపాదించి సుఖంగా ఉండండి" అని కృష్ణవేణి చెప్పినది. "నేను పెండ్లి చేసుకోను. నేను బ్రహ్మచర్య వ్రతము పూనెదను. నాకు ఉద్యోగం వద్దు. నా పొట్టకూటికి సంపాదించుటయందు నా కిచ్ఛలేదు. కృష్ణకు అవలగట్టున బెజవాడ సమీపమందు నేను బాలురకు గురుకులము స్థాపించి దేశీయ విద్యలన్నీ కరపెదను. నేను చదివిన చదువును స్వార్థపుచ్ఛక మంచి వినియోగము చేసెదను" అని వెంకటరావు చెప్పినాడు. కృష్ణవేణి చిరునవ్వునవ్వి "అటులనే చేయండి. మీకు భగవంతుడు తోడ్పడునుగాక! సెలవివ్వండి" అని వెళ్లిపోయినది.

బెజవాడ వైశ్యశిఖామణుల సాయముచేతను, కాశేశ్వరరావుగారి సానుభూతిచేతను, విద్యాధరపురము నందు కృష్ణవేణీతీరమున గురుకులమును స్థాపించి వెంకటరావు నిర్వహించుచున్నాడు. గోపాలరావుకూడా బి.యే. పరీక్ష ప్యాసయి వెంకటరావుకు సహాయభూతుడైనాడు. దేశాభిమానముతో పెక్కు రాంధ్రదేశీయ పండితులు ఉపాధ్యాయత్వమునకు గడంగినారు. ప్రొఫెసరు కోడి రామమూర్తి నాయుడుగారు విద్యార్థుల శారీర పరిశ్రమకు తగిన సదుపాయముల జేయుచున్నారు. సోమసుందరరావుగారు తమ కొడుకు జగన్మోహనమును గురుకులములో విద్యార్థిగా చేర్పించినారు. శారదా నికేతనములో శకుంతల ఇరవైసంవత్సరములు వెళ్లేవరకు విద్యాభ్యాసముచేసి, "సాహితీ" "విదుషీ" "శిరోభూషణ" పరీక్షలలో కృతార్థతనొంది జగన్మోహనమునకు విద్య పూర్తికాగానే అతని వరించినది.

శ్రీయుత నల్లపాటి హనుమంతరావుగారిచే స్థాపిత మయిన "శ్రీకృష్ణాశ్రమ"ములో నాదంపతు లుపాధ్యాయత్వము స్వీకరించి అస్పృశ్యతాదోష నివారణము నకు బద్ధకంకణులై యున్నారు. వారి కొకకొడుకు నొకకూతురు పుట్టినారు. వారికి వరుసగా "సోమసుందరం" "అనసూయ" అని పేరుపెట్టినారు.

ఆబిడ్డల ముఖవిలాసము, చురుకుదనము, శరీరారోగ్యము చూచినవారు నిజమయిన గురుకులవాసము చేసిన దంపతుల కిట్టిబిడ్డలు కలుగుటలో ఆశ్చర్యము లేదనుకొనుచున్నారు. ఈబిడ్డలు దేశమాతకు ముందెంత సేవచేయ నున్నారో!

ఇందలి నీతి

(1) స్త్రీ పురుషు లింద్రియలోలురు కాకూడదు

(2) స్త్రీ పురుషులు చేయు చెడుగనకు పురుషుడే ప్రాయశః కారకుడు.

(3) తప్పు చేసినవారు పశ్చాత్తాపపడి తప్పు త్రోవనుండి మరలునెడల వారిసంఘము దూరముగ నుంచకూడదు.

(4) పశ్చాత్తాపము బొందువారు తిరిగి తప్పు చేయకూడదు.

(5) శవములను తీసుకొనిపోవుటలో అందరు ముందంజ వేయవలెను.

(6) స్త్రీలకును పురుషులకును విద్య యవసరము.

(7) స్త్రీలకు పురుషులకు ప్రత్యేక గురుకులము లవసరము.

(8) గురుకులవాసంచేసి శరీరదార్ఢ్యమును, మంచి విద్యను బడసినవారి సంతానము దృఢగాత్రులు, సుందరరూపులు బుద్ధివికాసము గలవారునై దేశాభివృద్ధికి తోడ్పడగలరు.



ఊర్వశి

కొమాండూరు కృష్ణమాచార్యులు గారు (సాహితీసమితి)

ఊర్వశి

ఖాండవదాహమాదిగ నఖండ పరాక్రమ! నీయశంబు బ్ర
హ్మాండము నిండిపోయెఁ ద్రిదిశాలయ వాసు లహర్నిశంబు నీ
గాండివ పాండితీపటిమ గాథలఁ బ్రొద్దులు పుచ్చుచుందు రా
ఖండలుఁ డెప్డు నిన్ బొగడుఁ గౌరవభూషణ, శత్రుభీషణా!

అనవరతంబు నందనవనాంతములందుఁ జతుష్పథంబులన్
గనుఁగొనుచుండు నిత్యమును గారుడకిన్నర సిద్ధసాధ్యులన్
వినుము నిజంబు దెల్పెదను విశ్రుతరూపవిలాససంపదన్
జనసుత, నిన్నుఁ బోలఁగల చక్కని వాని నెఱుంగ నొక్కనిన్.

చేరెఁడు కన్నుదోయి సురసింధురతుండకఠోరపీవర
స్ఫార భుజద్వయంబు సువిశాలమహోన్నతవక్షమున్ శుభా
కార, విశాలసారతరుకాండ దృఢోరుయుగంబుఁజూడఁ బం
కారిని గన్నయట్ల హృదయంబున రాగము మొల్కలెత్తెడున్.

ఈయమరావతీపురికి నింద్రునిఁ గొల్వఁగవచ్చి యెన్నినా
ళ్లాయెనొ చూడు మొక్కదినమైన మదీయగృహంబు సొచ్చినా
చేయు సపర్య లందవు శచీపతికొల్వున నాట్యమాడ నా
చాయనె నేఁడు సూచితివి చాలదియే పదివేలు ఫల్గునా!

శతపత్రాయతనేత్రయుగ్మ మనిమేషత్వ స్థితిన్ దాల్ప నీ
పతిరాగంబున నన్నుఁ జూచుట సహస్రాక్షుండు వీక్షించి స
మ్మతి నీపాలికి నన్నుఁ బంపె వచియింపన్ శక్యమే దేవతా
పతికిన్ నీపయిఁ గల్గు కూర్మి ధరణీపాలాన్వయగ్రామణీ!

జ్యోతిష్టోమముఖాధ్వరక్రియలచే శుద్ధాత్ములౌవారు ని
ర్ఘాత క్రూర కఠోరశస్త్రహతి సంగ్రామస్థలిన్ బూర్ణ వి
ఖ్యాతిన్ మేనులు వీడు వీరులును మాకౌఁగిళ్లలోఁ జొక్కి సం
ప్రీతిన్ భోగములంద నర్హులుసుమీ వీరాగ్రణీ! యిచ్చటన్.

అట్టి నిలింపలోకమున కర్జున, కందనిమేనితోడ రా
నెట్టి తపంబుఁ జేసితివొ! ఇంతియకా దమరేంద్రుఁ గాఁగిటన్
బట్టి సుఖించు నహర్నసభావము లీలహరించి తట్టి నీ
దిట్టతనంబు మెచ్చవలెఁ దెల్పెడిదేమి కిరీటి! నీకిఁకన్.

అభిజనంబుఁ దలంప నాది నారాయణు, సాలవిశాలోరుసక్థ సుమ్ము
కాపురంబుఁ దలంపఁ గమనీయ నందనోద్యానవేష్టిత దివ్యహర్మ్యతలము
భోజనంబుఁ దలంప భూరిదుగ్ధాంభోధి, మథియింపఁబుట్టిన సుధయసుమ్ము
ఉబుసుపోకదలంప విబుధేంద్రకోల్వులో, వివిధలీలాలాస్య విభ్రమముల
హరిహరాదుల దివ్యసభాంతరములు, తలఁప నర్తనశాల లుదారచరిత
అట్టియూర్వశి నీపాలి కరుగుదెంచి, కోరుచున్నది గాఢోపగూహనంబు.

అర్జునుఁడు

బలిమి జగత్త్రయంబుఁ బరిపాలనసేయు శతక్రతుండు కో
మలిజనకుండు నీ వతనిమన్నన లందినభోగకాంత వీ
తలఁ బొసగూడునెట్లకట! తల్లివి నీవు, సుతుండ నేను నీ
వల నుచితంబుగాదు నినుఁ బల్మరుఁజూచిన జాడఁ దెల్పెదన్.

పౌరవవంశవర్ధనివి పంకజనాభుని యూరు దేశమం
దారయఁ జన్మమందితి మహర్షులఁ గాంచితి కుంభసంభవున్
ధీరు వసిష్ఠు నిట్లగుట దేవి, నినున్ జగదేకవంద్యఁగా
గారవమొప్పఁ జూచితిని గామవశుండనుగాను మానినీ!

ఊర్వశి

పాండుతనూజ! భూతలముఁ బాసితివైన సమర్త్యభావ మొ
క్కండు కో అంతయయ్యెఁ ద్రిజగంబులనేలు శచీవిభుండు నీ
దండకు నన్నుఁబంప నొకతప్పును జూపి నిరాకరించెదో
భండనభీమ! వావులను పాపము లే దమరావతీపురిన్.

పౌరవవంశ్యులై యవని భాసురయజ్ఞము లాచరించి, వి
స్తారయశంబుఁగాంచి వసుధాతలమేలిన రాజశేఖరుల్
వీరులు మమ్ముఁగూడి యిటఁ బ్రీతి రమించుచు నుందు రింద్రు పం
పారసిచూడు చిత్తమున నర్జున, భీషణశత్రుతర్జనా!

మాయది నిత్యయౌవనము, మామృదుదేహ మపార్థివంబు, మా
చాయలు తప్తకాంచనరసంబులు, దివ్యమనోజ్ఞ గంధముల్

కాయము, లాత్మభూషణనికాయము కల్పలతా ప్రవాళముల్,
తీయని గాంగతోయములఁ దీర్థము లాడుదు మేము ఫల్గునా!
రతమున ఘర్మజాలములు రాత్రులనేత్రని మీలనంబుల్
వ్రతములు నొక్కప్రొద్దులును వావులు వ్యాధులు లేవు మాకు సం
తతము విశాలనందనవనంబులఁ గామకళా రహస్యముల్
ప్రతిదిన మభ్యసించుటయె పాండవసింహ, వినోద మీపురిన్.

బలరిపుశాసనం బట, నివాసము వాసవలోక మంట నిన్
వలచిన యప్సరోవనిత వచ్చి నినుం దనుఁదాన కూర్మితోఁ
బిలిచెడు నంట, పార్థ! యిఁక బేలతనం బటు గట్టిపెట్టి నా
వలన సమస్తభోగములు వాసవసన్నిభ, పొందు మీపురిన్.

అర్జునుఁడు

పరుషశిలోచ్చయచ్ఛద విపాటనశాతశతారమెచ్చటన్
గరముల ఘుత్వమున్ గనునొ కామిని యచ్చట మీ వినీలసుం
దరతరభ్రూశరాసనమె నమ్మినకైదువు జంభవైరికిన్
నరుఁడొకఁ డెంత యట్లయిన నామనవిన్ వినుమమ్మ, తెల్పెదన్.

నీవు వచించు మాటలకు నిక్కము మారు వచింపనేర నా
భావము నీవయిం. జనదు భామిని! మాద్రియుఁ గుంతియున్ శచీ
దేవియు నీవు నొక్కటియ దేవి, క్షమింపుము నీదు పుత్రకున్
భావనమైన నీతనువు. పార్థుఁడు ముట్ట నసహ్యుఁ డమ్మరో!

ఊర్వశి

దక్కని వాఁడవంచు బలశాసనునాజ్ఞ యలంఘ్యమంచుఁ బెం
పెక్కిన జోదువంచు హరు నెక్కటి కయ్యమునం జయించి లా
వెక్కిన మేటివంచు జగదేక పరాక్రమశాలివంచు నా
మక్కువఁ దీర్తువం చకట మానము దక్కితి నీకుఁ జిక్కితిన్.

ఔర! యనన్యకాంత నిటు లాఁబడి వెట్టిన ఘోరపాతకం
బూరకయేల ని. న్విడుచు నుర్విని నీ వొకషండ రూపివై
బీరముదక్కి యౌవనము వేడుక నిన్ బరిహాస మాడఁగా
వారలకాట నేర్పుచును బార్థ చరింతువుగాక యీపయిన్.

దయ్యాల కొంప

గర్భాం అప్పారావు గారు, బి. ఏ.

విధి ననుసరించి యున్నగదిలోనే పండుకొనుట నాకలవాటు. పగటివేళ నాగదినే కచేరీచావడిగా నుపయోగించు కొనెడువాడను. నామంచము తలవైపున చిన్నమేజాబల్లయున్నది. బల్లపై విజయవిలాసము, తెల్లకాగితములు, పెన్సిలు, పేనా, సిరాబుడ్డి యున్నవి. అవసరమువచ్చినపుడు బంట్రోతునుగాని యింటిలోని వారినిగాని పిలుచుటకు చిన్నగంటయొకటి దానిపైనే యున్నది.

ఇంటిలో మిగిలినవారు పండుకొనుట కీగదికాక మరి రెండుగదు లున్నవి. అచ్చట మా యిరుగు పొరుగువారు, పరోపకార ధురీణులు నాయొద్దకువచ్చి "ఈ యిల్లు దయ్యాలకొంప. అనేకుల కిందు నష్టము కలిగినది. నీవు పిల్లలవాడవు. వేగము దీనివిడిచిపెట్టుము." అని పైసాయేమి కోరకయే సలహాయిచ్చిరి. నిజము చెప్పకతీరదు. వారిమాటలు నామనమున నాటినవి. ఆ వీధిలోనే ఆపాటియింటికి, లద్దె దీనికి రెండింతలు పుచ్చుకొనుచున్నారు. దానిని బట్టిచూడ మేమున్నయింటి కద్దెచాలతక్కువ. చిన్న యిల్లయినదొరకని యీ వీధిలో నిది కాళీయైయుండుటకు కారణము వారుచెప్పిన విషయమే యైయుండునని నిశ్చయించితిని.

కాని యీసంగతి మాయింటిలోనివారి కింతేనియు తెలియనీయలేదు. అంత తెలివితక్కువవాడను కాను. వారి కీసంగతి చెప్పిన యెడ నాయిల్లు వదలివేయువఱకు వారు నా ప్రాణములు కొరికివేయరా? 'ఏమయ్యా! ఇంటిలోనివారిదగ్గరకూడ దాపేనా?' అని మీరనవచ్చును. ఇంటినిలోనివారిదగ్గరకూడ దాచవలసిన విషయములు కొన్నియున్నవి.

కొన్నిమాసములు గడచినవి. మొదట 'దయ్యములకొంప' అను విషయము జ్ఞప్తికి వచ్చినరాత్రి నాకు నిద్దర పట్టలేదు. ఈచిక్కు కాలము గడచిపోవుచుండినకొలది మెల్లమెల్లగా నామనోవీథిని విడిచి పోయినది.

ప్రారంభమున కొన్ని రోజులవరకు మా యిరుగు పొరుగువారు వచ్చి మాక్షేమము నరయుచుండిరి. నాకు దయ్యములబాధ యేమియు లేదనియు వానిజాడ యెన్నడు కాన్పించలేదనియు గృహము. అనుకూలముగానే యున్నదనియు చెప్పుచుండెడివాడను.

ఒకనాటిరాత్రి యథాప్రకారము నాగదిలో నిదురపోవుటకై శయ్యపై చేరితిని. ఉదయము మొదలు సాయంకాలము వరకు ఎండ

తీవ్రముగా నుండుటచే రాత్రి వేళకూడ వాతావరణ మనుకూలముగా లేదు. ఎక్కువ ఉక్కగా నుండెను. దోమలబాధ మాయూరిలో మెండు. అందులో మాసంత పేటగూర్చి చెప్ప నవసరమే లేదు. ఈదోమలసంగీతముచేతను, చాల నుక్కగా నుండుటచేతను నాకేమియు నిద్దుర పట్టకుండెను. శయ్యపై నటునిటు దొర్లాడుచుంటిని. పది, పదకొండు, పండ్రెండు, ఒంటిగంట—కొట్టుట విన్నాను. దీపము కొంచెము తగ్గియున్నది. దీపమున్న నిద్దుర పట్టదని దాని నార్పివేసి మరల పక్కపై చేరితిని. గదియంతయు చీకటితో నిండిపోయెను. అంధకారము మృత్యువును స్ఫురింప జేసెను. ఈ స్ఫురణతో నీయింట దయ్యాలున్నవను మాట జ్ఞాపకము వచ్చినది. నేను నిద్దురపట్టుటకు ప్రయత్నించుచుండగా నామనసు దయ్యము లీయింట నెన్ని యున్నవో యాదయ్యము లెట్లు కలిగినవో చింతించుచుండెను.

ఇట్టివింత యాలోచనలో నుండగా నాకు కొంచెము మమత పట్టినది. తటాలున మేజాపైనున్న గంట ట్రింగుట్రింగుమని మ్రోగినది. నే నులికిపడితిని. గంట మ్రోగించినది నే నేమో యని చేయి పరీక్షించుకొంటిని. ఏమియు లేదు. నిద్దురలేక మనసు చిందరవందరగా నుండుటచే పగటివేళ నేను గంట మ్రోగింపగా కలిగిన శబ్దమే నాహృదయమున ప్రతిధ్వనించిన దని తలంచియు నమ్మకము కలుగక దీపము వెలిగించితిని. జాగ్రదవస్థయం దుండియు, వెలుతురుండియు నదేమో కాని నా యొడలు జల్లుమన్నది; శరీరము చెమ్మగిల్లినది. ఈ యింట దిరుగుచున్న దయ్య మెవతె యని యెలుగెత్తి యడుగబోవుసమయమున నామేజాపై నున్న విజయవిలాసము చప్పున మీదికెగిరి ప్రక్కను పడెను. పుస్తకము పైకెగురగానే యావ్రోటున నొక కాగిత ముండెను. దానిపై నక్షరములు స్ఫుటముగా కాన్పించెను. విషయ మేమో చదువబోగా నందు "ఈయింటి నాక్రమించి యున్న దయ్యమును నేను. నాకథ నీ కెఱిగించెద" ననువాక్యము లున్నవి. తత్క్షణమే యనాలోచితముగా "ఈ నిశీథసమయమున నిట్టి విషయము కలుగుట విపరీతము. నీకథ వినుటవలన నాకేమి యానందము" అనుమాటలు నా నోటినుండి వెడలినవి.

వెంటనే మేజాపైనున్న పెన్సిలు కదలి కాగితముపై నిలువబడి యిట్లుత్తరువు వ్రాయ మొదలిడెను.

"వివేకశూన్యమగు ప్రశ్న వేసితివి. నా కథలో ప్రతిమాటయందు విచారము కలిగించువిషయ మున్నది. అట్టిది నీ కెఱిగింప వలదా?"

"సత్యమే. నీకోర్కె కొనసాగింప దగినదియే. నీకథ కానిమ్ము. కాని నీవిట్లు కాగితముపై వ్రాసి తెలుపుకుంటె మాటలతో చెప్ప లేవా?" అని యడిగితిని. "అట్లే చెప్పెదను. నేను నీకుర్చీపై కూర్చుండి నీకు చెప్పెదను:

నాకథ

నే నీలోకమం దున్నప్పు డసామాన్య లీలాసుందర విగ్రహాయుక్తనై యుంటిని. ఆశక్తి

రచ్ఛాయ, చకోరములవంటి యాకన్నులతళతళలు, కెంపులమించి యనురాగము వెదచల్లు నాపెదవులు, వానికి సొంపు నాపాదించు నాణిముత్తెములబోలు నాపలువరుస, లోకము నాకర్షింపజేయుచుండెను. మా తల్లిదండ్రుల కేకపుత్త్రికనౌటచే నన్ను గారాబమున బెంచుచుండిరి. నా కయిదవయేటనే— ఆమాట చెప్పుట కిప్పుడుకూడ నాకు కలత కలుగుచున్నది.—నా కయిదవయేటనే పెండ్లి చేసిరి. మానాన్నగారు అన్నివిధముల మంచివారే కాని నా పెండ్లివిషయమున పొరపడిపోయిరి. అదైన నాసౌఖ్యము కోరియే యట్లొనరించిరి.

నా మేనత్తగారు విశేషధనవంతులు. అప్పటి కామెకు పండ్రెండేండ్ల యీడుగల బాలుడుండెను. మానాన్నగారు మేనల్లునకు నన్నిచ్చి వివాహము చేసినయెడల నేను ధనముతో తులతూగి యుందునని తలంచెను. వివాహము వెంటనే చేయనిచో తనకంటెధనవంతుల సంబంధము మామామగారు చూచుకొని మాసంబంధము విడుతురేమోయని వెఱచెను. తన యుద్దేశము బయలు పరుపక మా నాన్నమ్మ తాను జీవించియుండగానే నావివాహము జరిగించుమని తనను బాధించుచున్నదనియు, వేయిరూపాయీలుకట్నమిత్తుననియు మామామగారికి చెప్పి తత్‌క్షణమే జరిగింప నొప్పించెను. మా నాన్నమాటల కేమి, మా నాన్నమ్మమాటలకేమి మా మేనత్తయు వెంటనే యొప్పుకొనెను. వివాహము మహావైభవముతో జరిగిపోయెను.

చిన్నప్పటినుండియు నా మేనత్తకుమారుడు నన్ను బ్రేమతో జూచుచునే యుండెను. ఆతడు మా కన్నవారియింటికి వచ్చినపుడెల్ల నేను పరమానందభరితనై యాతని విడిచెడిదానగాను. ఆతడు వివాహమైనతరువాత మా పుట్టినింటికి వచ్చుట తరుచాయెను. ఆతని యానందమునకు మేరలేదు. ఆతనిపైని నాకు కూడ ప్రేమ పొంగిపొరలి వచ్చుచుండెనుకాని నాకు చిన్నతనమైనను కారణమేమో మును పటివలెనె నాతని తేరిచూచుటకుగాని, చేరి మాటాడుటకుగాని నామన మొప్పకుండెను.

బాల్యమందియేర్పాటు పరస్పరప్రేమాంకురవృద్ధికి దోహదమేకాని సంబంధము కుదుర్చుకొని యట్టి రాకపోకలు జరిగించుచు సరియగునీడు వచ్చువరకు మానాన్నగారు వివాహముచేయకుండిన బాగుగానుండియుండును. "మనలో నేమున్నది? దైవము ప్రతికూలముగా నుండునెడ" అని నీ వనగలవు. తనకార్యములలో మనుష్యుడు జాగ్రత్తగా నడిచినయెడ దైవ మనుకూలపడునని నా సమ్మకము. ఏదెట్లున్నను నా సౌఖ్యమున కంతరాయము కలిగినది. నాయానంద మేటగలిసినది. సంసారసముద్రమీద ననుకూలపడునావ పగిలిపోయినది. నాప్రా...—నుడువజాలకున్నాను— నాప్రాణప్రియుడు వివాహమైన సంవత్సరము పూర్తికాగానే యీలోకము విడిచెను.

అప్పటి కాతనికి పదమూడేండ్లవయసు. నా కారేండ్లే. మాతల్లిదండ్రుల శోకవార్ధికి మేరలేదు. ననుబట్టుకొని వారు గోలుమని యేడ్చిరి. వా రేడ్చుచున్నారని నేనును వారితో గలిసి

యేడ్చితిని. క్రమక్రమముగా మాతల్లిదండ్రుల
శోక ముపశమించుచుండెను. నాకు మున్ముందు
ముద్దు ముచ్చటలు జరుగవనియు, నలంకార
ములు చిత్రవిచిత్ర వర్ణ వస్త్రములు ధరింప
వలనుపడదనియు తలంచి నాతల్లిదండ్రులు
నన్ను వానితో ముంచి యానంద మొనగూ
ర్చిరి. బాలిక నగుటచే నా కానందమే. ఏండ్లు
గడచినకొలది నాకు యౌవన మంకురించు
చుండెను. నా శరీరసంపర్కముచే వస్త్రాలం
కారములును, వస్త్రాలంకార సంపర్కముచే
నాశరీరావయవములును, బరస్పరశోభను గాం
చుచుండెను. అయిన నా యందముచూచి
యానందించు వారెవరు? ఈనాలావణ్యమే
మహాపురుషుడు చూచి తనివినొందవలెనో
యా నాహృదయేశ్వరుండు పరమపదవి నొందె
ను. తల్లిదండ్రులకు నా లీలావిలాసము గాంచ
గనే గుండెలు ఝల్లుమనుచుండెను. ఇరుగు
పొరుగమ్మలక్కలు నన్ను గాంచినపుడెల్ల
"అయ్యో! దంతపు బొమ్మవంటి యీ పిల్ల
కేమి గతివచ్చినది. లక్ష్మీకళ లుట్టిపడు నీ బిడ్డ
దగ్గర వైధవ్యము కాలుపెట్టుట కెట్లు వీలయ్యె
ను. పాడుదైవము చూడలేక పోయినాడు."
అనుచు విచారించుచుండిరి.

ఇట్లారుసంవత్సరములు గడచినవి. నాకు
యుక్తవయసు వచ్చినది. అనగా నేను...చెప్ప
నోరాడదు. ఆసమయమున నా తల్లిదండ్రుల
దుఃఖమునకు మేరలేదు. నేను లోలోన గుందు
చుంటిని. నా వయసంతయు కానగాచిన
వెన్నెలయయినది. "అయ్యో! నానోముల
పంట! నాసౌఖ్య నిధానమా!" అని చిన్నతన
మున నాతో గలసిమెలసి యుండు నా మనో
హరుని మనోహరాకారము దలంచుచు దుఃఖ
ము దిగమ్రింగుచుంటిని. అయినను చిత్ర విచి
త్రాలంకారధారణము మానలేదు. కొన్ని
నాళ్లకు నాకుబుద్ధివచ్చినది. నాలావణ్యమేమో
హనాకారుడు కాంచి యానందించుటకై యేర్ప
రుపబడినదో యట్టి వ్యక్తి లేనపు డీ లావణ్య
మెందులకు? ఈవస్త్రాలంకారములతో నేమి
పని యని చింతించి చిత్ర వర్ణవస్త్రములు ధరింప
మానితిని.

ఇది యిట్లుండ మా పొరుగువారి కొక
పుత్త్రుం డుండెను. ఆతడు తరుణ వయస్కుడు.
పరిసరపట్టణమున నాంగ్లేయవిద్యాభ్యాస మొన
రించుచుండెను. అతడు సెలవు దినములలో
స్వగ్రామ మరుదెంచుచుండెను. అప్పు డప్పుడు
నాదెస ననురాగవీక్షణములు పరగించుచుం
డెను. అదంతయు నా యందలి జాలిచేతనే
యని తలంచితిని. నేను సంపూర్ణయౌవనవతి
నయియుంటగాంచి యీమారు తనచెల్లెలిద్వా
రా సుగంధపుష్పము లంప మొదలిడెను. ఇవి
నా కెందులకని యవి ధరింపక విడిచెడిదానను.
తన చెల్లెలిని పిలిచెడి నెపమున "లలితా!
లలితా!" యనుచు నే నున్నగదియొద్దకు వచ్చె
డివాడు. క్రమక్రమమున నాతో ముచ్చటింప
నారంభించెను. "విమలా! నీతో మాటాడుటే
నాకానందము. నీవుకూడ నట్లానందింతు వని
తలంచెద ననెను. "అట్లనకు"మని నే నంటిని.
ఆమాట కతడు ప్రఫుల్లవదనుడై లలితతో
నింటికేగి లలితచేతి కొక్క యుత్తర మిచ్చి
పంపెను.

"విమలా! నీరూపలావణ్యములు మిళిం ద్రానాఘ్రాతమగు చంపకము వడువున నిరర్థక మగుచున్నందులకు మిగుల వగచుచున్నాను. శ్రీవీరేశలింగం పంతులుగారు నీవంటివితంతువులకు మంచియేర్పాటు చేసియున్నారు. రాజమహేంద్రవరముపోయి నీజీవనము సార్థకము చేసి కొనుము. నీ వియ్యకొంటివేని నాసర్వస్వము వీడి నీవెంట చనుదెంచెదను."

నే నంతగా చదువుకొనిన దానను కాను గాని యుత్తరమందలి భావము గ్రహింపగలిగితిని. గుండె ఝల్లుమన్నది. శరీరమంతయు వణకెను. ఆతని ధూర్తత్వమును దూషించితిని. జవాబీయలేదు. "లలితా! మీ అన్నయ్య మంచివాడు కా"దంటిని. ఆ బాలిక నేనన్న మాట తన సోదరుని కెరిగించెను. అతడు నా మాటకు భయపడి పదిదినము లిటు రా మాని నాడు. లలితమాత్రము అప్పుడప్పుడు వచ్చుచుండెను. ఒకనాడు లలితతో 'మీ అన్నగారి టురాలే దే'మన్నాను. ఆసంగతి లలిత మును పటితీరున సోదరునికిఁదెలుప నాత డుత్సాహపూరితుడై నేనున్న గదిలోనికివచ్చి 'విమలకు నాపై కోప' మన్నాడు. 'నాకు కోపమెందు' కంటి. కోపములేనియెడ నామాట వినుమంచు నిట్లు చెప్పదొడగెను.

"విమలా! నీమనోహరునియందు నీకు గల విశ్వాసము ప్రశంసనీయమే. ఈ జగము విడిచిపోయిన వానియం దింక విశ్వాసమేమి? ఆతని నామస్మరణచేసి నీజన్మము నిరర్థకమేల చేసికొనెదవు. చచ్చినవానికాళ్లకు మ్రొక్కిన ఫలమేమి? మొదట నీ వొకనిసేవకు కుదురు కొంటివి. ఆతడు నిన్నువీడునపుడు మరొకని సేవకు నీవు కుదురుకొనెదవు కాని నీవు సోమరివై యీలోకమున పనిచేయనియెడ నీకై హిక సుఖమెక్కడిది? నీజీవనము గడచుటెట్లు? నీకు మోక్షముకూడ దూరమగును. నీజన్మము సార్థకమగుటకు గృహస్థునికి సహధర్మచారిణివై యుండవలెను. ఒకడు నీకు దూరమయ్యెను. ఇంకొకని జేపట్టి సంసారసుఖమనుభవించి నీవిధి నెరవేర్పవలెను."

"ఓహోహో! ఇది మీ యింగ్లీషుపద్ధతి. నీవు చెప్పినది ఐహికము. పారమార్థికము కాదు!" అని నేను పలుక నత డడ్డువచ్చి "ప్రత్యక్షసౌఖ్యము వీడి యనుమాన సౌఖ్యమునకై యాసించెదవేల? ముం దేమియున్నదో యెవ్వ డెరుగు? ఇట్టి పిచ్చి తలంపులు కట్టి పెట్టుము. అరు వారు కాసులుకంటె రొక్కము మూడుకాసులు మేలు. బాగుగా నాలోచింపుము; దయయుంచుము; మరువకు" మనుచు లేచిపోవునపుడు నావైపు తిరిగి చూచుచు పికారు పోయెను.

నే నారాత్రి శయ్యనుజేరి యాతనిమాటలయందు సత్యములేక పోలేదని నిశ్చయించితిని. పిదప నా మనోహరుదలంచి యది సత్యము కాదనుకొంటిని. మరల సత్యమంటిని. ఇట్లు డోలాందోళితమైన హృదయముతో రెండుజాముల రాత్రివరకు మేల్కొని కనుమోడ్చితిని. గదిలో నేమో శబ్దమయ్యెను. భయముచే తేరి చూడలేక కనులరమోడ్చి చూచుచుంటిని. నా బాలసఖుని నా మనోహరుని విగ్రహము లీలగా గాంచితిని. ఒడలు

ఝల్లుమనెను. శరీరము కంపించెను. ఆవ్యక్తి మెల్లనిమాటల "విమలా! ఏమి! నాయందు విశ్వాసము నీకు నశించినదా? నీమనమున నింకొకనికి చోటిచ్చితివా? ఇట్టి తుచ్ఛ సుఖమునకై యాసించితివా? అయ్యో! నన్నీపిశాచావస్థ నుండి విముక్తి నొందింతువని గంపెడాసతో నుంటిని. విమలా! నాబలవన్మరణ మెవరెరుంగరు. నీ తండ్రి వద్ద నాజనకుడు నా వివాహ సమయమున వేయి రూప్యములు గ్రహించెను. నాతోడి బాలురు నన్నందుల కపహసించుచుండిరి. ప్రతిదినము వారి కదియే పని. నేను వారినిజూడలేకపోతిని. నాజీవితమున కిదియొక కళంక మని యెంచితి. ఆత్మహత్య పాపమని యెరుంగక విసము తిని యకస్మాత్తుగా మరణించి యీరూప మొందితిని. నే నాత్మహత్యగావించుకొని నీసౌఖ్యము చెడగొట్టితిని. నీకుహింసగల్గించితిని. ఆపాపము నన్నంటినది. నీవు గయలో పిండమువేసి నాకీ యవస్థ తప్పించెదవని తలంప నీవు వేరువిధముగా ప్రవర్తింప దలంచితివి." అని దీనముగా బలికెను.

నన్ను లజ్జా భయము లొక్కుమ్మడి ఆవరించినవి. తెల్లవారుసరికి జ్వరము వచ్చినది. ఆహారము ముట్టకుంటిని. నా దుర్బుద్ధికి వగచి కడుంగుంది కృశించితి. బలవంతమున నాశరీరము ప్రాణమును వీడి యిట్లు త్రిశంకు స్వర్గమున నున్నది. నాతల్లిదండ్రులు విచార సాగరమున మునిగి మునిగి యీయూరు వీడి మా పినతల్లిగారున్న యూరున వసించి యున్నారు. ఈయిల్లు బాడుగ కీయబడి యున్నది.

ఇదివరకిందు వాసముచేయువారియందఱు వద్దను బాలవితంతువు లుండిరి. ఆబాల వితంతువుల నే నావేశించుచుంటిని. వారీబాధపడలేక యీగృహము వీడుచుండిరి. 'బాలవితంతువులనే పట్టి బాధించుచున్న దేమమ్మా' యని ఈ యిరుగుపొరుగువా రనుచుండిరి. దయ్యముల బాధకంటె నీబాలవితంతువుల బాధ యెక్కువ. ఇట్టిబాధ నీకింకను లేదు. నీవు పుణ్యాత్ముడవు. అందుచే నీవారి నెవరిని నే బాధింపలేదు. నీవెన్నడు బాల్యవివాహము లొనరింపకు. సంఘవిరుద్ధముకానిరీతి పదిసంవత్సరములవరకేనియు బాలికలకు పెండ్లిచేయకుము. తరువాత దేవునిపై భారమువేయుము. ఒక్కయుపకారముమాత్రము చేయుము. నాకు గయాశ్రాద్ధముపెట్టి నన్నీయవస్థనుండితప్పింపుము; నాభర్త జ్ఞాతులు గయాశ్రాద్ధము పెట్టుటచే విముక్తిపడసెను. ఎన్నడు నీకుమారునికై వరశుల్కము స్వీకరింపము. నేనుచెప్పినవన్నియు చేసెదవా?" అని తనకథ ముగించెను.

నేనొక్క నిట్టూర్పువుచ్చి 'తప్పక నీకోర్కెలు కొనసాగించి నీకు సౌఖ్యముగలుగజేసి నేను సౌఖ్యమొందెద' నని మనఃపూర్తిగా బలికితిని. అంతట నామె అట్లయిన "అదిగో నామనోహరుని చిత్రపట మున్నగది. అందు నే నతని బూజించుచుందును. అతడే నాదైవము. అత డిప్పుడు పరమేశ్వరు సన్నిధి నున్నాడు. అతనియెదుట ప్రమాణపూర్వకముగా జెప్పు"మని నన్ను అచ్చటికి దోడ్కొని పోవుచుండ,

మ. "సజనంబౌ కనదభ్ర నాటకమహా
శాలాంతర రంగ భ్రమ
ద్రజనీ బాహ్యపటంబు వీడఁగ మహా
రంగస్థలిన్ భానుఁడన్
న్నిజగన్నాటక సూత్రధారి యుదయం
జే సెల్పు ఘంటారవా
గ్రజ బిూశబ్దమనంగఁ గోళ్లరచె నే
గన్ గొక్కొరోకోధ్వనిన్."

కోళ్లుకూయగానే యారంగమును నూతనపాత్ర లలంకరింతురనుచు నామె యవ్వోటనే యదృశ్యమయ్యెను. తెల్లవారుజామయ్యెను. దైవస్మరణ చేసికొనుచు నే నీవలికివచ్చితిని.

సంపూర్ణము

దశమగ్రహము

(జామాతా దశమో గ్రహః)

శ్రీమాన్. కో. వేం. కృష్ణమాచార్యులయ్యవార్లు గారు

గ్రహములు తొమ్మిదంచుఁ జిరకాలమునుండియు నార్యకోటి య
న్వహము విమర్శనల్ సలిపి యాప్తఫలంబుగ నాడుచుండఁగాఁ
గుహక మొసర్చి యిక్కరణిఁ గొండొకరూపము నూని వచ్చితే
యహహా! మదీయపాప మిటు లాకృతి నూనిన నూనఁగల్గునే?

ఉ. ఆకసమందునం గ్రహములన్నియు నుంటనటంచు వించు నే
నాకసమందు నల్గడల నారసి యారసి యందుఁ గానమిం
జేకొని యీవివాహమును జేయఁగఁ బూనితి నంతమాత్ర నీ
యాకృతిఁ గొంచు వచ్చుచు నపాకృతగర్వునిఁగా నొనర్చితే.

ఆ. వె. గ్రహములందుఁ గొన్ని గతివక్రతవహించుఁ, గాని యెల్లయపుడుఁ గాంచఁబోవు
ఏకరాశి నుండ వేప్రొద్దు నీవసఁ, గుంభరాశిఁ గొందుఁ గుటిలగతివి.

గీ. మాసుఖమ్ముల నన్నింటి మంటఁ గలిపి, యవలఁ గన్యాగృహంబున నడుగువెట్టి,
మిథునసంప్రాప్తి నెంతయు మిట్టిపడుచుఁ, గుంభముం గొందు మకరమ్ముఁ గొల్లగొట్టి.

శా. కన్యాదాన మశేషకామ్యఫలముం గల్పించునంచుం జగన్మా
న్యుల్ సూరులు వల్కువించు హరి సంభావించి నేఁ గంటి నీ
కన్యారత్నము, సర్వముల్ మెసవినం గ్రాసింతు వీవన్న నీ
సన్న్యాసమ్మున కేఁ గడంగెదనొకో! స్వప్నమ్ము నందైననున్.

గీ. లోహపదమున ద్వాదశగేహమునను, సర్వఖేటమ్ము లోకపతి సంఘటించి,
వ్యయము సేయింపఁ దొలఁకొన్న పట్టునందు, నిట్లు సర్వస్వమును నశియించునొక్కొ!

సీ. ముక్కారుఁబండెడు మూఁడుకత్తులభూమి,నంత బయానకై యమ్మఁజేసి
స్వయమార్జితమ్మగు సకలస్థిరాస్తిని, రొక్కకట్నముపేర రూపుమాపి
అత్తపై దీపించు నాభరణావలిఁ, జిల్లరఖర్చుకై కొల్లవెట్టి
శునకవృత్తిని లభించిన సర్వవిభవమ్ము, నితరదానములకై హుత మొనర్చి
సకలమును బాపి, యిహలోకసక్తి మాపి, 'దేహి భిక్షా' మటంచని తిరుగఁజేసి
కాయసౌఖ్యమునంతయు మాయఁజేసి, మాయఁజేసితె? దుర్గ్రహంబ, క్షణాన!

శా. ఔ, నీ వన్యుఁడవే! పురాభవమునం దబ్జోదరుం గొల్చి లం
కానాథానుజజన్మ నిద్రఁ గొసఁగింగా యన్నక్రోధంబుచేఁ
గానీయంచుఁ బునర్భవంబున గుణగ్రామాప్తి నుప్పొంగి తి
వ్వానిద్రం ఘనవిగ్రహంబున విహారాహారలీలాగతిన్.

ఉ. మానము రొకంటెయల్లుఁడనుమాట మదిం దలపోయవేల! నీ
కామచయంబుఁ జాటునెడ గర్వము నూనదవేల! తృప్తి నే
రామమునందు నైననుఁ బ్రరోహముఁ గాంచ కదేల! ప్రస్తరం
బే మృదువంచు నాడికొన నీగతిఁ బల్కెదవేల! నక్కటా!

గీ. ఆర్యజను లాత్మవైరుల నభిశపింపఁ, గోరుపట్టులఁ గొండెక గూయు లేక
'యూఁడుబిడ్డలఁ బడయుత'మనుచుఁ బల్కఁ, బ్రాప్తమయ్యెనె, దుర్గ్రహంబ, త్వదాప్తి!

మ. అకటా! కొంపకుఁ గోడికిం గతికి నే హస్తోదకం బిచ్చితిన్
సకలంబుం ద్యజయించితిన్, హరికథాసల్లాపముం బూనితిన్
స్వకుటుంబంబున కాజ్ఞ వెట్టితిని వస్త్రం బొండు భిక్షింప, మం
దుకునైనన్ సుఖ మే నెఱుంగఁగలనే, దుష్టగ్రహంబ, యికన్!

ఉ. పాసము లుండునంతకును బాయనిమాట యటుండనిమ్ము, వం
శానుగతమ్ముగం దరము లైదిఁటఁ జొప్పడునంచు నార్యులై
జ్ఞానికసత్తము ల్వలుకు చక్కని బాంధవ మిట్లు రూపక
శ్రేణికి నమ్మఁగం గొనఁగఁ జెల్లునె యో గ్రహమా, వచింపుమా!

చ. వెలనిడి గొడ్డుగోదలను విల్చినయట్టుల విల్చినార మం
చలఱగ నిత్తువే! యలుకయంచునుఁ, గార్యమటంచు నెట్టులో

మలమల మమ్ము మాడ్చఁగలమార్గము నాత్మఁదలంచి, కాసులం
గలగలరాల్చుఁడీ యనెదు కర్కశకృత్యములం బొనర్చుచున్.

సీ. అచ్ఛపరా నాహితాగ్నులన్వయంబునఁ బుట్టి, యార్యధర్మము విడనాడినావు
పెండ్లికట్నములపైఁ బ్రేమ విశేషింప, నింటరుమీడియే యేడ్చినావు
అలుక పడుక యంచు నగ్రిమెంటున లేని, పలుకుల నీరీతిఁ బలికినావు
పొట్టకూటికి నయి పోరాని తెన్నులు, నెన్నిటినో మది నెంచినావు
ఆఁడుబిడ్డలు పొడమిన యంతలోన, నూతనో గోతనో పడనూఁకి పుడమి
సౌఖ్యముగ నాళ్లునాళ్లను జరుపికొనుట, భావ్యమను నొక్కచట్ట మేర్పఱచినావు.

మ. కనమో వేశ్యలఁ గోరుకాముకులు రొక్కంబిచ్చుటల్! దగ్గృహం
బునను జొచ్చుట, లిష్టముం బడసి సమ్మోదించు, టారీతి నీ
వనితారూపవిహీనవేశ్యల కిడన్ వచ్చెన్ సుతాప్రీతికై
యన్నృతంబున్ వచియింప నేల, యిది కన్యాదానమం చక్కటా!

గీ. వెలవెలందులు తమకులవృత్తి రోసి, యర్హుఁడగు నొక్కరునిఁ బెండ్లియాడుచుండ
నార్యధర్మమ్ములను విడనాడు నిట్టి, వెలమగలు రాక్షసులరీతి వెలసినారె?

చ. ఎకరము నేయుటన్ నహి, గడించిన వైభవమన్న సున్న, పై
దికుఁడని రూపురేకలను దేర్పఁ డెఱుంగును, మాటిమాటికిం
జకచక నాంగ్లవాక్యములఁ జాటెదు, వేతన మెంతవచ్చునో?
సకలము నాదువిత్తము నొసంగితిఁ గన్నియ కన్నమున్న, యీ
స్వకులవధూటి నేకరణి సాకెదవో? తలపోయు మాత్మలోన్.

సీ. క్రాపింగుజుట్టుకై కామినీయాయిలు, నీసాలఁ గొన్నింటిఁ దీసినావు
ఆంగ్లదేశమునుండి యవతరించినరీతి, హాటు సూటునుఁ గోటు నలఁదినావు
ఆడువారల మ్రోల నాంగ్లేయభాషావిలాసమ్ముఁ జాటింపఁ గూసినావు
అల్పభోజనుఁ డంచు ననుకొనఁ గాఫిహోటలునఁ గుత్తుకబంటి గుడిచినావు
ఆర్యధర్మమ్ము నెవ్వరైన నరసి తెలుప, 'మ్యాన్ ఫెలో' యను నొకపల్కు మనిపినావు
ఎద్దియో సాకుఁ జూపి మాయింట విడక, యాలి పోషించుకొనుపక్కి నరయు మీవు.

క. మనుజుఁడ ననుచుం బెండ్లాడినవాఁడ నటంచు దనయులే కాక సుతా
జన ముద్ధవిల్లునంచని, మనమునఁ దలపోసి యడుగుమా! ఇష్టములన్.

నీ ఋణం తీర్చుకున్నా

(౧)

విశ్వనాథ సత్యనారాయణగారు

౧

సూర్యనారాయణ భోజనము ముందర కూర్చున్నాడు. మీనాక్షి నేతిగిన్నె పుచ్చుకుని వంటయింటి ద్వారబంధం దగ్గర నుంచుంది. సూర్యనారాయణ పరిషేచనం చెయ్యబోతూ 'కృష్ణమూర్తియేడే' న్నాడు. కృష్ణమూర్తి దొడ్డిగడపలోంచి తొంగి చూశాడు. సూర్యనారాయణ నవ్వి 'రా, నాయనా! బువ్వతిందుగాని రా!' అన్నాడు. కృష్ణమూర్తి సందేహించాడు.

సూర్య—రా! దొంగబూని!

కృష్ణమూర్తి—మొగము గుమ్మపు వారన పెట్టి మళ్లీ మొగం చూపించి వోరగా నవ్వాడు.

సూర్య—రా! నాయనా! ం! (భార్యతో) తీసుకురావే నువ్వు.

మీనాక్షి కృష్ణమూర్తిని ఎత్తుకువచ్చి సూర్యనారాయణదగ్గర కూర్చోపెట్టి వెండి గిన్నెలో అతనికి వేరే కలిపిపెట్టింది.

సూర్యనారాయణ—నెయ్యివేసి కలిపి నోట్లో పెట్టనా!

కృష్ణ—నే తీతుకుతింతా.

మీనాక్షి—'నువ్వే తీతుకు తిను' అని వాణ్ణి ముద్దెట్టుకుంది. భోజనం చేసినంతసేపూ అన్నీ కృష్ణమూర్తికి ముందు; అన్నీ అతనియిష్టం వచ్చినట్టూ.

భోజనం అయిపోయింతరువాత సూర్యనారాయణ సావిట్లో కూర్చుని—'ఏమోయి! కృష్ణమూర్తీ! తాంబూలం వేసుకుంటావా' అన్నాడు.

కృష్ణ—'ఊఁ! వేతుకుంతానూ!' అని దీర్ఘంతీశాడు.

సూర్యనారాయణ వక్కకొరికి సగం అతని నోట్లో పెట్టి తమలపాకు సున్నం రాచి అందిస్తూ 'నీపేరేమిటి?' అన్నాడు.



కృష్ణ—కిత్తమూతి.

సూర్య—మీ నాన్న పేరు?

కృష్ణ—వెంకటేశ్వర్లుగారు.

సూర్య—ఊఁ! మీ అమ్మ పేరో?

కృష్ణ—అనసూయ.

సూర్య—'అల్లాగటోయి' అని సంతోషించినాడు. ఈ రీతిగా ఆ కుఱ్ఱవాడిచేత పేర్లు చెప్పించటం, సంతోషించటం రోజుకు పదిసార్లు. అది ఎప్పటికప్పుడే కొత్త.

ఇంతలో భోంచేసి వెంకటేశ్వరరావు వచ్చి కొడుకుని చూచి 'ఎక్కడ అన్నం తిన్నావురా' అన్నాడు.

కృష్ణ—వీళ్లింటో.

వేంక—వాళ్లింట్లో భోంచేస్తారా!

కృష్ణ—ఏం భోంచేస్తే! అన్నాడు కనుబొమ్మలెత్తి ముఖం అష్టంగా తిప్పుకుని—

వేంక—అమ్మ కొడుతుంది! ఉండు.

సూర్య—'ఎందుకు కొడుతుంది' అను.

కృష్ణ—'ఎందుకు కొట్టుండేమిటి! కొడితే వల్లి కొట్టును.' ముగ్గురూ కలిసి నవ్వారు.

వెంకటేశ్వరరావూ సూర్యనారాయణా ఇద్దరూ బందరులో ఒకింట్లోనే అద్దెకి వున్నారు. వెంకటేశ్వరరావు కలెక్టరాఫీసులో గుమాస్తా; సూర్యనారాయణ హైస్కూలులో మాస్టరు.

సూర్యనారాయణకు బిడ్డలు లేరు. వెంకటేశ్వరరావుకి ఒక్కడే కొడుకు. ఇద్దరూ ఒకటయిశేం యిట్లైతే యేం సుమారు ముప్పయిరేళ్ల వాళ్లు.

సూర్యనారాయణ భార్య కాపురానికివచ్చి యీనిమిదేళ్లవుతున్నది. బిడ్డలు లేరు. అందుచేత ఆ భార్యాభర్తలిద్దరికే కృష్ణమూర్తిమీద అతి అపేక్ష. కృష్ణమూర్తి పోషణ అంతా మీనాక్షే చేస్తుంది. కృష్ణమూర్తి యెంత యేడుస్తున్నా సూర్యనారాయణ ఎత్తుకుంటే మానేస్తాడు. కృష్ణమూర్తి పగల్లా సూర్యనారాయణగారి యింట్లోనే వుంటాడు.

కడుపునపుట్టినబిడ్డ, బంగారపుబొమ్మ; ముద్దుమాటలకు ముత్యాలగొమను; కృష్ణమూర్తి అంటే తల్లిదండ్రులకు అమితప్రేమ. వెంకటేశ్వరరావుకన్న సూర్యనారాయణ ధనవంతుడు. వెంకటేశ్వరరావుకు ఉద్యోగమే ఆధారము. సూర్యనారాయణకు తెనాలివేపున పాతికయెకరాల సుక్షుమాగాణిపొలముంది. అనసూయకన్న మీనాక్షి అందగత్తె. చదువుకుంది. సూర్యనారాయణ విద్యాధికుడు. బి. ఏ. యల్. టి; యం. ఏకి చదువుతున్నాడు. వెంకటేశ్వర్రావు స్కూల్ ఫైనల్ ప్యాసయినాడు. మీనాక్షికి సూర్యనారాయణకి సంతానమే తక్కువ. వాళ్లకి కృష్ణమూర్తిని చూస్తే లేకబిడ్డే అనిపించింది. ఏ జన్మాంతరవాసనో, మీనాక్షీ సూర్యనారాయణలు పండుకుని బిడ్డని మధ్యపడుకోపెట్టుకుని మాటలు చెప్పించుకుని నవ్వుకుంటారు. సంతోషపడతారు. అతనికి ఉక్కిరిబిక్కిరి అయ్యేటట్లుగా కౌగిలించుకుని ముద్దెట్టుకుంటారు. కొడుకుకోసం అనసూయవస్తే మీనాక్షి లేచి అబ్బాయిని తల్లికిస్తుంది.

కృష్ణమూర్తికి మూడేళ్లు వెళ్లినై. ఎడపిల్ల లేదు గనుక పాలు తాగుతూనే వున్నాడు.

సంవత్సరాది పండుగవస్తే సూర్యనారాయణ కృష్ణమూర్తికి మూడుకాసులు పెట్టి మెడలోకి సన్నని బంగారు గడియారపుగొలుసు చేయించాడు. మీనాక్షి పూలుతో రుమాలు నేసి కుఱ్ఱవాడికి కప్పింది. పండుగనాడు మీనాక్షి కుఱ్ఱవాణ్ణి అలంకరించి కృష్ణమూర్తివేషం వేసింది. నెత్తిమీద నెమలికన్నులు, మొగాన నల్లని విలువుబొట్టు పునుగుతో. సూర్యనారాయణ ఎత్తుకుని బజారు వెళ్లాడు. అందరూ పిల్లవాణ్ణి కళ్లారా చూచినవాళ్లే.

మళ్లీయింటికి వచ్చేటప్పటికి పిల్లాడికి ఆర్చి దిష్టికొట్టింది. కుఱ్ఱవాడు రెండురోజులు లేవలే.

మీనాక్షీ సూర్యనారాయణలు అమితనొచ్చుకున్నారు. కృష్ణమూర్తి తల్లిదండ్రులను మరిచిపోయినాడు. సూర్యనారాయణ కృష్ణమూర్తికి కొన్నవస్తువులు ఖరీదుచేస్తే అయిదువందల రూపాయలకి పైనవుతై. అనసూయా వెంకటేశ్వరరావులు వద్దనలేరు. కాదనలేరు; వాళ్లకీ తమబిడ్డ యితరులచేత యింతముద్దుగా చూడబడటం అంతరాత్మలో యిష్టంగానే వుంది.

వేసవికాలం వచ్చింది. పగలు ఎండలు గాడ్పులు తిరిగినా సముద్రతీరం గనక సాయంకాలమవటంతోటే చల్లపడుతుంది.

కృష్ణమూర్తికి సంపనపర్చులు, పన్నీటిపూరేలు, మల్లె పూదండలు, మామిడిపళ్లు షర్బతులు, సెంపూర్ణాలు. గంధం పూసి పక్కమీద మల్లెపూలుచల్లి పుత్రుణ్ణి పడుకో పెట్టి మీనాక్షి విసురుతుంది.

ఇంట్లో పిల్లిమూతలు పడతోస్తాయని ఆవిడ కొంచెం లోపలికివెళ్లినా కృష్ణమూర్తి యెండలోకి పరుగెత్తుతాడు. ఆవిడ వచ్చి యెన్నివెతికి మళ్లీ శుశ్రూష.

ఒకరోజున సాయంత్రం దొడ్లో కొబ్బరిచెట్టుక్రింద పిల్లాడు ఆడుకుంటున్నాడు. ఎక్కడిదో గేదవచ్చి తోకెక్కదయింది. అనసూయ లేవనేలేదు. మీనాక్షి ఎంతో ఆదుర్దాతో లేచివెళ్లి పిల్లవాణ్ణి ఛప్పున ఎత్తుకుంది. వాడు కిలకిలా నవ్వాడు.



అనసూయ అందికదా —'ఘనానాలేదమ్మా' అక్కయ్యా!' అని మళ్లీఅంది. 'ఏమమ్మా అక్కా! నీకడుపున ఒక కొడుకుపుడితే మాఅబ్బాయినీగాక నీకింత ప్రేమ వుంటుందా?'

మీనా—నాకు బిడ్డలెందుకులే. కృష్ణమూర్తిని నీవు నాకిచ్చేద్దూ. (కృష్ణమూర్తితో) నాయనా! నీవు నా దగ్గరుంటావా! మీఅమ్మదగ్గర కెళతావా!—

పుత్ర—నీదగ్గరే వుంతా.

సూర్యనారాయణకు వేసవికాలపు సెలవులొచ్చాయి. వాళ్లవూరు గుడివాడసీమలో ఒకపల్లెటూరు. అక్కడ సూర్యనారాయణకు ఒకకొబ్బరితోట మామిడితోటా వున్నై. అందులో చాలాచల్లగా వుంటుంది. వేసవి కాలం సెలవలు సామాన్యంగా అతనికి అక్కడ గడుస్తై. సెలవులు శుక్రవారం నాడుసాయంత్రం ఇచ్చారు. శని, ఆది, వుండి సోమవారం పోదామనుకున్నారు. భార్యా భర్త లిద్దరూ పుత్రవాణ్ణి వదలి పెట్టలేక పోయినారు. రేపంటే రేపని వారంరోజులు గడచినై. వెంకటేశ్వర్రావుకి కలెక్టరాఫీసు వుద్యోగంగా. అది యమలోకం సర్వీసు. పోస్టాఫీసు, ఇదీ. అతనికి సెలవలులేవు తమవూరు తీసుకువెళదామన్నా

మీనాక్షి 'పుత్రవాణ్ణి తీసుకువెళదా' మన్నది. భర్త, 'వాళ్లు పంపిస్తారా' అన్నాడు. నాలుగు రోజులు ఈ మధనపడ్డారు.

చిట్టచివరకు పుత్రవాణ్ణి తీసుకువెళ్లటం ధ్రువంచేశారు. అనసూయా వేంకటేశ్వర్రావులు మొట్టమొదట నాలుగైదు రోజులు వద్దన్నవాళ్లు ఇప్పుడు ఏమీ అనలేక వూరుకున్నారు వూరుకోటం ఇష్టంవుండికాదు, ఏమీ అనలేక. అర్ధాంగీకారం దానికి సమన్వయించారు మీనాక్షీ సూర్యనారాయణా.

పుత్రవాణ్ణి 'మాతోవస్తావా నాయనా' అంటే 'వత్తా' నని, 'వుంటావా

తండ్రీ' అంటే 'వుంతాను' అని, ఎన్నిసార్లడిగినా యిట్లాగే చెబుతాడు.

రైలుకు బండిపెళుతోంటే కుర్రవాడు తల్లిదగ్గరకే వచ్చాడుకాదు. వాడికి బండిసరదా. గుర్రపుబండి పరుగెత్తుతోంటే సంతోషం.

'అక్కయ్యా! కుర్రవాడు జాగ్రత్త' అని వొక వంద సార్లు చెప్పింది అనసూయ. వెంకటేశ్వర్రావు రైలు దాకావెళ్లి రైలు కదిలింతరువాత యింటికి వచ్చాడు.

వంపసూరు ఆడవాళ్లొరిగిపోయినారు పిల్లణ్ణిచూసేందుకు. అందులో పల్లెటూరాయెను. పల్లెటూళ్లలో ఉద్యోగస్తులంటే చాలా గౌరవం. మాస్టరంటే అంత గౌరవం లేదుగాని సూర్యనారాయణకి నూరురూపాయిలు జీతంగనుక అది కొంతమట్టుకు ఫరవాలేదు.

కుర్రవాడికి మళ్లీ దిష్టికొట్టింది. మరునాడు జ్వరం వచ్చింది. మూడవరోజున తగ్గింది. కుర్రవాడు 'అమ్మేదీ' అన్నాడారోజున. మళ్లీ మరచిపోయినాడు. నీళ్లుమారటంవల్లా, కొబ్బరికాయల ఎడనీరు తాగటంవల్లా అయిదోనాడు కుర్రవాడికి జలుబుచేసింది. పూజారి వెంకయ్యను పిలిచి చూపించారు. ఆయన ఏమీ లేదని ఒక మాత్ర యిచ్చి పోయినాడు. మానికొండనుంచి సాయిబులు మామిడికాయలు అమ్మొస్తారు. నాజూకుపనసలు కోసి ముక్కలు పెట్టారు కుర్రాడికి. జలుబుమీద దారుణం చేసింది. పదిరోజుల్లో పిల్లాడికేం బాగుండలేదు. మీనాక్షి తొందరపడ్డది. పిల్లాడిని తీసుకుపోదాం పదండీ అంది. ఆ రోజున నవమి శనివారం. ఏదో నివేశన స్థలాన్నిగురించి కొంచెం తగాదా వుంటే "రేపు వెళదాం" అన్నాడు సూర్యనారాయణ. మరెన్నడూ వీలు లేక పోయింది. ఆదివారంనాడు రాత్రి పిల్లవాడికి జ్వరం ఎక్కువగా వచ్చింది. రాత్రి నిద్దర్లో లేచి 'అమ్మా! నాన్నా! ఏలీ! తీతుకులా' అని యేడిచాడు. 'నాయనా, ప్రొద్దున్నే వెళదాం' అని వోదార్చింది మీనాక్షి. భార్యాభర్తలు ఇద్దరూ తెల్లవారులు మేలుకునే వున్నారు.

మరునాడు ఏకాదశీ సోమవారం. కుర్రవాడు తీసుకు వెళ్లేస్థితిలో లేడు. సూర్యనారాయణ వెంకటేశ్వరరావుకి టెలిగ్రాము కొట్టాడు. మీనాక్షి కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది. తొందర పడుతోంది. ఏడుపు ఆపుకుంటోంది. పిల్లవాణ్ణి మాటిమాటికి ఏమిటో పలకరిస్తోంది. కుర్రవాడికి సకలవిధశుశ్రూషలు చేస్తోంది. వైద్యుణ్ణి యింటికి వెళ్లనియ్యక ఆరాత్రంతా, మందులు పోస్తూనే వున్నారు. సూర్యనారాయణ నిస్తబ్ధుడై పోయినాడు. ఈ అప్రతిష్ఠ యెట్లాగా అనుకున్నాడు. అతని వొళ్లోంచి ప్రాణాలు లేచిపోయినై.

కుర్రవాడు మీనాక్షి కౌగిట్లోనే చంద్రాస్తమానం వేళకి చనిపోయినాడు. మరునాడు తెల్లవారింది.

పదిగంటలైంది. వెంకటేశ్వర్రావు రైలుమీద రాలేదు. మీనాక్షికి స్మృతి తెలియదు. వీధి అరుగు మీద సూర్యనారాయణ శవంవలె కూర్చుని సందుతిరిగి యెవళ్లొస్తున్నా వెంకటేశ్వర్రావేమోనని చూస్తున్నాడు. వెంకటేశ్వర్రావు రాలేదు.

'ఇక చూసిమాత్రం ఏంలాభం. సాయంత్రం రైలుమీద వస్తాడేమో. ప్రొద్దు కూకుతుంది. అందాకా రాత్రి పోయిన పిల్లాణ్ణియింట్లో పెట్టుకు కూర్చుంటామా' అని సూర్యనారాయణ బంధువులు పిల్లవాణ్ణి తీసుకుని వెళ్లి పారవేసి వచ్చారు. పిల్లవాణ్ణి తీసుకు వెళుతోంటే మీనాక్షి ఊరుబయటిదాకా బిగ్గరగా యేడుస్తూ వెళ్లింది. అక్కడనుంచి ఆమెణ్ణి బలవంతాన తీసుకు వచ్చారు.

రోజల్లా మీనాక్షీసూర్యనారాయణలు భోజనమే చెయ్యలేదు ఆనాడు అతి తీక్ష్ణంగా ఎండ కాసింది. వడబాగా కొట్టింది. ప్రొద్దు కూకేటప్పటికి అనసూయా వేంకటేశ్వర్రావులు వచ్చారు.

ప్రొద్దుటినుంచీ సూర్యనారాయణ వీధిఅరుగుమీద కూర్చున్నవాడు కూర్చున్నట్టే వున్నాడు. అతని మొగం మహాదుఃఖముచేత అప్రతిష్ఠ భయంచేత ఎండిపోయి నయ్యంమొఖం పడ్డది.

వెంకటేశ్వర్రావు కనబడ్డంతోటే సూర్యనారాయణ ఆపురుమని యేడ్చి వెనక్కు విరుచుకు పడ్డాడు. ఇంట్లోంచి మీనాక్షి ఏడుస్తూవచ్చి అనసూయకాళ్ల మీద పడ్డది.

రససిద్ధులైన సుకవులు వర్ణించే యిట్టిపట్లు నేనెవడను వర్ణించుటకు? ఆనిమేషములు ప్రళయకాలఖండములు. అసలు వరూ బతుకుతారని యెవరూ అనుకోలేదు. వాళ్లని ఓదార్చటం ఎవరిచేత కాలేదు. మీనాక్షీ సూర్యనారాయణలకు అనసూయా వేంకటేశ్వర్రావులను మొగాలలోకి చూడటానికి భయంవేసింది.

చివరకు వెంకటేశ్వర్రావు ఏడుస్తూ—'నా బిడ్డని నేను చూడకుండా ఎందుకు పంపేశావు? నువ్వెవడవు నా బిడ్డని పారేసేందుకు నాబిడ్డని నేను చేతులారా తీసికెళ్లి పారేసుకునేవాణ్ణి! అయ్యో! తండ్రీ!' అని కోపమూ దుఃఖమూ తెలియకుండా అన్నాడు.

వెంకటేశ్వర్రావు—'దుర్మార్గుడా! యముడివి నువ్వు. నా కన్నవాణ్ణి నాకు తే. నా బంగారుతండ్రిని నాకు తే.



మా అయ్యని నాకు యియ్యి. ఆ చచ్చిపోయిన శవాన్నే నాకిచ్చేశెయ్యి. నేను తీసికెళ్లి పారేసుకుంటా నా తండ్రిని. ఇయ్యి! ఇయ్యి!' అని యింకా అంటూండగా,

సూర్యనారాయణ కళ్లనిండా నీళ్లు కారుతూంటే స్వరంతో రెండుచేతులూ పైకెత్తి దణ్ణంపెట్టి 'నాయనా! క్షమించు! తప్పుచేశా! ఈ ఋణం తీర్చుకుంటా! తీర్చుకుంటా! క్షమించు' అన్నాడు.

అనసూయ యేడుస్తూనేవున్న భర్తనోరు తనచేత్తో మూసి 'ఊరుకోండి! వాడికి ఆయుర్దాయం లేకపోతే వాళ్లేంచేస్తారు?' అన్నది. మీనాక్షీ సూర్యనారాయణలకు అప్పుడు చచ్చిపోతే బాగుండు ననిపించింది. భగవంతుడిచ్చిన ఆయుర్దాయం తగ్గించుకోనేందుకు మాత్రం వాళ్లెవళ్లు?

వేంకటేశ్వర్రావుకు మళ్లీ శోకప్రవాహం పొంగివచ్చింది. "ఇదుగో నయ్యోయి! సూర్యనారాయణా! నీవు చదువుకున్నవాడవు. ధనవంతుడివి. నా పిల్లాణ్ణిదాయక ఇచ్చేశెయ్యి, ఇచ్చేశెయ్యి! అయ్యో! వాడు రత్నాల మూటయ్యా! మళ్లీ అటువంటిబిడ్డని చూడలేనయ్యా! అయ్యో! తండ్రీ! నీవు చచ్చిపోయినావంటే నవ్వుతాలేకుండావున్నానురా. చచ్చిపోలే. ఈయన అబద్ధం చెబుతున్నాడు. ఇదుగో నయ్యోయి! నా—
తండ్రిని నాకు తే. చచ్చిపోయి—
నేను పాతిపెట్టుకుం—
చెలవివ్వలేదు—
అని ఆగి మళ్లీ
నాడా! ఆక
పోలేపోయి
నాకియ్యి!'

పక్కని యేడు
'నాయనా చ
అన్నది.

వెంక—
ఎదు
మ

...డ రెండుకుక్కలు తిరుగుతున్నై. భార్యాభర్తలు ఇద్దరూ అక్కడకాసేపు కూర్చుని యేడిచారు. పూరి మునసబు వాళ్ల రైలుదగ్గరకి తీసికెళ్లేందుకు బండి తెప్పించాడు. ఇందుపల్లిస్టేషన్ అక్కడికి రెండుమైళ్లుంది. అశోకమూర్తులు స్టేషన్‌లోకి వెళ్లారు. రైలొచ్చింది.

సూర్యనారాయణ ఏదో తప్పు చేశాననుకున్నాడు. మీనాక్షిదుఃఖం చెప్పేందుకు వీలులేదు. వాళ్లిద్దరికి నిద్రాహారాలు లేవు. సూర్యనారాయణ నెలరోజులైన తరువాత బయటికి వచ్చాడు. చిక్కిశల్యమైనాడు. మీనాక్షికి నిరంతరశోకంచేత కళ్లుజబ్బుచేసినై. రెండు నెలలైంది; కళ్లు ఎక్కువ చేసినై. తెలవులై పోయినై. సూర్యనారాయణ ఉద్యోగానికి రిజిగ్నేషన్ ఇచ్చాడు. 'మళ్లీబందరుఏమొగం పెట్టుకువెళ్లను' అని ఏడిచాడు. కుర్రవాడి నగలన్నీ ఇన్‌స్యూర్ చేసి వేంకటేశ్వరరావుకి పంపించాడు సూర్యనారాయణ. వేంకటేశ్వరరావు తిరగగొట్టాడు. అవి అట్లాగే ముడుపు అల్లే పెట్టెలో

...ర్యనారాయణకి విరోధం వచ్చిం
...రావు పేరుచెపితే యిత
...క్రాపింగుపోయింది.
...గోష్పాదం అంత
...తోటే లేస్తాడు.
...నెలకి పదిహేను
...పిలిపించి నమకచమ
...కం నాలుగుపనసలు
...లైవుండే మీనాక్షీ
మీనాక్షి ఆ
...వుత్సాహం
...ను.
...వేంక
...పిల్లశి

పాడయిపోయినై. సరిగా తోటలకి నీళ్లుతోడించక పోవటంచేత వానిమీద ఫలసాయం ఏమీరావటంలా. సూర్యనారాయణ పొలాలుచేసే రైతులు మక్తాధాన్యం సరిగ్గా కొలవక మా కక్కరలేదని భూమి వదలిపెట్టి యింకెవరిని రైతుని కుదరనివ్వక పల్లెటూళ్లల్లో డబ్బుగల రైతులు భూమిగల బ్రాహ్మణులను ఎన్ని చిక్కులు పెట్టాలో అన్నీ పెటుతున్నారు. ఇంకా అనేక కారణాలచేత సూర్యనారాయణ మళ్లీ వుద్యోగంచేస్తే బాగుండు ననిపించింది. ఉన్నవూరుగదా అని బందరు స్కూళ్లలోనే పెట్టాడు అర్జీ. కాలేజీలో యిచ్చారు వుద్యోగం. భార్యతో వచ్చాడు. వేరే యెక్కడో వున్నాడు. ఒక రోజున సాయంత్రం వేంకటేశ్వర్రావు సూర్యనారాయణా బజారులో కలుసుకున్నారు. సూర్యనారాయణ మొగం వాల్చుకున్నాడు. వేంకటేశ్వర్రావు పలకరించి యేదోమాట్లాడి 'మా అమ్మాయిని చూచిపోదురుగాని రేపెప్పుడన్నా రండి' అని చెప్పాడు. 'వదినెగారు వచ్చిందా' అని అడిగాడు. అవ్వాళరాత్రి వేంకటేశ్వర్రావు సూర్యనారాయణ కనపడ్డాడని భార్యతో చెప్పాడు. 'వూళ్లో మళ్లీ మాస్టరుచేస్తున్నాట్ట. ఆ పేటలో వున్నారట. మీనాక్షమ్మగారితోనే వచ్చాట్ట' అని.

అనసూయకు మీనాక్షిని చూద్దామనిపించింది. వాళ్లెక్కడున్నారో కనుక్కుని నాలుగు రోజులైంతరువాత చూట్టానికి వెళ్లింది. ఇద్దరూ కొంచెం కంట తడిపెట్టుకున్నారు. బాగానే మాట్లాడారు.

మాటల సందర్భంలో మీనాక్షికి అయిదోనెల అని తెలిసింది.

అనసూయ వెళ్లిపోయేటప్పుడు 'మా రెండోభాగంలో ఎవళ్లో అరవవాళ్లున్నారు. మాటాలేదు ముచ్చటాలేదు. వట్టి అనాచారంగా వుంది. ట్రాన్సఫరు అయిందట్ట. వెళతారు. మీరువచ్చి వుండడమ్మా! అక్కయ్యా!' అని చెప్పింది.

మీనాక్షిని పుట్టింటివారు తీసుకువెళ్లారు. సూర్యనారాయణ ఆరునెల్లో యేడునెల్లో హోటల్లో వున్నాడు.

వేంకటేశ్వర్రావు కూతురుకి పుట్టినరోజు పండగచేసి సూర్యనారాయణని భోజనానికి పిలిచాడు. ఆయనా

ఉన్నారు. కొందరన్నారు: మనమల్లా కొత్తవాళ్లంతా పాతవాళ్ళూ, అని. దీన్ని కొందరు ఆక్షేపించి పారేశారు. మనమల్లా కొత్త బియ్యోపాసకులూరో బియ్యే పాసయి మనమల్లా కొత్తా? గో ఎల్లాగేమిటి తేలడం? అని. కొంతకొంతమంది సకృత్తుగా పాతవారితో బయలుదేరి కొత్తవారితో పాసయారు, భోజనానికి నాన్నతో కూచుని అమ్మతో లేచినట్టు. వీర్ని ఎందులో వేయాల్లో ఆలోచించవలసిన విషయమే. పోనీలెండి, 'పాతకొత్తలేమిటికి సువస్తువులకు'; వారూ సోదరులే గనక, ఆ సంగతి వార్నే అడుగుదాం, 'పాతయముడివా, కొత్త యముడివా' అని.

విభజనాలంటే త్రాహి త్రాహి అవుతోంది కాని, ఈ రెండుపక్షాలకీ తేడా చాలా ఉంది స్మండీ. ఖాటంగా ఉంది.

పాతవారు Detailed బియ్యేలు; కొత్తవారు Nondetailed బియ్యేలు. Tail మాత్రం ఇద్దరికీ ఉంది. పాతవారు పాసైనప్పుడు బియ్యే అంటే ఇంకా కొత్తగా ఊరుకునేది. సిపాయి మ్యూటినీ సంవత్సరం కాకినాడలో ఒకాయన బియ్యే పాసవగా ఆయన్ని ప్రతివాడూ బియ్యేగారు అంటూ హెచ్చరించడమే కాదు, మేనాలో కూచోబెట్టి ఊరేగించారట. ఈ కాలంలో బియ్యేలు ఊరేగించేవాళ్లు లేక, ఉద్యోగాల కోసం తమరే ఊరేగుతున్నారు. వెనకటి బియ్యేలకి సంసారగోష్ఠి ఉండేది. ఇప్పుడు, బియ్యేలు మామగారు హెచ్చుతగ్గుగా మాట్లాడితే పెళ్లాన్ని వదిలిపెట్టేస్తారు; పెళ్లానికి చదువు తక్కువని తమరు బియ్యే పాసవడంతోటే వదిలి పెడుతున్నారు. అసలు పాతబియ్యేలు కట్నాలు పుచ్చుగునే పెళ్లిళ్లు చేసుకున్నారు. కొత్తబియ్యేలు కూడా కొంతవరకు పుచ్చుకున్నారు కాని వ్యాపారం అప్పుడే ఎదురుతిరిగిపోతోంది. ఏమంటే, ఇప్పుడు పెళ్లి జోరుల్లో వరుడి తాలూకు నేలా, తోటా, రొక్కంసగదూ, జవాహిరీ, ఇవన్నీ కళ్లతో చూచి మరీ తాంబూలం ఇస్తున్నారు. (స్పష్టంగా కుర్రాడే సమస్తసుమన్నా. వెనకటివాళ్లు దేశభాషలకి శాస్త్రజంకేవారు. పాతబియ్యేలు జుట్టు పంచపాళీ లంగ చేయించడమే గొప్ప. తమ పిలక ఛేదించడం తమతల్లిదండ్రులకి శిరచ్ఛేదం అనుకునేవారుట. ఇంటిదగ్గర, వాళ్లు తెలుగే మాట్లాడేవారుట. కాని, కొత్తబియ్యే జోడిగుండు అయితీరాలి. కాకపోతే, వాడికి సివిలిజేషన్ లేదని అయినవాళ్లు ఏడిపిస్తారు. ఆమధ్య బియ్యేలు, మీసాలు సమూలంగా లాగించేసేవారు, కాని కొందరు కొత్తబియ్యేలు, అదేదో స్కాచ్ సాంప్రదాయంట, ముక్కు కింద ఒక్కొక్క పెద లెక్క నాలుగేసి వరకలు చొప్పున మాత్రం అట్టిపెడుతున్నారు. ఈ సభలోనే ఉన్నారేమో, ఒకవేళ అట్టివారు. వారికి ఏమీ ఫర్వాలేదు. Exemption ఇచ్చేద్దాం. కొత్తబియ్యేలలో చేతికర్ర లేనివారూ, సిగరెట్టు పెదవులతో కాల్చనివారూ అరుదు. వీలయితే, ఒక చేలానికూడా తీసుకుపోతూ, వాడితోటి, తమకి ఎంతమంది నమస్కారాలు పెడుతున్నారో, తమర్ని 'ఏమండీ' అని ఎంతమంది అంటున్నారో చెబుతూంటారు. కొత్తవాళ్లకి రిఫరెన్సులు ఎక్కువ. పాతబియ్యేలు

విస్తారంగా పట్టి భట్టీపడ్డులుట. హిస్టరీ, జాగ్రఫీ, ఇంగ్లీషు దేశీలూ గళగ్రాహిగా వచ్చేట్టు వాళ్లు కవిత్వాలు కూడా చేసుగుని వల్లెవేసి ఆట్టే పెట్టుగునే వారట; తమకు తెలిసే ఉండవచ్చూ!

నవత్ర హేస్టింగ్స్ న అమాచ వాలీస్
నవత్రి జాన్ షోర్ నవప్ట నింగ్టన్,
అసూప బార్లో అసూస మింటో
అయేత్రి మోమిరా అద్విత్రి అమ్హరెస్ట్.

(ఏ-అంటే ఒకటి, ద్వి - అంటే రెండూ చొప్పున తొమ్మిది దాకా చూసుగుని, సూ-అంటే సున్నా అనుకుని, అన్నింటికీముందు ఒకటి చేరుస్తూంటే ఈ ప్రభువులు పరిపాలన సంవత్సరాలు చక్కా వస్తాయి.)

అవునా, తెలుగు సంస్కృతాల్లో విశేష ప్రజ్ఞ ఉండడంవల్ల వాళ్లు అల్లా ఎక్కువ చేసుకునే వారు ధారణ. కొత్త బియ్యేలకి సంస్కృత ప్రాకృతాలు Greek and Latin; తెలుగులో గుణింతాలే చాలామందికి రావు. ఊఁ, పాపం, పైవారు వద్దయ్యా పోశ్ పొమ్మన్నారు. ఇక, సంస్కృతం మాట్టాడ్డం అనేది బూతులకి గౌరవనీయ ప్రయోగంగా అంటూంటారు; 'సంస్కృతంవద్దు, తిన్నగా మాట్టాడు, అని. ఇంటి దగ్గఱకూడా ఇంగ్లీషు. కాదు, అన్నట్టు, ఇంటి దగ్గరే ఇంగ్లీషు. అన్నం ఒడ్డిస్తూంటేకూడా కొందరు Enough, That will do,That will do అంటూంటారు. ఏమన్నా అంటే,తమరికి ఇంగ్లీషులోంకి మల్లే తెలుగులో వెళ్లదంటారు,జిహ్వా కలంకూడాను. కాని, దీనికి తగ్గట్టు ఒకొక్క కొత్తబియ్యే అనర్గళంగా తెలుగులో కవిత్వం చెబుతూంటాడు. కొంతకొంత ఇంగ్లీషు వచ్చిన తెలుగు వాడికి కొఱుకు బడుతుంది. ఆ తక్కింది ఏం వచ్చినా సరే తెలియదు. తెలిస్తే మజాలేదు; అందుకనే అచ్చేసి పారెయ్యాలని కొందరు,

సరి, పాతవారు సంపాదనలో గట్టివారు. కొత్తబియ్యేలు ఖర్చుపెట్టడానికి మార్గాలు నేర్చుకుని సిద్ధంగా ఉండేఘనులు. పాత బియ్యేలకి అంతా శబ్దప్రమాణమే. చదివిందీ, చెప్పిందీ, నమ్మేశేవారు. చాలా Experiments black-board మీద చూసేవారు. కొత్తవాళ్ళకి అంతాఅనుమానమే, అంతా ప్రత్యక్షమే. పాత బియ్యేలు, తమరు మూఢులనీ, చెప్పేవారు గొప్పవారనీ నమ్మకంతో చదివినవాళ్లు. కొత్త బియ్యేలు తమంతవారు లేరనీ, చెప్పేవాడు మూఢుడనీ దూసుకుపోయి సుడివల్ల ప్యాసై శనమీదికి కొట్టుగొచ్చాడనీ విశ్వాసంతో చదివినవాళ్లు. ఎక్కడికేనా వెడితే పాతబియ్యేలకి seats reserved; కొత్తబియ్యేలకి f. s. కొత్తబియ్యేలు స్వనాపితులు selfshavers; పాతవారు పరతంత్రులు. పాత బియ్యే moderate; కొత్తబియ్యే Extremist, లేకపోతే Independent. పాతబియ్యేది మెరకపంట(అనగా, వ్యాఖ్యానం. అతడు Jack of all trades). కొత్తబియ్యేది లంకపంట (అనగానున్నా ఒకటేపట్టుగుని చదివెయ్యడం.) పాతబియ్యేలు చాలా మట్టుకు కలిసివెళ్లి చిట్టచివరకి చీలిపోయేవారు. కొత్తవారు మొదటే చీలిపోయి బయలుదేరుతున్నారు.పాతబియ్యేలు,తద్దినాలు

తిథులు చూసుగునే పెట్టేవారట. కొత్త బిడ్డ్యో వీలయితే తద్దినం పెట్టనే పెట్టడు. మరీ వీలులేకవస్తే, సరియైన క్రీస్తుశకం చూసుగుని పెడతాడు. (లేకపోతే large Scale మీద summer vacation లో పెడతాడు.) వెనకటి వాళ్లు తర్పణాలు నీళ్లతో వొదిలేవారు. కొత్త బిడ్డ్యోలు, ఉదయం కాఫీ, సాయంత్రం టీ, జుహోమిస్వాహా అంటారు. పాత బిడ్డ్యోలకి గణ్యత సమానంగా ఉండేది. కొత్తబిడ్డ్యోలకి గణ్యత, చదివిన శాస్త్రాన్ని బట్టి వస్తోంది. Double decomposition లాంటి తలపారాప్పులు చేయగల science బిడ్డ్యో సమర్థుడు. ప్రతీ వాళ్లకీ Wanted. పారమార్థిక చింతలో పరిశ్రమ చేసే philosophy బిడ్డ్యోవట్టిపోబయ్య. ఎవ్వరికీ అక్కర్లేదు. (ఒకాయన చెప్పినట్టు Don't wanted). అందుకనే, "మీరు ఇంతాచేసి కేవలం philosophy graduate లా ఉన్నారేమిరా?" అనేమాట నిల్చిపోయింది. పాత బిడ్డ్యోలు fountain pen లు ఎరగరట. కొత్తవారు అవీ ఎరుగుదురు, 'దస్తూరీ స్వహస్తం'కూడా ఎరుగుదురు. పాతవారు దెబ్బలాట వస్తే ఓకొమ్ముకాసి, కావలిస్తే ఓతడాఖా తీసేవారుట. కొత్తబిడ్డ్యోలు, చిలిపిజట్టీలూ వెకిలి అల్లరితో ఆగుతారుకాని చేయి చేసుగోరు. పాతబిడ్డ్యోలు వినయవిధేయతలతో చదువుకుని ప్యాసై పదపడి అధికారులైనవాళ్లు. కొత్త బిడ్డ్యోలు, పాసురత్వంగల పండితులమీదఅధికారం ముందే చలాయిస్తూ చదవి ప్యాసయింతరవాత తమరుఎక్కడా చలామణీకాకపోడం అనుభవించి అప్పుడు వినయవిధేయతలు తెచ్చి పెట్టుగుంటున్నారు. కొత్తవారు చందాలు పైలాపచ్చీస్‌గా వేస్తారు, పాతవారు సణుగుతూ ఇస్తారు. కొత్తవారికి, 'నాకు తెలుగులో మొదట్నించీ Taste లేదండీ' అని చెప్పుగోడం fashion. పాతబిడ్డ్యోలు సాలుకి రెండు పరీక్షలు ఎరగరు. కొత్తవాళ్లు సాలుకి రెండు పరీక్షలు చూస్తున్నారు. ముందువాళ్లు మూడు కోరతారేమో అనుమానం. వెనకటి వాళ్లకి పరీక్ష ప్రశ్నలు చెప్పేసే వారుట, పంతుళ్లు. ఈ బిడ్డ్యోలు డబ్బెట్టి కొనుక్కోవలసి వస్తోంది. కాబట్టి, వెనక, ప్రశ్నలు కొందరికే ముట్టేవి. ఇప్పుడు అందరికీ ముట్టచ్చు. వెనకటి బిడ్డ్యోలు రాత్రి చదవకుండా తెల్లవారు ఝామున చదివి ప్యాసయారు. కొత్తవారు రాత్రెల్లా చదివి ఫేలవుతారు. వెనుకటివాళ్లది చల్లని చదువు, తరవాణ్ణి brand. కొత్తబిడ్డ్యోలది ఘాటుచదువు, Lipton brand,, కారాకిల్లీ brand, లేకపోతే Scissors brand. పాత బిడ్డ్యోలకి Retentivity ఎక్కువ, కొత్తవాళ్లకి Coercive power ఎక్కువ. పాతబిడ్డ్యోలు మూలం చదివి హానిహానిగా Criticism చేసేవారట. కొత్తబిడ్డ్యోలుమూలం తెలియకుండా Criticism వ్రాసే నేర్పు మొదట్నించీ సంపాదిస్తున్నారు. అందుకని వీరిలోకొందరు—కొందరేమిటి మళ్లా వెల్లిమాట - అందరూ కూడా ఒరిజినలే. కాదు aboriginal. పాతబిడ్డ్యోలు ఖాళీగా ఉండడం ఎరగరు. కొత్త బిడ్డ్యోలకి అంతా Leisure ఏ. Educated వాళ్లల్లో Unemployment గురించి ఆలోచించవలసిన బాధ్యత పాతబిడ్డ్యోలది, వారు కొంచెం గట్టున ఉన్నారుగనుక.

ఇల్లాంటి చిహ్నాలు వీరివారల్లో ఉన్నా అంతా ఒక్కటే కోవా గనక అందరూ కలుసుకోడానికీ, కొంతకాలం కలిసి గడపడానికీ, ఏర్పాట్లు చెయ్య వలసింది. ఇప్పుడీ ఊళ్లో తప్ప ఈసమావేశం సంగతి తక్కిన వారికి తెలియనే తెలియదు. ముందు శరీరం గనుక ఒక్క భోజనమైనా ఏర్పాటు చేయవలసింది. (ఆతరవాత ఇది చేశారు.)

పాతబియ్యాలు కొత్తవారి సమస్య మనస్సులో పెట్టుగుని వారికి ముక్తిమార్గం చూపించాలి. కొత్తవాళ్లు, ఆర్యధర్మాలూ, హిందూమతం, తెలుగుభాషాలాంటివాటికి, ఈపాటికి, కొంచెం దుమ్ము దులిపి, మనం ఎవరమో ఆ మాటకుడా కాస్త, వెనక్కితిరిగి చూసుగోవలసిన తరుణం వచ్చిందేమో, మరి! నమస్కారం.

సంపూర్ణము

శ కుం త ల

(హరిబ్రహ్మేశ్వరులు)

ఎఱుఁగవె కణ్వాశ్రమము హెచ్చగుమామరి చూదపెంపు నీ
వెఱుఁగవె నాదునెచ్చెలుల నింపొనగూర్చెడి లేడిపిల్లలన్
మఱచితివా గులాబులును, మల్లెలు, జాజులు గల్గు తోఁటలున్.
మఱచితివా నను గనిన మాటను సైతము రాజపుంగవా!

* * * *

సంపెఁగచెట్లకున్నడుమఁ జల్లనిగాడ్పులు వీచువేళ లాం
లింపుచు గోరువంకల చలింపనినాదుమనంబునందు సై
రింపఁగలేనిమార్పు నిగురింపఁగఁజేయు నృపాలుఁ డిట్లనన్
జెంపలు వైచికో నలగె చేష్టలుదక్కె సతీప్రపంచముల్.

* * * *

కలదు పవిత్రగర్భ నినుఁ గన్నసతీమణి; యామెచూడఁగాఁ
గలదు సుతుండు వీని; కని గౌరవపద్ధతి నీకుఁ జెప్ప; నా
వలను మదీయవాక్యములు బాగుగనుండునో లేదొ నీదు వీ
నుల; క నియోచనల్గలుగ నోమనుగా భవదీయహృద్గతిన్.

నిజమును జాటిచెప్పియవనీపతి వీవని పౌరులెల్లరున్
రుజువులు నీకుఁ జూపుతఱి రోషముతో భవదీయసత్సభన్
రుజువును జేయనౌనె యొక రోజున నీవు ననుం గ్రహించి యా
రుజువును జూపుమంచని యెఱుంగనియట్లు వచించు న్యాయమున్

* * * *

కోరంబోను త్వదీయరాజ్యసుఖముల్ కోర న్మహేంద్రత్వముం
గోర న్వైభవ మింతయేనియును నీకు న్నాకు జన్మించు నీ
కూరుం గైకొని నీదుదాస్యమున నిర్జ జొప్పించుకొ మ్మింక నా
భారం బీవు గ్రహించి భర్తవగుదో భాగ్యంబు నాకద్దియే.

*　*　*　*

నాకమునందుఁ దల్లికసి నన్నటవీస్థలిఁ బారవేచెఁ బా
నేకతమందు దీక్ష జపయించుచు మజ్జనకుండు రాఁడు నా
కైకడు ప్రేమఁ జూపు సలకద్భునిశిష్యులు వీడినారు నే
నేకరణి న్భవద్వచన మిట్లు వినంగలదాన భూపతీ!

కన్నీరా యిఁక రమ్ము రాజునకు నిక్కాఠిన్యమున్ మాన్పెదో
మన్నాథుం గని సత్యముం దెలిపెదో మందజ్ఞతం దెచ్చు రా
జ్యౌన్నత్యంబును బాపి జ్ఞాపకము సేయం జాతువా యవ్వనిం
నన్నేరీతి వరించి పెండ్లియయి యీ నాఁ డిట్లుసంగల్గెనో!

*　*　*　*　*

కల్లలాడిన రాజేంద్రు కలుషమునకు, బాసలను పీటఁబుచ్చిన ప్రభుగుణమున
దేశ మేరీతిఁ గష్టించి తీరవలెనో, న్యాయ మెప్పుడు స్థాపించు హాయిగలదొ?
రాజుహృదయంబు కరఁగదు రాతివోలె, స్వార్థిశయమున జ్ఞాపకశక్తి వీడె
అబలనగు నాకు దిక్కింక నవని లేరు, తల్లి మేనక రావమ్మ యల్లునిఁగన

*　*　*　*　*

నిన్ను నన్నుఁ గూర్చి నిర్ణయించెడువాఁడు, ఉన్నవాఁడు దేవుఁ డున్నవాఁడు
ఎన్నఁడైన నీవు నన్ను నొప్పించి నేఁ, డన్నమాట మార్చ నున్నవాఁడు.

(శకుంతల)

బ్రతికియున్నాఁడు పుడమిపై భరతుఁడొకఁడు, నీదు సూనుండు భయమింక లేదుతల్లి!
భావియుగశక్తి భువిఁదాల్చు వానిపేరు, రాజమాతవుఁ దగదు ధైర్యంబు వీడ

(భరతుఁడు)

మెఱుపుతీఁగవోలె మేనక యరుదెంచె, పుత్త్రిఁ బుత్త్రిపుత్త్రు బుజ్జగించె
నాకనమ్మువంక నరిగి రా ముప్వురు, జ్ఞప్తివచ్చె, రాజు చాలనొచ్చె.

(సూతుఁడు)

సంపూర్ణము

పొదిలెసీమ దండకవిలె

వేమూరి విశ్వనాథశర్మగారు

ఇది ప్రాచీనగ్రంథము; పొదిలెవాస్తవ్యులు యల్లమరాజు మహాలక్ష్మమ్మగారి దగ్గర నున్నది. చూచుటకొకపర్యాయము నాకా గ్రంథమునిచ్చిరి. ఆగ్రంథమున కొన్ని ముఖ్యాంశములు నిందు వ్రాయుచున్నాను.

ఈ గ్రంథము పూర్వపు దండకవిలెను బట్టి యల్లమరాజు ముద్దప్ప వ్రాసుకున్న నకలు. ప్రతిపుటమీదను అతని వ్రాలున్నది. గ్రంథాదిని యిట్లున్నది: "పొదిలెశీమకు స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౭౨౮ అగు నేటి అక్షయసంవత్సరం వరకు పూర్వపు మిరాశీలు, స్థాహులు, గ్రామాంతరాలు, మజరాలు దేశీలు పూర్వపు దండకవిలె ప్రకారం వ్రాశ్నెదండకవిలె వేసట పడ్క-చూస్తె తెల్సిని"

ఈ దండకవిలెయందలి విషయసూచి యిట్లున్నది:

గ్రామాలు మజరాలుతో మిరాశీలు వ్రాశ్నె జాబితా, దేవళాలు, మశీదులు, ప్రభవ ఆరభ్యముగా క్షయ వరకు నేటేటి శిస్తులు ముక్తసరుగా ఘుడ్తీల ప్రకారాన వ్రాశ్నెది. ఆయాగేండ్లను నడ్చిన కమాలీసు. ధారలను రాచకార్యాలను వ్రాశ్నెది.

కావలివాండ్ల వివరం

చెర్వులజాబితా

కొండలు, కోటలు

దేశపాలిమేరలక్షణం

వాగులజాబితా

స్థలకరణాల వంశావళి

పెమ్మయశింగధీమంతోవంశం

గోలకొండపోయినదినం

కర్నాటకపువారు, రాయలవారు దానపత్రాలువ్రాసేలక్షణం

వైష్ణవులకువ్రాసేది

శైవులకువ్రాసేద

బ్రాహ్మలకువ్రాసేద

సన్యాసులకువ్రాసేది

భిక్షువృత్తివారికి వ్రాశేది

శూద్రలకు ధర్మానకువ్రాసేది

చతుర్యుగాల ప్రమాణాలు

పొదిలె స్థలకరణాలవంశావళిన్ని శిలాశాసనాలున్ను ఆయావూళ్ల క్రింద ఆకులు వ్రాశ్నెద.

పంచాగ్నులవారివంశావళి

రాపెలవడ్డిపాటివారివంశం

గజపతివారిబంధులు సంబురాయనివారి సాంప్రదాయం

ఖురుముపాదుషావారిపిడిలు

గోలకొండవారి పిడిలు

శిలాశాసనాలుతాలూకు

పర్మానావ్రాశేలకుణం
మాదన్న అక్కన్న గారికివ్రాశేపద్దులు

ఇవిగాక మరికొన్ని చిల్లరవిషయము లున్న యీ దండకవిలెయందున్నవి. పొదిలె సీమలోని ప్రతిగ్రామముయొక్క హద్దులేర్పడిన కాలము, హద్దులేర్పరచినరాజు, వాటివిషయమై అప్పుడప్పుడు జరిగిన తగాదాలు ఆ యా గ్రామములలోని మిరాశిదార్లు, కరణాలు, కాపులు, సభాపతులు, పురోహితులు, వడ్రంగి, కుమ్మరి, వెట్టి మొదలగు గ్రామచాకర్లు ఏయే కుటుంబమువారికి చెందవలసినది తెలుపబడి యున్నది.

ఇవిగాక ఆ యా గ్రామములలోనుండిన శిలాశాసనములకు నకళ్లుయెత్తి వ్రాయబడినవి. ఇందు కొన్ని దొరతనమువారి శాసనాన్వేషణ శాఖవారికి లభింపనివికూడ కలవు.

పొదిలె సీమలోని గ్రామములయొక్క పొలిమేరలు చాలకాలముక్రిందనే నిర్ణయించి నట్లు తోచును. ప్రతిగ్రామమునుగూర్చియు ఈ విధముగవ్రాసియున్నది:—

"మూగచింతల సముతు పెదారికట్ల పరగణె మహల్ పొదిలె సర్కారుఖంమ్మం శాలివాహనుడు పూర్వమందు హద్దులు యేర్పరచినప్రకారం శకవర్షంబులు ౧౦౪౫ అగు నేటిసిద్ధార్థినామ సంవత్సరమందు రామదేవ మహారాయలుగారు బండ్లమీద శిలాశాసనాలుతెప్పించి నిర్నయముచేసిన ప్రకారము పొలిమేరహద్దులు" దీనినిబట్టిచూడగా పొదలెసీమలోని గ్రామములయొక్క సరిహద్దులు రమారమి వేయిసంవత్సరములక్రిందట నిర్ణయించినట్లు తేలుచున్నది. అప్పటినుండి మొగలాయీల హయాములోకూడ నెల్లూరి మండలములోని కొన్నిభాగములు కంభము సర్కారులోనుండినట్లు తెలియుచున్నది.

నెల్లూరుజిల్లాలో దేశపాండ్యాలకు స్థలకరణాలనిపేరు. పొదిలెసీమ స్థలకరిణీకెము పెమ్మయసింగధీమణీ వంశమువారిది — యల్లమరాజువారు, పోలమరాజువారు, అన్నంరాజువారు, శివరాజువారు. ఈ నాలుగుకుటుంబములవారు సగోత్రీకులు. పురుషపుణ్యములు గలవు. ఈసంగతి దండకవిలెలో "పొదిలెశీమకు స్తలకరిణెకము పెంమ్మయ శింగయధీమణి వంశమువారు. అంత్తా వక్కరుదుటివారు, శివ్వరాజువారు, యల్లమరాజువారు, పోలమరాజువారు, అన్నంరాజువారు" అనియున్నది.

పొదిలెసీమ స్థలకరిణీకెము సంపాదించిన విధాన మీ దండకవిలెలో నున్నది. "...ఆతర్వాత గజపతికి కటకమనేపట్నం, అశ్వపతికి ఢిల్లీపట్నం, నరపతికి విజయనగరంకూడా మూడ సింహాసనాలు యేర్పడెను. వోరుగల్లు పోయినతర్వాత నియ్యోగులకు యక్కడ నిర్వాహకంలేక వున్నగాను గజపతివారిని నియ్యోగి గోపరాజు రామన గజపతికివిన్నపం చేసి అప్పటికి శూద్రకరిణీకెలు ఉన్నగా అవి పరిహరించి నియ్యోగులగుకొందరికి స్తళకరిణికెలున్ను కొందరికి గ్రామకరిణీకెలు యిప్పించెను. పెమ్మయ శింగధీమణి వముశమువారికి పొదిలె శీమకరిణీకెము యిప్పిస్తే గజపతివారినాడున్ను ఆతర్వాత యిమ్మడిరాయలు, రామదేవరా

అంబ్బదేవరాయలు ప్రౌఢదేవరాయలు దనకా పెద్దలు మిరాశి అనుభవిస్తు ఉండి రామరాజు యల్లమరాజు కుమారుడు కొండ్నమరాజుగారు సాళువ నరసింహారాయలు క్రిష్ణరాయలుఅచ్యుతరాయలుగారిచేత తాళిచవుకట్లు, పచ్చలకడియాలు, అందలము మొదలయిన సకలబహుమానములు అంది పింగళిసూరన్నచాత నిర్మమాంపురాణము అనే ద్విపదకావ్యము కృతి అంది అచ్యుతరాయలువారు రాజ్యంచేస్తు ఉండ్నగా వారిబంధువులు మనుబోలి చాలుక్యుడు రాయలవారికి విన్నపంచేశి తొండమారయగుళ్లకు ప్రతినామమయిన కంభముశీమకు స్థళకరిణీకె మిరాశి యిప్పిస్తె పలుదినములు అనుభవిస్తు ఉండ్నగా ఆపూర్వపు మిరాశిదారులు వేముపల్లెవారుయడవపల్లెలో ఉండ్నగా యడుపల్లెవారు తమకు మిరాశిఉన్నది. పడిపోయినది ఉద్ధరించినావని కొండ్నమరాజుగారు...సగము స్థళకరిణీకెము పాళ్లుచేసుకొని పూర్వానడిచే అగ్రహారముమ్న యిరుపుట్టి యిద్దుం కంభంచెర్వుకింద మడిన్ని మేర ఖ౧కి మూడుమాని కెలుత వ్వోడు నడుస్తువుండ్నగా యిటీవల కొండ్నమరాజు యిరుపుట్టిమడిన్ని రట్లపల్లె అనే గ్రామం అగ్రహారం సంతరించి మడిమేర రవేసులు అగ్రహారాలుచేరి సుఖాన అనుభవిస్తు రాయలవారిదినములు బహుదినములు ఉండ్నగా రక్తాక్షిసంవత్సరాన రామరాజయ్యవారు చనిపోయిన వెన్క శా. శ. ౧౫౦౩ అగు నేటి విక్రమసంవత్సరాన మహమ్మదు ఖుల్లిషాదుషాగారు మిట్టదొడ్డి రాయరాయలు అశ్వరాయనిగారిని పంపున ఉద్ధరిస్తె కొండవీడు, బెల్లంకొండ, నాగార్జునికొండ మొదలయ్న నాలుగు గిరిదుర్గాలున్ను పధ్నాలుగు ముజాఫలున్ను ఆక్రమణచేసిరి.”

కొన్ని శిలాశాసనముల యొక్కయు, తామ్రశాసనముల యొక్కయు నకళ్లున్నవని పైని తెలిపితిని. నెల్లూరుజిల్లా కూచిపూండితామ్రశాసన మొకటి సృష్టించినదని వేణుగోపాల శెట్టిగారు తమ నెల్లూరుజిల్లా శాసనావళిలో తెలిపిరి. ఇది శా. శ. ౧౨౭౦ అచ్యుతదేవ మహారాయలది. సృష్టియని కొట్టివేయుటకిది యేకారణము. ఈ తామ్రశాసనముయొక్క నకలు దండకవిలెలోనున్నది. కాబట్టి కూచిపూండిశాసనముసృష్టియే అయినయెడలమిక్కిలిప్రాచీనమైనసృష్టియని తేలుచున్నది.

ఇదివరకు దొరికిన శాసనములలో శ్రీనాథునిపోషించిన తెలుగురాయని వంశావళిదొరకలేదు. దండకవిలెలో తెలుగురాయని వంశస్థులపేర్లుగలవు. “గజపతివారిలోను తెల్గురాయనివారివంశం సోమవంశం రాజులు—

సాళ్వకంపరాజు. అతని కుమారుడు
మంగరాజు. అతని కుమారుడు
కుమారమంగ. అతని కుమారుడు
పురుషోత్తమ. అతని కుమారుడు
చినకంప్పరాజు. అతని కుమారుడు
సంబరాజు. అతని కుమారుడు
తెల్గురాయడు.

ఈ తెల్గురాయనిగారు ఆముదాలపల్లె బసువమ్మకు సుంకరచెన్న అగ్రహారం యిస్తే

ను శివపురము అని పేరుపెట్టుకొని శివభక్తులకు నిత్యకృత్యమున్ను ధర్మంచేస్తు బహుదినములు నడ్పించుకొని దేవళాలముందర యీ వివరం శిలా స్తంభాలమీాద వున్నది.”

ఈ తెలుగు రాయలకు సంబంధించిన శిలాశాసనముయొక్క నకలు దండకవిలెలో నున్నది:—“తెల్గురాయలశాసనం వీరివంశము వారు తిప్పలదేవిపల్లె పొలాసప్రాన్ని శిలాశాసనం॥ స్వస్తి శ్రీకరంబులు ౧౩౬౦ అగునేటి కాళయుక్తి సంవత్సర వైశాఖ శు 3 భాను వారం పుణ్యకాలమందు సోమవంశోద్భవుండు ఆత్రేయగోత్రుండు శ్రీమన్మహామండలేశ్వర మేదినీ మీా సరగండ కఠారిసాళువ ధరణీవరాహుండైన పెదసంబురాయఠణ్ణోసాల తనయుండు శ్రీమన్మహా మండలేశ్వర మేదినీ మీా సరగండ కఠారిసాళువ ధరణీవరాహులైన తెలుగురాయని గుండభూప గోవిందయ్యా సాలానుజుండైన పెదరాయ విఠాలయ్యా. నుత। తిప్పలదేవి సూర్యవంశోద్భవుండున్ను కాస్యపగోత్రుడైన తనపతి జగతాటిశింగయ్యా పాలకున్ను తన తనయుడు తిమ్మయ్యాసాలకున్ను తన మాతృపితృవంశం వారలకున్ను పుణ్యంగాను ఆంకేపల్లె గ్రామమందు తటాక ప్రతిష్ట ధర్మశాసనం ఆచంద్రార్కస్థాయిగా నొసరించెను. పోలమరాజు గుర్వరాజు వ్రాసినది.”

ఇట్లు విజయనగరాధీశ్వరుల కొన్ని శాసనములకు నకళ్లున్నవి. ఇవిగాక నెల్లూరి సీమలో కొన్నిచోట్ల మొగలాయిలకు హిందు వులకు జరిగిన పోరాటముల వృత్తాంతములు గలవు. మొత్తముమీాద ఈ పొదిలె సీమదండకవిలెయందు కొన్ని ముఖ్యమగు చరిత్రాంశములు గలవని తోచి పై విషయములు వ్రాసి పంపితిని.

ఆ శీ స్సు

పంద్యారం వెంకటసుబ్బయ్య గారు (యువకవిమండలి)

సాగరుడు

వక్రగామినివి!

కృష్ణ

అగుదు దేవా! క్షమించి
ప్రత్యూషః ఫుల్ల పుష్పప్రభావవిత్ర
చిత్తమును జూచి నామీాదః జిలకరింపు
త్వద్దయాంబు శీకరములు;

సాగరుడు

ధన్యవీవు
విమలతావాహినీ పురావృత్తములను
మఱచి సంతప్తవయితివి మామకీన[ఱకుః
హృదయమును దొట్టి బ్రహ్మపూర్వీథి న
గనఁబడుచునుంటివీవ; నాకన్నుఁ గవకు.

కృష్ణ

ఔను, మీాయీావిశాల హృదంత రమ్ము
గాక చాలిన చోటేది నాకు?

సాగరుడు

నిజము
నీవుగాక మదీయ ప్రభావ మెఱుఁగ
జాణ లెవ్వరు? నిత్యకల్యాణి వగుము!

మిత్రహితోపదేశము

మంగిపూడి వేంకట శర్మ గారు

(మూఁడవసంపుటము, ఎనిమిదవసంచిక తరువాయి)

కొదువేమున్నది మాకు నందనుఁడు వెల్గన్ గొప్పవిద్వాంసుఁడై
సదనంబందును లోటుగల్గదు సమస్తం బీశ్వరుం డిచ్చె నె
మ్మదిగాఁ గాలముఁబుచ్చవచ్చునని బ్రహ్మానందమున్ జెందు నీ
ముదుసళ్లన్ దలిదండ్రులన్ వెతలలో ముంచంగ ధర్మంబె నీ
మది నాలోచనచేసి వారవనితన్ మానంగదే మిత్రమా!

ఇది యే మాగడమోయి, నీవయసువారిల్లాండ్రతోఁగూడి బల్
పదిలం బొప్పఁగ నిల్లు దిద్దుకొనుచున్ వర్తింప నీవిట్లు దు
ర్మదవృత్తిన్ దలిదండ్రులన్ వ్యసనవారాశిం బడం ద్రోసి నీ
బ్రదుకున్ నవ్వులపాలు చేసుకొని దుర్వ్యామోహ విభ్రాంతిఁ గు
ల్కుదువా వారవధూటులన్ మరగి నీకున్ భావ్యమే మిత్రమా!

సదనంబన్నను దివ్యమందిరము, నీసంసారమో సర్వసం
పదలన్ గ్రాలుచు నింద్రవైభవమునన్ భాసిల్లు, నీభార్యయో
విదుషీలోకవతంస, మాపరమసాధ్వీరత్నమున్ గూడి మ
న్మథ సామ్రాజ్య సుఖానుభూతి మతి నానందింప కీభోగపుం
మదిరాక్షిన్ గవగూడినాఁడ విదియున్ మర్యాదయే మిత్రమా!

చదువుల్ నేర్చినదానికిన్ ఫలముగా జ్ఞానంబు నార్జించి నే
ర్పొదవన్ నింద్రియ దుర్మదం బడఁచి చిత్తోన్మత్తతన్ ద్రుంచి దా
రధనాదీషణ మోహమున్ గొనక వైరాగ్యంబునన్ మించుచున్
ముద మొప్పారఁగ ముక్తికాంతఁగని సమ్మోహించి క్రీడింప కీ
మదవారాంగనఁగూడ వేడుకపడన్ మర్యాదయే మిత్రమా!

కులమర్యాదఁ దలంపఁగావలదె, లోకుల్ కాకులై చేయు నిం
దలకైనన్ వెనుదీయఁగావలదె, యుద్యత్కీర్తులౌ తండ్రి తా
తలశీలంబు గణింపఁగావలదె, మాద్యద్భోగినీ కంజనే
త్రలపై మోహము మానలేక కులకాంతన్ జింతలన్ ద్రోసి కే
వలమూఢాత్మునిభంగి వర్తిలెదు భావ్యంబే సుధీరత్నమా!

గుప్తసామ్రాజ్యము

గూడా కృష్ణమూర్తి గారు

(క్రీ. శ. 320 మొదలు 413 వరకు)

ఆంధ్రమహాసామ్రాజ్యము, కుషానురాజ్యము ఒకే తరిఅంతరించినవి. ఇవి యంతమొందిననాటనుండి ఒకశతాబ్దమువరకు అనగా మూడవశతాబ్దచరిత్ర మన కేమియు తెలియదు. నాల్గవశతాబ్దమున మరల హిందూదేశచరిత్రప్రారంభమాయెను. దేశమంతయు ఒకనూతన ప్రకాశముచే నావరింపబడెను.

పాటలీపుత్రపరిసరమున ఒకానొక చిన్నప్రాంతమునకు రాజ్యాధికారియై ప్రఖ్యాతివడసి చంద్రగుప్తడనురాజు పరిపాలించుచుండెను. ఈతనికాలము నుండియే భారతదేశమున మరల ఐకమత్యము నెలకొల్పబడినది. ఈతడే గుప్తవంశపురాజులలో ప్రప్రథముడు. ఇతడు లిచ్ఛవీకన్యయగు కుమారదేవిని 308-వసంవత్సరమున పెండ్లియాడెను. లిచ్ఛవీతెగవారు నేపాళరాజ్యము నేలుచుండిరి. వీరినిగూర్చి అజాతశత్రువుకాలమునుండి మరల నీకుమారదేవివివాహమువరకును కూడ మరియెచటను చెప్పబడియుండలేదు. కుమారదేవిని వివాహమాడిన యనంతరము ఇతడు మిగుల విఖ్యాతిగాంచి మగధరాజ్యమందు గొప్పపదవిని పొందెను. మగధరాజ్యముఖ్యపట్టణమగు పాటలీపుత్రము తనభార్యతరఫున నుండు లిచ్ఛవీతెగవారి స్వాధీనమున నుండుటచే తానా సింహాసనమును వశపరచుకొనెను. తండ్రితాతలనాటినుండియు చిన్నరాజుగానుండి లిచ్ఛవులతో సంబంధబాంధవ్యము కలుపుకొనినతోడనే చంద్రగుప్తుడు రాజాధిరాజాయెను. ఈతనితండ్రి పేరు ఘటోత్కచుడు. తాత పేరుగుప్తుడు. చంద్రగుప్తుడు తననాణెములమీదతనయొక్కయు తనభార్యయొక్కయు, లిచ్ఛవుల యొక్కయు చిహ్నములను ముద్రించుచుండెను. ఇట్లే యీతనియనంతరమువారుకూడ చేసియుండిరి. ఇతడు మొదటిచంద్రగుప్తుడు. ఈతనిరాజ్యము గంగాయమునానదులసంగమస్థానమువరకు వ్యాపించెను. ఇందు తిరుహాత్, దక్షిణబీహారు, అయోధ్య మొదలగునవి చేరియున్నవి. ఇతనికాలమునుండియే ఒకనూతనశకముప్రారంభించెను. ఆనూతనశకప్రారంభవత్సరము, 29-2-320 మొదలు 13-3-321 వరకుయనిచెప్పెదరు. 321 వ సంవత్సరముననే చంద్రగుప్తుని పట్టాభిషేక మహోత్సవము జరిగెను. ఇతడింకను పదిహేనువత్సరములకు చనిపోవుటకు ముందే (౩౩౫) కుమారుడగు సముద్రగుప్తుడే తనరాజ్యమునకు రాజుకాగలడని యెరిగియుండెను. ఈసముద్రగుప్తుడు చాలవిఖ్యాతిచెందినరాజు. ఇతడు రాజ్యారూఢుడు కాగానే తనరాజ్యమును విస్తరింపజేయవలెనను నుద్దేశము కలిగియుండెను. ఈతనిరాజ్యకాలములో సగభాగము యుద్ధములతోనే గడచిపోయెను. ఈతని కీర్తిని, శౌర్యమును చాటుచు, ఇతని యుద్ధములనన్నిటిని శ్లాఘించుచు ఒకకవి సంస్కృతమున వర్ణించియుండెను. ఈవర్ణనలే పెక్కుచోట్ల అశోకుని శిలాస్తంభములందు చెక్కబడినవి. సముద్రగుప్తుని విజయములన్నియు నాలుగుభాగములుగ విభజింపదగును. దక్షిణమున పదునొకండుగురు రాజులను, ఆర్యావర్తమున తొమ్మండుగురు రాజులను, అడవిజాతినాయకులను, ప్రజలను, పశ్చిమోత్తరభాగమున నుండు కొన్నిస్వతంత్రరాజ్యములను ఈతడుజయించెను. విదేశజులతో సంబంధముగలదనికూడ వాడుక. సముద్రగుప్తుడు మొదట తనబలమును ఆర్యావర్తమునందుండు రాజులమీదకు త్రిప్పి వారిని జయించెను. ఆరాజుల నామములన్నియు మనకు తెలియవు. ప్రస్తుతము మహారాజా సింధ్యాయొక్క రాజ్యభాగమగు మార్వా(పద్మావతి) యనుచోట గణపతినాగుడను రాజు పాలించు

మండ నాతని సముద్రగుప్తుండు సంపూర్ణముగ నోడించెను.

అనంతరము దక్షిణముగా బయలుదేరి మహానది ప్రవహించెడుప్రదేశమున నుండుదక్షిణకోసలమును జయించెను అచ్చట మహేంద్రుడనునాతడు రాజు. దక్షిణముగా పోవుచు ఒరిస్సాప్రాంతమందలి అడవి జాతులవారిని దునుమాడుచు వారివారిముఖ్యనాయకులను బట్టుకొనెను. ఇంకను దక్షిణముగ వచ్చి పిష్టపురము (పిఠాపురము)వరకు జయించి, అనంతరము చెన్నపురికి దక్షిణమునసుండు కంచీపురము (కంచి) ప్రవేశించి అచట పల్లవరాజగు విష్ణుగోపుని జయించెను. తదనంతరము నెల్లూరుజిల్లాయందుండు పలక్కా (Palakka) రాజగు ఉగ్రసేనుని స్వాధీనపరచుకొని, పశ్చిమభాగమునుండి మహారాష్ట్రదేశముమీదుగా నిజరాజధాని కరిగెను *

ఇట్లు దక్షిణమున క్రీ. పూ. 348 మొదలు 350 సంవత్సరమువరకు నుండెను. ఈతడు తనరాజధానికి పోవునపుడు విస్తారము బంగారమును, ఇతరధనమును దోచుకొనిపోయెను. ఉత్తరమున గంగాబ్రహ్మపుత్రా డెల్టాప్రదేశములును, నేపాళము మొదలగురాజ్యములును, ఈతనికి లోబడియుండెను. పంజాబు, రాజపుత్రస్థానము, మాల్వా మొదలగుప్రజాస్వామ్యరాజ్యములను స్వాధీనపరచుకొనెను. దక్షిణమునసుండి ధనమునుమాత్రము కొల్లగొట్టుకొనిపోయెను. ఈతనిరాజ్యము తూర్పున కామరూపమునుండి పశ్చిమమున చంబల్ నదివరకును, ఉత్తరమున హిమాలయములనుండి నర్మదానదివరకును వ్యాపించెను. ఇతరరాజు లీతనికి సామంతులుగా నుండిరి (Subordinate alliance). ఈతనికిని కాబూల్ దేశమురాజునకును సింహళాధీశునకును కడుస్నేహము. మేఘవర్ణుడను సింహళరాజు ఇద్దరుబౌద్ధసన్యాసులను హిందూదేశమున కంపెను. వారచ్చటను నివసించుటకు చోటుగానక తిరిగి తమదేశమునకు బోయిరి. అనంతరము మేఘవర్ణుడు మరియొకసన్యాసికి పచ్చలు (gems) బంగారము మొదలగు నితర కానుక లెన్నియో ఇచ్చి సముద్రగుప్తుని కడకంపెను. సముద్రగుప్తు డాబౌద్ధుని రావించి గారవించెను. ఆతడు కోరినరీతిని బోధివృక్షమునొద్ద నొక బౌద్ధభిక్షాశ్రమము నిర్మించుకొనుట కనుజ్ఞ నిచ్చెను. మేఘవర్ణుడు అచట ముప్పది, నలువదియడుగుల యెత్తుగలిగి మూడంతస్తులు గల్గియున్న ఒకగొప్ప భిక్షాశ్రమమును నిర్మించెను. అయ్యది, యతి నేర్పుగ మంచిరంగులతో చిత్రింపబడి చక్కగ నలంకరింపబడినది. ఇందు సువర్ణరజతములతో జేయబడిన బుద్ధునివిగ్రహ మొకటియుండెను. ఏడవశతాబ్దమున హియాన్ త్సాంగు హిందూదేశమునకు వచ్చినప్పుడిచ్చట వేయిమంది బౌద్ధసన్యాసు లుండిరి. సింహళమునుండి వచ్చువారల నచట అమితమర్యాదతో సందర్శించుచుండిరి. సముద్రగుప్తుడు నానాదేశములను జయించి అశ్వమేధయాగము చేసి ఆయుత్సవసందర్భమున బంగారము వెండి విచ్చలవిడిగ పంచిపెట్టెను. రాతితో జేసినగుర్రము, అశ్వమేధయాగచిహ్నముగా నిప్పటికి లక్నో వస్తుప్రదర్శనశాలయందున్నది. సముద్రగుప్తునకు కవిత్వమన్నను, సంగీతమన్నను కడుప్రీతి. తనంత తానే కొన్నియుద్గ్రంథములను వ్రాసెను. ఎల్లప్పుడును జ్ఞానసంపన్నులసహవాసమున నుండుట ఈతని కెక్కువసంతోషము. ఇతనికడ వసుబంధుడను బౌద్ధభిక్షువు కలడు. ప్రజల నెల్లరను సౌఖ్యముగ పరిపాలించి రాజ్యమున శాంతిస్థాపించి రమారమి (335-375) నలువదిసంవత్సరములు రాజ్యమేలి ఇతడు క్రీ. పూ. 375 సంవత్సరమున చనిపోయెను. ఈతనిభార్యపేరు దత్తదేవి. ఈమె కుమారుడే యువరాజు. సముద్రగుప్తుడు తాను జీవించియుండగనే తనయనంతరము రాజుగా నుండుటకై ఈతని నియమించెను.

ఇతడు రెండవచంద్రగుప్తుడు. ఈతనికి విక్రమాదిత్యుడను బిరుదనామము గలదు. క్రీ. 376 సంవత్సరములోనే యీతడు పట్టాభిషిక్తుడయ్యెను. చంద్రగుప్తుడు రాజ్యారూఢుడగుసరికి రాజ్యాంగపరిస్థితుల నెల్ల నెరింగినవాడై తండ్రిసంపాదించిన రాజ్యమెల్ల నిలబెట్టి తండ్రిచే జయింపబడని రాజ్యములపై దండువెడలెను. మొదట మాల్వా, గుజరాతులమీదకు బోయి ఆ రెండురాజ్యములం గెల్చెను. అనంతరము శకులు అనగా పశ్చిమక్షాత్రపులు పాలించుచున్నసౌరాష్ట్రము లేక గుజరాతుమీదకు దండెత్తిపోయెను. క్రీ. 388 సంవత్సరముమొదలు 404 వ సంవత్సరమువరకు కీతడు యుద్ధ

* ఇటీవలి పండితాభిప్రాయముల ననుసరించినచో సముద్రగుప్తుడు దక్షిణమున కాంచీనగరమువరకు వెళ్లియుండలేదనియు, మహారాష్ట్రమున నడుగుపెట్టలేదనియు తేలుచున్నది. ఈవిషయములన్నియు ఇంకను చర్చనీయములే.

ములే సల్పుచుండెను. మాళవసౌరాష్ట్రముల జయించుటచే అరేబియా, ఈజిప్టు మొదలగు దేశములలో వర్తకము సాగుట కవకాశము కల్గెను. పశ్చిమక్షాత్రపులు రెండు వంశములవారు. మొదటివారు నాసికముఖ్యపట్టణముగ జేసుకొని మహారాష్ట్రము నేలుచు, క్రీ. శ. 126 సం. ప్రాంతమున, ఆంధ్రచక్రవర్తి యగు గౌతమీపుత్రశాతకర్ణిచే నోడింపబడిరి. రెండవది ఉజ్జయినిక్షాత్రపులు. వీరు ఉజ్జయినిని రాజధానిగా జేసుకొని మాళవము నేలుచుండిరి. మొదట చష్టనుడు దీనికి రాజు. అనంతరము క్రీ. శ. 126 మొదలు 150 వరకు మొదటి రుద్రదమనుడు రాజ్యమేలి, అప్పుడు ఆంధ్రలోకమును పరిపాలించుచున్న గౌతమీపుత్త్రునికొమారుడగు రెండవ పులుమావినోడించి గౌతమీపుత్రునిచే స్వాధీనముచేసుకొనబడిన క్షాత్రపరాజ్యముకూడ తనరాజ్యములో కల్పుకొనెను. ఈవిధముగా రుద్రదమనుడు పశ్చిమదేశమునకంతకు రాజ్యాధికారియయ్యెను. సముద్రగుప్తుడీ ప్రాంతము జయించకపోయినప్పటికి నిచ్చటి రాజగు రుద్రసేనుడు అతని జయములను గాంచి యాతనికడ కొకరాయబారి నంపెను. ఈక్షాత్రపులు విదేశజులగుటచేత స్వదేశాభిమానియగు చంద్రగుప్తుడు వీరలసంపూర్ణముగ నోడించెను. అప్పుడు రుద్రసింహుడు రాజుగా నుండెను. అనంతరము క్రీ. శ. 388 సం. న క్షాత్రపరాజ్యమంతయు గుప్తసామ్రాజ్యములో జేర్పబడినది. ఈవిక్రమాదిత్యుడు 40 సంవత్సరములు రాజ్యమేలెను. (375-415). ఈతడు శరీరదార్ఢ్యము గల్గి, రాజ్యమును విస్తరింపజేసి ప్రజలను సౌఖ్యముగ పాలించెను. ఈతని నాణెములమీద సింహములతో నీతడు స్వయముగ బోరాడు చున్నట్లు ముద్రింపబడియుండెను. 5-వ శతాబ్దమున గుప్తసామ్రాజ్యమునకు పాటలీపుత్రముకాక, అయోధ్య ముఖ్యపట్టణముగా నుండెను. సముద్రగుప్త విక్రమాదిత్యులకాలమున పాటలీపుత్ర మంత ప్రముఖత వహించనప్పటికి వీరితరువాత రాజులకాలము నుండి, ఆరవశతాబ్దములో శ్వేతహూణులనువారు వచ్చువఱకు ప్రాముఖ్యము వడసియుండెను. హూణదండయాత్రయనంతరము పాటలీపుత్రముయొక్క ఘనత తగ్గియుండెను.

ఫాహియాన్ (క్రీ. శ. 405-411): — అయిదవ శతాబ్దమొదటిభాగమున ఫాహియాన్ మనదేశమునకు వచ్చి, చంద్రగుప్త విక్రమాదిత్యుని పరిపాలనాక్రమమునుగూర్చి విశదముగా వ్రాసెను. ఇతడు చైనాదేశమునుండి వచ్చిన మొదటిబాటసారి. ఇతనివ్రాతలనుబట్టి చూచినచో చంద్రగుప్తుడు ప్రజల నెంతశాంతియుతముగా పాలించెనో, ప్రజాభివృద్ధిగోరి ఎంతసక్రమముగా పాలించెనో తెలియగలదు. ఇతడు పాటలీపుత్రమును ప్రవేశించి అశోకచక్రవర్తి రాజభవనమును గాంచి యయ్యది దేవతలచే గట్టబడినదా యని భ్రమించెను. అచటనుండుబౌద్ధమతపీఠములలో, అనగా బౌద్ధభిక్షువుల కొరకై కట్టబడియుండిన ఆశ్రమములలో మూడుసంవత్సరము లుండి అచటనుండు గొప్పగొప్ప, గీర్వాణభాషాప్రవీణులకడ సంపూర్ణసంస్కృతజ్ఞానమును, అట్టి ఆశ్రమజీవితమును బాగుగ గ్రహించెను. అచ్చట జరుగు ఉత్సవములను చక్కగ వర్ణించెను. జనులందరు అన్నవస్త్రములకు లోపము లేకుండ నుండిరి. ధర్మసత్రములును, బాటలవెంబడి విశ్రాంతిగృహములును విశేషముగ గలవు. ముఖ్యపట్టణమగు పాటలీపుత్రమున నొక గొప్పధర్మవైద్యశాల యుండెడిదట. ఇచ్చట బీదవారు, అసహాయులు వచ్చి వారివారి శరీరాస్వస్థతను కుదర్చుకొని పోవుచుండిరి అచటనుండి వైద్యుడు వీరల నెప్పుడు జాగరూకతతో జూచుచుండవలయును. సింధునదిని దాటి యమునానదిమీదనున్న మథురానగరము వచ్చునప్పుడు (రమారమి 500 మైళ్లు) త్రోవలో వేలకువేలు బౌద్ధభిక్షువులచే నాక్రమింపబడిన భిక్ష్వాశ్రమములను గాంచెను. ఈప్రాంతమున బాగుగ బౌద్ధమత మభివృద్ధి జెందుచుండెను. మథురనుండి దక్షిణముగానుండు మాళవము ప్రవేశించి, ఏవిధమగువ్యాకులములేక సుఖముగా జీవించు ప్రజలను జూచి సంతోషము పట్టజాలకపోయెను. వారికి ఏమాత్రము దొరతనమువారిచే నిర్బంధమగు శాసనములుగాని, ఎక్కువగా శిక్షవిధించుటగాని లేదు. ప్రజలను పీడించి వారినుండి ధనమును దీసికొనక రాజు తనయొక్క స్వంతభూములనుండివచ్చు రాబడినుండియే రాజకీయోద్యోగులకు జీత మిచ్చుచు రాజకీయవ్యవహారములను చక్కగ నిర్వహించెను.

సర్వసాధారణముగా ప్రజలు బౌద్ధమతాచారములనే యవలంబించుచుండిరి. ఏప్రాణిని హింసించరు. త్రాగుట మొదలగునవి ద్వేషించెదువారు. కసాయి దుకాణము లెచ్చటను లేవు. పల్లెవారు, వేటకాండ్రు కసాయివాండ్రును ఊరుబయట నుందురు. వీరు పట్టణములోనికి వచ్చునప్పుడు ప్రజలకు తెలియజేయవలెను. విక్రమాదిత్యునికాలమున బంగారు నాణెములు రాగి, వెండి నాణెములవలెనే ఉపయోగించెదువారు. బౌద్ధభిక్షువ్రేశమములకు దొరతనమువారు కొంతధనము నుచితముగ నిచ్చుచుండిరి. అపరిమితముగా దానధర్మముల జేయుచు అవసరమైనచో బౌద్ధసన్న్యాసులకు కావలసిన యిండ్లు, బట్టలు, తిండి నిచ్చుచు, పండుకొనుటకు తగిన సదుపాయములను జేయుచుండిరి. ఈకాలమున దారిదోపిడికాండ్ర బాధలేదు.

విక్రమాదిత్యుడు బ్రాహ్మణమతావలంబుడైనప్పటికిని, ఇతరమతముల నన్నిటిని సమాదరణబుద్ధితో జూచుచు మతసంఘర్షణ రాకుండ పరిపాలించెను. కాని యీతనికాలమున బౌద్ధమతము క్రమక్రమముగా క్షీణదశకు వచ్చి బ్రాహ్మణమతము మెల్లమెల్లగ నభివృద్ధిజెందియుండెను. కొన్ని ప్రాంతములలో జనసంఖ్య తక్కువగానుండుటచే, ఆయాప్రదేశము లభివృద్ధికి రాలేదు. దీనికి కారణము మనకు తెలియదు. ఫాహియాన్ బౌద్ధక్షేత్రములగు, రాజగృహము, గయ, కాశి, చంప మొదలగుస్థలములను జూచి ఆకాలమున వర్తకస్థానముగానుండి, గంగాముఖద్వారమున నున్న తామ్రలిప్తి (టామ్ లూక్) ప్రవేశించి,అచ్చటనుండి ఒకవర్తకనౌకలో అనేకమందిహిందువులతోగూడ జావాకు బోయెను. అప్పుడందులో బ్రాహ్మణు లుండిరి. దీనినిబట్టిచూడ ఆకాలమున బ్రాహ్మణులు సముద్రయానము చేయుచుండిరనియు జావా మొదలగు ప్రదేశములలో హిందువులు వర్తకమును సాగించుకొనుచుండిరనియు తెలియుచున్నది.

చంద్రగుప్త విక్రమాదిత్యుడు గుప్తసామ్రాజ్యమును మెల్లమెల్లన నభివృద్ధిపరచి, ప్రజలను సుఖముగ పాలించి, తనసౌఖ్యమే ప్రజాసౌఖ్యముగ నెంచుకొని, గుప్తవంశమున నెంతయు వన్నె తెచ్చి విక్రమాదిత్యుడను బిరుదు వడసి, సక్రమముగ రమారమి నలువదిసంవత్సరములు రాజ్యపరిపాలనజేసి క్రీ. శ. 413-వ సం. రమున కాలధర్మమునొందెను.

౨

క్రీ. శ. 413 - 455

చంద్రగుప్త విక్రమాదిత్యుని కుమారుడగు మొదటి కుమారగుప్తుడు క్రీ. శ. 413 వ సం.న రాజ్యారూఢుడై నలువదిసంవత్సరములు రాజ్యమేలెను. ఈతనితల్లి పేరు ధ్రువదేవి. ఈతనిరాజ్యవైశాల్యమునుగూర్చి మనకు సవిస్తరముగ తెలియదు. కాని విజయచిహ్నముగనీత డశ్వమేధయాగమొనర్చుటచే, గుప్తసామ్రాజ్యమున కొన్ని క్రొత్తరాజ్యములు కల్పియుండవచ్చునని నమ్మవలెను. ఆరాజ్యము లేవో మనకు తెలియవు. యుద్ధములు లేకుండ రాజ్యమును సక్రమముగ మాత్రము పరిపాలించి ప్రజలను సుఖపెట్టెను. కాని అయిదవశతాబ్దమున అనగా కుమారగుప్తుని రాజ్యపరిపాలనాకాలము ముగియుతరిని, హిందూదేశపశ్చిమోత్తరభాగమునుండి, మోటుజాతివారును, అల్లరిమూకలును నగు శ్వేతహూణులు, దేశమున ప్రవేశించి గుప్తసామ్రాజ్యమునకు కొంత నష్టము కలిగించిరి. వీరిదండయాత్రనుగూర్చి ముందు మనము చదువగలము. ప్రస్తుతము గుప్తవంశపురాజులకాలమునాటి మత, సాంఘిక, వాఙ్మయములనుగూర్చియు, చిత్రకళనుగూర్చియు, అప్పటిభాషనుగూర్చియు కొంత తెలిసికొన నావశ్యకము.

దేశస్థితి

బౌద్ధమతముగాని, జైనమతముగాని ఆకాలమున నశింపలేదు. కొన్నికొన్ని ప్రదేశములలో బౌద్ధమతధర్మములనే యాచరించుచుండిరి. హిందూమతముగూడ విస్తరించియుండెను. కనిష్కునికాలమునుండి మరల బౌద్ధమత మభివృద్ధిజెందెను ఎక్కువ ప్రదేశములందు బ్రాహ్మణమతమునే జను లవలంబించియుండిరి.ఆబౌద్ధమతమునకును హిందూమతమునకును సంబంధము కలదు. గుప్తరాజులు బౌద్ధమతమును, జైనమతమును సమదృష్టితో చూచినప్పటికి

వారిమతముమాత్రము బ్రాహ్మణమతమే. సాధారణముగా బ్రాహ్మణులవద్దనే అనగా సంస్కృతభాషాప్రవీణులగు పండితులవద్దనే సలహాను దీసుకొనుచుండిరి. ఈ రాజుల కాలమున ఒనర్చబడిన అశ్వమేధయాగములే బ్రాహ్మణమతాభివృద్ధికి సూచనలు. మొత్తముమీద గుప్తులకాలమున బౌద్ధమతము మెల్లమెల్లన క్షీణింపజొచ్చెను.

క్రీ. 58-వ సం.న విక్రమాదిత్యుడను రాజు ఉజ్జయినిలో రాజ్యమేలెనని, కొన్నిగాథలు గలవు. అవి పొరబాటయియుండవచ్చును. నాల్గవ శతాబ్దాంతమున ఉజ్జయిని జయించి పాలించిన చంద్రగుప్తవిక్రమాదిత్యుడే అతడై యుండవచ్చును. ఆతని సభలో నవరత్నములనబడు తొమ్మండుగురు గొప్పగొప్పసంస్కృత పండితు లుండిరి. అందు సంస్కృతభాషాకవిశేఖరుడగు కాళిదాసుకూడ నీకాలపువాడై యుండును. చంద్రగుప్తుని పరిపాలనాంత్యముననో కుమారగుప్తుని మొదటి కాలముననో యీతడుండియుండును. రమారమి ముప్పదివత్సరములు సంస్కృతభాషయందనేకోద్గ్రంథముల రచించెను. అవ్వియవి జగద్విదితములుగ నున్నవి. నాలుగు, అయిదు శతాబ్దములలో సంస్కృతభాష యెక్కువగ అభివృద్ధినందెను. ఈకాలమున బాగుగ వాఙ్మయ మభివృద్ధిచెంది యనేకపుస్తకములు వెలువడెను. ఈకాలమున ముఖ్యముగ జ్యోతిషము, గణితశాస్త్రము అభివృద్ధినొందెను. బౌద్ధులకును, హిందువులకును విస్తారముగా ఘర్షణలు జరుగుటచే, రెండుమతములవారిచేతను అనేకగ్రంథములు వ్రాయబడినవి. మనుస్మృతిమొదలగునవి యీకాలముననే శ్లోకరూపమును దాల్చెను. బౌద్ధులు పాలీభాషయందనేకగ్రంథములను రచించిరి. ఈగ్రంథరాజములే అప్పటిచరిత్రకు మన కాధారములుగా నున్నవి.

సముద్రగుప్తునికాలమున సంగీత మభివృద్ధిజెందెను. అయిదు, ఆరు శతాబ్దములలో, బౌద్ధులయొక్కయు, బ్రాహ్మణులయొక్కయు, గొప్పగొప్ప కట్టడములను, స్తూపములను, విహారములను, రాజమందిరములను జూచిన అప్పటిశిల్పమునుగూర్చి వేరుగ జెప్ప నవసరము. ఈకాలమున శిల్పులు తమనైపుణ్యమునంతయు జూపి చక్కని కట్టడములను నిర్మించిరి. నాగ్నజిత్తుడను నాతడు శిల్పశాస్త్రమునుగూర్చి యొకగ్రంథమును వ్రాసెను. ఇందు మందిరములను గట్టుట, విగ్రహములను జెక్కుట, చిత్తరువులను చిత్రించుట మొదలగు విషయములనుగూర్చి విపులముగా వ్రాసియుండెను. స్తూపములమీద జెక్కబడియున్న విగ్రహములు వర్ణనాతీతములు. వేర్వేరు రాళ్లను జెక్కి నిర్మించుటయేకాక పెద్దపెద్దపర్వతములనుగూడ తొలిచి ఆకాలపుశిల్పులుతమ యద్వితీయశిల్పకళానైపుణ్యమునుజూపుచు, ననేకవిగ్రహములను జెక్కియుండిరి. పర్వతపుచెక్కడములు పైకిఅందముగా లేకపోయినప్పటికి లోన ఇంద్రభవనములవలె నుండును. ఇట్టిది బొంబాయికిని, పూనాకునుమధ్యగల కార్లీయనుచోట గలదు. ఇచ్చట బౌద్ధభిక్షువులు కొందరుండిరి.

అజంతామొదలగుచోట్ల చక్కనివిహారములు స్థాపింపబడినవి. ఈ విహారములలో మధ్య నొకవిశాలమైన సావిడియును చక్కగ చెక్కబడిన స్తంభములును ఉండును. అజంతావిహారములోని గోడలపై గల బుద్ధునిప్రతిమలును, బౌద్ధచరిత్రనుబట్టి జెకక్కిన చిత్రపటములును, అప్పటిశిల్పకళను వేనోళ్ల చాటుచున్నవి. (Vincent A.) స్మిత్తుగారు ఈకాలమున ఇట్టిచతురతగలశిల్పులు మొదలగువా రుండుటకును, అప్పటి నాగరికతాభివృద్ధికిని కారణము, ఆనాడుగుప్తులకుగల విదేశీయుల సంబంధమే యని నుడివిరి. కాని ఇది యసమంజసము. హైందవులు విదేశీయులతో స్నేహభావము కలిగియుండి, వర్తకముచేసిన జేసియుండవచ్చును గాని ఇతరులయొద్దనుండి నేర్చుకొనుననవసర మప్పటికి లేదు. సకలశాస్త్రములకుహిందూదేశమే పుట్టినిల్లు. ఇచ్చటనుండియే మెల్లమెల్లగ పాశ్చాత్యులుకూడ నేర్చుకొనిరి. గుప్తసామ్రాజ్యము క్రీ. శ. 330 మొదలు 455 వరకు ఉచ్చదశయందుండెను. కుమారగుప్తునియనంతరము సామ్రాజ్యపతనము ప్రారంభమాయెను. కుమారగుప్తుడు 450 సం.న పుష్యమిత్రరాజ్యముతో యుద్ధముచేసి ఓడిపోయి, 455-వ సం. దివికేగెను. కాని యీతనికుమారుడును, శూరాగ్రేసరుడును నగు స్కందగుప్తుడు పలుకష్టములుపడి, ఒకరాత్రి కటికినేలను పరుండి క్రమముగ తండ్రిచే నిగ్రహింపబడని శత్రువును సాధించి పుష్యమిత్రులను గెల్చెను.

3

క్రీ. శ. 455 సం. తరువాత గుప్తరాజ్యము

స్కందగుప్తుడు క్రీ. శ. 455-వ సం. సింహాసనారూఢు డయ్యెను. ఈతడు రాజ్యారూఢు డగు సరికి రాజ్యమంతయు నరాజకముగ నుండెను. ఈతని కెటుచూచినను కష్టములే. అట్టి విషమావస్థయం దెటులో పుష్యమిత్రులను మాత్రము గెల్చెను ఇంతలో పశ్చిమోత్తరభాగమునుండి శ్వేతహూణులు దేశములో ప్రవేశించి నాశనముచేయ మొదలిడిరి. అట్టియాపత్కాలమున స్కందగుప్తుడు భారత దేశమును రక్షించి, హూణుల నోడించి తల్లికడకు బోయి "శ్రీకృష్ణుడు దేవకీదేవికివలె" నమస్కరించి తనవిజయ మామెతో చెప్పగనే ఆమెకుగల్గిన యానందము వర్ణింప తరము గాదు. అనంతర మీతడు తనజనకుని స్మారక చిహ్నముగా ఒకపెద్దస్తంభముమీద నొకవిష్ణువిగ్రహమును జెక్కించెను. ఈతనిరాజ్యము పశ్చిమమున సౌరాష్ట్రముమొదలు, తూర్పున పాట్నాకు తొంభైమైళ్లదూరమువరకు వ్యాపించెను. మధ్యయిండియా దేశముకూడ నీతనికి లోబడియుండెను ఇట్లుకొంతకాలము దేశమున శాంతిస్థాపితమయ్యెను. కాని మరల పైనజెప్పబడినఅల్లరిమూకలు పశ్చిమోత్తరభాగమునగల, పంజాబు గాంధారము మొదలగురాజ్యములను స్వాధీనపరుచుకొని అచ్చటనుండి 470వ సం. మరల లోనికిప్రవేశింపజొచ్చిరి. స్కందగుప్తుడు మొదటనున్నంతబలముగా లేకపోవుటచేతను, శ్వేతహూణులమూకలు ఎక్కువగా నుండుటచేతను వారినీసమయమున గెలువలేకపోయెను అదిగాక స్కందగుప్తుని ధనాగారముకూడ ఖాళీయాయెను. అసలైన బంగారునాణెములకు బదులు కల్తీనాణెములను ముద్రింప వలసివచ్చెను. ఈతడుకూడ విక్రమాదిత్యుడనుబిరుదునామము వహించి క్రీ. శ. 480 వ సం. చనిపోయెను. ఇంతటితో గుప్తసామ్రాజ్యము క్షీణించెనని చెప్పవచ్చును. గుప్తవంశపురాజులుమాత్రము మరికొన్నితరముల వరకు, ఎచటనో తూర్పుభాగమున చిన్నచిన్నరాజులుగా నుండి పరిపాలించిరి.

స్కందగుప్తుని యనంతరము అతనిసోదరుడగు పురగుప్తుడు రాజ్యారూఢుడై కల్తీనాణెములను దీయించి సరియగు బంగారునాణెముల వేయించెను. ఇతడు అయిదుసంవత్సరములుమాత్రమే పాలించెను. ఇతని యనంతర మీతనికుమారుడు నరసింహగుప్తబాలాదిత్యుడు శ్వేతహూణుల నణచి 538-వ సం. వరకు పాలించెను. తరువాత ఇతనికుమారుడు రెండవకుమారగుప్తుడు రాజ్యమేలెను. తరువాత పదునొకండుగురురాజులు అనామకులైయుండి ముఖరి (Maukharis) వంశమువారితో కలిసి పరిపాలించిరి. ఈరెండువంశములవారును, ఒకప్పుడు మిత్రత్వముతోను, ఒకప్పుడు శత్రుత్వముతోను మెలగుచుండిరి. ఇందుపైనజెప్పిన కుమారగుప్తుని కాలముననో అనంతరముపాలించిన మొదటిజీవితగుప్తుని కాలముననో చైనానుండి పారమార్థుడను రాయబారి మగధనుజేరి అచ్చట బౌద్ధమతమును చక్కగ గ్రహించి, ఇచట తర్జుమాచేయబడిన పుస్తకములను మరియితర గ్రంథములను స్వదేశమునకు దీసికొనిపోయెను. శ్రీహర్షునియనంతరము అనగా (క్రీ. శ. 647 సం. తరువాత) ఆదిత్యసేనుడను గుప్తరాజు స్వాతంత్ర్యమును సంపాదించి అశ్వమేధయాగ మొనర్చెనట. రెండవజీవితగుప్తుడు గుప్తరాజులలో కడపటివాడు. ఇతడు తొమ్మిదవశతాబ్దప్రారంభమువరకు పాలించెను. తరువాత మగధరాజ్యము వంగదేశమును పాలించుచుండిన పాలవంశపురాజులకు లోబడెను. బుధగుప్తుడు, భానుగుప్తుడు అను నిద్దరురాజులు క్రీ. శ. 484 మొదలు 510-వ సం. వరకు (మొదటి కుమారగుప్తుని యనంతరము) పరిపాలించినట్లు శాసనములు గలవట. ఇంతటితో గుప్తవంశమునశించి, నామరూపములులేకుండ బోయినదని చెప్పవచ్చును.

సంపూర్ణము

ఒంటిమిట్ట–పోతరాజు

గోవాడ గోపాలకృష్ణయ్య గారు

అందుకొనుమిదె సాష్టాంగవందనంబు, వినయపూర్వకముగ సమర్పించుచుంటి
బోతరాజును గన్నట్టి పురవరంబ,వగుట జూచిపోవచ్చితినమ్మ! నిన్ను.

సుదతీ! సేమమె నీదుబిడ్డలకు నీచుట్టాలకున్ నీకు? నె
మ్మదిగా నున్నవె గొడ్లు జానపదసంపచ్ఛ్రీ శుభాకారముల్?
కొదలేకుండ సమృద్ధిగా నగునె మీకుంబాడియుం బంట? చే
యుదె యభ్యాగతదేవతార్చనల, నీకున్నట్టులేయాయె బో?

ఉన్నంతతోదృప్తి నొందియుండునుగాని, దేవులాడండెల్ల గానలేనని
తాదిను సంకటియేదో లేదనకిడు, వేళకువచ్చెడు విప్రులకును
నొరులకష్టము జూచి యోర్వలే డిసుమంత, చేతనైన దోడంగ జేయుచుండు
రామచంద్రప్రభునామమంత్రాక్షర, జపతత్పరతను నిచ్చలు మెలంగు
బెద్దలకు భక్తినల్పును భృత్యునిక్రియ, బరసతులనెల్ల దల్లులపగిదిజూచు
నలుగురికి మంచిగా నెప్డునడచుచుండు, బొంకెఱుంగడు తల్లిరో! పోతరాజు.

తల్లిదండ్రుల దైవతములుగాభావించి, సర్వోపచారముల్ సలుపుచుండు
ననుకూలవతిని గుణాలవాలను భార్య, నెంతొప్రాణంబుగా నెంచుకొనును
మందిర మంగళమాణిక్యదీపముల్, బిడ్డల గడుమురిపెముగ బెంచు
వచ్చిపోయెడు చుట్టపక్కాలకుం జాల,మర్యాదచేయును మమతజూపు
'నాత్మవ త్సర్వభూతాని' యనెడుమాట మనసులో బెట్టుకొని ప్రవర్తనముసేయు
గోపమెట్టిదో యెఱుగడుగూడ నెపుడు, బూర్ణచంద్రాస్య! బమ్మెరపోతరాజు.

తెంపులేకుండ హాసచంద్రికనుగాయు, శాంతరససుధాసారము సతము గురియు
తన్ముఖేందుబింబముయొక్క దర్శనమున, బాపతిమిరము నశియించు బద్మనయన!

శ్రుతిలలనామనోహరశిరోజము లొందిన చిక్కుదీసె, నా
గతి నుడికారమింపు లొలుకన్ రచియించెను భారతంబు, స
న్మతిని జగద్ధితంబులును మాన్యములౌ కృతులెన్నో చేసె గా
క, తనివిలేదు వ్యాసునకు గాంతరో! దేని రచింపకుండగన్.

ఆపరీక్షిత్కృత బ్రాహ్మణాపచార, పాపదావాగ్ని జల్లార్పనోపినట్టి
పతితపావనవాగ్జలవర్షమతివ!, కురిసె శుకఘన మేవార్ధి గ్రోలిక్రోలి.

ఏదా ముక్తిద్వారం, వేదాహారిభక్తభూరుహోష్టవసంతం
వేదాత్రిలోకపూజ్యము, పైదలి! తెనిగించె దాని భాగవతంబుగా.

జవ్వని కెమ్మోవి చాడ్పున నత్యంత, మృదుమధురంబులు పదములెల్ల
బూవులుం దావులుం బోలె బదమ్ములు, భావమ్ము లొండొంటి బాయకుండ
గ్రొంబాడి యాబాడుగుల బాలవలె నుట్టి, పడుచుండు రసమన్ని పట్టులందు
నెత్తునుండి పరుగులెత్తుచు దిగివచ్చు, నదిపోల్కి ధార యనర్గళంబు
చెప్పనేల? పల్మాటలు శ్రీమదాంధ్ర, భాగవతకవితా మహత్త్వంబు దెలుప
దాని బఠియించి పొందుమోదంబె సుమ్మి!, యాంధ్రభాష నేర్చినఫల మన్నమిన్న !

ఎంతవెట్టినో! యమ్మపుట్టిల్లు మేన,మామదగ్గఱ బాగడెడుమాడ్కిగాగ
బోతరాజు నీదగ్గఱ బొగడుచుంటి, నీవెఱుగనట్టు లోయలినీలవేణి!

వారిపై మాకుగల భక్తివలన నట్లు, పొగడితినిగాని నీపూర్వపుణ్యమేమొ!
యీ ప్రపంచములో సాధ్వి లిందఱుండ, బోతరాజు నీకడుపున బుట్టినాడు.

ఏమి? దున్నట్టులుండి నీమోమువెల్ల,బాఱె బ్రభాతచంద్రబింబంబు భాతి
దలపునకు వచ్చెనే? తల్లి తెలియకెవతో, యన్నమాటలు మఱచిపోవమ్మ! వాని.

ఎపుడుజూచిన ననుమానమేదొ యొకటి, బెట్టుకొని తల బ్రద్దలుగొట్టుకొనును
తండ్రి తాత ముత్తాతలు దరతరంబు, జెప్పుచుండెడుసత్యము లొప్పుకొనదు.
లేనిపోనివన్నియును గల్పించితెచ్చి, చెప్పుచుండును వినుగేమి చెందకుండ
నూహలను బట్టుకొని యూగుచుంటతప్ప, నున్నదే యిదిచూచిన దొక్కటైన?
పడతి! దీనిమాటల వినువారలెవరు?, వాగుచుండును నోటికి వచ్చినట్లు
మనసులో విచారము బెట్టుకొనకుమమ్మ!, యీ"చరిత్ర"సంగతిని నీ వెఱుగవొక్కొ?
తరుణి! "గంగ" యనంగ "గోదావరి"యని! తనకు గాబట్టినట్టు లర్థమును జెప్పె.
"బొమ్మెర"ను బట్టుకొనివచ్చి "బమ్మెర" యనె, దీనిమాటల నిజమిందు దెలిసెను గద!
ఆంధ్రవాల్మీకి నీపక్షమందు నిలచి, దీనిమాటలఖండించి తెలియజేసె
సత్యమును లోకమునకు నిస్సంశయముగ, నింక నీకు వచ్చినభయమేమి టమ్మ!
పూవుబోణి! చాలబ్రొద్దెక్కుచున్నది, త్వరగవెళ్లి చూచివత్తమమ్మ!
మున్ను పోతరాజు దున్నినపొలమును, వారివిగ్రహమును వాంఛతీఱ.

... ...

అనుకొన్నందుకు వచ్చితి, నినుజూచితి గొన్నినాళ్లు నీగృహమునను
టిని గడు సంతసమాయెను, వనితా! సెలవిమ్ము పోయివచ్చెద నింకన్.

నక్షత్ర కల్యాణము

పూతలపట్టు శ్రీరాములు రెడ్డిగారు

చంద్రుఁడు పాలసంద్రమునఁ బొడమిన ట్లొక-చోటను బ్రహ్మాంశమున నత్రి నసూయలకు జనించిన ట్లింకొక-చోటను బురాణములఁ జెప్పఁబడినది. ఇతఁడు నవగ్రహములలో రెండవవాఁడు; అమృతకిరణుఁడు; అశ్విన్యాది సప్తవింశతి భార్యలఁగలవాఁడు. ఈ యిరువదియేడ్గురు దక్షప్రజాపతికూఁతులు. ఆయతివలయం దతిరూపసియు ననురక్తయు నగు రోహిణియం దిందుం డతిరక్తుండైన కతమ్మునఁ దక్కినవా రాయుదంతంబొకతీరునఁ దండ్రి కెఱిఁగింప నతఁడు కుపితుఁడై క్షయరోగ పీడితుఁ డగుఁగాతమని శపించెను. అంత రోహిణీ మనోహరుఁడు దినక్రమమున నఱుఁ దెవులుచే క్షీణించుచు వచ్చెను. తమ భర్త రోగపీడితుఁ డగుటకు భార్యలు వంతఁగుంది తమ యసూయయ యింతకుఁ గారణమయ్యె నని యరసి శుభ్రాంశుఁడై యుండినఁ జూపులనైన సంతోషింతుము గదా! యని లోలోనఁ గుందుచు జనకునియొద్ద కరిగి మరలఁ బతి ననుగ్రహింపవేఁడిరి. ఆసమయముననే సుపర్వులు సోమునిఁ దమవెంటఁబెట్టుకొని దక్షుని యొద్దకు వచ్చి "నీయల్లుఁడిఁక నీకూఁతులందఱయెడ సమరక్తుఁడై యుండఁగలఁ డీపాటికను గ్రహింపు" మని ప్రార్థింప, దక్షుండును ప్రసన్నమతియై "మచ్ఛాపంబు వ్యర్థంబు కాజాలదుగానఁ బక్షము వృద్ధినొందుచుఁ బక్షము క్షీణించుచుండు. ఆపక్షము పదునైదు దినములనొప్పు" అని చెప్పి సరస్వతీ సముద్ర సంగమ స్థానమున స్నానముచేయ నియమించెను. తారానాథుఁ డట్లుచేసి ప్రభాసుఁ డయ్యెను. అప్పటినుండి యాస్థలంబు ప్రభాసతీర్థం బనుపేరఁ బరఁగు.

చంద్రుఁడు గురునొద్ద విద్యాభ్యాసము చేయుచుండి తారామోహబద్ధుఁడై బుధుఁడను కుమారునిఁగాంచె. ఇతనినుండి చంద్రవంశము ప్రారంభమయ్యె. సోముని మామయగు దక్షుఁడు బ్రహ్మ మానసపుత్త్రుఁడనియు నంగుష్ఠమునుండి పుట్టెననియు నిరుదెఱఁగుల బురాణములఁ జెప్పంబడు.

మఱియొక దక్షుఁడు గలఁడు. ఇతఁడు ప్రచేతస్సులకుఁ జంద్రుని కూఁతురగు మారిషయం దుద్భవించె. ఇతఁడు బ్రహ్మయాజ్ఞఁ బడసి మైథునక్రియవలన సృష్టిచేయ నారంభించెను. ఇతఃపూర్వము దృష్టి స్పర్శేచ్ఛాదులచే సంతానోత్పత్తి యగుచుండినట్లు తెలియవచ్చెడిని. ఇతఁడు వీరణ ప్రజాపతి కొమిరె నసిక్నిని భార్యఁగాఁగొని హర్యశ్వులను ననేక

పుత్రులఁ బడసె. వారలు నారదోపదేశంబున నూర్ధ్వరేతస్కులై సంతానేచ్ఛ యుడిగిరి. పదపడి శబలాశ్వులను వారలఁబుట్టింప వారును నట్లయిరి. అంతదక్షుఁ డత్యంత కుపితుఁడై యనపత్యతయు నిరంతర సంచారమును గలుగునట్లు నారదుని శపించి యఱువండ్రు కొమరితలఁ బడసెను. వారిలోఁ బదుగురను ధర్మునకుఁ, బదుమువ్వుర గశ్యపునకు, నిరువదియేడ్వురఁ జంద్రునకు, నల్వుర నరిష్టనేమికి, నిర్వుర నంగిరసునకు, నిరువురఁ గృశాశ్వునకు నిరుగుర బహుపుత్రునకునిచ్చి వివాహములు చేయించెను. పై యిరువురలో రెండవదక్షుఁడే చంద్రుని మామయని తెలుచున్నది. ఇది పురాణ ప్రసిద్ధము.

పురాణములకు వాస్తవార్థము నెఱుఁగలేక కొందఱు వెక్కిరించుచున్నారు. మఱి కొంద ఱివి యవ్వకథలని చెడమడఁ దిట్టుచున్నారు. ఇట్టివారు స్వభాషానిరాసకులై పాశ్చాత్య భాషానాగరికతాసంపర్కమో సంకర్షమో కొంచెముగనో గొప్పగనో గలవారే;

వాస్తవ మాలోచింపఁగాఁ బూర్వపు వారి ప్రాకృతిక, పాంచభౌతిక, జ్యోతిశ్చక్ర పరిశీలనా పాండితియుఁ, దమపరిశీలనమునఁ దేలిన సారాంశము నితరులొకసారి విన్న మఱల మఱపునకు రాకుండఁజేయఁ గథారూపమున నగపఱచుటలోఁ గలబుద్ధి నైశిత్యమపారమని తేలకపోదు. చంద్రునిఁగూర్చిన చరిత మందుఁగల యథార్థార్థమును గించిజ్జ్ఞుఁడనగు నాకుఁ దోఁచినంత వివరించుచున్నాఁడ. పొరపాటులైనచో దోషజ్ఞులు క్షమించి సవరింపింతురుగాత.

దక్షుఁడు నవబ్రహ్మలలో నొకఁడు. అనఁగా బ్రహ్మ. బ్రహ్మ సృష్టికర్త. సృష్టిక భగవంతుఁడే యని వేఱుగఁ జెప్పనవసరము లేదు. దక్షుఁడనఁగా నేర్పరియనియు నర్థము గలదు. భగవంతుఁడు నేర్పుతో-ననఁగా సూక్ష్మబుద్ధితోఁ (అతఁడే సూక్ష్మబుద్ధి నాలోచించి చేసెనన్నచో మనుజమాత్రుల బుద్ధికి నూహలకు నందని దన్నమాట.) జేసిన సృష్టికి దక్షసృష్టి యని పేరయ్యెను. విష్ణుపురాణమునఁ జెప్పఁబడిన దక్షసృష్టిలో నతని కిరువది నలుగురు కూఁతులు. వారిలో శ్రద్ధ, లక్ష్మి, ధృతి, తుష్టి, పుష్టి, మేధ, క్రియ, బుద్ధి, లజ్జ, వపువు, శాంతి, సిద్ధి, కీర్తియను పదుమువ్వుర ధర్మువున కొసంగఁబడిరి. అంతరార్థమున నివి ధర్మద్వారములని యెఱుఁగఁదగును. అంత వఱకేల? ఈపేళ్ల విన్నవారిలో నెవ్వరికేని మొదటఁ బురాణగాథ తోఁచునా? శ్రద్ధకుఁ గాముఁడును, లక్ష్మికి దర్పుఁడును, ధృతికి నియముఁడును, దుష్టికి సంతోషుఁడును, బుష్టికి లోభుఁడును, మేధకు శ్రుతుఁడును, గ్రియకు దండుఁడును, బుద్ధికిబోధుఁడును, లజ్జకు వినయుఁడును, వపువునకు వ్యవసాయుఁడును, శాంతికి క్షేముఁడును, సిద్ధికి సుఖుఁడును, గీర్తికి యశుఁడును బుత్రులైరి. ఇందలి యర్థాంతరము చదువరులకుఁ జెప్పనవసరమే యుండదు గదా!

మఱియొకదక్షుఁ డున్నాఁడనియు, నతని కఱువండ్రు కొమరితలనియు మున్నే చెప్పి

యుంటిమి. వీరిపేళ్లను సంతానమును గ్రమముగ వివరింతము.

ధర్ముని భార్యలు పదుగురు

వారిపేర్లు	సంతానము
అరుంధతి	పృథివితోఁ జేరిన సమస్తము
వసువు	అష్టవసువులు
యామి	దుర్గభూముల కధిష్ఠాన దేవత
లంఘ	విద్యోతుఁడు (ఘోషుఁడు)
భానువు	భానువులు
మరుద్వతి	మరుద్వంతజయంతులు
సంకల్ప	సంకల్పుఁడు
ముహూర్త	మహూర్తికులు
సాధ్య	సాధ్యులు
విశ్వ	విశ్వేదేవతలు

కశ్యపుని భార్యలు పదుమూఁడురు

దితి	దైత్యులు
అదితి	ఆదిత్యులు
దనువు	దానవులు
అనాయువు	సిద్ధులు
ప్రాధ	గంధర్వులు
ముని	మౌనేయులనఁబడు గంధర్వులు
సురస	యక్షరాక్షసులు
ఇల	వృక్షలతాతృణజాతులు
క్రోధవశ	మాంసాశనములైన సింహావ్యాఘ్రాది మృగములు
తామ్ర	శ్యేనాదిపక్షిగణములు, ఉష్ట్రాశ్వగార్దభములు
కపిల(సురభి)	గోగణము
వినత	అనూరుఁడు, గరుడుఁడు
కద్రువ	నాగులు

దీనింబట్టి పర్యాలోచింపఁగా భగవంతుని సృష్టిక్రమము మన కవగతమయ్యెడి. సంతాననామముల వ్యుత్పత్తులంబట్టి యంతరార్థము సులభగ్రాహ్యము. ఇఁకఁ బ్రస్తుతమునకు వత్తము. దక్షుఁడు తనకొమార్తెల నిరువదేడుగురఁ జంద్రున కిచ్చెనన భగవంతుఁడు నక్షత్రసమూహములకుఁ జందురు నధికారిగా నియమించెనని యర్థమూహ్యము. ప్రపంచములకుఁ గాంతినిచ్చుటకై క్రమముతప్పక సంచరింప నిరువదేడు నక్షత్రముల మార్గసంకేతములుగ భగవంతుఁడు చంద్రున కేర్పఱచెను. భగవంతుఁడేకవాక్యుఁడు. చండశాసనుఁడు. క్రమము తప్పినవారి శిక్షింపకమానఁడు. ఒకప్పుడు వక్రగమనమున రోహిణియందే యెక్కువకాలము నిలిచియుండుటచంద్రునకుఁదటస్థించెను. క్రమముగ నప్పుడన్నింటికిఁ జంద్రుఁ డాహ్లాదకరుఁడు కాకపోయెను; (చంద్రుఁడనఁగా నాహ్లాదకరుఁడని యర్థము. చందయతి ఇతిచంద్రః). దివికిఁ బ్రకాశమిచ్చి భూమికి నీయకుండె; (అనఁగాఁదానే స్వయంప్రకాశుఁడని గర్వించె). తక్కినవంత తమవంతను భగవంతునితో విన్నవించెను. అతఁడు కళాహీనుఁడగు నట్లుగఁ దన కృపను (సూర్యకిరణములకు) దూరగుఁడుగ, శాపమును (భూమిని) ఇచ్చెను (అడ్డుపెట్టెను). భూమి యడ్డగించుటవలనఁ దమకు మునుపున్న కళయుఁ దగ్గఁగదాయని నక్షత్రములు మొఱలిడె. అనఁగా మేము జన్మించినది తమోభూయిష్ఠమగు కాలంబునఁ బ్రాణులకు శక్తికొలఁది సాయపడుటకే కదా! మేధావంతులకు మానవ జన్మచరిత్రమునుగూడఁ దెలుపుచుం

టిమే. కించిత్కాంతి (తెలివి) నిచ్చుటకుఁ గూడ నిప్పుడు యోగ్యత లేకపోయెఁగదా? యని చింతించెనని భావము.

దేవత లమృతకిరణునుండి వెల్వడు నమృతమును పానముచేయుదురు. అందుచేతనే చంద్రునకు విధుఁడను పేరయ్యెనని పురాణ సిద్ధము. ఇందులకు సమన్వయ సమాధాన మెట్లన, విబుధులు చంద్రునిఁగూర్చి భగవంనితో నిట్లనిరి. "దేవా! శీతాంశుఁడిఁక నీయాజ్ఞ మీఱఁడు. అతఁ డిప్పుడు మాకే యమృతము (వెన్నెల) నిచ్చుటచే సుమాహ్లాదముం జెంది తిమిగాని మావలె మానవులు నాహ్లాదింపవలదా? నీకల్లరము పుత్త్రులముకామా? నీ యీ శాపకారణమున మనుజులకుఁ దమఃపరిహారమార్గము లేకపోయె. అయ్యది మాకును సంతాపకరంబు. ఇఁక వారు తరించుటెట్లు? మర్త్యులు నమర్త్యులు నీదయకు సమభాగులు కారె? చంద్రుఁ డోషధీశుఁ డగుటం జేసి సస్యాదు లిఁక ఫలింపవు. అన్నమయశరీరు లగు ప్రజలగతి యేమి? తారారాజపదము సుస్థితిం జెందుటం జేసి యరాజకంబయ్యె. కరుణింపవే యని వేడ దీనావనుండు కరుణించి "యిది మొదలుగఁ జంద్రుఁడు వృద్ధిక్షయంబులతో నాకలోకవాసులకును భూలోకవాసులకును క్రమంబుగ నమృతము నిచ్చుఁగాత" మని ప్రసాదించె. కానఁ బ్రజల కొక పక్షంబును దివిజుల కొకపక్షంబును జంద్రుఁడు సార్థకనాముఁ డగుచున్నాఁడు. ఇప్పుడు కలువలతోఁ డిరువదేడు నక్షత్రములవలన సముఁడై వర్తించుచున్నాఁడు. వక్రగతి లేదు. మఱియు భూ సూర్యమధ్య గతుండైనప్పటినుండియే వృద్ధి నొందుచున్నాఁడు. ఇదియే సరస్వతీ సముద్ర సంగమస్థానమున స్నాతుండై ప్రభాసుండయ్యె ననుటలోని భావము.

ఇట్లు (కళాభి)వృద్ధినొందుచున్న కాలంబున బృహస్పతి గ్రహ (లేక గోళ)సమీప వర్తినియగు తార చంద్ర తేజస్సును గొంత పొందెను. అంతవఱకుఁ గనఁబడకుండిన బుధగ్రహ మప్పుడు ప్రజాచక్షుర్గోచరమయ్యె. బృహస్పతి సమీపవర్తినియగు తారను గురుదారగను, చంద్రుఁడు కళాభివృద్ధి నొందుకాలమును విద్యాభ్యాసకాలముగను, తార చంద్రతేజంబును పొందుటయే గర్భధారణముగను, నీయిరువుర కారణమున బుధుఁ డగపడుటచే బుధుఁడు తారాశశాంకుల తనయుఁడుగను పౌరాణికులు వక్కాణించిరి. చంద్రుని కాంతిని బొందిన నక్షత్రములు తేజస్వంతములగుటయు, నొక్కొక్క ప్రసిద్ధనక్షత్ర (లేక గ్రహ)సమీపమునను ననేక స్వల్పనక్షత్రములు దోఁచుటయు మనకొకవింతలోనిది గాదు గదా! దుష్కార్యముగూడఁ గాదు.

చంద్రుఁడు సముద్రుని తనయుఁడా? అత్రికుమారుఁడా? యను ప్రశ్నకుఁ గొందఱు విమర్శకులు కల్పభేదమువలనఁ గలిగిన భేదమని సమాధాన మిచ్చుచున్నారు. పాద్మకల్పమున సముద్ర తనయుఁడనియు, వారాహకల్పమున నత్రిసుతుఁడనియుఁ జెలుపుచున్నారు. ప్రపంచము మొదట జలమయమై యందునుండి సృష్ట్యారంభ మయ్యెనని పురాణోక్తమును, బండిత సమ్మతమును నగుటచేఁ బాద్మకల్ప

మునఁ బద్మపైరి పయోధిం బోడమెననుట నిర్వివాదాంశమే; వారాహకల్పారంభమున జలప్రళయముగాక నైమిత్తిక ప్రళయమైనపుడు పునస్సృష్టిలోఁ జంద్రుఁ డత్రికొడుకై యుండవచ్చును. అత్రి బ్రహ్మర్షి (బ్రహ్మ భగవంతుఁడు)యనుట మనకుఁ దెలిసిన సంగతియే.

నవగ్రహములలోఁ జంద్రుఁడు ద్వితీయ గ్రహమనుటకు సూర్యుని తరువాతఁ బ్రపంచమును బ్రకాశవంతముగఁ జేయుటలో నింత వాఁడు లేమిగయే కారణము. ప్రపంచముపైఁగల గ్రహాధిపత్యముంబట్టియు నేర్పడియెడి. దినమున కిరువదినాలుగు హోరలు: ఒక్కొక్క హోర (గంట) కుఁ గ్రమముగ సూర్యుఁడు, శుక్రుఁడు, బుధుఁడు, చంద్రుఁడు, శని, గురువు, అంగారకుఁడు అధిపతు లగుచున్నారు. గ్రహగమనవేగముం(శక్తిం) బట్టి యీక్రమ మేర్పడుచున్నది. రాహు కేతువులు ఛాయా గ్రహములుగాన వదలిపెట్టఁబడినవి. పైయేడు గ్రహములు మూఁడువరుసలు గంటగంట చొప్పున నాధిపత్యము వహించుచురాఁగా నిరువదియొక్క గంటలగును. ఆపై మూఁడుగంటలకు మూఁడుగ్రహము పోగా మఱునాటి యుదయమునకు సరిగఁ జంద్రాధిపత్యము వచ్చుచున్నది. ఉదయకాలమున నెవ్వని యాధిపత్యముండునో వానిపేరనే యాదినము పిలువంబడుచున్నది. ఈకారణమున దినాదిని బ్రపంచాధిపత్యము వహించువారిలోను రెండవవాఁడు చంద్రుఁడే.

ఇఁక జంద్రునిలోని కలంకమునుగూర్చి యొకటి రెండు మాటలు చెప్పి విరమింతము. కలంకమునుగూర్చి పలువురు పలువిధములుగఁ జెప్పుచున్నారు. పురాణములలో నుత్ప్రేక్షలే కాని నిశ్చయాభిప్రాయము మృగ్యము. పాశ్చాత్యాధునాతన జ్యోతిర్మండల పరిశోధకు లది యొక ప్రపంచమని, యీప్రపంచమువలె నదియు సర్వవస్తు సమన్వితమని భూచ్ఛాయయని పలుతెఱఁగులుగ శంకావిరళముగఁ జెప్పుచున్నారు. ఇంతమాత్రపు సంగతులు మన పూర్వులుగూడ గనిపెట్టియే యున్నారు. భోజరాజుచేఁ బూర్వార్థమును గాళిదాసుచే నుత్తరార్థమును జెప్పఁబడిన దని కొందఱును, బిల్హణునిదని కొందఱును జెప్పునట్టి యీక్రింది శ్లోకార్థముం గమనింపుఁడు; చాలును.

అంకం కేపి శశంకిరే జలనిధేః
పంకం పరే మేనిరే
నారంగం కతిచిచ్చ సంజగదిరే
భూచ్ఛాయ మైచ్ఛన్పరే;
ఇందౌ యద్దళితేంద్రనీల
శకలశ్యామం దరీదృశ్యతే
తత్సాంద్రం నిశి పీత మంధతమసం
కుక్షిస్థ మాచక్ష్మహే.

సంపూర్ణము

మన్మథుని ప్రగల్భవాక్యములు*

భాగవతుల నృసింహశర్మగారు

నావుడు మన్మథుండు వదనంబు ప్రఫుల్లముగాన్ హసించి యో
హో! విధి! యట్టులైన మఱియున్నదె! మాటలకేమి? యమ్మహా
దేవువరింపఁజాలిన సతీమణిఁ గానము నిశ్చయంబు; నా
పూవులు ఫాలనేత్రుని విమోహితచిత్తునిఁ జేయఁజాలునే?

ఉ. అంటినఁ గందుబాణములు హత్తనినన్ భయమొంది డేగపె
న్నంటినభంగి నీశుకపికాదులు పర్విడు; వాని కంటెపె
న్మంటలకేను మాధవుఁడు మాడినశింతుము; నీదుమాట కీ
కొంటినిగాక కార్యమొనగూడునె? స్థాణువు సంచలించునే?

చ. జనులను యక్షరాక్షసుల సాధ్యుల సిద్ధులఁ దక్కువారలన్
వనితల పాదదాసుల నొనర్పఁగఁజాలుదు నొక్కతూపునన్
మునులను యోగులన్ భుజగభూషణుఁ డీషణశోషణుండనన్
ఘనతవహించెఁ గార్యమతికష్టతరంబని నాకుఁ దోఁచెడిన్.

ఉ. ఆఁడుదిపుట్టుటేడ? కుసుమావృతుఁడైన సఖుండు మాధవుం
డేడ? రవంతసందడికి నేడకొ యేగెడు ఒత్తులేడ? నే
నేడ? మహేశ్వరుం గెలుచుటేడ? యెఱుంగవొ మంచిచెడ్డలన్?
గీడుఘటిల్లునంచుఁ బరికింపవొ? వెంబరవిత్తువైతివో?

ఉ. ఇంతకు నీవె నన్ను శపియించితి విప్పుడు జంకనేల? ప్రా
ణాంతకమైనఁ గార్యమెటులైనను జేయక తప్పనోటు? లో
కాంతకుఁడైన రుద్రునయనానలకీలకు భస్మమాదు నీ
స్వాంతము సంతసించు నపు డంబుజగర్భ! విచారమేటికిన్.

---

* మదాంధ్రీకృత శ్రీ కాళికాపురాణమునుండి.

ఉ. కర్పరధారియైన శితికంఠుఁడు, క్రొన్నెలవేఁడి వెన్నెలన్
గూర్పఁగఁ దాళునోటు? ధృతిఁగోల్పడి కీడ్పడి తల్లడిల్లఁడే?
దర్పమణంచి వాని వనితాపదదాసునిఁ జేయకున్నఁ గం
దర్పుఁడనన్ రహించుబిరుదంబు లభించునె లోకనాయకా!.

చ. చిలుకలు కోకిలల్ చెవులు చిల్లులుపోవగఁ గూయ మాధవుం
డలరు లలంకరింపఁగ, లతాంతనికుంజగృహాంతరంబునన్
బాలఁతులతోడఁగూడి సఖి ముద్దులుగుల్కఁగ వానిచిత్తమున్
మలఁకలఁ బెట్టెదన్ జగతి మన్మథనామము సార్థకంబుగాన్.

చ. అలరులతావిఁ బూని మలయచ్యుతశీతలవాతపోతముల్
మలయఁగఁ బుష్పవాటికల మాధవుఁ డుజ్జ్వల పత్రపుష్పకాం
తుం వెదఁజల్లఁ గ్రొన్నెలమనోహరుఁడై నునుపండు వెన్నెలన్
దళుకులనీనుచుండఁ గని తాళగలండె? చలింపకుండునే?.

ఉ. స్థాణువుస్థాణువంచు సురసంఘముగొల్వగ గర్వియయ్యె, దృ
క్కోణము లెఱ్ఱచేసి యతికోటికిఁ దానొకపెద్ద యయ్యె; మ
ద్బాణసుగంధవాతమున ధ్యానము భంగముఁజేసి యంబుజ
భ్రూణ! సతీకటాక్షు పరిభూతునిఁజేసెద భూతనాథునిన్.

చ. నవనవలాడు కొమ్మలకొనంగల లేఁ జిగురాకుఁగొల్చి మా
ధవుఁడు రగుల్పఁజేయఁ బికతండము కోపముఁజూప, మత్సుమే
షువులకుఁజిక్కి తాపమున సోలి సతింగని 'త్రాహి త్రాహి మామ్
భవదధరామృతేన' యని పైఁటచెఱంగును బట్టుకుండునే?

ఉ. దుర్గమసీమనైనఁ దనతోఁ జనుదెంచెడు నంది మచ్ఛరా
వర్గళధాటికిన్ దనమనంబున నెంతయు సంచలించుచున్
స్వర్గమునందు నందనవనంబునఁ బచ్చికమేయుచుండు నా
స్వర్గవిసంగమంబునకుఁ బర్విడగన్ హరుఁ డేమిసేయునో?

ఉ. ముక్కుబిగించి భ్రూయుగళమున్ ముడివైచి సమాధి నమ్మరు
ద్భుక్కటకుండు కన్నుఁగవమోడ్చి యొకించుక విప్పునంతలో

ఱెక్కల విప్పి పూవుఁ బొదరింటను జక్కవ జోడుఁగూడ దా
మక్కువ యించుకంతయిన మానసమందునఁ బొందకుండునే?.

ఉ. బోయలు సాంద్రనీలవనభూమినిఁ గాంతల మోసపుచ్చుచున్
"రే"యని, గూడువేళ శబరీకబరీనిబిరీస నీలిమ
చ్ఛాయలకాలకాలఘనసంచయమున్ బలెఁ బ్రాంతిఁ గొల్పఁగన్
క్రేయని కేకరించుచుచును గేకియుగంబు మదీయకేళికిన్
డాయుచునుండ నాతని దృఢవ్రతదీక్ష సడింపకుండునే?.

ఉ. రాణఁదలిర్చు వల్లికల స్రూకులఁ బూఁబొదరిండ్ల నిత్యక
ల్యాణము పచ్చతోరణమునై విలసిల్లెడు నొక్కకానలో
నేణయుగంబుచేరి రమియించుచు నుండ హరుండుగాంచి, ఘృణన్
బోణికినై తడంబడునొ? ముక్కుబిగించి సమాధినుండునో?.

ఉ. సారసకైరవప్రకర సంగతభృంగగళా రవోత్పతత్
సారసచక్రవాక బకసంచయ భుక్తకుళీరమీన సం
సారసరోవిహారగత మానసమానస రాజహంస సం
సారవిలాసవైఖరుల స్థాణువుగాంచి చలింపకుండునే?

ఉ. నిర్జనభూమినున్న నవనీరుహవేష్టిత పుష్పవల్లికో
త్సర్జితపుష్పకేసర రజఃపటలాన్విత మారుతాహుతిన్
జర్జరితాంగుఁడై సరసి స్నానముఁ జేయునొ? లేక కామియై
నిర్జరకామినీమణుల స్నేహముఁ జేయునొ? నేను జూచెదన్.


గీ. సూనవతియైన లతకూన కౌగిలోన, తనదుమేనంట నంటయ్యెనని తలంచి
తానకూడెడు ముక్కంటి చానయంచు, తగులకుండఁ దాఁబాయునో మగతనంబు.

ఉ. వారణపీనకుంభములభంగిఁ గుచంబులు డంబుమీఱ దో
వారవిలాసినీగణము వారిధితీరనికుంజసీమలన్
దారుచునుండఁ గాంచి ప్రమథప్రకరంబు మదీయకేళికిన్
గేరుచునుండ నాతఁడు బిగించినకచ్చ సడల్పకుండునే?.


గీ. మేరువునకేగునో హిమమేదినీధ్ర శిఖరికేగునో డాగునో సృష్టియందు
నాతఁ డెచ్చోటనుండిన నచటనుండు, నెచటికేగిన నచ్చటి కేగుచుండు.



అమినుల్లా రాజుగారు
ఆఫ్ఘనిస్థానపు అమీరు



గాంధిమహాత్ముడు దక్షిణాఫ్రికా రాయబారులలో నొకరికి బొంబయినగరమున స్వాగతము నిచ్చుచున్నాడు.



జార్జి మైకేలుదొర

ఫ్రెంచిదేశపువాడు, ఇంగ్లీషు చానెలును ౧౧ ఘంటల ౫ నిమిషములలో ఈదెను.
ఇంతఅల్పకాలమున నిదివఱ కెవ్వరును ఈదలేదు.



కార్సను దొరసాని

అమెరికాదేశపు స్త్రీ. ఈమె ఇంగ్లీషు చానలును ఈదినది.

గీ. నాగకేసరకేసర నాగరంగ, నాగరామ్రకురవక పున్నాగపూగ
పర్ణపర్ణాసపాటల పర్ణధార, సాలబాలరసాలాది సాలములను.

గీ. మల్లికామాధవీవల్లి కోల్లసన్ని, కుంజపుంజసమావృత కూలములను
పుష్పితములైన పుష్పసమూహములను, మాధవుని కీర్తిఁబాడ, బంభరకులంబు.

గీ. సారనీరకాసార కల్హారకముల, జాతగంధబంధుర శీతవాతపోత
మెల్లెడల మెల్లమెల్లగ నుల్లముల్ల, సిల్లఁజల్లగఁ జలువలఁ జల్లుచుండ.


గీ. చిలుకతే రెక్కి తేనెలం జెలుకుధనువుఁ, బూని నారి బిగించి సమ్మోహనమను
ములికి సంధించివిడిచిన నులికిపడఁడె?, ఎక్కడకు నేగఁగలఁడు మహేశ్వరుండు?

ఉ. మామకబాణపాతమున మానసముల్ విచలింప, మీరు సం
ధ్యాముఖచుంబనక్రియకుఁ దత్తరమొందుచునుండఁ గాంచి యీ
కామునకిట్టులైరెయని గర్హణవాక్యములాడె నెవ్వఁడా
పాములవానిఁ బుష్పశరబాధితుఁ జేసెద నంబుజోద్భవా!

గీ. సూదిమొన మోపుటకునైనఁ జోటులేక, యెల్లెడల సంచరించు యోగీశ్వరునకుఁ
బిలిచి బిడ్డనిచ్చిన నేమి చులకనగునో?, తీపిదిగదీయునో లేక తెగులుకొనునో?.

ఉ. ఈతఁడు లోకనాయకుఁడో, యీశ్వరుఁడో, నిగమాంతవేద్యుఁడో,
భూతవిభుండో, వ్యోమతల మూర్ధుఁడో, నిర్జరసేవితుండో? యీ
ప్రేతను నొక్కతూపునకు, వెంబరవిత్తునిఁ జేయకుండినన్
జేతులమోడ్చి వెంటనె త్యజించెదఁ జాపముఁ బుష్పరోషమున్.

గీ. సత్తికిఁ దనశీర్షమిచ్చునో సగముమే నొ,సంగునో? కౌఁగిలించుచు సంగమించి
యతుల సంతోషముం జెంది ప్రాణములను, బాయునో యార! ఘోటకబ్రహ్మచారి.



బౌద్ధకాలవ్యవసాయచరిత్ర

పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి గారు

[క్రీ. పూ. 500 మొదలు క్రీ. శ. 500 వరకు]

ఈ కాలమునందు కౌటిలీయార్థశాస్త్రము వాగ్భటుని (అష్టాంగహృదయము, లేక) బాహటము, యాజ్ఞవల్క్యస్మృతి, అమరసింహుని నామలింగానుశాసనము, కాళిదాసుని గ్రంథములు మొదలగునవి పుట్టియున్నవిగాన యవియే యీచరిత్ర వ్రాయుట కుపయోగించినవి.

వేయివత్సరములు మితిగల యీకాలమున వ్యవసాయవిధులలోను, బీజనిక్షేపములలోను పెక్కుమార్పులు కలిగియుండును. గోదావరి, విశాఖపట్టణమండలములలో నిపుడుండునటులే నాడయోధ్యాప్రాంతమున వరిచేనుప్రక్కనే చెఱకుతోట వేయుచుండువారు. పండినచేల నాడువాండ్రు పాటలబాడుచు కాచుచుండువారు. దానిని కాళిదాసిటులు ఇంపుగ వర్ణించియున్నాడు.

(1) చెఱుకుతోటలనీడల గూరుచుండి వరిచేల గాచునాడువాండ్రు చిన్నతనమునుండి నేటివరకు జరిగి నరఘుమహారాజుయొక్క కథలను బాడిరి.

నాటివారు ధాన్యములను నాలుగురకములుగా విభజించిరి. 1. శాలిధాన్యములు (వరిధాన్యములలోని భేదములు), 2. శూకధాన్యములు (ముల్లుకలిగిన యవలు మొదలనవి), 3. తృణధాన్యములు (నీవారములు మొదలనవి), 4. శింబిధాన్యములు (పొట్టుకలిగిన కంది మొదలగు ధాన్యములు); ఇది అమరసింహునిమతము.

వాగ్భటుడు తన "యష్టాంగహృదయ" నందు "శూక, శాలి, తృణ" ధాన్యములను శూకధాన్యములనియు, కాయధాన్యములని మనము వాడుకొనువానిని "శింబి" ధాన్యములనియు జెప్పియున్నాడు. శూకధాన్యములలో నీక్రిందివి ముఖ్యమైనవి.

(2) రక్తశాలి (ఎఱ్ఱరాజనాలు), మహాశాలి (లావుగనుండురాజనాలు), కలమ (ఎఱ్ఱబుడమలు), [ఇవి మగధదేశమున బండుననియు కాశ్మీరదేశమున వీనికి మహాతండులములని పేరు కలదనియు వ్యాఖ్యాత వ్రాయుచున్నాడు.] తూర్ణకములు (దాళువాడ్లు), శకునాహృతములు (హంసలీధాన్యపువెన్నుల నుత్తరకురుదేశప్రాంతమునుండి తెచ్చి భరతఖండమునందు విడుమటచే నిచట వృద్ధినొందినందున శకునాహృతములని వీనికి పేరువెట్టిరి.), సారాముఖము (నల్లనిముల్లుకలది), దీర్ఘశూకము (పొడవైనముల్లుకలది.), లోధ్రశూకము (లొద్దుగపువ్వుయొక్క యాకారముగల ముల్లుగలది.), సుగంధికము (దీనికి మగధదేశమునందు గంధశాలి, దేవ

---

(1) ఇక్షుచ్ఛాయానిషాదిన్య స్తస్య గోప్తు ర్గుణోదయమ్; ఆకుమారకథోద్ఘాతం శాలిగోప్యో జగు ర్యశః.
రఘువంశము, స. 4-శ్లో. 20.

(2) రక్తో మహాం సకలమ స్తూర్ణక శ్శకునాహృతః; సారాముఖో దీర్ఘశూకో లోధ్రశూక స్సుగంధికః; పతంగా స్తపనీయాశ్చ యే చాన్యే శాలయ శ్శుభాః. (అష్టాంగహృదయము, 6-వ అధ్యాయము)

శాలి యనుమారుపేరులు కలవు.), పతంగము, తపనీయము, పాండుకము, పుండరీకము, ప్రమోది, గౌరశాలి, జాంగలము, లోహవాలము, కార్దమము, శీతభీరుకము మొదలగు శాలిధాన్యభేదములున్నవని యష్టాంగహృదయ వ్యాఖ్యాత వ్రాయుచున్నాడు.

అష్టాంగహృదయమునందు, యావకము, హాయనము, పాంసు, బాష్పము, నైషధకము, షష్టికము (ఈషష్టికములనే నేడు విశాఖపట్టణమండలమునందు "సత్తికల"ని వాడుచున్నారు. షష్టికలలో, గౌరషష్టికము, కృష్ణషష్టికము ననురెండువిధములు కలవు.) మహావ్రీహులలో— (శాలిధాన్యములలో) మహావ్రీహి, కృష్ణవ్రీహి, జతూముఖము, కుక్కుటాండము, కపాలాఖ్యము, పారావతకము, శూకరము, వరకము, ఉద్దాలకము, జ్వాలము, చీనము (చీనాదేశమునుండి తేబడినవిత్తనము), శారదము, దర్దురము, గంధనము, కురువిందము మొదలగు వరిధాన్యములు వర్ణింపబడియున్నవి:

అష్టాంగహృదయములోని వరిభేదములు 42 రకములకంటె హెచ్చుగ కాన్పించుచున్నవి. (తృణధాన్యములలో) కొఱ్ఱలు (కొఱ్ఱలలో రంగుభేదముల ననుసరించి నాలుగువిధములు కలవు.) వరగలు, నివ్వరివడ్లు, చామలు, శిబిరములు, ప్రశాంతికములు, మధూళికములు, అడవిగోధుమలు, కాండలోహితములు, ఆళ్లు, ఉద్దులు, యవలు, వెదురుధాన్యము, గోధుమలు, నందీముఖములు, (నందీముఖములు నిడుపుగ సన్నముగా నుండు గోధుమలలోని భేదము)—ఇవి శూకధాన్యములు. శూకధాన్యములలో 18 భేదము లున్నవి.

శింబిధాన్యము లనబడు కాయధాన్యములలో నీభేదము లున్నవి.

పెసలు, కందులు, చిఱుసెనగలు, మకుష్ఠములు (ఏనుగుసెనగలు), సెనగలు, అలచందలు, ఉలవలు, అనుములు, మినుములు, కాకాండోలా (గినియాధాన్యము) దూలగోవిల, నువ్వులు, అగసి, కుసుంభా యని 14 రకములు కాన్పించుచున్నవి.

(1) దమ్మునేలలయందు "పోడు" కాల్చిన నేలలయందు పండినధాన్యములు శ్రేష్ఠమైనవి. సంవత్సరము నిలవయున్నవికూడ మంచివేను. శ్రోత్రధాన్యము శ్లేష్మకరములు — పాశ్చాత్యవ్యవసాయకరు లిదివరకు నికృష్టముగా దలచిన దమ్ముపద్ధతి యుత్కృష్టమనియు, నేడును పోడు గాల్చి వ్యవసాయము చేయుట నికృష్టమని నిందింపబడు ఆరణ్యక జాతుల వ్యవసాయ ముత్కృష్టమనియు, అష్టాంగసంగ్రహము సంగ్రహము దృఢీకరించుచున్నది. పోడుగాల్చి వ్యవసాయము చేయుపద్ధతిని దొరతనమువారు నిషేధించుట కూడ, నేటిరంప, పితూరీకారణములలో నొకటి యని వినుచున్నాము. పోడుకాల్చుటచే, వనపాలక (ఫారెస్టు) శాఖకు నష్టమేమోకాని, తగలబెట్టినభూమిలోని ధాన్యము శరీరారోగ్యకరమని "అష్టాంగ సంగ్రహ" మను వైద్యగ్రంథము చెప్పుచున్నది. కాల్చినభూమిలో పంట జూడ హెచ్చుగ గలుగునని కాళిదాసుచెప్పుచున్నాడు; చూడుడు :

(2) సుతునిముఖము జూడ నట్టి నాకు మీతిట్టు
దీవనగా నున్నది. అగ్ని కట్టెలతో భూమిని గాల్చినను!
పిమ్మట సస్యముయొక్క యభివృద్ధికి హేతువగును గదా

కాలినభూమిలో పంట హెచ్చగునని యిప్పుడిప్పుడు పాశ్చాత్యవ్యవసాయకులు తెలిసికొనిరి. కాని కాళిదాసునాడే మనవారికి దెలియును. ఏధాన్యమున కెట్టి గుణము కలదో యాయుర్వేదగ్రంథములు చెప్పుచున్నవి; కాని యీగ్రంథమున కవియు నవసరమని వ్రాయలేదు.

దున్నెడిభేదములచే నాయాభూములకు వెవ్వేరు పేరు లీనా పెంచిరి, అట్లే నాగళ్లలోను వెవ్వేరుభేదములతో పేరులుంచిరి.

(1) శ్లో. నవం ధాన్య మభిష్యంది సేక్యం కేదారజం చ యత్; లఘువర్షోషితం దగ్ధభూమిజం స్థలసంభవమ్.
—అష్టాంగసంగ్రహము.

(2) శ్లో. శాపోఽప్యదృష్టతనయాననపద్మశోభే, సానుగ్రహో భగవతా మయి పాతితోఽయమ్, కృష్యాం దహన్నపి ఖలు క్షితి మింధనేద్ధో, బీజప్రరోహజననీం జ్వలనః కరోతి.— రఘువంశము, స. 9- శ్లో. 89.

(1) ఒకమారు దున్నినపొలము "సీత్యము"; రెండుమార్లుదున్నినపొలము "శంబాకృతము"; మూడు సారులుదున్నినపొలము "త్రిసీత్యము"; కొన్నిసస్యములను జల్లి దున్నవలసియుండును. అట్టివి "ఉప్తకృష్ట"; మనబడును.

(2) కఱ్ఱులేనినాగలి "అఫలము"; ఏడికోలలేనినాగలి "నిరీషము"; ఏడికోల, కఱ్ఱులేనినాగలి "కూటకము"; సర్వాంగోపేతమగునాగలి "హలము" అను పేరులతో నొప్పుచుండును.

పైనిచెప్పబడిన "దుక్కి" భేదములు సస్యముల ననుసరించియు, హలభేదములు భూములను, సస్యములను అనుసరించియు అవసరమగుచుండును. పైనాగళ్లు నేడు వాడుకొనబడు "గొఱ్ఱు" మొదలగువానికి మాతృకలై యుండును. "చెఱకు" లలోగూడ వివిధజాతులానాడు కలవు. వేర్వేరుచెఱకులకుమలనేకాక వానిగుణములగూడ నాటియాయుర్వేదజ్ఞులు కనిపెట్టిరి.

పౌండ్రకము—వాంశికము— శతపర్వము— కాంతారము— నేపాళము—మొదలగుచెఱకులు నాడు సేవ్యము చేయబడుచుండెను. ఇందు పౌండ్రక, వాంశిక, నేపాళశబ్దము లాదేశములనుండి తేబడి వృద్ధినొందింపబడినవి. శతపర్వ, కాంతారశబ్దములు, నేటి "వాలుజెఱకు, బంగారుతీగచెఱకు" వంటివి. పైవాని గుణములను వాగ్భటు డిటులు చెప్పెను:

(3) "పౌండ్రక"మను చెఱకు శైత్యము, ప్రసాదము, మాధుర్యము, ననుగుణములుకలది. "వాంశిక"మను చెఱకు అంతకంటె తక్కువగుణము కలది. శతపర్వము, కాంతారము, నేపాళము, ననుచెఱకు లొకదానికంటె నొకటి తక్కువగుణములు కలవై కొంచె ముష్ణగను, కషాయముగను, ఉష్ణముగను, విదాహముగను నుండును.

ఈశతాబ్దాదిని గోదావరిమండలప్రాంతమునందు జెఱకున కొకవిధమగు క్రిమిరోగము వ్యాపించినటులు బౌద్ధకాలమునందును జెఱకున కొకవిధమగు తెవులు వ్యాపించెనవి తోచుచున్నది. దాని నిటులు వాగ్భటుడు సూచించుచున్నాడు:

(4) చెఱకునకు మొదటను, చివరను పురుగులు కొట్టుటచేతను, మలినము చేరియుండుటచేతను, ఆలస్యము కలుగుటచేతను, యంత్రమునుండి తీసినచెఱకురసము వికృతగుణము కలది.

(5) చెఱకురసము నాడి బెల్లమును వండుటయే కాక "ఫాణిత"మను తేనెవంటి పదార్థమును, "మత్స్యండిక" యను సాధారణమగుపంచదారను "ఖండశర్కర" యను యిసుకవంటి పంచదారను దూలగొండియాకు రసముతో జేయబడిన "యవాస" మను శర్కరను జేయుచుండిరి.

పైగుడశర్కరాదివిశేషములు నేడు చెఱకు తోటలుగల ప్రదేశములలో వండెదు, తేనెపానకము, నల్లబెల్లము, తెల్లబెల్లము, పెద్దాపురిపంచదార, చీనిపంచదార, వంటివే యైయుండునుగాని దూలగొండియాకు రసముతో వండెడి 'యవాసము' మాత్రము మనకు గ్రొత్త. నూగుబెండరసమును, పాలను, చెఱుకురసము కాగునపుడు పోసినచో పంచదార స్వచ్ఛస్ఫటికాకృతి కలదై యింపుగ నుండుటను గోదావరీమండలమునందు చూచుచున్నాము. కాని యీపంచదార నిలువయుండదు. తాత్కాలికముగా నుపయోగించుట కనువైయుండును.

---

(1) నామలింగానుశాసనము, వైశ్యవర్గు.

(2) నామలింగానుశాసనము, వైశ్యవర్గు.

(3)...తత్ర పౌండ్రకః, శైత్యప్రసాదమాధుర్యై ర్వర స్తమను వాంశికః. శ్లో 45—శాతపర్వకకాంతారనైపలాద్యా స్తతః క్రమాత్, సక్షారా స్సకషాయాశ్చసోష్ణాః కించి ద్విదాహినః శ్లో 66, అష్టాంగహృదయము.5 అ.

(4) మూలాగ్రజంతు జగ్ధాది పీడనా న్మలసంకరాత్; కించిత్కాలం విసృత్యాచ వికృతిం యాతి యాంత్రికః—అష్టాంగహృదయము—5-40.

(5) అష్టాంగహృదయము—5 అధ్యాయము.

ఋగ్వేదకాలము మొదలు సూత్రకాలాంతము వరకు వ్రాసినవ్యవసాయచరిత మార్యావర్తముతో వింధ్యహిమాలయ పర్వత మధ్యభాగముతో మాత్రము సంబధించియున్నది. అంతవరకు నాంధ్రదేశపుబేరుకాని తత్పరిసరవ్యవసాయపద్ధతులుకాని, తెలియదగినగ్రంథములు కాన్పింపవు. మనుస్మృతి (10-48) ప్రకార మాంధ్రుడు వ్యవసాయకుడుగా నుండక వనజంతువుల జంపి జీవించువాడని స్పష్టమగుచున్నది. బౌద్ధకాలమునకు బూర్వమునం దాంధ్రదేశమున వ్యవసాయము నామమాత్రమై నేడు కోయ, సవరజాతు లరణ్యప్రాంతమున జేయు వ్యవసాయమువంటి కృషికలిగి యుండును. ఆర్యావర్తమునందు వ్యవసాయము, ఋగ్వేదకాలముననే సర్వాంగోపేతమై సూత్రకాలాంతమునకు మహోన్నతదశ నందియుండినది. క్రీ. పూ. నాలవ శతాబ్దమున గ్రీసుదేశపురాయబారిగా చంద్రగుప్తునికడ నుండిన "మెగస్థనీసు" వ్రాతలవలన నాంధ్రదేశపరిస్థితి కొంత తెలియుచున్నది. అనేకపరిస్థితుల జూడగా నాంధ్రులవ్యవసాయాభివృద్ధి క్రీ. పూ. నాలవశతాబ్దము నుండియే ప్రారంభింపబడియుండును. దండకాంతర్గతమగు నాంధ్రభూభాగమునందు వ్యవసాయ మనాగరికతావస్థయందే యుండును. కాని, కళింగమని చెప్పబడు నాంధ్రభాగముననూత్రము వ్యవసాయస్థితి కొంత వ్యాప్తినొందియుండును. కాళిదాసువర్ణించిన కళింగదేశము "ఉత్కల" (ఓఢ్ర) దేశమునకు దక్షిణమునందుండెను. గంజాంమండలములోని మహేంద్రగిరి యాకళింగములోనిది. అదిసముద్రము నంటియుండెను. ఆదేశపు పరిస్థితులు కొంతవరకు, కౌటిలీయార్థశాస్త్రము, రఘువంశము నను గ్రంథములవలన దెలియగలము. కళింగదేశవ్యవసాయ మిటులు కాళిదాసుసూచించియున్నాడు:

(1) మహేంద్రపర్వతమునందు ఈరఘుమహారాజుయొక్క యోధులు తమలపాకులచే పానభూమిని గల్పించి నారికేళమద్యమును కళింగాధీశుని కీర్తిద్రావి నటులు ద్రావిరి.—పిమ్మటను రఘుమహారాజు పండిన పోకతోటలు గలసముద్రపుటొడ్డు ననుసరించి దక్షిణపు దిక్కున కేగెను.

(ఇందుమతీస్వయంవరసమయమున "సునంద" యనుచెలికత్తె యిందుమతితో నిటు లనుచున్నది).

(2) ఓయిందుమతీ! ఈ మహేంద్రాధీశునితో మర్మరధ్వనులుగల తాళీవనప్రాంతములతో గూడిన సముద్రతీరమునందు ద్వీపాంతరములనుండి తేబడిన లవంగపుష్పముల ననుభవించుచు చల్లగాలిని సేవింపుమా.

పైపన్నలబట్టి కాళిదాసుకాలమున కీయాంధ్రదేశమునందు (ఉత్తరాంధ్రమునందు) కొబ్బరితోటలు, పోకతోటలు, తమలపుదోటలు విస్తారముగా కలవనియు తాళవృక్షసమృద్ధి కలదనియు లవంగముల నే "మలయ" ద్వీపములనుండియో దిగుమతి చేయుచుండిరనియు స్పష్టమగుచున్నది. ఇతరసస్యముల బెట్టక కేవల నారికేళతాంబూల్యాది వ్యవసాయముచేతనే కర్షకులు సంతుష్టినొందియుండరు. కాళిదాసునకు నుజ్జయినీ ప్రాంతమున నరుదగు నారికేళాదివనము లిచట నుండుటచే దక్కిన దేశములకంటె నిచట నీవ్యవసాయాభివృద్ధి కలదని సూచించియున్నాడు. నేడు మద్రాసు ప్రాంతమునందు వాడుకొనబడు నారికేళాసవము గంజాం మండలప్రాంతముననే నాడు వాడుకొనుచుండిరి. నేడు నారికేళాసవ ముత్తరాంధ్రమున నుపయోగించుట కానము. మదిరార్ణవాది గ్రంథములయందు, తాటికల్లు మద్యములలో ముఖ్యమని చెప్పుటచేతను, తాళవనసమృద్ధి గల యీ దేశమునందు తాటికల్లుచే బెల్లము వండబడుటయో, కల్లుదీసి యుపయోగించుటయో కాళిదాసునాడిచటను జరుగుచుండె నని తలపవలసియున్నది.

మద్యము భారతీయసాంప్రదాయమునందు భోగ్యము. పాశ్చాత్యసాంప్రదాయమున భోజ్యము. మద్యాదాయము చాణక్యునికాలమునందే కలదు, కాని మద్యశాలా నిబంధనలు నేటివలె లేక గవర్నమెంటువారికి సులభముగా తెలియుపద్ధతిలో జరుగుచుండెను. వానిని స్థలాంతరమున

(1) శ్లో. తాంబూలీనాం దళై స్తత్ర రచితా పానభూమయః, నారికేళాసవం యోధా శ్శాత్రవం చ పపుర్యశః;
తతో వేలాతటే నైవ ఫలవత్పూగమాలినా, అగస్త్యాచరితా మాశా మనాశాస్య జయో యయౌ. రఘువంశము, 4 సర్గ.

(2) శ్లో. అనేన సార్థం విహరాంబురాశే స్తీరేషు తాళీవనమర్మరేషు, ద్వీపాంతరానీత లవంగపుష్పై రపాకృతస్వేద లవా మరుద్భిః.
రఘువంశము, 6 సర్గ.

జర్చింతును. తాళవృక్షాతిశయము సురాతిశయముచే ప్రభుత్వమునకు ధనమును సమకూర్చుటయేకాక బీదవ్యవసాయదారున కార్థికాభివృద్ధిగూర్చునదియై యుండును. తాళవృక్షము కర్షకునకు "గల్పతరువు." త్రాడులు, మోకులు, బుట్టలు, తట్టలు, చాపలు, చేదలు, తానుతన పశువులు నివసించుట కిల్లు, పాక, కూడ తాళజవస్తునిర్మితముగా నేయుండును. బౌద్ధకాలారంభమున (క్రీ. పూ. 5 శతాబ్దిప్రారంభము) ప్రారంభింపబడి (క్రీ. శ. 6) బౌద్ధకాలాంతమున కీయాంధ్రదేశమునందు వ్యవసాయ ముచ్ఛస్థితికి రాగలిగెను. నాటిప్రభుత్వ మెటులువ్యవసాయమునకు గోడ్పడెనో వ్రాయుటకుముందు బౌద్ధకాలాంతమునకు నేయే వ్యవసాయము లెచట నెచట భరతఖండమున వ్యాప్తిజెందియున్నవో కాళిదాసమహాకవి రఘువంశమహాకావ్యమునందు రఘుదిగ్విజయమిషచే వ్రాసిననాటివ్యవసాయవర్ణనలచేదెలియగలదు కాళిదాసమహాకవి తనగ్రంథములందు నాటి "సాంఘిక మత నైతిక రాజకీయా" దికముల నిమిడించి తనగాథల బూర్తిచేసినమహానుభావుడు. రఘుదిగ్విజయము మిషను భరతఖండపై సర్గికస్థితిని కొంతవరకు నాలవసర్గయందువర్ణించి కొంతవడినవర్ణన నిందుమతీస్వయంవరాగతరాజవర్ణనమిష నారవసర్గలో బూర్తి చేసి యున్నాడు. అందు వ్యవసాయస్థితులుకూడ వర్ణింపబడియున్నవి. అవి యీక్రింద దిఙ్మాత్రముగ వ్రాయబడును.

(1) వంగదేశపురాజులు రఘుమహారాజుచే నోడింపబడి రాజ్యమునందు తిరిగి స్థాపింపబడినవారై యూడబెఱికి తిరిగి యూడ్చినపిమ్మట నెక్కువగా ఫలించువరిమొక్కలవలె ఎక్కువకప్పము నిచ్చిరి.

(2) రఘుమహారాజుయొక్క యోధులు తమల పాకులచే పానభూమిని గల్పించి నారికేళాసవమును కళింగాధీశునికీర్తిద్రావినటులుద్రావిరి.

(3) కళింగవిజయమైనపిమ్మటను రఘుమహారాజు పండినపోకతోటలుగల సముద్రపుటొడ్డు ననుసరించి దక్షిణపుదిక్కున కేగెను.

(4) ఓయిందుమతీ ! ఈమహేంద్రాధీశునితో, మర్మరధ్వనులతోగూడిన తాళవనములుగల, సముద్రతీరమున విహరింపుమీ.

(5) జయమునుగోరిన రఘువు బలములతో నడచుచు, మిరియపుదోటలనుండి యెగురుచున్న పసుపుపిట్టలుగల మలయపర్వతసమీపమున విడిసెను.

(6 (అచట) గుఱ్ఱపుడెక్కలవలన నెగురగొట్టబడి పరిమళించెడు నేలకిపండ్లధూళి తమతో సమముగా బరిమళించు నేనుగుకటములం దంటుకొనెను.

(7) ఆరణ్యకులచే ధాన్యము తీసికొనబడినపిమ్మటను మిగిలిన నీవారకాండమువలె నుంటివి——

ఇటులనే "కేరళ"మనబడు బొంబాయిప్రాంతమున ఖర్జూరవనములను, సింధుదేశప్రాంతమున ద్రాక్షావనములను, కాశ్మీరదేశమున కుంకుమపూదోటలను వర్ణించియున్నాడు. వంగదేశమునందు వరిపంట నేటివలె విస్తృతమై యూడ్పుపద్ధతిలో గలదని యిదివరలో వ్రాసినదానివలననే స్పష్టమగుచున్నది. ఇప్పటివలెనే ధాన్యమును నూరిచి గాలి కెగురబోసి గాదులలోను, పాణకలలోను నిలువచేసికొనుచుండిరి. నూర్చిన ధాన్యమున 'కవసిత' మనియు, ఎగురబోసినధాన్యమునకు "బూత" మనియు నామలింగానుశాసనమున

(1) ఆపాదపద్మప్రణతాః కలమా ఇవ తే రఘుమ్, ఫలైస్సంవర్ధయామాసు,రుత్ఖాతప్రతిరోపితాః. రఘువంశము.(స.4.)
(2) తాంబూలీనాం దళైస్తత్ర రచితాపానభూమయః, నారికేళాసవం యోధాః శాత్రవం చ పపుర్యశః. రఘు.(స.4.)
(3) తతో వేలాతటేనైవ ఫలవత్పూగమాలినా, అగస్త్యచరితా మాశా మనాశాస్య జయో యయౌ. రఘు.(స. 4.)
(4) అనేన సార్ధం విహరాంబురాశే స్తీరేషు తాళీవన మర్మరేషు. రఘు. (స. 6-57.)
(5) బలై రధ్యుషితా స్తస్య విజిగీషోర్గతాధ్వనః, మారీచోద్భ్రాంతహారీతా మలయాద్రే రుపత్యకాః. రఘు.(స.4-46.)
(6) ససంజు రశ్వక్షుణ్ణానా మేలానా ముత్పతిష్ణవః, తుల్యగంధిషు మత్తేభకటేషు ఫలరేణవః. రఘు. (స. 4-47.)
(7) అరణ్యకోపాత్తఫలప్రసూతి స్తంబేన నీవార ఇవావశిష్టః. రఘు (స. 6.)

గలదు. ఈ కాలమున "షాగువు" వస్తువులగు "జీలకఱ్ఱ, కొత్తిమిరి, కరివేపాకు" మొదలగు పదార్థము లభివృద్ధినొందినవి భరతఖండము వనములకు ప్రసిద్ధికెక్కినది. రవీంద్రనాథఠాకూరు మహాకవి యొకప్పుడు చెప్పినటుల, శాస్త్రగ్రంథము లరణ్యములనుండియే పరిశోధనలతో గూడ బయలుదేరినవి. మతస్థాపకు లరణ్యముననే నివసించుచుండిరి. బుద్ధుడు తన మతబోధలను, వేణ్వాదివనములలోనే చేయుచుండువాడు. ఏయేదోహదముల జేసిన నెట్టివృక్షము లభివృద్ధినొందునో నాటివారికి దెలియును. విత్తనముల మొలకగట్టుట, బీజములనుండి నూనెదీయుట, దూదినుండి నూలువడుకుట, యెంతపరిమితి కెంతద్రవ్యము కలుగునో వారికి దెలియును. గ్రంథవిస్తరభీతిచే మూలరహితముగ, కౌటిలీయార్థశాస్త్రమునుండి కొన్నిటిని వ్రాయుచున్నాను.

(1) ధాన్యములను నానబెట్టి మొక్కగట్టినచో రెండున్నరరెట్లు హెచ్చుకొలతకు వచ్చును. ధాన్యము పూచిపోయి పాడైనపు డైదవవంతు హెచ్చుగ కొలతకు వచ్చును. నువ్వులు, కుసుంభములు, హింగుదీబీజములు నూనెదీయుట కిచ్చినపుడు నాలవవంతు శుద్ధతైలము వచ్చును. అవిసెగింజలనుండి యారవవంతునూనె వచ్చును.

అయిదుపలముల ప్రత్తి, పట్టుకాయలనుండి యొకపలముదారము వచ్చును.

అశోకవృక్షము మొదలగు వృక్షములు పుష్పించుటకు కొన్నిదోహదక్రియలజేయుచుండిరి. అందొకదానిని మాళవికాగ్నిమిత్రనాటకమునుండి వ్రాసెదను:

(2) నవాంబురుహకోమలమై యందెలవప్పుడు కలిగిన యీమాళవికపాదములచే గౌరవింపబడిన యో యశోకమా! నీవు తత్క్షణమే మొగ్గల నెత్తకపోయిన యెడల కాముకసాధారణమగు దోహదమును వ్యర్థముగా వహించుచున్నావు.

ఈవర్ణనము మాళవికచరణమునకు లత్తుక బూసి కొని నూపురములను ధరించి, యశోకపుచిగుళ్లను ధరించి యశోకమును దన్నినపు డగ్నిమిత్రుడు వర్ణించినది—

పైయశోకవృక్షము దోహదవిశేషముచే నైదుదినములలో మొగ్గనెత్తెనని మాళవికాగ్నిమిత్రనాటకమునందైదవయంకమున వర్ణింపబడెను. శంఖ, లిఖిత, గౌతమ, ఔశనస ధర్మశాస్త్రము లించుమించు బౌద్ధకాలాంతమున బుట్టియుండునని తలంతును. ఆస్మృతులలో చింత, నిమ్మ, దానిమ్మ, పనస" మొదలగు వృక్షములనుగురించియు వాటి ఫలములనుగురించియు వర్ణనలు కలవు. అందువలన పైవృక్షములను, వనములను నాటివారు పెంచుచుండిరని చెప్పవచ్చును. వాగ్భటుడు "బాహట"మను గ్రంథమునందు విశేషముగ సస్యములను, ధూమపానములను జెప్పియున్నాడు; కాని మిరపకాయ, పొగాకు, నల్లమందుల ప్రశంస యందులేదు. అవి మహమ్మదీయుల కాలమునం దీదేశమున బ్రవేశించినవి. మిర్చికి బదులు మిరియములను వాడిరి. "గంజాయి" ఉపనిషత్తుల కాలమునందే వ్యాపించి యీకాలమున వృద్ధినొందినది. నేడు రాష్ట్రాదాయములో ముఖ్యముగా పరిగణింపబడుచుండిన "మద్యాదాయము" (ఎక్సైజ్), "మౌర్య చంద్రగుప్తుని" కాలమునందు "దుర్గాదాయము" (స్థానిక స్వపరిపాలనము)నకు సంబంధించియున్నది. మద్యవ్యవహారము వ్యవసాయమునకు సంబంధింపదు; కాని మద్యము భోజ్యద్రవ్యముగా నేడు పాశ్చాత్యదృష్టియందుండుటచే దానిని కౌటిలీయార్థశాస్త్రమునుండి మూలరహితముగ క్లుప్తీకరించి వ్రాయుచున్నాడను.

(3) నాడు "మేదక. ప్రసన్న, ఆసవ, అరిష్ట, మైరేయ, మధువు" లను నారు విధములగు మద్యములే కలవని యర్థశాస్త్రమునందు కలదు. అందాసవారిష్టములు కేవల వ్యాధినివారకములును శుష్కమానవ బలకరములు నగుటచే దేశోపకారములుగానే యుండును.

---

(1) కౌటిలీయార్థశాస్త్రము, 36 వఅధ్యాయము.

(2) శ్లో. అనేన తనుమధ్యయా ముఖరనూపురారావిణా, నవాంబురుహకోమలేన చరణేన సంభావితః; అశోక! యది సద్యఏవ ముకులైర్నసంపత్స్యసే, వృథా వహసి దోహదం లలితకామిసాధారణమ్. మాళవికాగ్నిమిత్రము, 16 శ్లోకము.

(3) కౌటిలీయార్థశాస్త్రమ్; 46 అధ్యాయము.

(1) "ఇప్పపూవు" నుండి తీయబడిన "మధువు"ను, మామిడిపండ్లరసముతో జేయబడిన "సీధువు"ను క్షత్త్రియవైశ్యు లుపయోగింపవచ్చు నని కుమారిలభట్టు తంత్ర వార్తికమునందు కృష్ణార్జునులు "మధ్వాసవక్షీబు" లైరని బౌద్ధు లాక్షేపించినపుడు ప్రత్యుత్తరముగా వ్రాసియున్నాడు.

పైపద్యములలో పిండితో జేయబడిన మేదకము, తాళజమగు ప్రసన్నము, బియ్యపు సారాయియగు మైరేయముమాత్రము దోషావహములై యున్నవి. "మైరేయ"మును యుద్ధసమయమునందు క్షాత్రకాలమునుండి నేటివరకును ప్రాచ్యపాశ్చాత్త్యు లుపయోగించుట విచారణీయాంశమై యున్నది. నేడు ప్రపంచమందంతటను నేవిధమగుమద్యము నుపయోగింపరాదను మహోద్యమ మొకటి వ్యాపించి యుండుట ప్రపంచశాంతికి పరమేశ్వరుడు నిర్మించిన శాంతి సందేశమని తలంపవలసి యున్నది.

సురాపానము ఋగ్వేదకాలమునుండి నేటివరకు భరతఖండమున గలదు కాని దానినన్నికాలములయందును నార్యులు నిషేధించుచునే యున్నారు. (2) "కల్లు ద్రావరాదు" అని యుపనిషత్తులును, (3)"తినెడి పదార్థములలో సురయే పాపకరమైనది. అందువలన త్రైవర్ణికు లెపుడును సురాపానము చేయరా" దని తంత్రవార్తికకారుడును పెక్కండ్రు స్మృతికర్తలు నిషేధించుటయే కాక ఘోరప్రాయశ్చిత్తములగూడ విధించియున్నారు. కాని దీనివలన గొంతద్రవ్యాదాయము కలుగుటచే ప్రతిప్రభుత్వము సురాపానమునకు సమ్మతించుచున్నది. కౌటిల్యుడు సురాపానమునకు కొన్నివిధులను నిరూపించుచున్నాడు. అందుక్రిందివి ముఖ్యమైనవి.

(4) "పానశాల పెక్కుగదులును, వేర్వేరు శయ్యాసనములును, గంధమాల్యోదకములును, నాయాఋతువుల కనుగుణమగునటులు సుఖవస్తువులును, కలిగియుండవలెను. పానాగారములయందు గూఢచారులు దాగియుండి, కల్లుద్రావువారు చేయువ్యయములను ఆగంతుకుల చర్యను, మత్తసుప్తుల యలంకారాచ్ఛాదనద్రవ్యములను జాగ్రత్తతో, చూచుచుండవలెను. మత్తసుప్తుల యలంకారాదులలో నేదైన పోయినపుడు పానశాలాధ్యక్షుడు నష్టపడినవాని కాద్రవ్యమూల్యము నిచ్చుకొనుటయే కాక దండనకుగూడ పాత్రుడగును. అందరును పానాగారమునందే త్రాగవలెను. కర్మకరులు ప్రమాదము నొందకుండగను, ఆర్యులు మర్యాదాతిక్రములు కాకుండగను, దుర్మార్గు లత్యంతోత్సాహులు కాకుండునట్లుగను, పావుశేరు మొదలు శేరువరకు పానము చేయవచ్చును. విశేషముద్రకలవారు మద్యము నింటికి దీసికొనిపోవచ్చును. నిర్ణీతప్రదేశముల దప్ప మరియొకచోటున సురావిక్రయము జేసినవానికి నారువందలపణము లపరాధము విధింపబడును. సురాశాల లొకదానికొకటి దూరముగా నుండవలెను. సురను గ్రామములనుండి బయటికి దీసికొనిపోరాదు. గాటుసారాయిని, గుఱ్ఱములు మొదలగు వాహనములకును, పందులకును బోయవలెను. పానశాలయందుండు గూఢచారులు త్రాగుబోతులయొక్క చర్యల బరిశోధించి చోరాదుల దెలిసికొనవలెను. సురాధ్యక్షుండే సురను జేయించి, వర్తకులద్వారా విక్రయింపవలెను. ఇతరులు సురనుజేసియమ్మినచో నూటికైదు చొప్పున పన్ను నిచ్చుకొనవలయును.

ఇది నాటిసురా సురాపానచరిత్రము. నేటికిని నాటికి గలభేదమును తజ్ఞులు తెలిసికొందురు గాక!

---

(1) యత్తు వాసుదేవార్జునయో ర్మద్యపానస్మృతివిరుద్ధ ముపన్యస్తం, తత్రాన్న వికార సురామాత్రస్యైవ త్రైవర్ణికానాం ప్రతిషేధః......మధుసీధ్వోశ్చ క్షత్త్రియవైశ్యయో ర్నప్రతిషేధః కేవలబ్రాహ్మణ విషయత్వాత్— కుమారిలభట్టకృత తంత్రవార్తికమ్.

(2) "నసురాం పిబేత్".

(3) సురావై మలమన్నానాం పాప్మాచ మల ముచ్యతే, తస్మా ద్బ్రాహ్మణ రాజన్యౌ వైశ్యశ్చ న సురాం పిబేత్. తంత్రవార్తికమ్.

(4) కౌటిలీయార్థశాస్త్రము, 46 అధ్యాయము.

ఈకాలమునందు జ్యోతిష్యవనశాస్త్రము లభివృద్ధినొందినవి. ఎచటనెచట నెంతెంతవర్షముకురియునో ఏయేగ్రహసంచారముచే నెటులుఫలించునో దైవజ్ఞులు కనిపెట్టిరి. "గర్గసంహితా"దిగ్రంథము లీనాడే పుట్టినవి.

చాణక్యు డర్థశాస్త్రమునందు, నాడు కలవర్షప్రమాణమును గ్రహస్థితులచే దెలిసికొనుచుండిన, వర్షసస్యాదివృద్ధులను స్వల్పముగ వ్రాసియున్నాడు. దానిని క్రింద వ్రాయుచున్నాను.

(1) నిర్జలస్థానములలో పదునారు ద్రోణముల (అంగుళముల) వర్షమును, జలప్రాయప్రదేశములలో నిరువదినాలుగు ద్రోణములవర్షమును, వ్యవసాయోపయుక్తములగు "అశ్మక" దేశములలో పదుమూడున్నర ద్రోణముల వర్షమును, అవంతీ(ఉజ్జయినీ) దేశమునం దిరువదిమూడు ద్రోణములవర్షమును అపరాంత (పడమటికనుములు)మునందును హిమవత్పర్వత ప్రాంతమందును, కాలువల మూలమున వ్యవసాయముజరుగు ప్రదేశములందును కాలానుగుణముగ నమితవర్షము కురియును. కురియువర్షములో మూడవవంతు ఆషాడ కార్తీకమాసములందును, తక్కినది శ్రావణ భాద్రపదాశ్వయుజ మాసములందును కురిసిన యెడల సమరూపవర్ష మందురు.

బృహస్పతియొక్క స్థానగమనమధ్యస్థానముల నుండియు, శుక్రునియుదయాస్తమయచారములనుండియు, సూర్యుని ప్రకృతి వికృతుల బట్టియు, అవర్ష ప్రవర్షముల దెలియవలెను.

సూర్యుని బట్టి బీజసిద్ధిని, బృహస్పతిబట్టి కాండవృద్ధిని, శుక్రునిబట్టి వర్షమును దెలిసికొనవలయును.

సప్తాహిక (నీటిభూమినుండి స్వీకరించునవి, యురుమునవి) మేఘములు మూడు, నీటిని బిందురూపముగా వదలునవి యెనుబది, ఎండ గాయుమేఘము లరువది, ఇవియే వర్షకారణములు. వాతాతపయోగములు సమమైయేప్రదేశమునందు మూడుమార్లు దున్నుటకనువగునటులు వర్షము పడునో యాప్రదేశము సస్యసమృద్ధమగును. వ్యవసాయకు డల్పమధ్య మాధికవృష్టులకు దగునటులు సస్యభేదములను వేయుచుండవలెను. భావిపరిశోధనలలో నింకను బౌద్ధకాల పరిశోధనవిశేషములు తెలియవచ్చును.

పశువర్ధనము

ఈకాలమున పశువు లత్యధికవృద్ధి నొందినవి. బౌద్ధమత ప్రచారమునలన పశుమేధము లడుగంటినవి. జైనమతాతిశయమువలనను, అశోకాదిసమ్రాట్టులయొక్క ప్రేరణమువలనను జీవదయాతత్వమభివృద్ధినొంది మనుష్యవైద్యశాలలతోపాటు పశువైద్యశాలలును బయలుదేరి, పశువర్ధనమునకు గారణమైనవి. అశోకచక్రవర్తి యూరపుఖండములో గూడ పశు వైద్యశాలల నేర్పఱచి యుండెనట! ఆతడు స్వదేశమున నెంత యభివృద్ధి చేసియుండునో మనమిప్పు డెటులుచెప్పగలము? గ్రామనిర్మాణము గోవృద్ధి కనుకూలముగా నుండవలె ననువిశేషవిధి యానాడు కలదు.

---

(1) షోడశద్రోణం జాంగలానాం వర్షప్రమాణ మధ్యర్థ మనూపానాం దేశవాసానా మర్ధత్రయోదశాశ్మకానాం త్రయోవింశతి రవంతీనా మమిత మపరాంతానాం హైమన్యానాంచ కుల్యావాపానాంచ కాలతః. వర్షా త్రిభాగః పూర్వపశ్చిమమాసయోః ద్వౌభాగౌ మధ్యమయోః సుషమారూపంత స్యోపలబ్ధి ర్బృహస్పతే స్థానగమన గర్భాధానేభ్యః శుక్రోదయాస్తమయచారేభ్యః సూర్యస్య ప్రకృతి వైకృతాచ్చ.

సూర్యా ద్బీజసిద్ధిః, బృహస్పతే స్సస్యానాం స్తంబకారితా, శుక్రాద్వృష్టిరితి."

శ్లో. త్రయ స్సప్తాహికా మేఘా అశీతిః కణ శీకరాః, షష్టి రాతప మేఘానాం ఏషా వృష్టి స్సమాహితా.

వాత మాతపయోగంచ విభజ న్యత్ర వర్షతి, త్రీన్ కర్షకాంశ్చ జనయన్ తత్ర సస్యాగమో ధ్రువః.

తతః ప్రభూతోదక మల్పోదకంవా సస్యం వాపయేత్—కౌటిలీయార్థశాస్త్రమ్, పంచచత్వారింశోఽధ్యాయః.

(1) గ్రామమునకు దగినటులు గోవులు సంచరించుటకును, బ్రాహ్మణుడు గడ్డి, పుష్పములు, సమిధలు తెచ్చుకొనుటకును, రాజు తగినభూమి నేర్పరుపవలెను. గ్రామమునకు, పొలమునకు నడుమను నూరుధనుస్సులు (400 మూరలు) ప్రమాణముగల మందబయలుండవలెను. ముండ్లు రాళ్లుగల ప్రదేశమైనచో నంతకు రెండురెట్లు ప్రమాణముగల మందబయలుండవలెను.

(2) దున్నకుండగ నుండినభూములలోను బసువుల మేతకుగాను బీడులను విడువవలెను. గోజాతి విశేషముగా నుండుటచేతను వెవ్వేరుగురుతుల బెట్టుకొని నాటివారు వ్యవహరించుచుండిరి. కొన్నిటి నిట వ్రాయుచున్నాడను.

(3) ఔక్షకము=ఎద్దులగుంపు, గవ్యా=ఆవులగుంపు, వాత్సకము=లేగలగుంపు, (ఒక్కొక్కదానినే గుర్తుపట్టవలసినయెడల) మహోక్షము=పెద్దయెద్దు, జాతోక్షము=బలసినయెద్దు, తర్ణకము=అపుడుపుట్టినలేగ, శకృత్కరి=పేడాదివయస్సుదాటనిదూడ, దమ్యము=దున్నెడియీడు గలగిత్త, ఆర్షభ్యము=ఆబోతగుటకుదగినయెద్దు, ఇట్వరము=ఆబోతు, నస్యోతము=ముక్కునకుద్రాడుగ్రుచ్చినయెద్దు, ప్రష్ఠవాట్=దున్నుట, మోయుట నేర్చుకొనుచుండిన యెద్దు, శాకటము=బండియెద్దు, ప్రాసంగ్యము=మున్నెడి యెద్దు.

(4) అశ్వము=మరుకుగనడచుయెద్దు, అశ్వతరము=వేసడముపలె పరుగెత్తు ఎద్దు.

(5) ఇట్టివిభాగములే యావులకునుగలవు. నైచికి మంచియావు, వశ=గొడ్డావు, అవతోక=దైవవశమునఈచుకొనిపోయినయావు, లేహత్=ఆబోతెక్కుటచే ఈచుకొనిపోయినయావు, సంధిని=ఎదబోయుయావు, ఉపసర్యా=పొర్లదగియున్నయావు, ప్రష్ఠౌహి=లేజూడియావు, పరేష్టుక=పెక్కీతలీనినయావు, ద్రోణదుఘ=నాలుగుశేర్లపాలిచ్చునావు, (కౌటిల్యుని వ్యావహారిక ద్రోణము 187 పలములయెత్తు). సమాంసమీనా=ప్రతివత్సరము ఈను ఆవు ఇటులనే, యేండ్ల ననుసరించి "ద్వివర్షి, త్రివర్షి" యను పేరుల బెట్టుచుండిరి. విస్తారము పాడియుండుటచేతను పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, నేయి మొదలగు వానియం దుండు వెవ్వేరుభేదములకు వెవ్వేరుపేరుల బెట్టుచుండిరి. మేకలను గొఱ్ఱెలను రోమముకొఱకును పాలకొఱకునుగూడ పెంచుచుండిరి. మేకబొచ్చుతో నేసినబట్ట కొకపేరును, గొఱ్ఱెబొచ్చుతో నేసినబట్ట కింకొక పేరునుగలవు. చెవులపిల్లి బొచ్చుతో నేసినబట్ట కలదని యమరుడు వైశ్యవర్గులో వ్రాసియున్నాడు (ఇది నేటివ్యవసాయశాస్త్రజ్ఞు లెరుగరు). దానికి "శశోర్ణ" మనిపేరు. కడచిన యైరోపామహాసంగ్రామమునందు, జర్మనీదేశీయు లాహారముకొఱకు తమదేశమునంగల గొఱ్ఱెలను, మేకలను నామమాత్రశేషముగ వధించుటచేతను "ఊలు" బట్ట లాదేశమునం దరుదైనవట. ధీశాలురగు జర్మనుదేశీయు లిపుడు కుందేళ్లబొచ్చుతో నేసినబట్టలు, ఊర్ణవస్త్రములకు మారుగా వాడవచ్చుననియు, కుందేళ్లచిరకాలములో బెఱుగుననియు గనిపట్టి యటులు చేయుచుండిరని వార్తాపత్రికలలో జదివియున్నాము. శశోర్ణము బౌద్ధకాలముననే భారతీయులచే గనిపెట్టబడినదని గ్రంథములు చెప్పుట యాశ్చర్యకరమైనది. ఆంగ్లకలాశాలలలో రక్తప్రసారమును, హృదయకోశపరిశీలనమును విద్యార్థులకు జూపుటకుగాను శారీరకశాస్త్ర (ఫిజియాలజీ) పండితులు దానిని తెప్పించుచుందురు. చెవులపిల్లి మాంసాహారులకు భోజ్యముకూడ అగుచున్నది. కాన

(1) గ్రామ్యేచ్ఛయా గోప్రచారో భూమేరాజవశేనవా, ద్విజస్తృణైంధః పుష్పాణి సర్వత స్స్వవ దాహరేత్;
ధనుశ్శతపరీణాహో గ్రామక్షేత్రాంతరం భవేత్, ద్వేశతే కర్వటస్యస్యా న్నగరస్య చతుశ్శతమ్.

[యాజ్ఞవల్క్యస్మృతి—వ్యవహారకాండ.]

(2) అకృష్యాయాం భూమౌ పశుభ్యో వివీతాని ప్రయచ్ఛేత్. కౌ. అర్థశాస్త్రము, (2-20)

(3) నామలింగానుశాసనమ్, వైశ్యవర్గ

(4) కౌటిలీయార్థశాస్త్రము (2-29)

(5) నామలింగానుశాసనము, వైశ్యవర్గ.

వర్తక, వాణిజ్య, శారీరశాస్త్రములద్వారా మిక్కిలి యుపయోగించు "శశవర్ధనము" భవిష్యత్కాలమున నవసరమగునేమో ?—గేదెపాల నుపయోగించుచున్నటులు సామవేదమునందే కలదు కాని యజుర్వేదమునందు "దున్నపోతు" మృగముగా వర్ణింపబడుటచే మహిషముచే దున్నుటకాని బరువునుమోయించుటకాని, బండిని లాగించుటకాని నాత్రికాలమున లేదని తలంపవలసియున్నది. బౌద్ధకాలగ్రంథములలో మహిషవాహన మచటనచట వర్ణింపబడుటచే నప్పటినుండియే మహిషము వ్యవసాయాంగజంతువుగా మారియుండును. ఈకాలమున నింతగ పాడిపంట లభివృద్ధినొందినను దేశీయులకు తృప్తిగలుగక మహాకవులు తమగ్రంథములయందు పాలసముద్రమును, పెరుగుసముద్రమును, నేతిసముద్రమును, చెఱుకుసముద్రమును గల్పించిరి. మధువుల తృప్తినొందించుటకు గాబోలు కల్లుసముద్రముగూడ కల్పించిరి. నేటికాలమునందు భరతఖండమునందేకాక ప్రపంచమంతటను, "ఇక్షు, దధి, క్షీర, సర్పి" సముద్రములకంటె సురాసముద్రమే హెచ్చుగనుప్పొంగుచున్నది. పాడి యైశ్వర్యమునకు నెలవగునుగాన క్షీరములనుండియే, యైశ్వర్యాధిదేవతయగు లక్ష్మియుద్భవించెనని పండితులు, కవులు కల్పించియుందురు. కర్షకులయింట పాడియుండుననియు వారియింటనే లక్ష్మియుండుననియు, దలచికాబోలు "హాలచక్రవర్తి" గాథాసప్తశతియను ప్రాకృతకావ్యమునందు కర్షకతనూజ నిటులు వర్ణించుచున్నాడు:

(1) పథికులు వ్యవసాయకునింట పిండిబొమ్మవలె తెల్లగనుండినవానికూతుంజూచి పాలసముద్రమునుండి పుట్టినలక్ష్మియేమో యని రెప్పవేయక చూచుచున్నారు.


నాటిమహారాజులు విశేషగోబృందముకలవారై యుండిరి. దానిని దిలీపునిగాథలో కాళిదాసిటులువర్ణించుచున్నాడు :

(2) ఓదిలీపా! యీయావొక్కదానిచేతనే గురువున కపరాధము జేసితినని తలపకుము. వసిష్ఠుని కోపము బోగొట్టుటకు నీకడ నుండంతపాడువుగల కోట్లకొలది యావులు లేవు గనుకనా ?

గోవత్సము లవధ్యములని చాణక్యుడు తనయర్థశాస్త్రమునం దిటులు వ్రాసియున్నాడు:

(3) లేగదూడలు, వృషభములు, గోవులు నవధ్యములు. వీనిని వధించువాని కేబదిపణములు దండము—

నాటిమహారాజులు విశేషగోబృందముకలవారై తమగోవులపై గోధ్యక్షు డను నుద్యోగినిగూడ నుంచి గోబృందాభివృద్ధికి దోడ్పడుచుండిరి. గోవులు, మహిషములు, మేకలు, గాడిదలు, ఒంటెలు, గుఱ్ఱములు, వేసడములు మొదలయినవానియొక్క యోగక్షేమాభివృద్ధికి జూచుటకునాటిప్రభువులు తమప్రభుత్వమునందు వ్రజశాఖయును నొకశాఖనుంచిరి. గోధ్యక్షుడు చేయవలసిన విధులను కౌటిలీయార్థశాస్త్రమునుండి మూలరహితముగ వ్రాసెదను.



(1) పేచ్ఛంతి అణిమిసచ్ఛా పహిఆ హాలిఅస్స పిట్ఠపాండురిఅం, ధూఅం దుద్ధసముద్దుత్తరంతలచ్ఛిం విఅ స అణ్హా.—(౮౮) గాథాసప్తశతి;

(2) అథైకధేనో రపరాధచండాద్గురోః కృశానుప్రతిమాద్బిభేషి, శక్యోఽస్య మన్యుర్భవతా వినేతుం గాః కోటిశః స్పర్శయతా ఘటోధ్నీః.—ర, వం (౨-౪౯)

(3) "వత్సో వృషో ధేనుశ్చైషా మవధ్యాః, ఘ్నతః పంచాశత్కో దండః.—కౌ. అ.

ద్రౌపదీవాక్యము

పళ్లె పూర్ణప్రజ్ఞాచార్యులు గారు

పాండవులమాటపై దౌత్యభారమూని
సంధియొనరింపఁ గౌరవసభకుఁ బోవు
నబ్జనాభునితో నిట్టులనియె ద్రుపదు
పట్టి, మదిలోనఁ గోపంబుఁబట్టలేక.

అన్న! నావిన్నపం బొక్కఁ డాలకింపు
మేవియో చెప్పెదనటంచు నెన్నఁబోకు
పతులచేతను, వంచింపఁబడియె నంచు
నైన దయలేదె? చెల్లెలిపైన నీకు.

నన్నుఁబోలెను బుడమి మున్నెన్నఁడైన
నవమతిఁ గన్నయట్టి యిల్లాలుకలదె?
చెంతనుండియు నెవ రుపేక్షింపఁ గలరు?
పరులు తమభార్యలను భంగపఱచుచుండఁ

ద్రుపదభూపాలునకుఁ గూర్మి దుహితనయ్యుఁ
బాండునందనులకు ధర్మపత్నినయ్యు
నీకుఁ జెలియలనయ్యు లోకైకవినుత!
పరులచే బల్మి సభ కీడ్వఁబడితి నాఁడు.

ఉ. యాదవసింహా! నీవెఱుఁగ
వా? ననుఁ బాండవధర్మపత్ని శౌ,
ర్యోదయలీల గ్రాలఁగఁ సు
యోధను నానతి దుస్ససేనుఁ డా,
హా! దయమాలి వేణిఁ గొని
యందఱుఁ జూడఁగనిండుఁ గొల్వులో,
నీదరి కీడ్చినన్ క్షమ వ
హించియె పాండవు లూరకుండుటల్.

అయ్యయో! పాండుసుతులు దుఃఖాబ్ధినుండి
యుద్ధరింపంగఁ బడిరి యావృద్ధరాజు
చేత దుర్యోధనునిమాటఁ జెవినిబెట్టి
ఘోరకాంతారమున కంపుకొఱకొ, యేమొ?

పరులొనర్చిన యవమానభరమునెల్ల
సైఁచియే యూరకుండె నజాతవైరి
మాఱుచేయంగఁ దగిన సామర్థ్యమున్నఁ
దలఁచనే యింతయేని శాత్రవుల కెగ్గు.

బలులు, భీమార్జునులు నట్టిపట్లనైత
మన్న మోమునె చూచుచు మిన్నకుండి
రాతతాయుల ధృతరాష్ట్ర నాత్మభవులఁ
జేయ రేటికొ? భస్మావశేషులుగను.

మురదానవమర్దన! యా
కురువృద్ధునకేను దలఁపఁ గోడలఁగానో?
భరియింపరాని యా నా
పరిభవ మతఁ డెట్లుసైఁచెఁ బ్రాజ్ఞుండయ్యున్.

గీ. అల్లదుర్యోధనుని యుల్లముల్లసిల్లఁ
జేయ సూతసుతుండు "దాసీ!" యటంచుఁ
బ్రాభవోపేతుఁడై నన్నుఁ బరిహసించెఁ
దఱిగికొని పోవు నది మదిఁ దలఁచికొన్న.

ఉ. ఎక్కిడఁగాని విల్లు వరి
యింపను నేనితనిఁ గులంబులోఁ,
దక్కువవాఁ డటంచు బెడి
దంబుగఁబల్క స్వయంవరంబులో
మిక్కుటమైన లజ్జ విర
మించెఁ బ్రయత్నమునుండి దాన నీ
మ్రుక్కడి వెక్కిరించె నను
మున్నటు నే సభ బన్నమొందఁగన్.

నుతగుణ! రుక్మిణి నీవలె,
నతుల భుజాశక్తిఁగొనియె నర్జునుఁడు నన్‌
ధృతరాష్ట్రసుతుఁడు నేఁటికి
బ్రతికెయున్నాఁడు బల్మిఁబట్టియు సభ,నన్.

ఏకవస్త్ర, నన్నుఁదాఁకకుమన నేక
వస్త్రవేని, విగతవస్త్రవేని
విడువ నిన్నటంచు వెంటాడె, నాదుస్న
నేనుఁ డెట్లు సైఁతు వానిచెయిది.

గురులుఁ గురువృద్ధులును నెలకొనిన నిండు
సభను దొడనుండుమని నన్ను సైఁగఁజేయ
ధార్తరాష్ట్రుఁడు భీముఁ డత్తఱినివాని
తొడను జేయఁడదేలకో తుండెములుగ?

ఏమియొనరింప భీమున కింతబలము?
కరమునందేల నరున కాగాండివంబు?
సమరమందు సుయోధనుఁ జంపకుండ
సలుపుచున్నారు యత్నంబు సంధికొఱకు.

ఉపవసించుటలేల, యాతపములేల,
యేల ప్రత్యక్షమాయె నాయీశ్వరుండు?
వితయకా, పరమాస్త్రసంవేదియైన
శక్రతనయుండుఁ జేసాచె శాత్రవులకు.

మురహర! పార్థుఁడు నీవును
నరనారాయణులుకారె? న్యాయ్యమె? నాకా
నరిపరిభవజార్తిని బా
పరు? మీకే నంతప్రేమ పాత్రనుగానో?

సంధియొనరింపఁ గౌరవసభకుఁ బోవ
నెంచితివి, కారుణికుఁడవు; మంచిమాట
సంధియపుడేన్ స్మరింపు దుశ్శాసనోగ్ర
పాణి దూషితమైన యీవేణిఁ గృష్ణ!

దీనతను పాండుసుతులు సంధియ యొనర్ప
గాత, ధృతరాష్ట్రసుతులతోఁ గయ్య ముడిగి
వృద్ధతముఁ డయ్యు నాతండ్రి యుద్ధమునకె
కడఁగు, నాభంగపాటోర్వఁ గలఁడె యతఁడు.

ఉ. ఇంతకు నాపయిన్ బతు లు
పేక్షగనుండిన నుండనిమ్ము,
ధీమంతులు శౌర్యవంతు లభి
మన్యు పురస్సరులైన బాహువి,
క్రాంతులు నందనుల్ కలరు
గా మఱివారలఁ బంపియేని, మా
యింతు రణోర్వి వైరుల, స
హింతునె? బన్నము వీరమాతనై.

ఏగు జాగయ్యెడిని గౌరవేంద్రసభకుఁ
బంకజోదర! యిమ్మాడ్కిఁ బల్కుమచట
సంధియే కోరిరి పృథాత్మజాతులనుచు
సమరమేకోరె ద్రుపదాత్మజాత యనుచు.

అర్థశాస్త్రము

[వెనుకటి సంచిక తరువాయి]

గండికోట సత్యనారాయణమూర్తిగారు, యమ్. ఏ.

7. వెలల హెచ్చుతగ్గులవలన కలిగెడు లాభ నష్టములు

ధనమూల్యముయొక్క హెచ్చుతక్కువ లనగా వస్తువుల వెలలయొక్క తక్కువహెచ్చు లని కదా చెప్పియుంటిమి. ఇక సామాన్యముగా వెలల హెచ్చుతగ్గులవలన కలిగెడు లాభనష్టములను విచారించెదము.

ఒకపారిశ్రామిక నాయకుడు పదిసంవత్సరముల తరువాత తీర్చెడుషరతుతో రూ. 1000 అప్పు చేసి తనపరిశ్రమవిషయమున పెట్టుబడిగా వినియోగించె ననుకొందము; ఈమధ్యను రూపాయియొక్కవిలువ సన్నగిల్లుటవలన మొత్తముమీద వస్తువులవెల లధికరించిన వనుకొందము. పదిసంవత్సరములపిదప తనఋణము తీర్చుటకై వెల లతిశయించియుండుటవలన కొంచెము వస్తువులను విక్రయించిన చాలును; అనగా వెల లెక్కువగుట మనపారిశ్రామిక నాయకునకు లాభకరముగానే యుండును. సరకుల నమ్మి అప్పులను దీర్చెడు ఋణగ్రస్తులకు వెల లధికరించుట లాభమే. ఋణదాతలకు మాత్రము నష్టమే; ఏమన రూపాయియొక్క విలువ క్రుంగిపోవుటవలన పూర్వము కొనగల్గినన్ని పదార్థములను కొనలేరు. కాని అప్పుల నిచ్చువారు సాధారణముగా వెల లతిశయించియున్నప్పుడు ఎక్కువవడ్డీ పుచ్చుకొనెదరు. వస్తువిక్రయ మొనర్చి లాభమును పొందజూచెడు వ్యాపారస్థులకు వెల లధికరించుట సంతోషదాయకమే. ధాన్యాదులను కొట్లలో పోసుకొని అమ్మకము చేయు భూస్వాములకు వెల లెక్కువైనచో చాల లాభము వచ్చును; జీతవారికిన్ని, నిర్ణీతమైన మాసపుజీతములను సంపాదించెడువారికిన్ని, పించనుదార్లకున్ను వర్తకుల ధరలు హెచ్చినట్లయిన ఎంతో కష్టముగా నుండును. హెచ్చింపబడుటకు వలనుపడని శిస్తులను చెల్లించెడు గుత్తదార్లకు ధాన్యపుధర జాస్తీఅయినయెడల లాభమే; ఏమన కొంచెము ధాన్యము నమ్మినట్లయిన శిస్తు చెల్లించుటకు కావలసినసొమ్ము రాబట్టవచ్చును. భూమియొక్క స్వంతదారునకుమాత్రము నష్టమే; ధాన్యాదులధరలు హెచ్చుగా నున్నసంవత్సరములలో నగదుశిస్తులను పుచ్చుకొనెడు భూస్వాముల కిది అనుభవవిదితమే. అయితే ధరలు మందగించియున్నపుడు నిర్ణీతమైన నగదుశిస్తులు లాభకరముగానే యుండును. ఆహారపదార్థముల వెల లెక్కువగా నున్నపుడు కూలిచేసి జీవించెడు వారికి కష్టమే. అయితే ఒకానొకప్పుడు వస్తువులవెల లధికరించినవని కూలివాండ్రెక్కువకూలి సంపాదించగలరు. మొత్తముమీద మనదేశపు కూలీలకు ధరలహెచ్చున కనుగుణ్యమైన కూలి వచ్చుచుండలే దనికొందరు విమర్శకుల అభిప్రాయము. మరికొన్ని విషయములు: ధనముయొక్కవిలువ తగ్గినట్లయిన, అనగా వస్తువులవెల లధికరించినయెడల సరకులను ఎగుమతిచేయు దేశములకు లాభకరముగాను, ధరలు విజృంభించియున్న దేశములనుండి వస్తువులను దిగుమతిచేయు దేశములకు నష్టముగాను ఉండును. అన్నివస్తువులవెలలున్ను అతిశయించియున్నపుడు గవర్నమెంటువారి రెవిన్యూకూడ మొత్తముమీద తగ్గును; వెలలు సరసముగా నుండి దేశమందు లక్ష్మి తాండవమాడుచున్నయెడల దొరతనమువారు పన్నుల నెక్కువచేసినను ప్రజలు సంతోషముగా చెల్లింతురు.

ధనపరిమాణన్యాయసందర్భమున మనము ముఖ్యముగా గమనించవలసినవిషయ మేమన: ప్రజల డిమాండునకు మించిన ధనరాసులు (నాణకరూపక మైనను, నోట్లరూపక మైనసరి) గవర్నమెంటువారు జారీచేసినయెడల ధనముయొక్క విలువ (Inflation of currency) తగ్గి మీదచెప్పిన కొన్ని అవస్థలు తటస్థించకమానవు; ప్రజల డిమాండునకు తక్కువగా నున్నట్లు ధనరాసులు చలామణీ అగుచున్నయెడల (ప్రత్యేక కారణముల సంగతి గమనించకుడు) వస్తువుల వెలలు తగ్గుటకే (Deflation of currency) చూచుచుండును.

8. ధనవిషయమగు "గ్రెషాం" సూత్రము (Gresham's Law of Money). వస్తుమారకము, అప్పులను తీర్చగల్గుట మొదలగు పనులను చేయగల్గెడు రెండువిధములైన ధనము ఏదేశమందైనను చలామణియగుచుండినయెడల కొన్ని సందర్భములలో తక్కువ విలువగల ధన మెక్కువ విలువగల ధనమును పారదోలును. ఇదియే గ్రెషాం సూత్రము. ఇంగ్లాండుదేశములో ఎలిజబెత్ మహారాణీ రాజ్యముచేయు కాలమందు లండన్ రాయల్ఎక్స్ఛేంజ్ స్థాపకుడగు సర్‌థామస్ గ్రెషాం (Sir Thomas Gresham) అనుభవ విదితమగు స్థితిగతులను గమనించి మీదచెప్పినసూత్రమును కనుగొనుటవలన ఈసూత్రమునకు గ్రెషాం సూత్రమని పేరు వచ్చినది. మన మతిజాగ్రతగా దెలుసుకొనదగువిషయము లీసూత్రమం దున్నవి. తక్కువ విలువ కలధన మెక్కువవిలువకలధనమును పారదోలు ననగా అర్థమేమి? ఈసూత్రసందర్భములో తక్కువవిలువకల ధన మనగేమి? ఎక్కువవిలువగలధనమన నేమి? ఏయే సందర్భములలో ఈసూత్రము వర్తించుచున్నది?


తక్కువవిలువకలధన మెక్కువవిలువకలధనమును పారదోలు ననగా రెండువిధములైన ధనముయొక్క సహాయమున వ్యవహారములను చక్కబెట్టుకొనగల్గినప్పుడు ప్రజలు తక్కువవిలువకలధనమునే (Bad Money, Weak money) చలామణి చేయుచో ఎక్కువవిలువ కలధనమును (Good money, Strong money) వస్తుమారకము మొదలగుపనుల కుపయోగించకుండ దానిని దాచిపెట్టుటయో, దానిని కరిగించి లోహపుముద్దను అమ్మి లాభము తీయుటయో, అన్యదేశములవారికి ఎగుమతిచేయుటయో చేయుచుందురు. తక్కువవిలువగలధన మెక్కువవిలువగలధనమును పారదోలు ననగా మొదట వింతగా తోచును. ఎక్కువవిలువగల లోహనిర్మిత నాణెములకు బదులుగా తక్కువవిలువగల అరిగిపోయిన నాణెములను ప్రజ లుపయోగించుటలో వాస్తవముగా విచిత్ర మేమియును లేదు. ఏమన, ధనమనునది తినుట కుపయుక్తమైన పదార్థము కాదు; తనవద్దనున్న నాణెము ఎవడైనను ఇంకొకని కిచ్చి వానివద్దనుండి వస్తువులను కొనుటకు గదా ఉపకరించుచున్నది. అట్టిసందర్భములో వస్తుమారకమునకుగాని, అప్పులను తీర్చుటకుగాని తక్కువవిలువగల అరిగిపోయిన నాణెమునైనను, లేదా లేశమైనను తూనికకు తక్కువగానుండనిదియును, ప్రశస్తముగానున్నదియున్న, ఎక్కువవిలువకలదియున్న అయిన నాణెమునైనను చలామణి చేయవచ్చును. అయితే ఈరెండువిధములగు నాణెములలో దేనిని ఇచ్చినను సరివస్తువుల నమ్మువాడుగాని, ఋణదాతగాని పుచ్చుకొనితీరవలెనన్న చట్టనిబంధన మున్నపుడు, ఎవడైనను మొదట చెప్పిన తక్కువవిలువకల నాణెము నుపయోగించుటకే ఇష్టపడును. మంచినాణెమం దున్నలోహము ప్రశస్తముగానున్న, తూనికకు సరిగానున్న ఉండుటవలన అట్టి నాణెములను వస్తుమారకము మొదలగువిషయముల కుపయోగించక ప్రోగుచేసి ఆదాలో వేయుటయో, ఆనాణెములను కరిగించగా లభించులోహముతో అలంకారములు పాత్రములు మొదలగునవి తయారుచేయించుటయో, లోహమును అంగడిలో అమ్మకముచేసి లాభమొందుటయో, అన్యదేశీయుల కివ్వవలసిన బాకీలక్రింద ఎగుమతిచేయుటయో ఎవనికైనను సహజము. కావుననే చట్టప్రకారము వస్తుమారకము మొదలగుక్రియ లొనర్చగల రెండువిధములగు నాణెములు దేశములో జారీచేయబడుచున్నపుడు పైనవివరించినట్లు తక్కువ విలువగల నాణెములే వాడుకలో నుండునుగాని ఎక్కువవిలువగలవి అంతర్ధాన మొందుచుండును. ఈసూత్రసందర్భమున తక్కువవిలువగల ధన మనిపించుకొనునవెవ్వి? చలామణీ విలువకన్న వాస్తవమగు బజారువిలువ తక్కువగాగల నాణెములు, ప్రశస్తలోహనిర్మిత ప్రమాణ

నాణకములు, బజారుధరకు రానికాగితపునోట్లు, టంకము జాస్తిగా కలసిన లోహపునాణెములు, వాడుకలో చాలకాల ముండుటవలన అరుగుదలనొందిన నాణెములు, చలామణివిలువలో భేదము కలిగించకుండ గవర్నమెంటువారో కానొకప్పుడు లోహప్రాశస్త్యమును తగ్గించియో, తూనిక తగ్గించియో, ఎక్కువ టంకమును సంకరముచేసియో జారీచేయు నాణెములు (Debased currency)—వీటినన్నిటిని తక్కువవిలువగలధన మనిచెప్పవచ్చును. ఎక్కువవిలువకల ధనమనగా తూనిక, పరిశుద్ధత మొదలగు గుణములు సమంజసముగా నుండుటయే కాక దొరతనమువారి టంకశాలాధికారు లారోపించు విలువకున్ను (Mint value), బజారువర్తకు లారోపించు విలువకున్ను (Market value), ఏవిధమైన భేదములేని ప్రశస్తలోహనిర్మిత నాణకములు. ఇట్టి రెండువిధములగు నాణెములున్ను దేశపుచలామణిలో నున్నపుడు గ్రెషాం సూత్రము వర్తించి మీదచెప్పబడిన మాదిరి మంచినాణెములు క్రమముగా అంతర్ధానమొంది తక్కువవిలువకల నాణెములే వాడుకలో నుండుట తటస్థించును.

కొన్ని ఉదాహరణముల నిక గమనించెదము: 19 వ శతాబ్దాంతమువరకు అనేకదేశములలో "లోహద్వయనిర్మితనాణకచలామణీపద్ధతి లేక "బైమెటాలిజం" (Bimetallism) ప్రబలియుండెను; అనగా బంగారంతోనుగాని, వెండితోనుగాని చేయబడిన నాణెములు ప్రమాణనాణకములుగా చలామణీ యగుచువచ్చినవి; ఇన్ని వెండినాణెముల కొకబంగారునాణెము సమాన (Legal or Mint ratio)మని దొరతనమువారు స్థాపించిన టంకశాలాధికారులు చాటించుచూవచ్చిరి. బంగారమునకున్ను వెండికిన్ని, "ఫ్రీకాయినేజ్" లేక స్వేచ్ఛాముద్రణపుహక్కు ఉండెను. వస్తుమారకము, అప్పులు తీర్చుట మొదలగు పనులకు నిరాటంకముగా ఎంత సొమ్ము మొత్తమువరకైనను బంగారమునాణెములనైనను, వెండినాణెములనైనను, (Unlimited legal tender) ప్రజ లుపయోగింపవచ్చును. అయితే బంగారముయొక్కయు వెండియొక్కయు బజారు ధరలకున్ను (Bullion rates or Market prices of gold and silver) టంకశాలలు నిర్ణయించెడు వెలలకున్ను భేదమేర్పడినప్పుడు చిక్కులు తటస్థించుచు వచ్చినవి. ఆ చిక్కులయొక్క సందర్భముననే "గ్రెషాం సూత్రము" వర్తించుచూవచ్చినది. ఆంగ్లేయనాణకతంత్ర చరిత్రము నుండి (History of the English currency policy) సంగ్రహింపబడిన ఈదిగువవిషయములను జాగ్రతగా గమనించినచో "గ్రెషాం సూత్ర" ప్రవర్తనము స్పష్టపడును. మూడవవిల్లియం రాజ్యముచేయు కాలములో (William III, 1688—1702) లోహద్వయనిర్మితనాణకపద్ధతి (Bimetallism) అమలులో నుండెను. బంగారముతో చేయబడిన గినీలు (Gold guineas)న్ను, వెండితో చేయబడిన షిల్లింగులున్ను (Silver shillings) ప్రమాణనాణకములు; రెండులోహములకున్ను స్వేచ్ఛాముద్రణము లేక "ఫ్రీకాయినెజీ" హక్కున్ను ఎంతలేసి అప్పులనైన తీర్చుశక్తిన్ని (Unlimited legal tender) ఉండినవి; ఒక బంగారపుగినీ 22 షిల్లింగులకు సమానము; ఒక ఔన్సు తూనికగల బంగారమునకున్ను, 15.93 ఔన్సుల తూనికగల వెండికిన్ని ఒకటే విలువకలధనము టంకశాలాధికారులు జారీచేయుచు వచ్చిరి; అనగా, బంగారమునకున్ను వెండికిన్ని 1 : 15.93 రేషియో (Ratio) అనగా 100 బంగారపుగినీలకు 15.93 షిల్లింగులు సమానము. ఆకాలపు బజారు ధరలుకూడ అట్లే ఉన్నవి. అనగా బంగారమునకున్ను వెండికిన్ని టంకశాలయందున్న రేషియో (Mint ratio) మార్కెటు రేషియోకు (Market ratio) సమానముగా నుండెను. కొన్ని సంవత్సరములైనపిదప బంగారపుటుత్పత్తి జాస్తీ అయినందున దానివిలువ మార్కెట్లో తగ్గినది; అనగా పూర్వమువలె ఒక ఔన్సు బంగారమునకు 15.93 ఔన్సులవెండికి బదులుగ 1717-వ సంవత్సరములో 15. 21 ఔన్సుల వెండిన్ని, 1760-వ సంవత్సరములో 14.14 ఔన్సుల వెండిన్ని సమానమైయుండెను. 1717లో ఒకగినీ 21 షిల్లింగులకు సమానమని మాత్రము శాసించిరి. కాని దొరతనమువారు బంగారమునకున్ను వెండికిన్ని కలమార్కెట్టురేషియో టంకశాలలందుకూడ స్థాపించుటకు యత్నించలేదు. 14.14 ఔన్సుల వెండికి 100 గినీలధనము బజారులోనున్న 15.21 ఔన్సులవెండికి 100 గినీలధనము గవర్నమెంటు టంకశాలలో



కోయంబుత్తూరు వ్యవసాయఅరణ్యకళాశాలలయందలి ఆంధ్రవిద్యార్థులు



దక్షిణాఫ్రికా రాయబారులు

నున్ను దొరుకుచు వచ్చినది. 1769లో నున్న స్థితి ఇది. అప్పుడు తక్కువవిలువగల నాణెములు బంగారపు గినీలు కాబట్టి ఎక్కువవిలువగల వెండిషిల్లింగులు "గ్రెషాం" సూత్రానుసారముగా వాడుకలోనుండి తొలగింపబడుచూవచ్చినవి; ప్రజలు లాభమును పొందుచువచ్చిరి. 2100 షిల్లింగులకు 100 గినీలు సమానమని దొరతనము వారి చట్టము. కావున 100 గినీలుకల ఎవడైన 2100 షిల్లింగులను సంపాదించి ఆషిల్లింగులను కరగించగా లభించినవెండిని బజారులో అమ్మినట్లయిన 107½ గినీలను టంకశాలలో ముద్రింపించుటకు కావలసినంత బంగారమును పొందగలిగియుండెను. 7½ గినీలలాభము ఇంతసులువుగా పొందగల్గినప్పుడు షిల్లింగు లిక దేశములో చలామణీ యగుచుండునా? కావు. అందులకు గ్రెషాం సూత్రప్రవర్తనమే కారణము.

1760-వ సంవత్సరము తరువాత వెండి ఉత్పత్తి ప్రపంచములో అధికరించెను. వెండి చౌక అయినది. 1800-వ సంవత్సరములో బంగారమునకున్ను వెండికిన్ని కల బజారురేషియో ఇంగ్లాండులో 1: 15. 68 అయినది. కావున అప్పుడు 'గ్రెషాం' సూత్రానుసారముగ బంగారము నాణెములు దేశపువాడుకనుండి తొలగింపబడుచూవచ్చినవి. ఇట్టిసంకటములం జేసియే ఇంగ్లాండు దొరతనమువారు వెండినాణెము ప్రమాణనాణముకాదనిన్ని, వెండికి స్వేచ్ఛాముద్రణపుహక్కు లేదనిన్ని 1816-వ సంవత్సరములో చట్టనిబంధన మొనర్చి నాటిలగాయతు ఏక స్వర్ణలోహనిర్మిత నాణకపద్ధతి (Monometallic gold standard) ననుసరించిరి. ఐరోపా మహాసంగ్రామకాలములో (1914-1919) ప్రశస్తలోహముల వెలలధికరించుటంజేసి లోహనిర్మితనాణకములు క్రొత్తవి అంతగా జారీచేయబడక ఇంగ్లాండులో ఒకపౌను విలువగల కరెన్సీనోట్లు, మన ఇండియాలో ఒక రూపాయ విలువగల కరెన్సీనోట్లు (One pound notes and One rupee notes) జారీచేయబడినవి. ఇది వరకు చలామణీ అగుచున్న బంగారపుపౌనులున్ను, వెండిరూపాయలున్ను అతివిశేషముగా ప్రజలు వాడుకలో నుండి తప్పించుచుచూవచ్చిరి. టోకెను నాణెముగానున్న ఇండియాదేశపు రూపాయిసైతము ఆకాలమందపురూపమయినది.; అట్లే ఇంగ్లాండులో సువర్ణనాణకమగు పౌను స్టర్లింగుకూడ అంతర్ధానమొందెను. ఇదంతయు గ్రెషాం సూత్రప్రభావమే.

ఈ పేరా ఆరంభమున 'గ్రెషాం' సూత్రమును నిరూపించినప్పుడు "కొన్ని సందర్భములలో" అనిచెప్పియుంటిమి. అట్లేల చెప్పవలయును? ఆసందర్భములెవ్వి? 'గ్రెషాం' సూత్రముకూడ తక్కిన ఆర్థిక న్యాయములవలె కొన్ని ప్రత్యేక స్థితిగతులలవడినగాని వర్తింపదు. ఈ సూత్రము వర్తించుటకు ముఖ్యముగా దేశమందు ధనము తక్కువగానుండకూడదు. వ్యాపారములు సరిగా నడచుట కెంతో కొంత ధనమావశ్యకము. ఆధనము తక్కువవిలువగలదైనను, ఎక్కువవిలువగలదైనను సరివస్తుమారకము మొదలగు క్రియలను నిర్వర్తించుటకు కావలసినంత మొత్తముగా లేనప్పుడు సూత్రము వర్తింపదు. 'గ్రెషాం' సూత్రానుసారముగా ఎక్కువవిలువగల ప్రమాణనాణకములను పరదేశయాత్రచేయించుటగాని, వాటిని ఆదాచేయుటకు దాచిపెట్టుటగాని, కరిగించి నగలను చేయించుటగాని లాభదాయకముగా నుండవచ్చును. కాని వస్తుమారకము మొదలగు కర్మలకే తగినంత ధనము దేశములో లేనప్పుడు ఎక్కువవిలువగల నాణెములు వాడుకలో నుండి సులభముగా తప్పింపబడవు. ఏదేశపు దొరతనమువారైన రెండువిధములగు లోహపునాణెములు నిరాటంకముగా చలామణి అగుచుండవలెనని ఉద్దేశించినచో ఒకలోహమునకు స్వేచ్ఛాముద్రణపుహక్కునుగాని, ఎంతలేసి అప్పులనైన తీర్చగలశక్తినిగాని ప్రసాదింపరు. అందువలననే లోగడ 3-వపేరాలో చెప్పబడినట్లు టోకెను నాణెములకు మీదపేర్కొనబడిన అధికారములు లేవు. బంగారు నాణెములయొక్కయు వెండినాణెములయొక్కయు విలువలు ప్రశస్తలోహముల బజారుధరల ననుసరించియుండునట్లు విడిచిపెట్టక నాణ్యతంత్రవేత్తలగు దొరతనమువారు తగినకట్టుబాట్లను చేయుచున్నారు. 'గ్రెషాం' సూత్రము వర్తించుట కింకొకముఖ్యమైన షరతు ఆవశ్యకము; రెండువిధములగు ధనమున్ను వాస్తవముగా చలామణి కావలెను; అనగా ధన మొనర్చగలకర్మలను చేయగల్గియుండవలెను, లేనిచో సూత్రమువర్తింపదు. ఆరెం

టిలో ఒకవిధమగు ధనమును వ్యాపారస్థులు ఉపయోగించుట కంగీకరించకయే పోయినయెడల సూత్రము వర్తించనే వర్తింపదు. ఆకుపచ్చని వెనుకప్రక్కలుగల నోట్లు (green backs) అమెరికా దేశములో జారీచేయబడినప్పుడు లోహనిర్మితనాణకము లేల 'గ్రెషాం' సూత్రానుసారము అంతర్ధానము కాలేదన ఆనోట్లను ప్రజ లంగీకరించలేదు. వస్తుమారకము మొదలగు క్రియలకా నోట్లు వాడబడుచుండినట్లయిన, సూత్రము వర్తించియుండవచ్చును. ప్రజలుమా కీనోట్లక్కర లేదనుటంజేసి, 'గ్రెషాం' సూత్రమువర్తించుటయే లేదు.

9. నాణకతంత్రపద్ధతులు

ఇంతదనుక ధనముయొక్క కర్మములంగూర్చియు ప్రమాణాముఖ్యనాణకములకు కలభేదములంగూర్చియు, ధనమునకు సంబంధించిన రెండుముఖ్యములగుఆర్థికన్యాయములంగూర్చియు వివరించితిమి. ఈ పేరాలో ప్రపంచమంగు వేర్వేరు కాలములలో సామాన్యముగా నవలంబింపబడిన నాణకతంత్రపద్ధతుల స్వభావమును, అవి కాలక్రమేణ ప్రస్తుతమందములలోనున్న పద్ధతులుగా పరిణమించుటకు కారణములను, వేర్వేరు దేశములలో వేర్వేరు నాణకపద్ధతు లుండుటకు ముఖ్యకారణములను క్లుప్తముగా విశదపరచెదము.

పూర్వకాలమం దనేకదేశములలో ఇప్పటివలె నాణకతంత్రపద్ధతులు లేవు. వస్తుమారకమునకుప్రశస్తలోహనిర్మితంబగు నాణకములుఆవశ్యకసాధనములని ప్రజలు గ్రహించినతరువాతకూడ ఒకనిచేతినుండి ఇంకొకనిచేతికా నాణెములు వ్యవహారక్రియలందు మారుచున్నపుడు లోహముతూనికయున్ను, పరిశుద్ధతయున్ను సరిచూచుటకు త్రాసున్ను, తక్కెడయున్ను పరిశుద్ధతను శోధించగల్గు పరాబులున్ను, తక్కిన పరికరములున్ను (currency by weight) ఆవశ్యకములై యుండెను. వేర్వేరుతూనికలుకలవియు వేర్వేరురకముల ప్రశస్తలోహములతో చేయబడినవియు, వేర్వేరుఆకారములుకలవియు అయిన నాణెములు వాడబడుచున్నకాలమందు మీద పేర్కొనబడిన పురాతనపుకట్టుదిట్టముల ఆవశ్యకత వదుపరులు గ్రహించిరనియే మానమ్మకము. పూర్వకాలములో హిందూదేశము, ఈజిప్టు, ఖాల్డియా, అస్సీరియా మొదలగుదేశములు నాణెములను తూచుకొని, వాటిపరిశుద్ధతను శోధించి, విలువలను నిర్ణయించుచూ లోకమందలి ఎన్నియో ఇతరదేశములతో విపులముగ వర్తకవ్యాపారము జరిపించుచూవచ్చిన వనుటకు చరిత్రాత్మకసాక్ష్యము లున్నవి.

కొన్ని దేశములలో వెండితోను, మరికొన్ని దేశములలో బంగారముతోను, మరికొన్ని దేశములలో రెండుప్రశస్తలోహములతోను ప్రమాణనాణెములను నిర్మించుచూవచ్చిరి. చిల్లరవ్యాపారములకు అనేకవిధములైన అముఖ్యనాణకము లేర్పడినవి. పందొమ్మిదవశతాబ్దాంతము వరకు నాగరకదేశమందలి నాణకతంత్రవేత్తలు ఒకసువర్ణమే ప్రమాణనాణకపు లోహముగా నుండవలెనా, లేక, సువర్ణనాణకములున్ను, వెండినాణెములున్ను ఇష్టమువచ్చినసొమ్ముమొత్తములవరకు అప్పులు తీర్చుకొనుట కధికారముగల ప్రమాణనాణకములుగా నుండవలెనా అనువిషయమునయుక్తియుక్తంబులైన వాదప్రతివాదంబులొనర్చిరి. ఆవాదప్రతివాదముల అంతరార్థమును సరిగా తెలుసుకొనుటకై ఈరెండునాణకతంత్రముల ముఖ్యోద్దేశములను ఏయేదేశములం దేయేకారణములంజేసి ఏకసువర్ణలోహనిర్మితనాణకపద్ధతి (Gold monometallism) అవలంబింపబడెనో, ఎందువలన ప్రశస్తలోహద్వయనిర్మితనాణకపద్ధతి (Bimetallism) మొత్తముమీద నిరసింపబడినదో మనము గమనించవలసియున్నది. రెండుప్రశస్తలోహములతోను చేయబడిన నాణెములు ప్రమాణముగా నుండవలెనన్న, 7వ పేరాలో చెప్పబడినట్లు రెండులోహములకున్ను "ఫ్రీకాయి నేజి" హక్కున్ను, "అన్ లిమిటెడ్ లీగట్టెండరు" గుణమున్ను, (మితిలేని సొమ్ముమొత్తములవరకు అప్పులను తీర్చుగుణము) ఉండవలెను; ఆరెండులోహములకున్ను దొరతనమువా రేర్పరచిన రేషియో మార్కెట్టు రేషియోకు సమానముగా నుండవలెను (Equivalence of the Legal and the Market ratio of gold and silver). ఈ "బై మెటాలిజం" ఒకప్పుడు ఇంగ్లాండు, అమెరికా సంయుక్తరాష్ట్రములు, లాటిన్ యూనియన్ (Latin Union) లో చేరిన ఫ్రాన్సు- ఇటలీ, బెల్జియం, స్విట్జర్లాండు, గ్రీసు అనెడు దేశములలో అమలులో నుండెను. అయితే మీద

పేర్కొనబడిన వరతులన్నియు ఈదేశము లన్నిటిలోను వర్తించలేదు. కొన్ని దేశములలో నొకప్పుడు బంగారపు నాణెము 1-కి ఇన్ని వెండినాణెములు సమాన (Rated bimetallism) మని దొరతనమువారు ఆలోహముల బజారుధరల్లననుసరించి ఏర్పరచుచుండిరి మరికొన్ని దేశములలో ఒకప్పుడటుచేయక బంగారము యొక్కయు, వెండియొక్కయు, ధరలను టంకశాలాధికారులొకవిధముగాను, బజారువర్తకులింకొకవిధముగాను(the System of Parallel standards) నిర్ణయించుచూ వచ్చిరి. అనేకకారణములం జేసి ఏకసువర్ణలోహనాణకపద్ధతి (Gold monometallism) యే1816 వ సంవత్సరము నుండిఇంగ్లాండులోను,1864నుండిపోర్చుగల్‌లోను,1815 నుండి స్వీడెన్‌లోను, 1875 నుండి జెర్మనీలో, 1892 నుండి ఆస్ట్రియాలోను, 1897 నుండి రషియాలోను, జపాన్‌లోను స్థాపింపబడినది. లాటిన్‌యూనియను లోచేరిన దేశములున్ను, అమెరికాయున్ను, మనహిందూదేశమున్ను క్రమముగా వెండినాణెములను ప్రమాణనాణకములుగా నిల్పెడు ప్రయత్నములను వదలుకొనినవి. ఈ వేర్వేరుదేశముల నాణకతంత్రచరిత్రముల నన్నిటిని ఇచ్చట వివరింపబూనుట సాహసకార్యముగాని బైమెటాలిక్ మతమువారి వాదనలను, వాటి విమర్శనములను సంక్షేపముగా నిరూపించెదము; సందర్భానుసారముగ కొన్ని ముఖ్యమైన చరిత్రాంశకవిషయములనుకూడ గమనించెదము.

10. లోహద్వయ నిర్మితనాణకపద్ధతి (Bimetallism) ననుసరించువారి వాదనలు (విమర్శన సహితము)—

(1) ప్రశస్తలోహములు రెండింటితోను చేయబడిన ప్రమాణనాణకములు చలామణి అయ్యేపద్ధతి సువర్ణనాణకపద్ధతికన్న మంచిది ; ఏమన ఎక్కువ నిలుకడకల మూల్యప్రమాణము (More stable standards of value) లేర్పడును.

బంగారముయొక్క ఉత్పత్తియందలి హెచ్చుతక్కువలను, వెండియొక్క ఉత్పత్తియందలి తక్కువహెచ్చులు సరిచూచుకొనును; ధనపరిమాణన్యాయానుసారము వస్తువులవెలలు మిగులజాస్తీగాగాని, తక్కువగాగాని యుండక నిలుకడకలిగియుండును.

ఈ వాదన యుక్తియుక్తముగా నున్నదికాని ప్రశస్తలోహములు రెండింటియొక్క ఉత్పత్తి జాస్తి అయినప్పుడు దేశమందలి నాణకములసంఖ్య అధికరించును. వస్తువులవెల లప్పు డధికరించవా ? వస్తువుల ధరలు పోతరించియుండుట నష్టదాయకమే.

(2) వస్తువులవెల లధికరించినను లాభమే; ఏలన ముఖ్యముగాఅర్థోత్పాదకులు(Prodecers of wealth) ధరలు హెచ్చుగానున్నప్పుడే లాభములను బొందెదరు.

ఉత్పాదకులకుమాత్రము వెల లతిశయించినందున లాభము లెప్పుడును వచ్చుచుండునా ? ఒకవేళ ఉత్పాదకులకు లాభదాయకముగా నున్నను వినియోజకులకు (Consumers) ధరలు హెచ్చిన నష్టము కాదా !

(3) ధరలు జాస్తీఅయినచో ఋణగ్రస్తులకు లాభమే. అవునుగాని, ఋణదాతలకు నష్టముండదా? (6 వ పేరా కడపటిభాగమును గమనించవలెను.)

(4) సువర్ణనాణకములనే ప్రమాణముగానెలకొల్పుపద్ధతి ననుసరించినచో కావలసినంత సువర్ణము లభించుట కష్టముగా నుండును గావున ప్రశస్తలోహములు రెండింటితోను చేయబడు నాణెములు ప్రమాణముగా నంగీకరించుపద్ధతియే అనుసరణీయము. బ్యాంకులయొక్క "రిజర్వు"ల కవశ్యమగు లోహనిర్మితధనముకూడ సులభముగా చేకూరును.

ఒక్కలోహపుటుత్పత్తియందలి హెచ్చుతక్కువలవలననే వస్తువులవెలలు నిలుకడగా నుండవు! రెండులోహములున్ను ప్రమాణనాణకములలో చేరినవయినప్పుడు లోహరాసుల సరఫరా ఒకప్పుడు మితిమీరి వెలలను పొడిగించదా? అంతేకాక టంకశాలాధికారులు బంగారపునాణెమున కిన్ని వెండినాణెములు సమానమని ఏర్పరిచినను బజారుధరలు మారునపుడు ఎన్నియో సంకటములు కల్గును. (7-వపేరా చూడుడు.)

(5) బంగారపునాణెములను ప్రమాణముగా గైకొను దేశములకున్ను వెండినాణెములను ప్రమాణముగా నంగీకరించు దేశములకున్ను వర్తకవ్యాపారములు సరిగా

జరుగుటకు బై మెటాలిక్ పద్ధతిని ప్రతిదేశమువారున్ను అనుసరించవలెను.

ఈవాద మెంత సహేతుకమై యున్నను అంతర్జాతీయ బైమెటాలిక్పద్ధతిని(International bimetallism) వివిధ దేశములవా రంగీకరించినప్పుడుగదా రెండులోహములకున్ను ప్రమాణ మేర్పడుట. వివిధ దేశముల తాలూకు నాణకతంత్రవేత్తలు ఈవిషయమును తీర్మానించుటకొరకే బ్రసెల్సు (Brussels) మొదలగు స్థలములలో సమావేశమై నాణకతంత్రచర్చ చేసియుండిరి. ప్రయోజన మగుపడలేదు. కొన్ని దేశములవారు స్వలాభప్రేరితులై బై మెటాలిక్ పద్ధతి కడ్డంకులను దెచ్చిపెట్టిరి. చరిత్రాత్మక విషయములను గమనించినచో వివిధదేశములవా రీబైమెటాలిక్పద్ధతిని విసర్జించుటకు కారణములు దేటపడును.

లోహద్వయనిర్మిత ప్రమాణనాణక పద్ధతియం దారోపించదగు ఆక్షేపణలు:—

(1) ఈపద్ధతి నవలంబించు దేశములలో రెండులోహములయొక్క మింటు రేషియో (Mint ratio) యున్ను, మార్కెటు రేషియో (Market ratio) యున్ను తరుచుగా భేదించుటవలన 'గ్రెషాం' సూత్రానుసారము ప్రియముగానుండు లోహముతో చేయబడిన ప్రమాణ నాణకములు వాడుకనుండి తప్పింపబడును; చౌకగా నుండు లోహముతో చేయబడిన నాణెములుమాత్రము దేశమందు చలామణియగుచుండును. 7-వ పేజీలో ఇందుకొక యుదాహరణము ఆంగ్లేయ నాణకతంత్రచరిత్రమునుండి సంగ్రహింపబడినది. మరికొన్ని దేశముల యొక్క నాణకతంత్రచారిత్రక విషయముల నిందుల కుదాహరణంబులుగ దెల్పెదము.

(1) 1873-వ సంవత్సరముసరికి ఇంగ్లాండు, పోర్చుగల్, జెర్మనీదేశములు బై మెటాలిక్ పద్ధతిని విడనాడి ఏకసువర్ణలోహనిర్మితనాణకపద్ధతిని స్వీకరించినందున ఆదేశములలో పూర్వమువలె వెండికి డిమాండు లేకపోయినది. ప్రపంచమందలి వెండియొక్క సరఫరా జాస్తి అయినది. బై మెటాలిక్పద్ధతి ననుసరించుచుండిన లాటిన్యూనియన్‌లో చేరిన దేశములకే వెండి అంతయు వెళ్లినది; కారణమేమన నాణకరచన కాలాటిన్యూనియన్ దేశములవా రింకను బంగారముతోపాటు వెండి కూడ వాడుచుండిరి. పూర్వముకన్న వెండి సరఫరా అధికరించియుండుటంజేసి వెండివెలలు చౌకఅయినవి. బజారుధరలప్రకారము ఒకబంగారపుప్రమాణనాణకమునకు పూర్వముకన్న ఎక్కువవెండి దొరుకుచుండెను. టంకశాలలోమాత్రము బంగారమునకున్ను, వెండికిన్ని పూర్వమేర్పరిచిన రేషియో అమలు జరుగుచుండెను. గ్రెషాం సూత్రము నిరాటంకముగా వర్తించినది; సువర్ణనాణకములను ప్రజలు వాడుకలోనుండి తప్పించుచూవచ్చిరి. లాటిన్యూనియన్ దేశములవారు వెండినాణకములనుమాత్రము వాడుచూవచ్చిరి.

(2) బై మెటాలిక్పద్ధతి ననుసరించెడు లాటిన్యూనియన్ దేశములవారు 19-వ శతాబ్దమధ్యమున అనగా కాలిఫోర్నియా, ఆస్ట్రేలియా ప్రదేశములందలి గనులనుండి సువర్ణరాసు లమితముగా లభించినప్పుడు పూర్వముకన్న ఎక్కువ బంగారమును నాణకరచన కుపయోగింపగల్గిరి. బంగారముమిగులచౌకఅయినది. తారతమ్యములం జూడగ వెండియే ప్రియమైన లోహమైనది. కావున గ్రెషాం సూత్రానుసారముగ వెండినాణెములగు "ఫైవ్ ఫ్రాంకు పీసెస్" (Five-franc pieces)వాడుకలోనుండి తప్పింపబడుచూవచ్చినవి. బంగారపునాణెములే లాటిన్యూనియన్ దేశములలో చలామణియగుచూవచ్చినవి.

(3) అమెరికాసంయుక్తరాష్ట్రములు 1792 లో బై మెటాలిక్పద్ధతి ననుసరించుట కారంభించినవి. అప్పుడు నూరుబంగారపునాణెములకు 1503 వెండినాణెములు సమానమని దొరతనమువారిచట్టము. ప్రశస్తలోహముల బజారుధరలు మారుచూవచ్చినందున మార్కెటురేషియోకు టంకశాల రేషియో సమానముగా నున్నట్లు సంస్కారములు చేయబడుచూవచ్చినవి; లేనిచో గ్రెషాం సూత్రానుసారము ఏదో ఒకలోహముతో చేయబడిన ప్రమాణనాణకములు వాడుకలోనుండుట కష్టముగదా. 1834-వ సంవత్సరములో నూరుబంగారు నాణెములకు 1600 వెండి నాణెములు సమానములని దొరతనమువారు శాసించవలసివచ్చెను.

(4) 1873 వ సంవత్సరాంతమునరికి లాటిన్‌యూనియన్ దేశములవారుకూడ బైమెటాలిక్పద్ధతి నేవిధముగానైన నెలకొల్పుటకు బద్ధకంకణులైయున్నను ప్రశస్తలోహపుధరల తారుమార్లకున్ను అందువలన కలిగెడు నష్టములకున్ను, ఇతరదేశీయులవలన విడనాడబడిన వెండి రాసులకొలది ఫ్రీకాయినేజీ గల తమదేశములకు రవాణా చేయబడుననిన్ని, భీతిల్లినవారై వెండివిషయమున స్వేచ్ఛాముద్రణపుహక్కు ఇకమీదట వర్తింపదని చట్ట మేర్పరిచిరి. అయినను బంగారపునాణెములతోపాటు వెండినాణెములకు "ఫైవ్ ఫ్రాంకు పీసెస్" కూడ లీగ ల్టెండరు గుణములు కల్గియుండెను అనగా బైమెటాలిక్పద్ధతి పూర్ణముగా విడనాడబడలేదు; రెండులోహములకు పూర్వమువలె స్వేచ్ఛాముద్రణపుహక్కు లేనందున లాటిన్యూనియన్ దేశముల నాణకతంత్రమునకు "సొట్టప్రమాణము" లేక "లింపింగ్ స్టాండర్డ్" (Limping Standard) అని అర్థశాస్త్రజ్ఞులు నామకరణముచేసిరి.

(5) జెర్మనీ, హాలెండు మొదలగు ఐరోపాదేశములవారు వెండి ప్రమాణనాణెరచనకు పనికిరాదని (demonetisation of silver) శాసించుటవలన వెండియొక్క 'డిమాండు' సన్నగిల్లినది; కాని సరఫరా అధికరించుచుండెను; ఏమన అమెరికా సంయుక్తరాష్ట్రములందున్న గనులనుండి వెండి రాసులకొలది ఉత్పత్తిచేయబడెను. దీని పర్యవసాన మేమన: వెండియొక్క వెలలు క్రుంగినవి. వెండి చౌకలోహ మయినది. 19వ శతాబ్దాంతమువరకు అమెరికా సంయుక్తరాష్ట్రములు బై మెటాలిక్పద్ధతినే అనుసరించుచూ వచ్చినందున, వెండిని ఉత్పాదించువారు ఎట్లైన అమెరికా దొరతనమువారు తప్పనిసరిగ వెండిని రాసులకొలది ప్రతిసంవత్సరము కొనునట్లు చేయుట కుద్యమించిరి. అమెరికా కాంగ్రెసువారిని ప్రేరేపించుటవలన, 1878 లో "బ్లాండు ఆక్టు" (the Bland Act,) ప్యాసైనది; ఈఆక్టువలనను 1890 లో ప్యాసైన "షెర్మన్ ఆక్టు" (the Sherman Act,) వలనను "యునైటేడ్ స్టేట్సు ట్రెజరీ" (the United States Treasury) వారు ప్రతి మాసమున్ను $4\frac{1}{2}$ మిలియన్ల (ఒకమిలియన్ అనగా 10 లక్షలు) ఔన్సుల వెండి విధిగా కొనవలసినవారైరి. కాని ఈచట్టములవలన ప్రయోజనముమాత్రము లేకపోయెను. వెండివెల నానాటికి దిగబడుచుండెను. బై మెటాలిక్పద్ధతివలన కలిగెడు కష్టనష్టములు జరుగుచునే యుండెను. 1893 వ సంవత్సరములో మనహిందూదేశములో రాబోవు ప్రకరణమం దుదాహరింపబడు కారణములంజేసి వెండికి "ఫ్రీకాయినేజ్" (స్వేచ్ఛాముద్రణము) హక్కు తీసివేయబడినది. అందువలన పూర్వమువలె హిందుదేశమునకు వెండి యనవసరమైనది. అనగా డిమాండు చాలవరకు తగ్గిపోయినది; ఇదివరకే అధికరించియున్న వెండిసరఫరా (Silver supplies) ఇంకను జాస్తీ అయినది. అందువలన వెండియొక్క వెల క్షీణించుచుండెను. వెండివెల సన్నగిల్లినకొలది బై మెటాలిక్పద్ధతి ననుసరించియున్న అమెరికావారి కష్టనష్టములు మితిమీరుచుండెను, గ్రెషాం సూత్రానుసారము గబంగారపుప్రమాణనాణకములు వాడుకయం దుండక పరదేశయాత్ర జాస్తీగా చేయుట కారంభించినవి.

ఇక కార్యసాఫల్యము అన్యథా నెరవేరదని అమెరికాదొరతనమువారు గ్రహించి 1893-వ సంవత్సరము అక్టోబరుమాసములో బ్లాండు, షెర్మను ఆక్టులను రద్దుపరచుటయేకాక 1900 లో జారీచేయబడిన ఆక్టు ప్రకారము సువర్ణనిర్మితములగు డాలరే ప్రమాణనాణకమని నిర్ణయించిరి.

మీద పేర్కొనబడిన చరిత్రాత్మకవిషయములవలన రెండులోహములతో చేయబడిన ప్రమాణనాణకములను చలామణీచేయ నుద్దేశించు దేశములగతి తుదకు చౌకలోహముతో చేయబడిన నాణెములుమాత్రము వాడుకయందుండుననుసంగతి చదువరులకు విశదమయినదని నమ్మెదము.

(2) బై మెటాలిక్పద్ధతియం దింకొక లోపమారోపింపవచ్చును: రెండులోహములతోను చేయబడిన నాణెములు ప్రమాణముగానుండును కావున ఋణములు వెండినాణెముల సహాయమునగాని బంగారపునాణెముల సహాయమునగాని తీర్చుకొనవచ్చునుగద! ఏదైన ఒకలోహము (వెండి అయినను సరి బంగారమైననుసరి) చౌక అయినప్పుడు ఋణగ్రస్తులు చౌకలోహముతో చేయబ

డిన నాణెములసహాయమున వారిఅప్పులను తీర్చుట కుద్య మింతురు; ఋణదాతలో, ప్రియముగానుండు లోహముతో చేయబడిన నాణెములద్వారా వారిబాకీలను వసూలుచేయుటకు యత్నించుచుందురు. ఇందువలన అప్పులవిషయమగు కాంట్రాక్టులగతిచాల గందరగోళముగా నుండకమానదు.

(3) ఏదేశమందైన బైమెటాలిక్పద్ధతి సరిగా వర్తింపవలెనన్న బంగారమునకున్ను, వెండికిన్ని టంకశాలవారేర్పరిచిన రేషియో మార్కెటురేషియోకు సమానముగా నుండవలెనని ఇదివరకే చెప్పియుంటిమి. కాని అట్టిసామ్యము వాస్తవముగా నేర్పడుట కష్టము. బంగారముయొక్కయు, వెండియొక్కయు సరఫరా డిమాండులంజేసి ఆలోహముల బజారుధరలు మారుచుండును. ఒకప్పుడు బంగారపుప్రమాణనాణెమందుండెడు బంగారము వెల 10 వెండిప్రమాణనాణెములయందుండు వెండి వెలకు సమానముగాను, ఇంకొకప్పుడు 12 లేక 14 వెండి నాణెములను కరిగింపగా లభించిన వెండియొక్క వెలకు సమానముగాను ఉండవచ్చును. ఈబజారుధరల ననుసరించి టంకశాలధరలను సదా సంస్కరించుట కష్టము; అట్లు సంస్కరించక దేనిగతి దానిదని విడచిపెట్టుటకూడ ప్రమాదకరముగా నుండును. వెండిబంగారముల బజారుధరలు అనేకకారణములవలన ఎప్పుడు నొకేతీరున నుండవు.

కొన్ని దేశములవారు లోహద్వయ నిర్మితప్రమాణనాణెకపద్ధతినిన్ని మరికొన్ని దేశములవారు ఏకలోహ నిర్మితప్రమాణనాణెకపద్ధతినిన్ని అనుసరించినచో కష్టముగా నుండవచ్చునుగాని అన్ని దేశములవారున్ను ఏకీభవించి అంతర్జాతీయ బైమెటాలిక్పద్ధతి (International Bimetallism) నేల అవలంబించకూడ దనుసమస్యనిక గమనించెదము.

వెండిబంగారముల టంకశాల (మింటు) రేషియోకున్ను, బజారు (మార్కెటు) రేషియోకున్ను సమానత్వమేర్పడుటకు కావలసిన సమయోచితసంస్కారములను, ఇతరకట్టుదిట్టములను చేసుకొనెదమని కొన్ని దేశములు ఒడంబడిక చేసుకొనినయెడల బైమెటాలిక్పద్ధతి సులభముగా ననుసరింపవచ్చుననిన్ని ఆపద్ధతివలన కలిగెడు లాభములను ప్రజలు పొందవచ్చుననిన్ని అంతర్జాతీయ బైమెటాలిక్ మతమువారి వాదము; అయితే 1878-1881-1892 సంవత్సరములలో పారిస్, బ్రసెల్సు నగరములలో ఏతద్విషయమై జరిగిన నాణెకతంత్రవేత్తల సమావేశములు కొన్ని దేశములవారి స్వలాభపరాయణత్వముంజేసి నిష్ప్రయోజనములయినవి.

1874 వ సంవత్సరము మొదలు అమెరికా, ఐరోపాఖండములందలి దేశములవారు రెండు ఆర్థికప్రమాదముల నెదుర్కొనవలసివచ్చెను:— (1) వెండివెలలు నానాటికి సన్నగిల్లుట; (2) సమస్తపదార్థములవెలలున్ను క్రుంగుచుండుట.

1871—1896 లో వెండి రాసులకొలది గనుల నుండి లభించుచుండుటవలనను, అదేకాలమం దనేక దేశములవారు వెండి ప్రమాణనాణెకములను నిర్మించుటకు తగినలోహము కాదని వెండిని విడనాడుటచేతను, వెండియొక్క సరఫరా ప్రపంచమందుండు డిమాండును అతిక్రమించెను; అందువలననే ఈదిగువపట్టీలో ప్రదర్శింపబడినట్లు మీద పేర్కొనబడిన సంవత్సరములలో వెండియొక్కవెలలు దిగజారుచూవచ్చినవి:—

సంవత్సరము		ఒక ఔన్సు వెండివెల పెన్సులలో
1871	—	$60\frac{9}{16}$
1872	—	$60\frac{1}{4}$
1873	—	$59\frac{1}{4}$
1874	—	$58\frac{5}{16}$
1875	—	$56\frac{13}{16}$
1876	—	53
1877	—	$54\frac{3}{4}$
1878	—	$52\frac{9}{16}$
1879	—	$51\frac{3}{16}$
1880	—	$52\frac{1}{4}$
1881	—	$51\frac{3}{4}$
1882	—	$51\frac{13}{16}$
1883	—	$50\frac{9}{16}$
1884	—	$50\frac{11}{16}$

1885	—	$48\frac{5}{8}$
1886	—	$45\frac{3}{8}$
1887	—	$44\frac{5}{8}$
1888	—	$42\frac{7}{8}$
1889	—	$42\frac{11}{16}$
1890	—	$47\frac{3}{4}$
1891	—	$45\frac{1}{16}$
1892	—	$39\frac{13}{16}$
1893	—	$35\frac{5}{8}$
1894	—	29
1895	—	$29\frac{7}{8}$
1896	—	$30\frac{3}{4}$
1897	—	$27\frac{9}{16}$
1898	—	$26\frac{15}{16}$
1899	—	$27\frac{7}{16}$
1900	—	$28\frac{1}{4}$
1901	—	$27\frac{3}{16}$
1902	—	$24\frac{1}{8}$
1903	—	$24\frac{3}{4}$
1904	—	$26\frac{3}{8}$
1905	—	$27\frac{13}{16}$
1906	—	$30\frac{7}{8}$
1907	—	$30\frac{3}{16}$
1908	—	$24\frac{3}{8}$
1909	—	$23\frac{11}{16}$
1910	—	$24\frac{11}{16}$
1911	—	$24\frac{9}{16}$
1912	—	$28\frac{1}{32}$
1913	—	$27\frac{9}{16}$
1914	—	$25\frac{5}{16}$
1915	—	$23\frac{11}{16}$
1916	—	$31\frac{5}{16}$
1917	—	$40\frac{7}{8}$
1918	—	$47\frac{9}{16}$
1919	—	58

1871–1896 లో వెండివెలలేకావు, వస్తువుల వెలలు కూడ దిగజారినవి (6–వ పేరాలో పొందుపరచ బడిన "ఇండెక్సు నెంబర్ల" పట్టీని గమనింపుడు). ఈ యవస్థలకు కారణము బై మెటాలి క్పద్ధతిని విడనాడి **అ**నేకదేశములవారు "గోల్డు మోనో మెటాలిజం" (Gold Monometallism) లేక ఒక్క–బంగారముతో చేయబడిన నాణెములనే ప్రమాణములుగా నంగీకరించు పద్ధతి నవలంబించుట యని బై మెటాలి క్మతమువారు వాదించుచుండిరి. అనేకదేశములవారు తిరిగీ బంగారపు నాణెములతోపాటు వెండినాణెములుకూడ ప్రమాణనాణకములుగా నంగీకరించు బై మెటాలిక్పద్ధతిని నెలకొల్పిన చో వెండియొక్క–వెలలు సన్నగిల్లుట మాని అధికరించు నన్నిన్ని (వెండినాణెములను రచించుటకు జాస్తీవెండి కావలసియుండును కాబట్టి వెండియొక్క– డిమాండు అధికరించును), వాడుకలోనుండు ప్రమాణనాణెములసంఖ్య అధికరించుటవలన ధనపరిమాణసూత్రానుసారముగ వస్తువులవెలలు పొడిగించబడుననిన్ని, బంగారపునాణెములనే ప్రమాణనాణకములుగా నంగీకరించు మోనో మెటాలి క్పద్ధతివలన బంగారపు సరఫరా తగ్గియుండుటంజేసి వర్తకవ్యాపారములకు కావలసినన్ని బంగారపునాణెములు లేవనిన్ని, అందువలననే వస్తువులవెలలు తగ్గియున్నవనిన్ని, ఆతగ్గుదల నంతమొందించుటకు ధనపరిమాణమును వృద్ధిచేయగల్గు బై మెటాలి క్పద్ధతియే **అ**నుసరణీయమనిన్ని బై మెటాలి క్మతమువారు వాదించుచూ వచ్చిరి.

ఈవాదమెంత యుక్తియుక్తముగా నున్నను నాణకతంత్రసమావేశములు ఇదివరకేసూచించినట్లునిష్ఫ్రయోజన మగుటకాక ఏరెండు ఆర్థికప్రమాదములను నివారించుట బై మెటాలి క్పద్ధతిపని యని చెప్పుచుండిరో, ఆరెండు ఆర్థికప్రమాదములు కారణాంతరములంజేసి నివారింపబడుటవలన బై మెటాలిక్వాదుల వాదములకు బలము తగ్గిపోయెను. బంగారము గనులనుండి జాస్తీగా ఉత్పన్నమగుటవలన వర్తకవ్యాపారములకు తగినన్ని బంగారపుప్రమాణనాణకములు మోనో మెటాలి క్దేశములందు లేవనెడు **ఆ**క్షేపణ అడుగంటినది; ధనముయొక్క– పరిమాణము హెచ్చినందున

వస్తువులవెల లధికరించుటంజేసి వెలలు సన్నగిల్లుచున్న వనియెడు ఆక్షేపణకూడపోయినది. అంతేకాదు; అనేక దేశములవారు బై మెటాలి క్పద్ధతిని విడనాడుటవలన దానిని పునరుద్ధారణచేయుట దుస్తరమని ఆర్థికప్రపంచ మునకు బోధపడినది. బై మెటాలిజమా లేక మోనో మెటాలిజమా అనుసరణీయమైన నాణ్యతంత్రరాద్ధాంతమున కిప్పుడు ప్రాముఖ్యమే లేదు.

లోహద్వయనిర్మితనాణకపద్ధతి నవలంబించుటకు కష్టపడుటకన్న విలువగల ప్రశస్తలోహములతో చేయబడిన నాణెములకు బదులుగ నాణకపుచీట్లును (Paper currency) ఏల ధనముగా పరిగణించుటకు అంతర్జాతీయసమావేశములను, ఒడంబడికలను చేయరాదని పలువురు నాణకతంత్రవేత్తలు ఘోషించుచున్నారు.

నాణకరచనకు ధనవ్యయ మధికము

నాణకపు చీట్లను ఒడంబడికలప్రకారము ధనముగా పరిగణించి అట్టి నోట్లను, లేక చీట్లను అచ్చుగుద్దించుట అతితక్కువఖర్చుతో చేయవగు కార్యము. ఈలాభము నుద్దేశించుటవలనను, పరపత్యుపకరణముల ప్రాబల్యముచేతను, నాగరికతాభివృద్ధి యగుచుండుటవలనను ఈకాలపు వ్యవహారములెన్నియో లోహనిర్మితనాణక సహాయ మపేక్షింపకయే నక్కపెట్టబడుచున్నవి. ఏతద్విషయమును, తత్సంబంధమగు విశేషాంశములను మరుసటి ప్రకరణములో గమనించెదము. (సశేషము)

పదరాపోదాము - పల్లెటూరికి మనము

(ఒక చోదరి)

"పదరాపోదాము పల్లెటూరికి మనము"

నదరు బెదరులేక ఎదురాడువారులేక మన
పెద్దలొసగిన మడిమాన్యాలమ్మాము ప.

కాఫీహోటలు కేగి నీటుగాను మనము
వాటుదేలినట్టి పాటిస్నేహితులతో
మన పెద్దలిచ్చిన మడిమాన్యాలమ్మాము. ప.

చెంతజేరదీసి చైరొకటి మనకిచ్చి
కడులాభముందని కలక్టరును జేర్చి ఈ
మాయపకీళ్లు మన గొంతుగోసేరు ప.

ఈ నీటుథాటులుజూచి నిజమేననితలచి
పరగవ్యాపారముకు పరువులెత్తిమనము
ఫ్యాక్టరీ లటెంచి పడి పోయినామురా ప.

కౌన్సిళ్లలో మనకు గలదుమోక్షమంచు
ఓటుఓటంటును ఊళ్ల వెంటదిరిగి
కౌన్సిళ్లకుపోయి గతిగానగాలేక
మతిభ్రష్టులయినాము మరివద్దురాయివి ప.

ఉద్యోగాలలోన ఉన్నది లాభమని
ఇల్లు పొలా లమ్మి యింగ్లీషునుచదువ
వచ్చుజీతముమనకు వెచ్చముకు జాలదురా ప.

తాలూకాబోర్డులకు తగుదుము మనమంచు
యితరజాతులకెల్ల యిరువు లేదటంచుసాటి
సోదరులతో సరిగానుండలేక
అహంకారముచేత అణగిపోయిన మనము
నష్టపరుపదలచి కష్టాల్పాలయినాము
కష్టాల్పాలయినాము నష్టపడిపోయినాము. ప.

ఈదుర్గుణముచేత విరిగిపడినయట్టి
మనను మోహపెట్టినమన బ్రాహ్మణ సోదరులు
వెర్రి యిదియని తలచి వెనుదిరుగుచున్నారు
మడిచెక్కలలోనె మనకుమోక్ష మంచు ప.

పొందనీ బంగారు పొందుగోరువాని
చేరనీ అధికారచింతితుని దాని
నిర్లక్ష్యపరపుము నీయదృష్టమును
విత్తునాటినగలదు వెలలేని లాభము
చెట్టుపెంచినవాని చేరునురా లక్ష్మి
వానికంటెను లేరువసుధలో నధికులు. ప.

గ్రంథస్వీకారము

౧. యజుర్వేద కథాసంగ్రహము (౫౦ కథలు). గ్రంథకర్త—శ్రీ పారనంది సర్వేశ్వరశాస్త్రిగారు. వెల తెలియదు. ప్రకాశకులు: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండు సన్సు వారు, 192, ఎస్ప్లనేడు, మదరాసు.

౨. (ఎ) స్త్రీజాతకప్రకరణము (సంస్కృతమూ. ఆంధ్రవివరణము), వృద్ధయావనతంత్రమునుండి ఉద్ధరింపబడినది. ౫అధ్యాయములు. వెల రు. ౦–౮–౦

(బి) జ్యోతిషార్ణవనవనీతము అను జ్యోతిషార్ణవ షీయూషము. (సంస్కృతమూలము. ఆంధ్రవివరణము.) వెల రు. ౨–౦–౦

పై రెండు (ఎ, బి) గ్రంథములకును ఆంధ్రవివరణమును శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు రచియించినారు.

ప్రకాశకులు: శ్రీ అత్తోట వెంకటరమణమూర్తిగారు, శకుంతలాపబ్లిషింగ్ హౌస్, 1/28, కొండలయ్యరువీథి, మదరాసు.

3. క్షమార్పణము (సాంసారికనవల). గ్రంథకర్త: శ్రీ తేకుమళ్ల రామచంద్రరావుగారు, (బి. ఏ. ఆనర్సు). ప్రకాశకులు: శ్రీవేంకట పార్వతీశ్వర కవులు, ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయము, పిఠాపురము. వెల రూ. ౧—౮—౦.

౪. శ్రీకుశలవ నిర్వచన రామాయణము (పద్య కావ్యము). గ్రంథకర్త: శ్రీమాదవోలు కామాక్షయ్యగారు. ఇది దొరకుచోటు నెల్లూరు జిల్లా, వెంకటగిరి టవున్ తూర్పువీథిలోనుండు గ్రంథకర్తగారియొద్ద. వెల రూ. ౦—౮—౦.

౫. ఆత్మవ్యక్తి (ఛందోబద్ధము), ౨౦ ఖండములు. (ఊహాలన్నారు.) గ్రంథకర్త: శ్రీ కవికొండల వేంకటరావుగారు, నరసాపురము, గోదావరిజిల్లా. వెల. రూ. ౦—౮—౦.

౬. హ్యాంలెట్—డెన్మార్కు కుమారరాజా; షేక్స్పియరు "హ్యాంలెట్" అను నాటకమున కాంధ్ర రచనము. గ్రంథకర్త: శ్రీగోకులపాటి వీరేశలింగం పంతులుగారు, బి. ఏ., కాకినాడ. విలాసము: ౧. గ్రంథ కర్తగారు. ౨. ఏ. రాజగోపాలు రెడ్డి కంపెనీవారు, 198, ట్రిప్లికేను రోడ్డు, పెరంబూరు బ్యారక్సు, చెన్నపురి. వెల రూ. ౦—౬—౦.

౭. ఆంధ్రకవిత్వచరిత్రము, (ప్రథమభాగము.)– ఈపేరున 'భారతి' యందు క్రమముగ ముద్రితములైన వ్యాసములే యిట్లు గ్రంథరూపమును దాల్చినవి. గ్రంథకర్త: భోగరాజు నారాయణమూర్తిగారు, సంస్థానాంధ్రకవి, విజయనగరము. వెల రు. ౨—౦—౦



అంపశయ్య

పెనుమర్తి వెంకటరత్నముగారు, (యువకవిమండలి)

ఆవిలెక్కా! ఖరబాణ తీక్ష్ణతలు బ్రహ్మానందమూర్తిత్రయీ
ప్లవమాన ద్రుహిణాండదశ్యదుబయూజ్జాతాప్త తేజస్వియై
న వియన్నిర్ఝరిణీకుమారునకు నంతశ్శత్రుసంజేతకున్
జివురుల్ పోలెఁ దనూలతం బొదివి వాసించెన్ గృపాణాగ్రముల్.

అదరహాస కందళితమైన ముఖాంతర దేహళీలురత్
స్వాదువచస్సుధన్ బ్రణవసామపికీకలకంఠగానముల్
ప్రోది నొనర్చి రాచకులముం బెడిదమ్ములు తేరుకొన్న పు
త్త్రాదుల కౌరవేయులఁ బృథాసుతులంగని తేనెవాఁకగా!

దాహ మనినాఁడు భీష్మపితామహుండు, నిష్ఠురస్వీయ దివ్యగాండీవముక్త
శాతనారాచములు ధనంజయుఁడు గప్పె, లోఁతెఱుంగని పాతాళలోకములకు!

గంగా స్వచ్ఛతరంగముల్ మలయమార్గ వ్యగ్ర బాలానిలో
త్తుంగస్ఫీతపటీరశైత్యములు చిందున్ భీష్మమార్తాండుపై
పొంగారుంగని పెంచినట్టి ప్రణయంపున్ వాసనల్ తోఁచె స్వీ
యాంగప్లావ్యదుదూథవాహినుల నంభోంతర్జలేజంబులన్.

రోచిష్మత్కమలాప్త భర్మకళలూరున్ దివ్యకల్లోలినీ
వీచీస్వచ్ఛత లల్లుకొన్న కురుపృథ్వీనాథ శుభ్రాస్యసం
ప్రాచుర్యమ్ములు; మందబుద్ధులయి తత్పావిత్ర్యకూటస్థరే
ఖాచైతన్యము చూడఁజాలరట! హార్క్ష్యస్వాము లుర్వీధవుల్.

ఆ భీష్మానన దివ్యరాగములు సాయంస్పృష్టప్రాభాకర
శ్రీభాగ్యంబుల కప్పువెట్టినవి పుంజీభూత మాధుర్యముల్
ఆభూమీగతనీడజస్వనములం దావృత్తులంబొంది పృ
థ్వీభావాంగణమందు మ్రోఁగినవి తంత్రీఘట్టనోంకారముల్.

అపరశైలాంతరాళ గహ్వరములందు, మణఁగె సాంధ్యసతీహిరణ్మయమరీచి
కౌరవేయ నేత్రాంబు శీకరములందు, శోకనిశ్శ్వసితంబులు ప్రాకిపోయె.

సాభిప్రాయ విశేషములు

శ్లో. సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత !
శ్రద్ధామయో ఽయం పురుషో యో యచ్ఛ్రద్ధ స్స ఏవ సః.

ప్రకృతి ప్రాణులకు యజ్ఞమున కనురూపమైన ఫలమును గలుగజేయుచున్నది. మానవులకు వారు నోచెడినోమునకు దగిన ఫలము గలుగుచున్నది. ప్రకృతియందు చెట్టునకు దగిననీడ గలుగుచున్నది. చిన్ననోమును నోచి పెద్దఫలము నపేక్షించుట నిరర్థకము. తామసరాజసయజ్ఞములను జేయుచు సాత్త్వికఫలమున కాశపడుట యనర్థదాయకము. పంచతంత్రము నందు అసంప్రేక్ష్య కారిత్వఫలము చక్కగను దెలుపబడినది. ఆతంత్రము నందలి మొదటికథయందు మణిభద్రనాపితోపాఖ్యానమునం దపరీక్షితకారిత్వ ఫలము బాగుగ వర్ణింపబడినది. తమతమ యధికారానధికారముల నెంచక ఫలము నపేక్షించెడివారు స్వయమ్ముగ చెడుటయును, నితరులను చెరుపుటయును సంప్రాప్తమగుచున్నది. మణిభద్రునకు ధనప్రాప్తికి గారణభూతమైన లగుడతాడనము నాపితునకు మరణకారణంబైనది.

శ్లో. కుదృష్టం కుపరిజ్ఞాతం కుశ్రుతం కుపరీక్షితమ్,
తన్నరేణ న కర్తవ్యం నాపితేనాత్రయత్కృతమ్.

ధీమంతులు బాగుగ బరీక్షించి నియాత కర్మలను జేయుచు స్వయముగను తరించుచు నితరులను తరింపజేయుచున్నారు. స్వీయ విషయములందు మానవు లెటులు ప్రవర్తించినను పరవిషయములందు బాగుగ యోచించి దిగుట వివేకము. తాను చెడుట కంగీకరించినను ఇతరులను చెరుచుట యధర్మము. వర్తమాన కాలమునందు తామస రాజసగుణములు ప్రబలి, అసంప్రేక్ష్యకారిత్వము వ్యాపించి, సంరంభము ప్రబలుచున్నది. భగవద్గీతయందు దైవాసురసంపద్విభాగయోగమునందు వివరించిన రీతి నాసురభావము దిగంతములందు వ్యాపించుచు మహా సంక్షోభమును గలుగజేయు చున్నది. సకలవ్యవహారములయందును నహంభావము ప్రబలి తనకు మించినవారు లేరను నాసురభావము వర్ధిలుచున్నది.

శ్లో. ఆఢ్యో ఽభిజనవానస్మి కో ఽన్యో ఽస్తి సదృశో మయా,
యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞానవిమోహితాః.

అహఙ్కార పరాయణులు సర్వజ్ఞత్వమును బూనుచు రాజస తామస గుణముల నాశ్రయించుచు నిహపరములను దుఃఖమయము చేయుచున్నారు. అహఙ్కార పరాయణులకు లోకమంతయును "తమ" మయమై శ్రద్ధాయోగము దుర్లభ మగుచున్నది. వారలకు లోకమునం దంతటను నేను, నాది, నామాట, నాకీర్తి, నాపక్షము, నాధనము, నా కులము, నాజాతి ప్రత్యక్షమగుచు సత్యార్థ మప్రత్యక్షమగుచుండును. వర్తమానసంధియుగమునం దీ

మమకారాహంకారములు విపరీతాకృతిని దాల్చుచు మహాసంక్షోభమును గలుగజేయుచున్నవి. సాంఘికపారిశ్రామిక రాజకీయ మత వ్యవస్థలు మహాపరివర్తనమునుబొందుచు మమకారాహంకారములు వర్ధిలుచున్నవి. దృష్టి నేవైపునకు మరల్చినను నీదుస్థితియె గోచరం బగుచున్నది.

* * * *

ఇంగ్లాండునందు బొగ్గుగనుల సమస్య యథాస్థితియందున్నది; పనివాండ్ర సమ్మెకట్టు క్రమముగనుసడలిపోవుచున్నది. తక్కువకూలి కెక్కువకాలము పనిచేయవలసిన యవసరము పనివాండ్ర కేర్పడినది. యజమానులు పట్టిన పట్టును విడువలేదు. బాల్డువిను ప్రభుత్వము యజమానులపక్షము నవలంబించుచు పనివాండ్ర హృదయములందు నిరాశను గలుగజేసినది. రాజీనామాను కుదుర్చుటకు జరిగిన ప్రయత్నములు విఫలములైనవి. కార్మికనాయకుడు కుక్కుగారు పనివాండ్ర పరాజయము నంగీకరించుచు క్రమనిర్గమనము నుపదేశించుచున్నాడు. పనివాండ్రు మూడుమాసములనుండియును ననుభవించిన కష్టములును, దేశమునకు సంప్రాప్తమైన నష్టమును వర్ణనాతీతములు. బొగ్గుగనుల పనివాండ్రసమ్మెకట్టుఫలము ధనస్వాముల దుర్భేద్యమైన బలమును విశదము చేసినది. ఇటలియందు ఫాసిటు తత్త్వము ధనస్వామ్యత్వమును సమర్థించు చున్నది. సాంఘికకార్మికపక్షములు విలయమును బొందుచున్నవి. ఫ్రాన్సు జర్మనురాజ్యములందును ధనస్వాములప్రాబల్యము స్థిరపడుచున్నది. యూరపురాజ్యములు పక్షములుగను నేర్పడి యుద్ధమునకు సిద్ధమగుచున్నవి. ఐరోపామహాసంగ్రామసమయమునందు ప్రజాస్వామ్యత్వసంరక్షణవిషయమై చేసిన ప్రతిజ్ఞలు నిరర్థకములైనవి. ప్రజలు నిస్సహాయులై పూర్వమువలెనే రాజ్యతంత్రజ్ఞులతంత్రములకు బలియగుచున్నారు. ఆసియా యూరపుఖండములందు సంగ్రామాంకురములు పల్లవించుచున్నవి. యూరపురాజ్యములు నాటినదురహంకారబీజము లీదుష్ఫలమును గలుగజేయుచున్నవిధమును ప్రపంచవ్యవహారములు విశదముచేయుచున్నవి. ప్రపంచమునం దంతటను వ్యక్తము మగుచున్న దుష్ఫలమే భారతభూమియందును వ్యక్తమగుచున్నది. వర్తమానసమయమునందు దేశమునందంతటను పర్యాప్తంబైన యెన్నికలప్రచార మహంకారప్రభావమును విశదముచేయుచున్నది.

* * * *

ధర్మనిరీక్షణము

గాంధిమహాత్ముడు భారతరాజ్యాంగరంగమునందుగలుగజేసిన ధర్మనిరీక్షణఫలమునియోజకగణమునందును, ప్రచారకులందును, అభ్యర్థుల ప్రకటనలందును గోచరం బగుచున్నది. కాంగ్రెసుప్రచారకులు మొదటచేసిన బహిష్కారప్రచారమును, వర్తమాన సమయమునందు జేయుచున్న ప్రవేశ ప్రచారమును, ప్రజాహృదయమునందు గలుగజేయుచున్న సంచలనమును దేశవ్యవహారములు దెలుపుచున్నవి. ప్రజాహృదయమునం దారంభమునం దుదయించిన యుత్సాహాగ్ని యిప్పుడు

చల్లబడినది. ఆరంభమునందు వేనవేలు దేశమోక్షమునకై ఆత్మార్పణమును జేసిరి; ప్రజాహృదయమునందుమహాసంచలనమును గలుగజేసిరి. దేశమంతయునుస్వరాజ్యనాదముతోను, గాంధి విజయధ్వానములతోను మారుమ్రోగినది. వేలకొలదిప్రజలుపరమోత్సాహముతో దేశమాతకు కానుకలను సమర్పించిరి; సభలనుచేసిరి; హరతాళములను గావించిరి; సహాయనిరాకరణము నవలంబించిరి; నిరంకుశప్రభుత్వమును నిరసించిరి; భారతమాతకు మంగళహారలతను సమర్పించిరి. ఇపుడాస్థితి యంతయును మారినది. సహాయ నిరాకరణము నుపదేశించిన నాయకు లిపుడు సహాయతంత్రము నుపదేశించుచున్నారు. వివిధసంఘములయందు స్వప్రయోజనము ధర్మ లక్ష్యమును మార్చినది. సంఘాభిమానము కులాభిమానము ప్రబలినవి. హిందూమహమ్మదీయ విభేదములు,బ్రాహ్మణబ్రాహ్మణేతరభేదములు,కమ్మకాపుభేదములు, సహకారా సహకార భేదములు పెచ్చుపెరిగినవి.

ఆరంభమునందు ప్రజాహృదయమునం దుదయించిన ధర్మనిరీక్షణము స్వాభిమాననిరీక్షణముగ బరిణమించినది. శాసనసభాభ్యర్థులు కులాభిమానమును,ధనాభిమానమును, అధికారాభిమానమును విజయచిహ్నముగను గైకొనుచున్నారు. ప్రచారకులును తదనుగుణ్యముగను ప్రవర్తించుచున్నారు. కమ్మవారు కమ్మ అభ్యర్థులకు, కాపులు కాపులకు, రెడ్లు రెడ్లకు, బ్రాహ్మణులు బ్రాహ్మణులకు వోట్లనిచ్చుటకుకృతనిశ్చయులైయున్నారు. దేశమునం దధికార పదవులు గలుగజేసిన వ్యామోహ మపారమై ధర్మనిరీక్షణము దుర్గ్రాహ్యముగ నున్నది.అభ్యర్థులు మంత్రి పదవుల నారాధించుచున్నారు. నియోజకవర్గము కులతత్త్వము నారాధించుచున్నది. స్వప్రయోజన పరాయణత్వము ప్రబలునపుడు స్వధర్మారాధనము దుస్తర మగుచున్నది. ఈవిషమస్థితియందుకాంగ్రెసు అభ్యర్థులస్థితి దురూహ్యముగ నున్నది. ప్రజలయందు శేషించియున్న యుత్సాహమునైనను వినియోగించుటకు దేశారాధకులు గనుపడకున్నారు. న్యాయవాదులు వారి వృత్తియందు మునిగియున్నారు. విద్యార్థులు పాఠశాలలందు మునిగితేలుచున్నారు. వోటరులు ప్రచారకుల బోధనలను విని సంభ్రమును జెందుచున్నారు. ఒకవైపునకు ధర్మము, వేరొక వైపునకు కులాహంకారాభిమానము వోటరులను బలీయముగ నాకర్షించుచున్నవి. ఈసందిగ్ధ సమయమునందు వోటరులు స్వధర్మ నిర్వహణమును జేసి దేశక్షేమమునకు బాటుపడుట శ్రేయస్కరము.

* * * *

వోటరుల ధర్మము

వర్తమానపుటెన్నికలయందు కాంగ్రెసు అభ్యర్థులను నిలువబెట్టి ప్రజాపక్షమునకు విజయమును గోరుచున్నది. కాంగ్రెసుపక్షవిజయము ప్రజాపక్షవిజయముగను, పరాజయము ప్రజాపక్షపరాజయముగను బరిగణింపదగియున్నది. ప్రజాహృదయమునందు ధర్మాభిమానము వెలయుచున్నను కులాభిమానము ధర్మా

రాధనమునకు ప్రతిబంధకముగనున్నది. కురుక్షేత్రమునందు సంగ్రామకాలమునందు పార్థునకుగలిగిన ధర్మసందేహమే వోటరులకును గలుగుచున్నది. కులమా ధర్మమా సేవింపదగినదను సమస్య ప్రతిఘటించుచున్నది. కులతత్త్వమును సేవించుట యధర్మమని తెలిసియున్నను సంశయభావము ప్రతిబంధకముగ నున్నది. ప్రజలునమ్మిన దానిని జేయజాలకున్నారు. కాంగ్రెసునం దభిమానమున్నను ధర్మనిర్వహణముచేయుటకు శక్తిలేకున్నది. "నాచల్దిమూటను గట్టుకొని నావోటులను కాంగ్రెసునకిచ్చెదను" అనువా రరుదుగనున్నారు. శక్తివంచన లేకను ప్రచారమును జేసెడివారును నరుదుగనున్నారు. అట్టివిషమపరిస్థితులందు ధర్మపరాయణులు స్వధర్మ నిర్వహణమును చేయుటకు దీక్షను బూనినగాని కాంగ్రెసునకును, దన్మూలమున ప్రజాపక్షమునకును విజయముగలుగుట దుర్లభము.

నవంబరు 8-వ తేదిని ఎన్నికలు జరుగనున్నవి. నెలదినముల వ్యవధిమాత్రముగలదు. ఈయమూల్యమైనకాలమును దేశారాధనమునకై వినియోగించుట దేశాభిమానులకు ధర్మమైయున్నది. జయాపజయములు ప్రయత్నముమీద నాధారపడియున్నవి. ప్రయత్నము చేయక ఫలము గలుగజాలదు. దేశక్షేమపరాయణులందరును ఉదాత్తభక్తి చందమునను దేశసేవను జేయుటకు మంచితరుణ మాసన్నముగ నున్నది. వోట్లుగలవారు వారివోట్లనిచ్చియును, ప్రచారకులు వోట్లనువేయించియును, పలుకుబడిగలవారు ప్రోత్సహించియును కాంగ్రెసుఅభ్యర్థులకు విజయమును సమకూర్చుట సకలవిధములను వర్తమానవిషమదశయందవసరముగనున్నది. అభ్యర్థుల గుణావగుణముల నెంచి వోట్లనిచ్చుటధర్మముగాని, కులాభిమానమునుబూని వోట్లనిచ్చుట భావ్యముగాదు. స్వార్థపరాయణుల ప్రగల్భములను, కులాభిమానమును, ధనప్రాబల్యమును విసర్జించి ధర్మనిర్వహణమునకు బూనుకొనుటకు భగవంతుడు దోడ్పడి కాంగ్రెసునకు విజయము సమకూర్చుగాత! ధర్మసాధనమునకు శ్రద్ధాభక్తులు సాధనములు గాని మమకారాహంకారములును, కులాభిమానములును సాధనములుగావని ప్రాజ్ఞులు గ్రహింతురుగాత !!

సంపూర్ణము

Edited and Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No.7, Thambu Chetty Street, G. T. Madras



విషయానుక్రమణిక

గేరాణి—మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు ౧-౫
అభిజ్ఞానశాకుంతలము—పేరి వేంకటేశ్వరశాస్త్రి గారు ౬-౧౭
వర్ష ఋతువు—నాళము కృష్ణారావు గారు ౧౮-౨౦
గానమాధురి—వెలువోలు సీతారామయ్యాచౌదరి గారు ౨౦
యెంకిపాటలు—డి. ఎ. నరసింహము గారు ౨౧-౩౧
ఆహా! ఏమిస్వభావము!—శతావధాని చిదంబరశాస్త్రి గారు ౩౧-౩౨
రామాయణమునందలి వానరులెవరు?—కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి గారు ౩౩-౪౨
అభినవకవి—సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి గారు ౪౩
సోమకుడు-ఋత్విజుడు—మొక్కపాటి నరసింహశాస్త్రి గారు ౪౪-౪౭
కవివిపంచి—కె. అన్నమరాజశర్మ గారు ౪౭
నాట్యము—శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారు ౪౮-౫౫
ఆంధ్రుఁడా!—పువ్వాడ శేషగిరిరావు, చోడవరపు జానకిరామయ్య గార్లు ... ౫౫
మోసగాండ్రకథలు—పండిత పురాణం సూర్యనారాయణతీర్థులు గారు ... ౫౬-౬౪
గాజులసెట్టి—మునిమాణిక్యం నరసింహారావుగారు ౬౪
రెండుకోర్కెలు—శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ గారు ౬౫-౭౬
బాలచంద్రుడు—అధికార్ల సూర్యనారాయణరావు గారు ౭౭
చంపావతి—ఆండ్ర శేషగిరిరావు గారు ౭౮-౮౩
ప్రకృతియోగిని! నినుఁగాంచి సుకృతినగుదు—సోమంచి వాసుదేవరావు గారు ౮౪
తులసిమొక్కలు—పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ... ౮౫-౯౬
ఈశ్వరోపాలంభన—నాదెళ్ల వెంకట్రావుగారు ౯౬
నాలందవిశ్వవిద్యాలయము—కె. నరసింహాచారి గారు ౯౭-౧౦౮
రారాజు—దొంతరాజు వెంకట్రామయ్య గారు ౧౦౮-౧౦౯
బౌద్ధకాల వ్యవసాయచరిత్ర—పెండ్యాల వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి గారు ౧౧౦-౧౧౬

మరపు—శ్రీమతి న్యాయపతి వెంకట విజయలక్ష్మమ్మ గారు ౧౧౭-౧౧౮
మనోవిహ్వాలత—మల్లాది చంద్రశేఖరరావు గారు ౧౧౮
సంపరమాసి—ఎ. లక్కరాజు నాయుడుగారు ౧౧౯-౧౨౨
శారదానికేతనము-చిత్రకళాభవనము—మంత్రవాది వెంకటరత్నము గారు ౧౨౩-౧౨౪
చాలు—పానుగంటి విజయరాఘవరావు గారు ౧౨౪
కవిప్రబోధము—అనంతపంతుల వెంకటేశ్వర్లు గారు ౧౨౫-౧౨౮
వేంకటేశ్వరవచనాలు ౧౨౯-౧౩౨
నాకోర్కులు—పండిత పెనుమచ్చ సత్యనారాయణరాజు గారు ... ౧౩౨
ఆంధ్రగ్రంథములపట్టిక ౧౩౩-౧౩౭
సమరాహ్వానము—శ్రీనివాసరావుగారు... ... ... ౧౩౮
గ్రంథవిమర్శనము ౧౩౯-౧౪౩
గ్రంథస్వీకారము ౧౪౪-౧౪౫
ప్రథమచుంబనము—జంధ్యాల శివన్న శాస్త్రిగారు ౧౪౫
సాభిప్రాయవిశేషములు ౧౪౬-౧౪౮

చిత్రములు

త్రివర్ణచిత్రము:—ప్రవరాఖ్యుఁడు, వరూధిని.

ఏకవర్ణచిత్రములు:—ప్రాచీనచిత్రములు ౪; శారదానికేతనమందలి చిత్రకళాభవన చిత్రములు ౧౧. నాలంద విశ్వవిద్యాలయచిత్రములు ౧౨; విద్యార్థినీ సమాజము-కాకినాడ; ఇతర చిత్రములును.


భారతీ చందాదారులకు విన్నపము

1. తమతమ విలాసములు మారినపుడు వెంటవెంటనే మాకు విడి అక్షరములతో తమ (చందాదారు) నెంబర్లుసహా ప్రతినెల 5-వ తేది లోపల తెలియజేయవలెను. లేనిచో క్రొత్తవిలాసమునకు బంప వీలుండదు.

2. ప్రతిమాసమును (ఇంగ్లీషునెల) 7 వ తేదీని యీపత్రిక యిచ్చటినుండి టపాలో పంపబడుచున్నది. చేరనివారు వెంటనే మాకు తెలిపి వారివారి జిల్లాల తపాలు అధికారులకు వ్రాయ గోరెదము.

'భారతి' వ్యవస్థాపకుడు.

ప్రవరాఖ్యుఁడు వరూధిని



"ఉ. ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ, యొంటి చరించె దోట లే, కివ్వనభూమి భూసురుడ నేఁ బ్రవరాఖ్యుఁడఁ ద్రోవ దప్పితిం
గ్రొవ్వన నిన్న గాఁగ నగముం జనుదెంచి పురంబుఁ జేర నిం, కెవ్విధిఁ గాంతుఁ దెల్పఁగదవే తెరు వెద్ది శుభంబు నీ కగున్." —మనుచరిత్ర.

చిత్రకారుఁడు: శ్రీ కే. వి. సోమయాజులుగారు, రాజమండ్రి.

మాతృపూజ

జి. జాషువ గారు

సగరమాంధాత్రాది షట్చక్రవర్తుల
యంకసీమల నిల్చి నట్టిసాధ్వి
కమలనాభుని వేణుగానసుధాంబుధి
మునిఁగి తేలిన పరిపూత దేహ
కాళిదాసాదిసత్కవికుమారులఁగాంచి
కీర్తినందిన పెద్దగేస్తురాలు
బుద్ధాదిమునిజనంబులతపంబున మోద
బాష్పము ల్విడిచిన భక్తురాలు
సింధుగంగానదీజలక్షీర మెపుడు
గురిసిబిడ్డలఁ బోషించుకొనుచునున్న
పచ్చిబాలెంతరాలు మాభరతమాత
మాతలకుమాత సకలసంపత్సమేత.

ఓరుగల్లుకోట

శ్రీ శేషాద్రిరమణకవులు

ఆదితటాకంబుగా దాంధ్రకుమార,
అరివీరదుస్సాధమైనట్టి పరిఘ;
అవ్విశైలములు గా వాంధ్రకుమార,
దుర్వైరిదుర్గమ దుర్గరాజములు,
అద్దికుంకుమముగా దాంధ్రకుమార,
తెలుఁగునెత్తుటిగడ్డఁ దెరలినదుమ్ము;
అద్ది విభూతిగా దాంధ్రకుమార!
కాంతామణీసహగమనరంగంబు;
నవలక్షవిలుకాండ్రు నాలుగుదెసల
ఆంధ్రసామ్రాజ్య కల్యాణగీతంబు
ఆలపించిన నర్తనాగార మిద్ది;
కాదుకా దిది భూతగణమందిరంబు
ఒకకాలముననాంధ్రు లుత్సాహ మలర
నేల నాల్గుచెఱంగు లేలినయపుడు
జయలక్ష్మితోఁ గూడి శారదాదేవి
విహరించె నీపుణ్య వీథులయందుఁ;
గాలగర్భమునందుఁ గలసె నాకథలు
దాస్యంబు సైఁచె నీధరణిభాగంబు.